# సామాజిక పరివర్తన మరియు ప్రణాళిక

**బి.ఏ. సమాజ శాస్త్రము - మూడవ సంవత్సరము, పేపర్ - 3**

**రచయితలు**


**డా॥ ఎం.వి.లక్ష్మీ దేవి,** ఎం.ఏ., పిహెచ్.డి.,
అసోసియేట్ ప్రొఫెసర్,
డిపార్టుమెంటు ఆఫ్ సోషియాలజీ
ఆర్.బి.కె.వి.ఆర్. మహిళా కళాశాల
నారాయణగూడ, హైదరాబాద్ - 500 027

**డా॥ వి. రెడ్డప్ప నాయుడు,** ఎం.ఏ., పిహెచ్.డి.,
అసోసియేట్ ప్రొఫెసర్,
డిపార్టుమెంటు ఆఫ్ సోషియాలజీ
శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి-2

**డా॥ ఐ. శోభ,** ఎం.ఏ., పిహెచ్.డి.,
అసోసియేట్ ప్రొఫెసర్,
డిపార్టుమెంటు ఆఫ్ వుమెన్ స్టడీస్
శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి -2

**డా॥ టి. శ్రీనివాస్,** ఎం.ఏ., పిహెచ్.డి.,
అసోసియేట్ ప్రొఫెసర్,
డిపార్టుమెంటు ఆఫ్ సోషియాలజీ
కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్.

**డా॥ జి.వి. రమణ,** ఎం.ఏ., పిహెచ్.డి.,
అసోసియేట్ ప్రొఫెసర్,
డిపార్టుమెంటు ఆఫ్ సోషియాలజీ
శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం
అనంతపురం - 515 003.


**సంపాదకులు**


**ప్రొఫెసర్ ఎం.ఎస్.ఎన్. రెడ్డి,** ఎం.ఏ., పిహెచ్.డి.,
డిపార్టుమెంటు ఆఫ్ సోషియాలజీ
శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి - 517 502.


*సమన్వయకర్త*


డా॥ డి. వెంకటేశ్వర్లు, M.A., Ph.D.,
డిపార్టుమెంట్ ఆఫ్ సోషియాలజి
ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం, నాగార్జున నగర్



డైరెక్టర్
ఆచార్య డి. కృష్ణారావు, M.Sc., Ph.D.

**దూరవిద్యా కేంద్రము**

ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం, నాగార్జున నగర్
Ph: 0863-2293299, 2293356, 08645-211023, Cell:98482 85518
08645 - 211024 ( Study Material )
Website : www.anucde.ac.in or www.anucde.info
e-mail : info@ anucde.ac.in

B.A. : Social Change and Planning

| | | |
|---|---|---|
| First Edition | : | 2006 |
| Second Edition | : | 2006 |
| Third Edition | : | 2010 |
| No. of Copies | : | 2000 |

**Fourth Edition :** 2013
**No. of Copies :** ~~3000~~ 1500

(C) **Acharya Nagarjuna University**

This book is exclusively prepared for the students of Centre for Distance Education, Acharya Nagarjuna University and this book is meant for limited circulation only.

*Published by :* M.V. Ramkumar Ratnam
**Prof. D. Krishna Rao**
Director
Centre for Distance Education
Acharya Nagarjuna University
Dr. P.P.S. Paul Kumar
**Prof. M.V. Ramkumar Ratnam**
Deputy Director
Centre for Distance Education
Acharya Nagarjuna University

*Printed at :*
**Don Bosco Technical School Press**
Ring Road, Guntur-7, Ph : 2350832

# ముందుమాట

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం 1976లో స్థాపించబడిన మొదలు నేటి వరకు ప్రగతి పథంలో పయనిస్తూ వివిధ కోర్సులు, పరిశోధనలు అందిస్తూ, 2003 వ సంవత్సరంలో NAAC చే B++ (80-85) గ్రేడును సంపాదించుకొని దేశంలోనే ఒక ప్రముఖ విశ్వవిద్యాలయంగా గుర్తింపు సాధించుకొన్నదని తెలియజేయటానికి ఎంతో సంతోషిస్తున్నాను. ప్రస్తుతం గుంటూరు, కృష్ణా, ప్రకాశం జిల్లాలలోని సుమారు 300 అనుబంధ కళాశాలల విద్యార్థులకు డిగ్రీ, పి.జి. స్థాయి విద్యాబోధనతో పాటు పరిశోధన డిగ్రీలను కూడా ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం అందిస్తోంది.

ఉన్నత విద్యను అందరికి అందించాలన్న లక్ష్యంతో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, దూర విద్యా కేంద్రాన్ని స్థాపించింది. దీని ద్వారా పూర్తి స్థాయిలో కళాశాలకు వెళ్ళి విద్య నభ్యసించలేనివారికి, ఎంతో వ్యయ భరితమైన ఫీజులు చెల్లించలేని వారికి, ఉన్నత విద్య చదవాలన్న కోరికవున్న గృహిణులకు ఈ దూర విద్యావకాశం ఎంతో దోహదపడుతుంది. ఇట్టి వారందరికి తమ ముంగిట్లో విద్యను అందించే ఉద్దేశ్యంతో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, 2003-04 విద్యా సంవత్సరంలో డిగ్రీస్థాయిలో బి.ఏ., బి.కాం.; పి.జి. స్థాయిలో ఎం.ఏ., ఎం.కాం., ఎం.ఎస్.సి., ఎం.బి.ఏ, ఎల్.ఎల్.యమ్ కోర్సులను ప్రారంభించడం జరిగింది.

ఈ దూర విద్యా పద్ధతి ద్వారా విద్యనభ్యసించే విద్యార్థుల కొరకు రూపొందించే పాఠ్యాంశాలు, సులభంగాను, సరళంగాను, విద్యార్థి తనంతట తానుగా అర్థం చేసికొనేలా ఉండాలనే ఉద్దేశ్యంతో విశేష బోధనానుభవం కలిగి, రచనా వ్యాసంగంలో విశేష అనుభవంగల అధ్యాపకులతో పాఠ్యాంశాలను వ్రాయించటం జరిగింది. వీరు ఎంతో నేర్పుతో, నైపుణ్యంతో, నిర్ణీత సమయంలో పాఠ్యాంశాలను తయారుచేశారు. ఈ పాఠ్యాంశాలపై విద్యార్థినీ విద్యార్థులు, ఈ పాఠ్యాంశాల బోధనలో నిష్ణాతులైన వారు ఇచ్చే సలహాలు, సూచనలు సహృదయంతో స్వీకరించబడతాయి. నిర్మాణాత్మకమైన సూచనలను గ్రహించి మున్ముందు చేసే ప్రచురణలలో మరింత నిర్దిష్టంగా, మరింత సులువుగా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ప్రచురణ చేయగలం. ఈ పాఠ్యాంశాల అవగాహన కోసం, సంశయాల నివృత్తి కోసం డిగ్రీ స్థాయిలో వారాంతపు తరగతులు, పి.జి. స్థాయిలో కాంటాక్ట్ క్లాసులు ఏర్పాటు చేయటం జరిగింది.

దూర విద్యా కేంద్రం ద్వారా విజ్ఞాన సముపార్జన చేసి, ఉన్నత విద్యార్హతలు సంపాదించి జీవనయాత్ర సుగమం చేసుకోవడమేగాక, చక్కటి ఉద్యోగావకాశాలు పొంది, ఉద్యోగాలలో ఉన్నత స్థాయికి చేరాలని వాటి ద్వారా దేశ పురోగతికి దోహదపడాలని నా ఆశయం. రాబోయే సంవత్సరాలలో దూర విద్యా కేంద్రం మరిన్ని కొత్త కోర్సులతో దిన దినాభివృద్ధి చెంది ప్రజలందరికి అందుబాటులోకి రావాలని ఆకాంక్షిస్తున్నాను. ఈ మా ప్రయత్నానికి సహకరించిన దూర విద్యా కేంద్రం డైరెక్టర్లకు, సంపాదకులకు, రచయితలకు నా అభినందనలు.

ప్రొఫెసర్ కె. వియన్నారావు
కులపతి
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం

# B.A. Final Year Sociology
## PAPER –III : Social Change and Planning

1. Social evolution, progress and social change - planned and unplanned social change - chain reactions of changes - Theories relating to social change.

2. Factors effecting social change - biological technological and cultural factors cultural lag.

3. Social Planning and Development Meaning and Principle of social planning sociological aspects of economic planning obstacles to social planning traditions customs values illiteracy and other institutions.

4 Communication and social planning methods of communication role of opinion leaders in social planning and social change.

5. Social planning in India community Development Programmes and Panchayati Raj, Sarvoday Movement Gandhi's constructive programmes.

6. Social Legislation and social change problems in the implementation of social legislations, social legislations in India.

7. Social change in India - Islamaiation, Westernization Sanskritization Modernization and Secularization.

**Recommended Books**


| | | |
|---|---|---|
| 1. | Maclver and page | Society |
| 2. | R.N. Sharma | Principles of Sociology |
| 3. | M.N. Srinivas | Social change in Modern India |
| 4. | Yogendra Singh | Modernization of Indian Tradition |
| 5. | B. Kuppuswamy | Social change. |

B.A. DEGREE EXAMINATION, May 2006.
(Examination at the end of Final Year)

## Part II : SOCIOLOGY

## PAPER - III - SOCIAL CHANGE AND PLANNING

Time : 3 Hours Max. Marks :100

### SECTION A

Answer any FIVE questions.
Select atleast TWO questions from each Section.
All questions carry equal marks.

1. What is social change? Differenciate between change and progress?
సామాజిక మార్పు అనగానేమో తెలిపి, మార్పు మరియు ప్రగతిల మధ్యగల తేడాలను వివరించండి.
2. Explain the planned change in India.
భారతదేశంలో ప్రణాళికా యుతమైన మార్పును వివరించండి.
3. Describe the cyclic theories of social change.
సామాజిక మార్పుకు చక్రీయ సిద్ధాంతాన్ని వివరించండి.
4. Discuss the role of technological factors in social change.
సామాజిక మార్పుకు సాంకేతిక కారకాల పాత్రను వివరించుము.
5. How do variation in Birth and death rates Leeds to social change?
జనన మరణరేటులో తేడాలు వివిధమైన సామాజిక మార్పుకు దోహదం చేస్తాయో వివరించండి.

### SECTION B

6. Discuss the impact of changing Technology on the role of women in contemporary society.
సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులు సమకాలిక సమాజంలోని స్త్రీల పాత్రపై ఎటువంటి ప్రభావాన్ని చూపుతున్నాయో వివరించండి.
7. Describe the relation between social change and industrialisation.
సామాజిక మార్పుకు మరియు పారిశ్రామికీకరణకు మధ్యగల సంబంధాన్ని వివరించండి.
8. Discuss the chain reactions in social change.
సామాజిక మార్పుకు గొలుసుకట్టు ప్రతి చర్యలను వివరించండి.
9. Discuss the problems in implementation of social planning in India.
సామాజిక యోజన అమలులో ఉత్పన్నమయ్యే సమస్యలను వివరించుము.
10. Answer any TWO short notes.
    a) Natural Balance.
    b) Charles Darwin.
    c) Mass Media.
    d) Dwacra.

    క్రింది వానిలో ఏ రెండింటికైనా లఘుటీక వ్రాయుము :

    ఎ) సహజ సమతౌల్యము

    బి) చార్లెస్ డార్విన్

    సి) భావ ప్రసారాలు.

    డి) డ్వాక్రా.

# విషయ సూచిక


| | | |
|---|---|---|
| 1. | సామాజిక పరివర్తన నిర్వచనం, స్వభావం | 1.1 - 1.6 |
| 2. | సామాజిక పరివర్తన - రకాలు మరియు సిద్ధాంతాలు | 2.1 - 2.9 |
| 3. | సామాజిక ప్రగతి - సామాజిక పరిణామము | 3.1 - 3.5 |
| 4. | సామాజిక పరివర్తన - జైవిక కారకాలు | 4.1 - 4.8 |
| 5. | సామాజిక పరివర్తన - సాంకేతిక కారకాలు | 5.1 - 5.6 |
| 6. | సామాజిక పరివర్తన - సాంస్కృతిక కారకాలు | 6.1 - 6.8 |
| 7. | సామాజిక ప్రణాళిక - సామాజికాభివృద్ధి - అర్థ వివరణ, సూత్రాలు | 7.1 - 7.7 |
| 8. | ఆర్థిక ప్రణాళికలో సామాజిక అంశాలు | 8.1 - 8.5 |
| 9. | సామాజిక ప్రణాళికలో భావ ప్రసారపాత్ర, సామాజిక ప్రణాళిక.... | 9.1 - 9.4 |
| 10. | భారతదేశంలో సామాజిక ప్రణాళిక - సముదాయ అభివృద్ధి, పంచాయితీరాజ్ వ్యవస్థ | 10.1 - 10.4 |
| 11. | భారతదేశంలో సామాజిక ప్రణాళిక - సర్వోదయ ఉద్యమము, మహాత్మాగాంధీ.... | 11.1 - 11.5 |
| 12. | భారతదేశ సామాజిక ప్రణాళిక - బలహీన వర్గాల సంక్షేమము, స్త్రీ సంక్షేమము... | 12.1 - 12.6 |
| 13. | భారత దేశంలో సామాజిక శాసనాలు | 13.1 - 13.6 |
| 14. | భారతదేశంలో సామాజిక పరివర్తన - ఆధునికీకరణము - నిర్వచనము, స్వభావము... | 14.1 - 14.5 |
| 15. | భారతదేశంలో సామాజిక పరివర్తన ప్రక్రియలు.... | 15.1- 15.6 |

# పాఠం - 1

## సామాజిక పరివర్తన నిర్వచనం, స్వభావం

## 1.0 ఉద్దేశ్యం

సామాజిక పరివర్తను నిర్వచించి, దాని లక్షణాలు పేర్కొని, సామాజిక పరివర్తన అధ్యయన ప్రాముఖ్యతను వివరించడం.

విషయసూచిక


1.1 పరిచయం

1.2 నిర్వచనము

1.3 సామాజిక పరివర్తన లక్ష్యాలు

1.4 సామాజిక పరివర్తన కారణాలు

1.5 సామాజిక పరివర్తన కారకాలు

1.6 సామాజిక పరిణామము - సామాజిక ప్రగతి

1.7 సామాజిక పరివర్తన నిరంతర పరిచర్యలు

1.8 సామాజిక పరివర్తన అధ్యయన ప్రాముఖ్యత

1.9 సారాంశం

1.10 నమూనా ప్రశ్నలు

1.11 చదవదగిన పుస్తకాలు


## 1.1 పరిచయం

మనకు కనిపించే ఈ దృశ్య ప్రపంచంలో పరివర్తనకులోను కానిదంటూ ఏదీ లేదు. పరివర్తన అనేది భౌతికంగా మాత్రమే కాదు, ప్రకృతిపరంగా, మానసికంగా, సామాజికంగా కూడా మనం గమనించవచ్చును. ప్రకృతి నిరంతరమూ పరివర్తనకులోనవుతూ వుంటుంది. పరివర్తన అనేది ప్రకృతి సిద్ధమైనది. ఏ సమాజమూ పరివర్తనకు అతీతం కాదు. పరివర్తన చెందని సమాజం అంటూ ఉండదు. పరివర్తన ఒక నిత్య నూతన స్రవంతి. ఏ సమాజము మరియు సంస్కృతి పరివర్తనకు లోనుకాకుండా తప్పించుకోజాలవు. కొన్ని సమాజాల్లో ఈ పరివర్తన వేగవంతంగా మరికొన్ని సమాజాల్లో నెమ్మదిగా వుంటుంది.

## 1.2 నిర్వచనం

"సమాజంలో మానవ సంబంధాల్లో కలిగే మార్పునే సామాజిక పరివర్తన అంటారు" మెకైవర్

"సమాజిక వ్యవస్థాపనలో అనగా సామాజిక నిర్మితిలో మరియు ప్రకార్యాలలో జరిగే మార్పునే సామాజిక పరివర్తన అంటారు" - కింగ్స్‌లీడేవిస్

## 1.3 సామాజిక పరివర్తన లక్షణాలు

### 1.3.1 సామాజిక పరివర్తన ఒక నిరంతర ప్రక్రియ

సమాజము నిరంతరము పరివర్తనకులోనవుతూ వుంటుంది. మార్పులేని సమాజం అంటూ వుండదు. మానవ జాతి, మానవ సమాజము ఆవిర్భవించినప్పటి నుండి నేటి వరకు పరివర్తన చెందుతూనే వుంది. రేపటికి కూడా పరివర్తన చెందడం ఖాయం.

**1.3.2 సామాజిక పరివర్తన అశాశ్వతమైనది**

పరివర్తన లక మార్పు అనేది కాలానుగుణంగా వుంటుంది. పాత పద్ధతులను, అలవాట్లను, వస్తువులను వదలివేసి క్రొత్తగా వినియోగంలోకి వస్తే వాటిని గ్రహించడానికి మనిషి నిరంతరము ప్రయత్నిస్తుంటాడు. అందుకే 'క్రొత్త ఒక వింత, పాత ఒక రోత' అనే నానుడి వచ్చివుండవచ్చును.

**1.3.3 పర్యావరణంలో మార్పు సామాజిక మార్పుకు దారి తీస్తుంది**

పర్యావరణంలో చోటు చేసుకునే పరివర్తన మానవ సమాజం పై ప్రగాఢమైన ముద్రను వేస్తుంది. పర్యావరణంలో కలిగే మార్పుల వలన మన సమాజంలో క్రొత్త పద్ధతులకు మరియు పరికరాలకు రూపకల్పన జరగడం ఖాయం. పర్యావరణంలో చోటు చేసుకొనే పరివర్తనలు మానవ ప్రవర్తనపై తమ ప్రభావాన్ని చూపుతాయనడంలో అతిశయోక్తి లేదు.

**1.3.4 మానవ పరివర్తనే సామాజిక పరివర్తన**

వివిధ కారణాల వలన మానవ ప్రవర్తనలో, అలవాట్లలో, పద్ధతుల్లో జరిగే పరివర్తనే సామాజిక పరివర్తన. మనిషి తన అవసరాన్ని బట్టి ప్రవర్తనలో, అలవాట్లలో మార్పులు చేర్పులు చేసుకుంటూ వుంటాడు. పాత వాటిని వదలి క్రొత్త వాటిని స్వీకరిస్తూ వుంటాడు.

**1.3.5 వివిధ కారకాల పరస్పర చర్యల ఫలితమే సామాజిక పరివర్తన**

ఒక కారకం (Single Factor) వలన కేవలం ఒక పరివర్తన మాత్రమే చోటు చేసుకోవచ్చును. కానీ ఆ పరివర్తనను అనేక కారకాలు ప్రభావితం చేస్తాయి. సాంస్కృతిక, భౌతిక, జైవిక, సాంకేతిక కారకాల పరస్పర చర్యల ఫలితమే సామాజిక పరివర్తన.

**1.3.6 ప్రణాళికాబద్ధమైన సామాజిక పరివర్తన**

మానవుడు రూపొందించే వివిధ ప్రణాళికలు, కార్యక్రమాలు, సిద్ధాంతాలు సామాజిక పరివర్తనను ప్రభావితం చేస్తాయి.

**1.3.7 ప్రకృతి వైపరీత్యాలు - సామాజిక పరివర్తన**

ప్రకృతి వైపరీత్యాలైన కరువు, వరదలు, భూకంపాలు, అగ్ని పర్వతాలు మొదలైనవి సామాజిక పరివర్తనను ప్రభావితం చేస్తాయి.

**1.3.8 స్వల్పకాలిక మరియు దీర్ఘకాలిక పరివర్తనలు**

సమాజంలో చోటు చేసుకునే పరివర్తనలు కొన్ని స్వల్పకాలం మాత్రం మానవుల జీవితాన్ని ప్రభావితం చేస్తాయి. మరికొన్ని మాత్రం దీర్ఘకాలం నిలిచి వుంటాయి. నేడు అత్యంత ప్రాధ్యానత సంతరించుకొన్న ఒక పరివర్తన రేపటికి ప్రాధ్యాన్యత లేనిదిగా పరిణమించవచ్చును. కొన్ని పరివర్తనలు స్వల్పకాలికి ప్రయోజనాలను, మరికొన్ని దీర్ఘకాలిక ప్రయోజనాలను చేకూర్చుతాయనడంలో సంశయం లేదు.

## 1.4 సామాజిక పరివర్తనకు కారణాలు

సామాజిక పరివర్తన చాలా సంక్లిష్టమైనది. సమాజంలో మనం నిత్యం గమనించే మార్పులకు కారాణాలు అనేకంగా వుంటాయి. ఒక్క కారణం చేత మాత్రమే సమాజంలో మార్పు సంభవించదు. ఒక్క కారణమే మార్పునకు శ్రీకారం చుట్టదు.

**1.4.1 అంతర్గత కారణాలు**

1. సంఘర్షణ : ప్రతి సమాజంలో వంద శాతం శాంతియుత వాతావరణం వుండదు. ప్రతి సమాజంలోను ఘర్షణ వాతావరణం ఎంతో కొంత వుంటుంది. ఆ ఘర్షణ వాతావరణానికి ఏ సముదాయం కానీ సమూహం కానీ సమాజం కానీ మినహాయింపు

కాదు. వ్యక్తుల ఉద్దేశ్యాలలో, కోరికలలో భిన్న వైఖరులుంటాయి. కొందరు అందివచ్చిన అవకాశాలు వినియోగించుకొంటారు. మరి కొందరికి అవకాశాలే రావు. కొందరు అవకాశాలను సద్వినియోగం చేసుకోలేరు. సమాజంలో వున్నవారికి, లేనివారికి మధ్య వైరుధ్య జీవన విధానం, సంఘర్షణ తప్పకుండా వుంటాయి. ఈ సంఘర్షణను అదుపు చేయడానికి ప్రయత్నించడం, తద్వారా సరిక్రొత్త మార్పులు సంభవించడం సహజమే. అలాగే విద్య, ఉపాధి ద్వారా సమాజంలోని అట్టడుగు వర్గాలతో చైతన్యం కలగడంతో పరివర్తన చోటు చేసుకోవడం మనం గమనిస్తున్నాం.

2. సామాజిక సమస్యలు : సమాజాన్ని నిరంతరము వేధించే మతతత్త్వం, కులతత్త్వం, జనాభా విస్ఫోటనం, లంచం, అవినీతి, వ్యభిచారం, నిరుద్యోగం, రాజకీయ కక్షలు, అవిద్య, దరిద్ర్యం మొదలగు సామాజిక సమస్యలు సంఘర్షణపూరితమైన వాతావరణాన్ని సృష్టిస్తాయి. ఏ సమాజం కూడా ఘర్షణాత్మకమైన వాతావరణంలో మనజాలదు. సర్దుబాటు తప్పనిసరి. ఇలాంటి సర్దుబాట్లు మరియు నూతన ఆలోచనలు క్రియారూపం దాల్చడం వలన సమాజంలో పరివర్తన చోటు చేసుకోవడం సహజమే. ఉదాహరణకు జనాభా విస్ఫోటనం అనే సమస్యను పరిష్కరించడం కోసం, జనాభాను నియంత్రించడానికి కుటుంబ నియంత్రణ పద్ధతులు అమలు పరచడం మొదలయింది.

3. విప్లవాలు మరియు ఉద్యమాలు : సమాజంలో నిరుద్యోగం, బద్రత, ఆహారం, స్వేచ్ఛలాంటి వాటికి భంగం కలిగినపుడు విప్లవాలు కానీ ఉద్యమాలు కానీ సంభవిస్తాయి. తత్ఫలితంగా అనేక మార్పులు సంభవించడం సహజమే. ఉదాహరణకు రైతు ఉద్యమాలు, దళిత ఉద్యమాలు, ఆధ్యాత్మిక ఉద్యమాలు. వీటి ఫలితంగా సమాజంలో ఎన్నో మార్పులు సంభవించడం మనం గమనించవచ్చును.

4. సాంస్కృతిక పరివర్తన : సాంస్కృతిక వ్యవస్థలోని మార్పులు, సామాజిక మార్పులకు దోహదం చేస్తాయి. నూతనత్వం కోసం పరితపించే పద్ధతులు, నమ్మకాలు సడలిపోయి వాటి స్థానంలో సరిక్రొత్త పద్ధతులు, నమ్మకాలు సంతరించుకొంటాయి. సామాజిక, సాంస్కృతిక మార్పులకు లోనుకాని సమాజం అంటూ వుండదు.

### 1.4.2 సామాజిక మరియు అసమాజిక పరిసరాలు ప్రభావం

మానవ సమాజ నిర్మితిపై సామాజిక, అసమాజిక పరిసరాలు ప్రభావం తప్పకుండా వుంటుంది. అసమాజిక పరిసరాలలో ఏర్పడే పరివర్తన తప్పకుండా సమాజ వ్యవస్థలపై వుంటుంది. పరిసరాలలో ఏర్పడే మార్పులు సమాజాన్ని ప్రభావితం చేస్తాయి. అలాగే ప్రకృతి వైపరీత్యాలు కూడా సమాజాన్ని ప్రభావితం చేస్తాయి. వరదలు, కరువు, భూకంపాలు, సునామీలు, తుఫానులు లాంటి ప్రకృతి వైపరీత్యాలు సమాజాన్ని ప్రభావితం చేస్తాయి. తద్వారా సమాజంలో అనేక పరిణామాలు సంభవిస్తాయి. ఆ పరిణామాల ఫలితమే సామాజిక పరివర్తన.

## 1.5 సామాజిక పరివర్తన కారకాలు (Factors of Social Change)

సామాజం పరివర్తన చెందటానికి అనేక కారకాలు కారణభూతమవుతుంటాయి. ఒక సమాజంలో ఒక కారకం ప్రధాన పాత్ర వహిస్తే మరొక సమాజంలో మరో కారకం ప్రధాన పాత్రను వహించడం జరుగుతుంది. అంతేకాకుండా ఒక కాలంలో ఒక కారకం ప్రాధాన్యత వహిస్తే వేరొక కాలంలో మరొక కారకం ప్రధాన పాత్రను వహిస్తుంది. ఈ విధంగా సామాజిక పరివర్తనకు దేశ, కాల పరిస్థితులు దోహదం చేస్తాయి. అంతేగాక సామాజిక పరివర్తనకు కార్యకారణ సంబంధాలు విశ్లేషణకు ప్రాధాన్యాన్ని ఇవ్వటం కూడా జరుగుతుంది. సామాజిక పరివర్తనకు దోహదం చేసే వివిధ కారకాలను సమాజ శాస్త్రజ్ఞులు గుర్తించారు.

అందులో ముఖ్యమైన వాటిని ఈ క్రింద పేర్కొనడం జరిగింది.

1. భౌతిక పరిసరాలకు సంబంధించిన కారకాలు

2. జైవిక కారకాలు

3. సాంఘిక కారకాలు
4. ఆర్థిక, రాజకీయ కారకాలు
5. సాంస్కృతిక కారకాలు
6. సాంకేతిక కారకాలు
7. మానసిక కారకాలు
8. మహాపురుషుల ప్రభావం
9. విప్లవాలు
10. యుద్ధాలు
11. తాత్విక దృక్పథాలలో మార్పు
12. ఇతర సమాజాల ప్రభావం

పైన పేర్కొన్న కారకాలు సమాజం పరివర్తన చెందటానికి ఒక దానితో మరొకటి అవినాభావ సంబంధాన్ని కలిగి ఉంటాయి. సామాజిక వ్యవస్థలో భౌతిక, జైవిక, సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక, సాంకేతిక అంశాలు పరస్పరం సంబంధాన్ని కలిగి అంతర్భాగాలుగా ఉంటాయి. ఈ అంశాల మధ్య పరస్పర చర్యలు ఎల్లప్పుడూ జరుగుతూ ఉండటం వల్ల ఒక వ్యవస్థలో మార్పు జరిగినప్పుడు ఇతర వ్యవస్థలలో కూడా మార్పు జరగటమనేది సర్వసాధారణ విషయం. సమాజం నిరంతరం పరివర్తనకు గురిఅయ్యే దృగ్విషయం.

## 1.6 సామాజిక పరిణామము - సామాజిక ప్రగతి (Social Evolution and Social Progress)

సమాజిక పరిణామాన్ని సామాజిక పరివర్తన ప్రక్రియగా గుర్తించవలెను. పరిణామం ఒక ప్రవర్తనాక్రమం. సామాజిక వ్యవస్థలోని రూపాలలో విశిష్టీకరణము అధికమైనప్పుడు, అది మొత్తం వ్యవస్థలో వృద్ధి కలిగించినప్పుడు దానికి "సామాజిక పరిణామం" అంటారు.

ఒక వ్యవస్థలోని భాగాలు ప్రత్యేక ప్రకర్యాలను నెరవేరుస్తూ అవి మొత్తం వ్యవస్థకు మిగిలిన భాగాలకు మధ్య పరస్పర సంబంధాన్ని పెంపొందించినప్పుడు దానిని సామాజిక పరిణామం అని చెప్పవచ్చును. చాలా మంది సమాజ శాస్త్రజ్ఞులు సామాజిక పరిణామాన్ని గురించి ప్రస్తావించినారు. దుర్క్‌హైమ్ అనే సమాజ శాస్త్రజ్ఞుడు సామాజికాభివృద్ధికి శ్రమ విభజన ఎంతో అవసరమని నొక్కి చెప్పాడు.

కొమ్ట్, స్పెన్సర్స్, వార్డ్ మొదలైన సామాజిక పరిణామవాదులు సామాజిక ప్రగతిని సామాజిక పరిణామం యొక్క ఫలితంగా భావించినారు. సామాజిక దృగ్విషయంలోని అనేక ధోరణులు సామాజిక ప్రగతి కోసమే నిర్దేశితమైనవని వీరి అభిప్రాయం. కానీ పరిణామమంటే ప్రగతి అని అర్థం చేసుకోరాదు. ఒక వ్యవస్థ ప్రగతి పథంలో ఉన్నదా? లేదా? అనే విషయాన్ని ఎవరి ప్రమాణాల ప్రకారం వారు నిర్ణయించుకోవలసిందే.

ప్రగతి అంటే ఒక ప్రమాణం దృష్ట్యా ఒక విషయంలో వృద్ధి జరగడం లేదా ఆ విషయం మెరుగు పడటం. అయితే ఏది సర్వసమ్మతమైన ప్రమాణం? అనే ప్రశ్నకు సమాధానం చెప్పడం కష్టం. ప్రగతిని నిర్ణయించడానికి సర్వజన సమ్మతమైన ప్రమాణాలు లేవు.

పరిణామం, ప్రగతి రెండింటిని ఒకటిగా భావించగూడదు. కోమ్ట్ అతని అనుచరులు తమ రచనలలో ఈ రెండింటిలోని వ్యత్యాసాలను గుర్తించలేదు. యల్.టి. హబ్ హౌస్ సామాజిక అభివృద్ధిని సామాజిక ప్రగతిగా నిర్వచించినాడు. సమాజం పరిణామం చెందినదని నిర్దిష్టంగా చెప్పవచ్చును. కాని సమాజము ప్రగతి చెందుతున్నదని చెప్పినప్పుడు అవతలవారు కూడా మన విలువలను, ప్రయాణాలను అంగీకరించవలెను.

## 1.7 సామాజిక పరివర్తన నిరంతర ప్రతిచర్యలు (Chain Reactions of Social Change)

సామాజిక జీవన విధానం మారుతున్న అనేక అంతర్గత విభాగాల వ్యవస్థ. సమాజంలోని ఒక వ్యవస్థలోని ఒక భాగంలోని మార్పు ఇతర వ్యవస్థలలోని అనేక భాగాల మార్పుకు కారణమవుతుంది. ఇది సమాజంలోని అనేక మంది వ్యక్తుల జీవన విధానాన్ని కూడా ప్రభావితం చేస్తుంది. ఉదా: పారిశ్రామిక విప్లవం తరువాత సాంప్రదాయిక కుటుంబపరమైన ఉత్పత్తి దెబ్బతిన్నది. కుటుంబ పరమైన ఉత్పత్తి దెబ్బతినడం వల్ల స్త్రీలు జీవనోపాధికోసం కర్మాగారాలలో పని చేయవలసి వచ్చింది. అనేక ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాలలో స్త్రీలు పనిచేయడం మొదలు పెట్టారు. దీని వలన స్త్రీల సంపాదన, ఆదాయం పెరిగి ఆర్థిక స్వాతంత్ర్యం పొందగలిగినారు. స్త్రీల అభిరుచులలోను, ఆలోచనలలోను, భావాలలోను మార్పులు నెమ్మదిగా రావడం ప్రారంభించినాయి. ఫలితంగా వారిలో కొత్త జీవన విధానం ప్రారంభమైనది. ఇవన్నీ మొత్తం కుటుంబ జీవన విధానాన్నే మార్చివేసినాయి. అలాగే కులవ్యవస్థలో కూడా అనేక మార్పులు సంభవించినాయి. ఆధునిక కాలంలో కులవ్యవస్థ లక్షణాలలో మౌలికమైన మార్పులు ఏర్పడినాయి.

మానవుని కార్యకలాపాలు కూడా సామాజిక పరివర్తనకు దారితీస్తాయి. మానవుడు తన అవసరాలను సంతృప్తి పరచుకొనడానికి అనేక సాధనాలను కనిపెడుతూ ఉంటాడు. ఈ అన్వేషణలో అతడు నాగరికతను పెంపొందిస్తున్నాడు. మానవుడు కొత్తకొత్త సాధనాలను ఉపయోగించడం ద్వారా వాటిని సమాజంలో ప్రవేశ పెట్టడం ద్వారా సామాజిక పరివర్తనకు కారకుడవుతున్నాడు.

చాలాకాలం నుంచి సమాజాలు పరివర్తన చెందుతున్నప్పటికి ఆధునిక యుగంలో పరివర్తన రేటు తీవ్రతరమయింది. వైజ్ఞానిక, సాంకేతిక రంగాలలో విశేషాభివృద్ధి జరిగి ప్రపంచంలో సామాజిక వ్యవస్థలను కదిలించి వేసినాయి. దాని వలన సమాజాలలో విప్లవాత్మకమైన పరివర్తనలు కలిగినాయి. రవాణా, ప్రచార సాధనాల అభివృద్ధి జరగడం వల్ల ప్రపంచంలోని సమాజాలన్నీ పరస్పరం సన్నిహితమవుతున్నాయి.

## 1.8 సామాజిక పరివర్తన అధ్యయన ప్రాముఖ్యత

ఈ దిగువ పేర్కొన్న కారణాల వలన సమాజ శాస్త్రంలో సామాజిక పరివర్తన అధ్యయనం విశిష్ట ప్రాముఖ్యతను ఏర్పరచుకున్నది.

1. సామాజిక పరివర్తన సర్వకాల సర్వ వ్యవస్థలలో జరిగే ప్రక్రియ.

2. సామాజిక పరివర్తన, సామాజిక క్రమం (Social order), సామాజిక స్థిరత (Socail statics) పరిస్పరాధారమైనది. ఒక దానికి అర్థం చేసుకోవాలంటే మరొక దానికి అర్థం చేసుకోవాల్సి ఉంటుంది.

సమాజ శాస్త్ర మూల పురుషుడు అయిన అగస్ట్ కోమ్టే (August Comte) సమాజ శాస్త్రాన్ని సామాజిక స్థిరత (Social statics), సామాజిక గమనాత్మకం (Social dynamics) అని రెండు భాగాలుగా విభజించినాడు. సామాజిక శాస్త్ర అగ్రగాములైన హెర్బర్ట్ స్పెన్సర్ (Herbert Spencers) లెస్టర్ వార్డ్ (Lesten Ward) ఎమిల్ డుర్కీమ్ (Emile Durkheim), కారల్ మార్క్స్ (Karl Marx) మొదలైన వారి రచనలను పరిశీలిస్తే సామాజిక పరివర్తన అధ్యయనానికి వారెంత ప్రాముఖ్యతనిచ్చారో అర్థమవుతుంది.

సామాజిక పరివర్తన, సామాజిక క్రమం రెండూ పరస్పరం సన్నిహితమైనవి. ఒకదాని అవగాహన మరొక దాని అవగాహనకు దారి తీస్తుంది.

1. ప్రస్తుత సమాజాన్ని అర్థం చేసుకోవాలంటే గతంలో దానిలో వచ్చిన మార్పుల క్రమాన్ని తెలుసుకోవాలి.

2. అభివృద్ధి చెందుతున్న దేశాలలో ప్రణాళికబద్ధమైన పరివర్తనకు ఇచ్చే ప్రాధాన్యత కారణంగా సామాజిక పరివర్తన అదనపు ప్రాముఖ్యతను సంతరించుకుంది.

3. 18వ శతాబ్దంతో సంభవించిన ఫ్రెంచి విప్లవం వలన పారిశ్రామిక విప్లవం వలన వ్యక్తమయిన సామాజిక పరివర్తన కారణాలను, గతిని వివరించడానికి 19వ శతాబ్దంలో అగస్ట్‌కోమ్టే తదితర సమాజ శాస్త్రజ్ఞులు చేసిన ప్రయత్నాలతో సమాజ శాస్త్రం ఆవిర్భవించిందంటే సామాజిక పరివర్తన అధ్యయనానికి ఎంత ప్రాముఖ్య ఉందో అవగతమవుతుంది.

## 1.9 సారాంశము

పరివర్తన ప్రకృతి సహజం. అది ఎల్లప్పుడూ మార్పు చెందుతూ ఉంటుంది. అది ఒక ప్రక్రియ. సామాజిక పరివర్తన సామాజిక సంబంధంలోని మార్పులతో సంబంధించి ఉంటుంది. సామాజిక పరివర్తనలో సామాజిక ప్రక్రియలు, సామాజి సంస్కరణ, ఉద్యమాలు, విప్లవాలు మొదలయినవి ఇమిడి ఉంటాయి. సామాజిక సంబంధాలో ఎటువంటి మార్పు సంభవించినా స్థూలంగా దానిని సామాజిక పరివర్తనగా పేర్కొనవచ్చును.

## 1.10 నమూనా ప్రశ్నలు

ఈ క్రింది ప్రశ్నలకు సమాధానాలు వ్రాయుము.

1. సామాజిక పరివర్తన వివిధ కారకాలను వివరించండి.
2. సామాజిక పరివర్తన అనగానేమి? సామాజిక పరివర్తన లక్షణాలను పేర్కొనుము.
3. సామాజిక పరివర్తనను నిర్వహించి, సామాజిక పరివర్తన అధ్యయన ప్రాముఖ్యతను గురించి వివరించుము.

## 1.11 చదవదగిన పుస్తకాలు


1. Wilbert E. Moore - Social Change
2. Rathnaiah. E.V. & Subba Reddy. T. - సమాజము, పరివర్తన, ప్రణాళికలు
3. Radha Krishna Moorthy, & Padmaja. K. - సమాజము - నిర్మితి - పరివర్తన

పాఠం - 2

# సామాజిక పరివర్తన - రకాలు మరియు సిద్ధాంతాలు

## 2.0 లక్ష్యాలు

సామాజిక పరివర్తన రకాలను మరియు వివిధ సిద్ధాంతాలను గురించి చర్చించడం.

విషయసూచిక


2.1 పరిచయం
2.2 సామాజిక పరివర్తన - రకాలు
2.3 ప్రణాళికరహితమైన సామాజిక పరివర్తన
2.4 ప్రణాళికాబద్ధమైన సామాజిక పరివర్తన
2.5 సామాజిక పరివర్తన సిద్ధాంతాలు
2.6 పరిమాణాత్మక సిద్ధాంతాలు
2.7 చక్రీయ సిద్ధాంతాలు
2.8 మతపరమైన సిద్ధాంతాలు
2.9 సారాంశము
2.10 నమూనా ప్రశ్నలు
2.11 చదవదగిన గ్రంథాలు


## 2.1 పరిచయం

పరివర్తనకులోనుగాని మానవ సమాజం అంటూ ఈ భూగోళంలో వుండదు. సామాన్యమైన మరియు సంక్లిష్టమైన సమాజాలు నిరంతరమూ పరివర్తనకు గురి అవుతూ వుంటాయి. ఈ పరివర్తనకు అనేక కారణాలు దోహదపడుతుంటాయి. సమాజంలోని ఒక వ్యవస్థలో వచ్చిన పరివర్తన తాలూకూ ప్రభావం ఆ సమాజంలోని ఇతర వ్యవస్థల్లో తప్పకుండా ప్రతిఫలిస్తుంది. ఈ పాఠంలో సామాజి' పరివర్తన రకాల గురించి మరియు వివిధ సిద్ధాంతాలను గురించి తెలుసుకుందాం.

## 2.2 సామాజిక పరివర్తన - రకాలు

సామాజిక పరివర్తన ముఖ్యంగా రెండు విధాలుగా జరుగుతుంది. అవి :

1. ప్రణాళికారహితమైన సామాజిక పరివర్తన (Unplanned social change)
2. ప్రణాళికాబద్ధమైన సామాజిక పరివర్తన (Planned Social Change)

## 2.3 ప్రణాళికరహితమైన సామాజిక పరివర్తన

సమాజంలో వ్యక్తుల ప్రమేయం లేకుండా, సహజసిద్ధంగా, ప్రకృతిపరంగా సంభవించే పరివర్తనలను ప్రణాళికారహిత సామాజిక పరివర్తన అంటారు. పరివర్తన ప్రకృతి సహజధర్మం. మానవుడు తన మేథస్సుతో ప్రకృతినిగానీ, ప్రకృతిలో నిరంతరమూ చోటుచేసుకొనే మార్పులనుగానీ వూహించడం, అదుపులో వుంచడం అసంభవం ఐనప్పటికీ, మానవుడు ప్రకృతిలో సంభవించబోయే మార్పులను వూహించడానికి మరియు నియంత్రించడానికి నిరంతరమూ ప్రయత్నిస్తూనే వున్నాడు. ప్రకృతిపరంగా సంభవించే వరదలు, కరువు

కాటకాలు, భూకంపాలు, అగ్నిపర్వతాలు, సునామీలు సమాజంపై తమ ప్రభావాన్ని చూపెట్టి, తద్వారా ఎన్నో మార్పులు చోటుచేసుకోవడానికి దోహదం చేస్తాయి. అలాగే మానవాతీత వ్యక్తులు, దైవిక శక్తులు అనేక రకాల మార్పులకు కారణమని మనిషి భావిస్తూవుంటాడు. మానవ సమాజంలో పాతుకుపోయిన మత విద్వేషాలు, మూఢనమ్మకాలు, సనాతన భావనలను తొలగించడం సులభం కాదు. కాబట్టి ఎలాంటి అవాంతరం జరిగినా, ప్రకృతిపరమైన మార్పులు సంభవించినా, వీటికి కారణం మానవాతీత శక్తులు ప్రభావమని మనిషి నమ్మడం, ఆ నమ్మకాన్ని ఇతర సభ్యులు ఆమోదించడం సాధారణంగా వుంటుంది. ప్రకృతిపరంగా సంభవించే మార్పులు సమాజంలోని వివిధ వ్యవస్థలైన కుల, మత, కుటుంబ, వివాహ, విద్య, రాజకీయ వ్యవస్థల్లో అనేక మార్పులకు దోహదం చేస్తాయి.

## 2.4. ప్రణాళికాబద్ధమైన సామాజిక పరివర్తన

ప్రణాళిక (Planning) అనే భావన చాలా సనాతనమైనది. అనాదికాలం నుండి సమాజ శ్రేయస్సు కోసం వివిధ ప్రణాళికలను రచించడం, వాటిని సమాజ శ్రేయస్సు కోసం అమలు పరచడం మనం గమనించవచ్చును. పురాణకాలంలోను రకరకాల ప్రణాళికలను మానవ సమాజ శ్రేయస్సు కోరి అమలు పరచడం అనేది అతిశయోక్తి కానేకాదు. వ్యక్తి నిరంతర కృషి వలన, ప్రయత్నం వలన, ఆలోచనల వలన సమాజంలో పరివర్తన చోటు చేసుకోవడం సహజమే.

శాస్త్రీయ, సాంకేతిక విజ్ఞానం అభివృద్ధి చెందడం వలన పరివర్తన ప్రకృతి సిద్ధంగా జరగదని, మానవుని నిరంతర కృషి వలన, ప్రయత్నం వలన మాత్రమే సంభవిస్తుందనే భావన బయలుదేరింది. శాస్త్రసాంకేతిక విజ్ఞానాన్ని వినియోగించి సముదాయంలోని పరిసరాలను, పరిస్థితులను అభివృద్ధి పరచడం సంభవించింది. తద్వారా ప్రణాళికయుతమైన అభివృద్ధి జరగడానికి దోహదపడింది.

మన దేశంలో స్వాతంత్ర్యానంతరము ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ నాయకత్వాన పటిష్ఠమైన ప్రణాళికల ద్వారా సామాజిక పరివర్తనలు తీసుకురావడానికి ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. తత్ఫలితంగా పంచవర్ష ప్రణాళికలు (Five Year Plans) కు వ్యూహరచన చేయడం, వాటిని సమగ్రంగా అమలు పరచడం ప్రారంభమైనది. సామాజికన్యాయం, ఆర్థిక వికాసం, రాజకీయ సమానత్వం, నిరుపేదల అభివృద్ధి, బడుగు వర్గాల శ్రేయస్సు, ప్రజారోగ్యం, గిరిజనాభివృద్ధిమున్నగు నైతికపరమైన, న్యాయపరమైన అంశాలకు ప్రాధాన్యత ఇవ్వడం జరిగింది.

### 2.4.1 భారతదేశంలో ప్రణాళికా బద్ధమైన సామాజిక పరివర్తన

స్వాతంత్ర్యానంతరం భారతదేశంలో ప్రణాళికాబద్ధమైన పరివర్తనకు గట్టిపునాదులు పడ్డాయి. ఎందరో మేధావులు, సంఘ సంస్కర్తలు, ఆర్థిక, సామాజిక శాస్త్రవేత్తలు, జాతీయ నాయకులు, జాతీయ అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనలో అహర్నిశలు శ్రమించారు. ప్రజలందరికీ సామాజిక న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, ఆర్థిక, సామాజిక సమానత్వం, అణగారిన వర్గాల అభ్యుదయం, శాస్త్ర, సాంకేతిక విజ్ఞానాభివృద్ధి, విద్య, వ్యవసాయం, పేదరిక నిర్మూలన, పారిశ్రామిక అభివృద్ధి మొదలగు లక్ష్యాలు సాధించడానికి వివిధ జాతీయ ప్రణాళికలకు రూపకల్పన జరిగింది. దేశప్రజల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని జాతీయ ప్రణాళికలు రూపొందాయి.

### 2.4.2 జాతీయ ప్రణాళికలోని ముఖ్యమైన అంశాలు

(అ) యావద్భారత దేశాన్ని దృష్టిలో వుంచుకొని తదనుగుణంగా జాతీయ అభివృద్ధి విధానాలకు రూపకల్పన

(ఆ) జాతీయ సమస్యలపై సమగ్ర పరిశోధన

(ఇ) సామాజిక, ఆర్థిక, శాస్త్ర సాంకేతిక, సాంస్కృతిక అంశాల అభివృద్ధి కోసం బృహత్తరమైన పథకాలను రూపొందించడం.

(ఈ) రూపొందించిన వివిధ ప్రణాళికలను కార్యాచరణలో పెట్టడం.

పారిశ్రామికాభివృద్ధి, దేశ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి, జనాభా నియంత్రణ, జాతీయ వనరులు, మానవ వనరుల పరిరక్షణ,

పేదిరిక నిర్మూలన, మౌలిక వసతుల రూపకల్పన, ఆరోగ్యం, రహదారులు, భూముల వర్గీకరణ మొదలగునవన్నీ జాతీయ ప్రణాళిక పరిధిలోకి వస్తాయి.

## 2.4.3 పంచవర్ష ప్రణాళికలు

స్వాతంత్ర్యానంతరం మన మొదటి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ నాయకత్వాన ప్రణాళికబద్ధమైన సామాజిక పరివర్తనకు అంకురార్పణ జరిగింది. నెహ్రూజీ నాయకత్వంలో సామాజిక పరివర్తన తీసుకురావడానికి పంచవర్ష ప్రణాళికలను ప్రవేశపెట్టారు. సామాజిక న్యాయం, సమానత్వం, ఆర్థిక వికాసం, స్వేచ్ఛ మొదలగు న్యాయపరమైన, నైతికపరమైన అంశాలకు మన రాజ్యాంగంలో పొందుపరిచారు. సామాన్య ప్రజానీకానికి సామాజిక, రాజకీయ, ఆర్థిక ప్రగతి ఫలాలు అందాలనేదే పంచవర్ష ప్రణాళికల ముఖ్య ఉద్దేశం. నిర్దిష్టమైన, స్పష్టమైన లక్ష్యాలతో ప్రజలందరినీ చైతన్యవంతులుగాచేసి, వారిని భాగస్వాములూ చేసి సామాజిక పరివర్తన తీసుకురావడానికి చిత్తశుద్ధితో, దీక్షతో ప్రయత్నిస్తే తప్పకుండా దేశ సామాజిక, రాజకీయ, ఆర్థిక రంగాల్లో విప్లవాత్మకమైన మార్పులను తీసుకురావడం అసాధ్యం కాదు. వీటినన్నింటినీ దృష్టిలో ఉంచుకొని పంచవర్ష ప్రణాళికలను రూపొందించారు.

## 2.4.4 పంచవర్ష ప్రణాళికలు - వాటి లక్ష్యాలు

| వరుస నెం. | కాలపరిమితి | ముఖ్య లక్ష్యాలు |
|---|---|---|
| మొదటి పంచవర్ష ప్రణాళిక | 1951-52 నుండి 1955-56 వరకు | వ్యవసాయ అభివృద్ధి |
| రెండవ పంచవర్ష ప్రణాళిక | 1956-57 నుండి 1960-61 వరకు | పారిశ్రామికాభివృద్ధి |
| మూడవ పంచవర్ష ప్రణాళిక | 1961-62 నుండి 1965-66 వరకు | స్వావలంబనము ఉపాధి సౌకర్యాల పెంపు |
| నాల్గవ పంచవర్ష ప్రణాళిక | 1969-70 నుండి 1973-74 వరకు | పేదరిక నిర్మూలన, బడుగు వర్గాల ఆర్థిక అభివృద్ధి విద్య ఉద్యోగ అవకాశాల అభివృద్ధి |
| ఐదవ పంచవర్ష ప్రణాళిక | 1974-75 నుండి 1979-80 వరకు | స్వయం సమృద్ధి |
| ఆరవ పంచవర్ష ప్రణాళిక | 1980-81 నుండి 1984-85 వరకు | పేదరిక నిర్మూలన |
| ఏడవ పంచవర్ష ప్రణాళిక | 1985-86 నుండి 1989-90 వరకు | ఆర్థిక అభివృద్ధి, ఆధునీకరణ, శాస్త్ర, సాంకేతిక అభివృద్ధి |
| ఎనిమిదవ పంచవర్ష ప్రణాళిక | 1992-93 నుండి 1996-97 వరకు | మానవ వనరుల అభివృద్ధి |
| తొమ్మిదవ పంచవర్ష ప్రణాళిక | 1997 నుండి 2002 వరకు | కనీస ఉమ్మడి ప్రణాళిక, స్వయం సమృద్ధి, ఉద్యోగ కల్పన, పేదరిక నిర్మూలన, అందరికీ ఆరోగ్యం. |
| పదవ పంచవర్ష ప్రణాళిక | 2002 నుండి 2007 వరకు | ఉపాధి కల్పన, అక్షరాస్యత పెంపు, మౌలిక సౌకర్యాల కల్పన |

1966-67, 1967-68, 1968-69, 1990-91, 1991-92 సంవత్సరాలలో వార్షిక ప్రణాళికలు తయారుచేసి వాటిని అమలు జరిపారు.

## 2.5 సామాజిక పరివర్తన సిద్ధాంతాలు

సమాజ శాస్త్రవేత్తలు, చరిత్రకారులు, మానవశాస్త్రవేత్తలు వివిధ సామాజిక పరివర్తన సిద్ధాంతాలను రూపొందించారు. ఈ సిద్ధాంతాలను మూడు వర్గాలుగా విభజించవచ్చును. అవి

1. పరిణామాత్మక సిద్ధాంతాలు (Evolutintionary Theories)
2. చక్రీయ సిద్ధాంతాలు (Cyclical Theories)
3. మతపరమైన సిద్ధాంతాలు. (Theological Theories)

## 2.6 పరిణామాత్మక సిద్ధాంతాలు (Evolutintionary Theories)

పరిణామాత్మక సిద్ధాంతవాదులు మానవ సమాజాలు క్రమక్రమంగా సాధారణ స్థాయి నుండి సంక్లిష్ట స్థాయికి చేరాయని, సమాజిక పరివర్తన అంటే ప్రస్తుతమున్న స్థితి నుండి ప్రగతి పథంలో పయనించడమని విశ్వసించారు. వీరి ప్రకారం పరివర్తన వలన మానవ నాగరికత క్రొత్త పుంతలు త్రొక్కుతూ, సమాజ శ్రేయస్సుకు దోహదపడుతూనే వుంటుంది. పంతొమ్మిదవ శతాబ్దంలో ఐరోపా దేశాల సామ్రాజ్యవాద విస్తరణ వలన ప్రపంచలోని మిగతా ఖండాల సమాజాలతో పరిచయం ఏర్పడింది. ఐరోపా సమాజానికి ఈ సమాజాలతో గతంలో సంబంధ బాంధవ్యాలు అంతగా లేవు. సామ్రాజ్యవాదం బలంగా వేళ్ళూనుకోవడం వలన వివిధ సమాజాలతో పరిచయం ఏర్పడి, ఆ సమాజాల సంస్కృతి, నాగరికత, సామాజిక వ్యవస్థల గురించి పరిశోధనకు నాంది పలికారు.

పరిణామాత్మక సిద్ధాంతం ప్రకారం ప్రతి సమాజం వివిధ దశల గుండా పరివర్తన చెంది నేటి నాగరికతను సంతరించుకొన్నది. యల్.హెచ్. మోర్గాన్ (L.H.Morgan) అనే శాస్త్రవేత్త ప్రతి సమాజం మూడు దశల గుండా పయనించిందని అభిప్రాయపడ్డాడు.అవి

1. ఆటవిక దశ (Savagery)
2. అనాగరికత దశ (Barbarism)
3. నాగరికత దశ (Civilisation)

సమాజ శాస్త్ర పితామహుడైన ఆగస్ట్ కామ్టే ప్రకారం మానవ సమాజం మూడు దశల గుండా అభివృద్ధి చెందినది. అవి

1. ఆదిమ దశ (Theological Stage)
2. ఆది భౌతిక దశ (Mataphysical Stage)
3. పాజిటివ్ దశ (Positive Stage)

సామాజిక శాస్త్రం పరిణామ సిద్ధాంతంతోనే ప్రారంభమైంది. 19వ శతాబ్దంలో పరిణామ సిద్ధాంతం జీవశాస్త్రల నుండి, ప్రత్యేకించి చార్లెస్ డార్విన్ (Charles Darwin) రూపొందించిన జీవ పరిణామ సిద్ధాంతం నుండి ప్రేరణను పొందింది. బ్రిటీష్ ప్రకృతి శాస్త్రజ్ఞుడైన చార్లెస్ డార్విన్ చారిత్రాత్మకమైన తన సముద్ర ప్రయాణం తరువాత 1859వ సంవత్సరంలో "జాతుల పుట్టుక (Origin of Species) అనే గ్రంథాన్ని రచించినాడు. ఈ గ్రంథంలో "జీవన పోరాటం" (Struggle for existance) మరియు అర్హమైనదే బతక కలుగుతుంది. (Survival of the filtest) అనే సూత్రాల ఆధారంగా జీవ పరిణామ సిద్ధాంతాన్ని రూపొందించినాడు. ఈ సిద్ధాంతం ఆ తర్వాత విశేషంగా వ్యాప్తి చెందింది. దీని ప్రభావం కేవలం జీవ శాస్త్రాలకు మాత్రమే పరిమితంకాక సాంఘిక శాస్త్రాలకు కూడా వ్యాప్తి చెందింది. సమాజ శాస్త్రవేత్తలు ప్రాణులలో అంతర్గతంగా నిగూఢంగా ఉన్న శక్తి సామర్థ్యాలు కాలక్రమేణా ప్రస్ఫుటమయ్యే ప్రక్రియను పరిణామం అంటారు. ఈ ప్రక్రియతో జీవులు క్రమేణ పెరిగి పెద్దవై పరిణతి చెందుతాయి. వాటి శక్తి సామర్థ్యాలు పెరుగుతాయి. సాధారణమైన

ఈ పరిణామ నమూనాను సామాజిక వ్యవస్థలకు అనువర్తింపజేసినప్పుడు అవి కాలక్రమేణా పరిమాణంలోను, ప్రకార్య, నిర్మితులలోను ఊర్ధ్వాభిముఖంగా వృద్ధి చెందుతాయి. ఈ నమూనాను ఉపయోగించి సామాజిక పరిణామ సిద్ధాంతాలను రూపొందించిన వారిలో ఆగస్ట్‌కామ్టే (Auguste Comte), హెర్బర్టు స్పెన్సర్ (Herbert Spencer), హెన్రీ మెయిన్ (Henry Maine), ఎల్.హెచ్. మోర్గాన్ (L.H.Morgan) డబ్ల్యూ.జి.సమ్నర్ (W.G.Sumner) ఎ.జి.కెల్లర్ (A.G.Keller) కారల్‌మార్క్స్ (Karl Marx) దుర్క్‌హైమ్ (Derkheim) మెకెవర్ (Mac lever) మొదలగు సమాజ శాస్త్రజ్ఞులను ప్రముఖంగా పేర్కొనవలెను.

సామాజిక పరిణామ సిద్ధాంతాలన్నింటిని మూడు రకాలుగా విభజించవచ్చును. అవి :

1. దశల వారీ పరిణామాత్మక సిద్ధాంతాలు (Stage-Wise Evolutionary theories)
2. సాధారణ పరిణామాత్మక సిద్ధాంతాలు (General Evolutionary theories)
3. బహుశాఖీయ పరిణామాత్మక సిద్ధాంతాలు (Myltilineal Evolutionary theories)

## 2.6.1 దశల వారీ పరిణామాత్మక సిద్ధాంతాలు (Stage-Wise Evolutionary theories)

కొందరు సామాజిక పరిణామ వాదులు కొన్ని నిర్దిష్ట దశలలో మాత్రమే సమాజాలు పరిణామం చెందుతాయని చెప్పినారు. చరిత్రకారులు, పురావస్తు శాస్త్రవేత్తలు నాగరికతకు పూర్వం సమాజాలు కొన్ని నిర్దిష్టదశలలో అభివృద్ధి చెందినాయని అభివర్ణించినారు. వారు పేర్కొన్న చారిత్రాక దశలను క్రింది విధంగా చెప్పవచ్చును.

### ప్రాక్ చరిత్రయుగం (Pre-Historic Period)

1. **ప్రాచీన శిలాయుగం** (Pre-Historic Period)

ఎ) పూర్వ ప్రాచీన శిలాయుగం (Lower Paleolithic Age)

బి) మధ్య ప్రాచీన శిలాయుగం (Middle Paleolithic Age)

సి) ఉత్తర ప్రాచీన శిలాయుగం (Upper Paleolithic Age)

2. **మధ్య శిలాయుగం (Mesolithic Period)**
3. **నవీన శిలాయుగం (Neolithic Period)**

### చారిత్రకయుగం

1. రాగియుగం (Copper Age)
2. కంచు యుగం (Bronze Age)
3. ఇనుప యుగం(IronAge)
4. పారిశ్రామిక యుగం (Industrial Age)

ఆదిమ మానవులు ఉపయోగించిన పనిముట్లను, ఇతర వస్తు సామాగ్రిని ఆధారంగా చేసుకొని చారిత్రక యుగాల విభజన చేయడం జరిగింది. ప్రాచీన శిలాయుగంలో మానవులు మొరటురకం రాతిపనిముట్లను ఉపయోగించి ఆహార సముపార్జన మొదలైన కార్యకలాపాలు కొనసాగించేవారు. క్రమంగా ఆరాతి పనిముట్లకు పదును పెట్టి వాటిని నునుపుకాను, సున్నితంగాను మార్చుకున్నారు.

నవీన శిలాయుగంలో పనిముట్టును సున్నితంగా చేయడమే గాక వ్యవసాయ పద్ధతులను కూడా కనిపెట్టినారు. నవీన శిలాయుగంలో వ్యవసాయక విప్లవం రావడం వల్ల సామాజిక వ్యవస్థలో, సంస్కృతిలో క్రమంగా పరిణామం కలిగిందని చరిత్రకారులు వెల్లడిస్తారు. చరిత్రకందని పూర్వయుగంలో మానవునికి వ్రాత అనేది తెలియదు. వ్రాతను కనుకొనడంతో సమాజాలు చరిత్ర యుగంలో ప్రవేశించినాయి. నాగరికత మొదటి దశలో మానవుడు రాగి, కంచు పనిముట్లను వాడి క్రమంగా ఇనుమును కనిపెట్టి దానితో ఎన్నో పనిముట్లను తయారుచేసుకొన్నాడు. దీని వల్ల చేతిపరిశ్రమలో చాలా అభివృద్ధి వచ్చింది. ఇట్లా మానవుడు పరికరాల అభివృద్ధి అతని సామాజిక, సాంస్కృతిక అభివృద్ధికి దోహదపడిందని చరిత్రకారులు చెబుతారు.

**ఆగస్ట్ కామ్టే (Auguste Comte)**

ఆగస్ట్‌కామ్టే (1798-1857) అనే ఫ్రెంచి తత్త్వవేత్త సమాజ శాస్త్రజ్ఞుడు తన "పాజిటివ్ ఫిలాసఫీ" (Positve Philosophy) అనే గ్రంథంలో మానవుని బుద్ధి వికాసంతో పాటు మానవ సమాజాలు కూడా మూడు దశలుగా పరిణామం చెందినాయని పేర్కొన్నాడు. అవి :

1. మతపరమైన దశ లేదా ఆదిమ దశ (Theological or primitive stage)
2. అది భౌతిక దశ (Metaphysical stage)
3. పాజిటివ్ దశ (Positive Stage)

మతపరమైన లేదా ఆదిమ దశలోనే సమాజంలో మత ప్రాబల్యం అధికంగా ఉండేది. ప్రజలలో భక్తి విశ్వాసాలు, మూడనమ్మకాలు ఎక్కువగా ఉండేవి. ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలు సమాజంలో మానవులను నియంత్రిస్తూ ఉండేవి. ఈ దశలో రాచరికం, సైనికాధిపత్యం కొనసాగుతూ ఉండేవి. రాజులను దైవాంశ సంభూతులుగా భావించేవారు. క్రమంగా మానవుని మేధస్సు వికాసం చెందడంతో అతనిలో వివేచనాశక్తి, హేతువాదం అభివృద్ధి చెందినాయి. దానితో మూఢనమ్మకాల ప్రభావం సన్నగిల్లి నాయ్యసమ్మతమైన హక్కులకోసం పోరాటం కొనసాగింది. అన్ని విషయాలలో మానవుడు తార్కిక విచారణ సాగించాడు.

పాజిటివ్ దశ (Positive Stage) మానవునిలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించినది. సమాజంలో శాస్త్రీయ, సాంకేతిక, పారిశ్రామిక వికాసానికి, అభివృద్ధికి ఇది ఎంతగానో దోహదపడింది. ఈ దశలో విశ్వజనీనమైన, మానవీయమైన విలువలకు ఎక్కువ ప్రాధాన్యత లభించినది. ఈ విధంగా కాలక్రమేణ సమాజాలు మూడు దశలుగా పరిణామం చెందినాయని ఆగస్ట్ కామ్టే పేర్కొన్నాడు. కామ్టే విశదీకరించిన మూడు దశలలోని సామాజికాంశాల సంబంధాన్ని ఈ క్రింది పట్టికలో చూడవచ్చును.

## సామాజిక పరిణామ దశలు - వ్యవస్థలు

| బుద్ధివికాశ దశ | ప్రాబల్య వ్యవస్థ | సామాజిక యూనిట్ | ప్రాబల్యసామాజిక విలువలు | భావవృత్తి |
|---|---|---|---|---|
| ఆదిమ దశ | సైనిక వ్యవస్థ | కుటుంబం | బంధుత్వం | అనురాగము |
| అది భౌతిక దశ | న్యాయ వ్యవస్థ | రాజ్యం | సమిష్టి | గౌరవం |
| పాజిటివ్ దశ | పారిశ్రామిక వ్యవస్థ | మానవజాతి | విశ్వజనీనమైన | సానుభూతి |

## 2.6.2. సాధారణ పరిణామాత్మక సిద్ధాంతాలు :

ఆగస్ట్ కామ్టే (Auguste Comte) మోర్గన్, ఎల్.హెచ్.(L.H.Morgan), ఎ.జి.కెల్లర్ (A.G. Keller) కారల్‌మార్క్స్ (Karl Marx) మొదలైన శాస్త్రవేత్తలు సమాజాలు కొన్ని నిర్దిష్ట దశలలో పరిణామం చెందుతాయని పేర్కొన్నారు. మరికొంతమంది సమాజ

శాస్త్రజ్ఞులు దశల వారీగా కాక సామాజిక పరిణామానికి సంబంధించిన సాధారణ సిద్ధాంతాలను రూపొందించినారు. వీరు సమాజాలు ఆదిమ, సామన్య దశల నుండి సంక్లిష్ట దశ వరకు పరివర్తన చెందుతాయమని పేర్కొన్నారు. ఈ రకమైన ముఖ్యసిద్ధాంతాలను గురించి తెలుసుకుందాం.

**హెర్బర్ట్ స్పెన్సర్ (Herbert spencen)**

సాధారణ పరిణామ సిద్ధాంతాన్ని రూపొందించి దానిని సామాజిక పరిణామానికి అనువర్తింపజేసిన వారిలో హెర్బర్ట్ స్పెన్సర్ (1820-1903) అనే బ్రిటీష్ సమాజ శాస్త్రవేత అగ్రగణ్యుడు. స్పెన్సర్ సాధారణ పరిణామ సిద్ధాంతాన్ని ఈ విధంగా వివరించినాడు. "పరిణామ ప్రక్రియ జరుగుతున్నప్పుడు పదార్థం సమీకలనం అవుతుంది. గతి విక్షేపణమవుతుంది. ఆ సందర్భంలో అనిర్దిష్టము, అసంసక్తత, సాధర్మ్యము ఉన్న పదార్థము నిర్దిష్టము, సంసక్తత, సంసక్తత, వైధర్మ్యమున్న పదార్థంగా రూపాంతరం చెందుతుంది". అప్పుడే శేషించిన గతి కూడా సమానాంతరంగా రూపాంతరం చెందుతుంది. హెర్బర్ట్ స్పెన్సర్ పరిణామ సిద్ధాంతాన్ని అన్ని వ్యవస్థలకు అన్వయించవచ్చును. ఇది అన్ని శాస్త్రాలకు సంబంధించిన సాధారణ పరిణామ సిద్ధాంతం. పదార్థం, గతి వీటి పునర్విభజన వల్లనే ఖగోళాలు, జీవులు, సమాజాలు ఏక రూపత నుండి బహురూపతకు పరివర్తను చెందుతుంటాయని స్పెన్సర్ అభిప్రాయం.

తొలిదశలోసమాజాలు సామాన్యమైనవిగాను, చిన్నవిగాను, ఉండి క్రమంగా పెద్దవిగాను, సంక్లిష్టంగాను పరిణామం చెందాయి. చిన్న చిన్న సమాజాలు సమీకరణం చెంది సంయోగ సమాజాలుగా రూపొందుతాయి. ఈ సమీకరణ ప్రక్రియ సమాజాలలో నిరంతరం కొనసాగుతూనే ఉండేదని, తరువాత కుటుంబాలు సమీకరణం చెంది గోత్రం (Clan) గాను, గోత్రాలు తెగలుగాను, తెగలు జాతీయ రాజ్యాలు (Nation States) గాను పరిణామం చెందినాయని స్పెన్సర్ అభిప్రాయపడినాడు. సామాజిక పరిణామానికి సమిష్టి ప్రయత్నం అవసరము.

**ఎమైల్ డుర్క్ హైమ్ (Emile Durkhelm)**

ఎమైల్ డుర్క్‌హైమ్ (1858-1917) అనే ఫ్రాన్స్ సమాజ శాస్త్రజ్ఞుడు జనాభా పెరుగుదలను, శ్రమ విభజనను ప్రధాన చరరాశులుగా తీసుకుని సామాజిక పరిణామాన్ని వివరించినాడు. ఆచార వ్యవహారాలు సమాజంలోని వ్యక్తులను, సమూహాలను సంఘటిత పరుస్తాయి. ఇట్లా ప్రాథమిక సంబంధాల వల్ల సమాజంలో ఉండే దార్ఢ్యాన్ని డుర్క్‌హైమ్ యాంత్రిక దార్ఢ్యం (Mechanical Solidarity) అని పేర్కొన్నాడు. సామాజిక వ్యవస్థలలో జనాభా పెరుగుదల వల్ల శ్రమ విభజన, విశిష్టీకరణము అధికమై యాంత్రిక దార్ఢ్యం (Mechanical solidarity) నుండి విధాయక దార్ఢ్యం (Organic solidarity) వైపు పరివర్తన జరుగుతుందని డుర్క్‌హైమ్ అభిప్రాయపడినాడు.

### 2.6.3 బహుశాఖీయ పరిణామాత్మక సిద్ధాంతము (Multilinear Evolutionary Theories)

సామాజిక పరిణామ సిద్ధాంతాలపై వచ్చిన తీవ్ర విమర్శ పర్యవసానంగా కొంతకాలం దాకా సామాజిక పరిణామాన్ని గురించిన పరిశీలన, పరిశోధన నిలిచిపోయింది. కాని ఇటీవలనే సమాజ శాస్త్రజ్ఞులు, మానవ శాస్త్రజ్ఞులు తమ దృష్టిని సామాజిక పరిణామం మీద సారించినారు. వీరు బహుశాఖీయ పరిణామ సిద్ధాంతాలను రూపొందించినారు. సమాజాలన్నీ, నిర్దిష్టదశలలో ఒకే రకంగా పరివర్తన చెందవనీ, వాటి వివిధాంశాలలో పరిణామము వేర్వేరుగా జరుగుతుండవచ్చునని ఈ సిద్ధాంతాలు చెబుతాయి. డబ్ల్యూ.ఎఫ్.ఆగ్బర్న్ (W.F. Ogburn) రూపొందించిన సాంస్కృతి విలంబన సిద్ధాంతం (Cultural lag theory) రాబర్ట్ మెకైవర్ (Robert Maciver) లెస్లీవైట్ (Leslie White) రూపొందించిన శక్తి సిద్ధాంతం, టాల్కాట్ పార్సన్స్ (Talcott Parsons) అనుసరణ సామర్థ్య సిద్ధాంతం (Theoryof Adaptive Capacity) మొదలగు వాటిని ముఖ్యమైన బహుశాఖీయ పరిణామాత్మక సిద్ధాంతాలుగా పేర్కొనవచ్చును.

## 2.7 చక్రీయ సిద్ధాంతాలు (Cyclical thories)

ఈ సిద్ధాంతం ప్రకారం దాదాపు అన్ని సమాజాలు అవిర్భావ, పతన దశల్ని, పెరుగుదల, క్షీణ దశల్ని కలిగి ఉంటాయి. సామాజిక వ్యవస్థలలో, సంస్కృతులలో హెచ్చుతగ్గులు, వృద్ధిక్షయాలు, సృష్టిలయలు ఒకదాని తరువాత మరొకటి చక్రీయంగా మార్పు చెందుతుంటాయి. ఇటువంటి సిద్ధాంతాలనే చక్రీయ పరివర్తన సిద్ధాంతాలని (Cyclical Evolutionary theories) అంటారు. విల్‌ఫ్రెడ్

పారెటో (Wilfred Pareto) ప్రతిపాదించిన శిష్టజన పరిసంచలనం (Theory of Circulatoin of Elites) ఆస్వాల్డ్ స్పెంగ్లర్ (Oswald Spengler) సొరొకిన్ (Sorokin) స్టువర్ట్ చాపిన్ (Stuart Chapin) మొదలగు శాస్త్రవేత్తలు రూపొందించిన సిద్ధాంతాలను ప్రధాన చక్రీయ సిద్ధాంతాలుగా పేర్కొనవచ్చును.

**పిట్రిమ్ ఎ. సొరొకిన్ (Pitrim. A. Sorokin)**

సొరొకిన్ తన సోషియల్ అండ్ కల్చరల్ డైనమిక్స్ అనే గ్రంథంలో సమాజిక పరివర్తనా సిద్ధాంతాన్ని విపులంగా వివరించినాడు.

సామాజిక, సాంస్కృతిక వ్యవస్థలు నిరంతరం రెండు అవధులు మధ్య లయ పూర్వకంగా క్రమంగా పునరావృత్తమయ్యే దశలుగా పరివర్తనం చెందుతుంటాయని సొరొకిన్ ఉద్ఘాటించినాడు.

సామాజిక - సాంస్కృతిక వ్యవస్థ పునరావృతదశలు (Recurrent Stages of Socio-Cultural system), సామాజిక - సాంస్కృతిక వ్యవస్థలు ప్రధానంగా మూడు దశలుగా ఉంటాయని సొరొకిన్ చెప్పినాడు. అవి :

1. చింతనాత్మకము (Ideational)
2. ఆదర్శము (Idealistic )
3. వైషయికము (Sensate)

చింతనాత్మక వ్యవస్థలో ఆధ్యాత్మిక, పరమార్థిక విలువల ప్రాబల్యం అధికంగా ఉంటుంది. వ్యవస్థలన్నీ వ్యక్తులలో ఆత్మ సిద్ధిని పెంపొందించడానికి వినియోగపడతాయి. వైషయిక సమాజంలో ఇంద్రియానుగతమైన విలువలను, విషయ వాంఛలకు ప్రాబల్యం ఉండటం వల్ల వ్యవస్థలన్నీ వాటి సఫలత కోసమే పనిచేస్తాయి. వైషయిక తత్త్వశాస్త్రంలో ఇంద్రియ గోచరమైన వాస్తవికతకు, సత్యానికి ప్రాధాన్యం ఉంటుంది. వైషయిక సమాజంలో ప్రమాణాలు ప్రధానంగా చట్టాల మీద శాసనాల మీద ఆధారపడి ఉంటాయి. వైషయిక సంస్కృతిలో కళలు, సాహిత్యం వాస్తవికతను నగ్నంగా చిత్రించి ఇంద్రియాలను ప్రీతిని చేకూర్చటం జరుగుతుంది. చింతనాత్మక సమాజంలో మతము అంచంచల భక్తి విశ్వాసాలకు, నిత్యానుష్టాన కర్మలకు ప్రాధాన్యం ఇస్తుంది. కాని వైషయిక సమాజంలో సమిష్టి ప్రార్థనలకు, ఉపన్యాసాలకు, సామాజిక సంక్షేమ కార్యక్రమాలకు ప్రాధాన్యం ఉంటుంది. చింతనాత్మక, వైషయిక, సామాజిక సాంస్కృతిక వ్యవస్థల మధ్య ఉన్న వ్యత్యాసాలను సొరొకిన్ ఈ విధంగా విపులంగా వర్ణించినాడు.

సామాజిక - సాంస్కృతిక వ్యవస్థలు ఈ రెండు అవధులు మధ్య చలిస్తూ ఉంటాయి. ఈ రెండింటి మధ్యసంధిదశను ఆదర్శ సామాజిక సాంస్కృతిక దశగా సొరొకిన్ పేర్కొన్నాడు. దీనిలో చింతనాత్మక, వైషయిక వ్యవస్థల లక్షణాల సమ్మిళితమై ఉంటాయి. సమాజము నిరంతరం ఈ మూడు దశలలో పరివర్తన చెందుతుంటుందని సొరొకిన్ అభిప్రాయ పడినాడు. ఇరవయ్యోశతాబ్దంలో వైషయిక సంస్కృతి అగ్రస్థాయిని చేరిక్రమంగా ఆదర్శ సంస్కృతిగా పరివర్తన చెందుతుందని సొరొకిన్ పేర్కొన్నాడు.

సొరొకిన్ సిద్ధాంతం కూడా కొన్ని విమర్శలకు గురి అయింది. సొరొకిన్ సామాజిక సాంస్కృతిక వ్యవస్థలను ప్రధానంగా మూడు రకాలుగా విభజించడం సంకుచితమని కొందరు సమాజ శాస్త్రజ్ఞులు అభిప్రాయపడినారు. ఏ సమాజమైన పూర్తిగా చింతనాత్మకంగా కాని, ఆదర్శంగాకాని, వైషయికంగా కాని ఉండదు. సొరొకిన్ మూడు రకాలు వ్యవస్థలను వర్ణించడంలో అతని వ్యక్తిగత విలువలు ప్రతిబింబిస్తున్నాయి. ఏదిఏమైనప్పటికి సొరొకిన్ తన సిద్ధాంతాన్ని రూపొందించి సామాజిక పరివర్తన విషయం మీద సమాజ శాస్త్రజ్ఞుల జిజ్ఞాసను ఇనుమడింపజేసినాడు.

## 2.8 మతపరమైన సిద్ధాంతాలు (Theological theories)

ప్రపంచ మతాలన్నింటిలోను విశ్వసృష్టికి, మానవుని సామాజిక వ్యవస్థలకు సంబంధించిన విజ్ఞానము కొంతవరకు ఉంటుంది. ఈ విజ్ఞానము జానపద గాథలలోను, పురాణకథలలోను, మతగ్రంథాలలోను ఉండటం మూలంగా సాంప్రదాయంకంగా సంక్రమిస్తున్నది. అందువలన ఈ విజ్ఞానం సజీవంగా నిలచి ఉంటున్నది. మత గ్రంథాలలో సృష్టి లయలకు సంబంధించిన సిద్ధాంతాలను ప్రతిపాదించినారు. ఈ సువిశాల ప్రపంచానికి, అందులో ఉన్న ప్రాణకోటికి, వాటి సమాజాలన్నింటికి మూలకారణము సర్వాంతర్యామి, సర్వశక్తి సంపన్నుడు

అయిన భగవంతుడే అని మతాలన్నీ ప్రబోధిస్తున్నాయి. భగవంతుని అనుమతి లేకుండా ఏమి జరగదని వీరి దృఢ విశ్వాసం. సామాజిక వ్యవస్థలను కూడా భగవంతుడే సృష్టించినాడనీ, అవి అతడు ఆదేశించిన రీతిగా పనిచేస్తూ, పరివర్తన చెందుతాయనడంలో అన్ని మతాల వారు ఏకీభవిస్తారు. మతపరమైన ఈ సామాజిక పరివర్తన సిద్ధాంతాలు చాలా పురాతనమైనవి.

వేద మతానుసారంగా కృత, త్రేత, ద్వాపర, కలియుగాలుగా కాలచక్రము ఒక క్రమంలో తిరుగుతుంటుంది. ఈ యుగాలు ఒక దాని తరువాత ఒకటి మార్పుచెంది కలియుగాంతాన ప్రళయం వస్తుందని, ఆటు తరువాత మళ్ళీ మళ్ళీ అదే వరుసలో యుగాలు పరివర్తన చెందుతుంటాయని హిందూ పురాణాలు చెబుతాయి. సామాజిక వ్యవస్థలు కూడా యుగధర్మాన్ని అనుసరించి నడుస్తూ మార్పు చెందుతుంటాయని పురాణేతిహాసాలు చెబుతున్నాయి. ప్రతి యుగంలోను శాంతి భద్రతలు లోపించడానికి అవకాశముందని అటువంటి పరిస్థితులలో దుష్టులను శిక్షించి సాధుజనులను రక్షించి, శాంతి భద్రతలను నెలకొల్పడానికి ఆదినారాయణుడు అవతరిస్తాడని వైదిక మత గ్రంథాలు ఉద్ఘాటిస్తున్నాయి.

క్రైస్తవులు కూడా ఈ ప్రపంచాన్నంతటిని భగవంతుడే సృష్టించినాడని నమ్ముతున్నారు. దేవుడు మొట్టమొదట ప్రపంచాన్ని, అందులో అనేక వస్తువులను సృష్టించి తరువాత ఆడమ్ (Adam) ఈవ్(Eve)లను సృష్టించినాడని, ప్రపంచంలోని మానవులంతా ఆ ఆదిదంపతుల సంతానమేనని వీరు భావిస్తారు. మానవులందరు దేవుని శిరసావహిస్తూ ఆయన చెప్పిన మార్గంలో నడవడం ద్వారాసుఖ సంతోషాలను పొందవచ్చుననీ, అట్లా చేయని పక్షంలో సకల కష్టనష్టాలకు గురవుతారని క్రైస్తవ మతము బోధిస్తుంది. మానవ సమాజము అధమస్థితి నుండి ప్రారంభమై దేవుని రాజ్యాన్ని స్థాపించి విస్తృతపరచడం ద్వారా ఉన్నత స్థాయికి చేరుతుందని క్రైస్తవ మత అనుయాయుల విశ్వాసం. ఇట్లా ప్రపంచంలోని మతాలన్ని సామాజిక వ్యవస్థలను భగవంతుడు సృష్టించినాడని, ఆయన నిర్దేశించినట్లుగా అవిపనిచేస్తూ పరివర్తన చెందుతాయని చెబుతాయి. మతపరమైన సామాజిక పరివర్తనా సిద్ధాంతాలు ప్రజల విశ్వాసానికి సంబంధించినవి మాత్రమే. వీటికి శాస్త్రీయమైన, చారిత్రాకమైన ఆధారాలేవీ లేవు. కాబట్టి సామాజిక పరివర్తనకు సంబంధించిన శాస్త్రీయమైన చర్చలో వీటికి ప్రాముఖ్యత అంత ఉండదు.

## 2.9 సారాంశం

సామాజిక వ్యవస్థలలోని పరివర్తనలను పరిశీలించి వాటిని వివరించడానికి సమాజ శాస్త్రజులు వివిధ సిద్ధాంతాలకు రూపొందించారు. కొన్ని సిద్ధాంతాలు ఏకపక్షీయమైనవి. ప్రత్యేకమైనవి. మరికొన్ని సిద్ధాంతాలు ఒకే దేశ చరిత్రను గానీ ఏదో ఒక రంగాన్ని దృష్టిలో పెట్టుకుని రూపొందించినవి. ఇంకా కొన్ని సిద్ధాంతాలు సామాజిక ప్రగతికి, పరిణామానికి సంంబంధించినవి.

## 2.10 నమూనా ప్రశ్నలు

1. భారతదేశంలో ప్రణాళికాబద్ధమైన సామాజిక పరివర్తనాలు గురించి ఒక వ్యాసము వ్రాయుము.
2. సామాజిక పరిణాబాత్మక సిద్ధాంతాన్ని చర్చించుము
3. సామాజిక పరివర్తన సిద్ధాంతాలను గురించి వివరింపుము.

## 2.11 చదువదగిన పుస్తకాలు


1. రాధాకృష్ణమూర్తి & పద్మజ.కె - సమాజము, నిర్మితి పరివర్తన
2. Wilbert E. Moore - Social Change
3. Appelbaum R.P. - Theories of Social Change
4. Sorokin.P. - Contemporary sociological theories.
౫. తెలుగు అకాడమి - సమాజము, పరివర్తన - ప్రణాళికలు

పాఠం - 3

# సామాజిక ప్రగతి - సామాజిక పరిణామము

## 3.0 ఉద్దేశ్యాలు

సామాజిక ప్రగతిని మరియు సామాజిక పరిణామాన్ని విశదీకరించడం, సామాజిక ప్రగతి లక్షణాలు, సామాజి పరిణామ భావనలను వివరించడం.

విషయసూచిక


3.1 పరిచయం

3.2 సామాజిక ప్రగతి నిర్వచనాలు

3.3 సామాజిక పరిణామం నిర్వచనాలు

3.4 సామాజిక ప్రగతికి సామాజిక పరిమాణానికిగల తేడా

3.5 సామాజిక ప్రగతి లక్షణాలు

3.6 సామాజిక ప్రగతి - ప్రాతిపదికలు

3.7 ఉద్దేశ ప్రగతి

3.8 సామాజిక పరిణామ భావం

3.9 సారాంశము

3.10 నమూనా ప్రశ్నలు

3.11 చదువదగిన గ్రంథాలు


## 3.1 పరిచయం

పరిణామము అనే పథం ఎవాల్వర్ (Evolvere) అనే లాటిన్ పదం నుండి ఉద్భవించింది. 'ఎవాల్వర్' అంటే అభివృద్ధి చెందడం అని అర్థం. మన సంస్కృత భాషలోని 'వికాస్' అనే పదానికి ఈ 'ఎవాల్వర్' అనే పదం పర్యాయ పదంగా వాడుకలో వున్నది. సమాజంలోని వ్యవస్థల్లోగాని, సమాజ సభ్యుల ప్రవర్తనలో, ఆచార వ్యవహారాల్లో గానీ, సమాజ నిర్మితి, ప్రకార్యాలలోగానీ వచ్చే అంతర్గత అభివృద్ధినిగానీ, పరివర్తనను గానీ, సామాజిక పరిణామము అని అంటారు. సమాజంలో క్రమబద్ధతతో సంభవించే పరివర్తనను తెలియజేయడాన్ని మాత్రమే సామాజిక పరిణామము అని అంటారు.

పరిణామము అనే పదాన్ని జీవశాస్త్రము నుండి సమాజ శాస్త్రములోనికి తీసుకొనబడినది. జీవశాస్త్రములోని జీవ పరిణామము అనే పదాన్ని సమాజ శాస్త్రంలో సామాజిక పరిణామముగా అనువదించారు. జీవ పరిణామ సిద్ధాంతం జీవుల పుట్టుకను, వాటి అభివృద్ధిని, కాలనుగుణంగా జీవులలో కలిగిన మార్పులను వివరిస్తుంది. అలాగే సామాజిక పరిణామ సిద్ధాంతం మానవ సమాజ పుట్టుకను పరిణామాన్ని అభివృద్ధిని, మానవ సంబంధాల అభివృద్ధిని విశదపరుస్తుంది.

సమాజ శాస్త్ర ప్రారంభదశలో కొందరు శాస్త్రవేత్తలు క్రమానుగత పరిణామమే సామాజిక పరివర్తనని భావించారు. మరికొందరు సామాజిక ప్రగతి (Social Progress) నే సామాజిక పరివర్తనగా అభివర్ణించారు. కానీ ఆధునిక సమాజ శాస్త్రవేత్తలు సామాజిక పరివర్తన, సామాజిక పరిణామము సామాజిక ప్రగతుల కంటే భిన్నమైనదని భావిస్తున్నారు.

## 3.2 సామాజిక ప్రగతి నిర్వచనాలు

"హేతుబద్ధమైన విలువలను కలిగివున్న అభివృద్ధి లేదా పరిణామాన్ని సామాజిక ప్రగతి అంటారు"- గిన్స్‌బర్గ్ (Ginsberg)

"ఒక సమూహం కోరుకున్న భవిష్యత్ లక్ష్యసాధానాభివృద్ధినే సామాజిక ప్రగతి అంటారు" - డబ్లు. ఎఫ్.ఆగ్బర్న్ (W.F.Ogburn)

## 3.3 సామాజిక పరిణామం నిర్వచనాలు

"సమాజంలోని సభ్యులు గత సామాజిక ప్రమాణాలను వదలి నూతన సామాజిక ప్రమాణాలకోసంచేసే ప్రయత్నపూర్వక ప్రక్రియనే సామాజిక పరిణామం అని నిర్వచించవచ్చును".

"ప్రణాలికాబద్ధమైన లేక ప్రణాళికాబద్ధం కాని సాంస్కృతిక సామాజిక సంబంధాల, సామాజిక పరస్పర చర్యల అభివృద్ధినే సామాజిక పరిణామం అంటారు" - ఇ.హెచ్.హౌస్ (E.H.House)

## 3.4. సామాజిక ప్రగతికి సామాజిక పరిణామానికి మధ్య గల తేడా

సామాజిక పరిణామం అనేది సమాజ వ్యవస్థలో కలిగే అనేక మార్పులకు సంబంధించిన ప్రక్రియ. సామాజిక వ్యవస్థల్లో నిరంతర విభేదీకరణ, సమైక్యతలను మనం పరిణామంగా వివరించవచ్చును. సామాజిక పరిణామం అనేది ఒక శాస్త్రీయ భావన. సమాజాలలో విభేదీకరణ, సంక్లిష్టత, భావ ప్రసార వ్యవస్థలు సునిశితం కావడం మొదలైన సూచికల ఆధారంగా సమాజాలు పరిణామం చెందుతున్నాయా? లేక పరిణామం చెందడం లేదా? అనే విషయాన్ని శాస్త్రీయంగా వివరించవచ్చును.

కానీ సామాజిక ప్రగతిని గురించి వివరించడం అంత సులభం కాదు. కోరుతున్న దిశలో జరిగే సామాజిక పరివర్తనను సామాజిక ప్రగతి అని అంటారు.

కానీ ఈ పరివర్తన క్రమంలో ఎలాంటి పరివర్తన వాంఛనీయం అనే విషయంలో సమాజ సభ్యుల మధ్య భేదాభిప్రాయాలు వుండవచ్చును. ఒకరికి వాంచనీయమైనది మరొకరికి వాంఛనీయం కాకపోవచ్చును. వ్యక్తులను బట్టి, సముదాయాలను బట్టి, సమూహాలను బట్టి సామాజిక వ్యవస్థల్లో విభిన్నత వుండవచ్చును. కొంతమంది నేటి సామాజిక వ్యవస్థలు ప్రగతి పథంలో పురోగమిస్తూ, మానవాళికి సుఖ సంతోషాలను చేకూర్చుతున్నాయని భావిస్తే, మరికొందరు గతంలోని సామాజిక వ్యవస్థలే మెరుగ్గా వుండేవని, ఆనాటి మానవాళి సుఖ,సంతోషాలతో వుండే వారని భావిస్తారు. ప్రస్తుత సమాజంలోని అన్ని వ్యవస్థలు పతనమవుతున్నాయని భావిస్తారు. అంటే సామాజిక ప్రగతి భావనలో విలువలు, ప్రమాణాలు ఇమిడి వున్నాయి.

## 3.5 సామాజిక ప్రగతి లక్షణాలు

1. ఒక నిర్దిష్టమైన దిశలో, క్రమబద్ధంగా పురోగమించడం
2. ఆశయం, సంకల్పం, ఉద్దేశం అనేవి ముఖ్యమైన మూల సూత్రాలు.
3. సామాజిక ప్రగతి దేశా కాల పరిస్థితులను బట్టి మార్పు చెందుతుంది.
4. లక్ష్యసాధనసిద్ధిస్తేనే సామాజిక ప్రగతికి మార్గం సుగమమవుతుంది.
5. సముదాయకాభివృద్ధి, సమూహాఅభివృద్ధి, మతాభివృద్ధి సామాజిక ప్రగతికి మూలాలుగా పేర్కొనవచ్చును.
6. సమాజంలోని వివిధ వ్యవస్థలో ప్రగతి స్థాయి ప్రతిఫలిస్తుంది.
7. సమాజ సభ్యులకోసం సుఖసంతోషాలను సాధించడమే సామాజిక ప్రగతి.
8. సామాజిక ప్రగతిని సాధించడానికి మానవుడు నిరంతరము ప్రకృతిని లోపరచుకోవడానికి ప్రయత్నిస్తూ, లక్ష్య సాధన దిశగా పురోగమించడమే సామాజిక ప్రగతి.

ప్రకృతిపరమైన వరదలు, తుఫానులు, కరువు కాటకాలు, భూకంపాలు, అతివృష్టి, అనావృష్టి మొదలగునవి సామాజిక ప్రగతికి అడ్డుతగలడం మామూలుగా సంభవిస్తుంటాయి. ఇటువంటి విపత్కర పరిస్థితుల్లో వివిధ ప్రణాళికల ద్వారా ప్రకృతి బీభత్సాలను అధిగమించవచ్చును. సమాజాన్ని ప్రగతిపథంలో నిలుపడానికి వీలుంటుంది.

## 3.6 సామాజిక ప్రగతి - ప్రాతిపదికలు

సామాజిక ప్రగతి భావనలో స్వీయ విలువలకు అవకాశం ఎక్కువగా వుంటుంది. కాబట్టి దీనికి సంబంధించిన వివిధ ప్రాతిపదికలను వివరించారు. వీటిలో ముఖ్యమైన ప్రాతిపదికలను క్రింద పేర్కొనడం జరిగింది.

1. మూర్తిమత్వ వికాసం (Personality Development)
2. సంతోషం (Happiness)
3. వాంఛలు (Desires)
4. సామాజిక శక్తుల నియంత్రణ (Control of Social forces)
5. పరిసరాలతో అనుసరణ (Adoptation of Environment)

### 3.6.1 మూర్తిమత్వ వికాసం (Personality Development)

సమాజ సభ్యుల సంపూర్ణ మూర్తిమత్వ వికాసానికి దోహదం చేయడమే సామాజిక ప్రగతి యొక్క ముఖ్య లక్ష్యంగా పేర్కొనవచ్చును. సమాజంలోని వివిధ వర్గాల ప్రజలకు స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలను కల్గించి, వారిలో మూర్తిమత్వ వికాసాన్ని ప్రేరేపించడానికి అనువైన సామాజిక నిర్మితులను ఏర్పాటు చేయడమే సామాజిక ప్రగతి యొక్క ముఖ్య ఉద్దేశ్యం. సామాజిక వ్యవస్థలకు,వ్యక్తులకు మధ్య సమన్వయం కుదిరేవిధంగా పరిస్థితులను రూపొందించవలెను.

### 3.6.2 సంతోషం (Happiness)

ససమాజం సుఖసంతోషాలతో వర్థిల్లడానికి అనుకూలమైన పరిస్థితులను నెలకొల్పడానికి సమాజంలోమార్పులు సంభవిస్తే, ఆ మార్పులను సామాజిక ప్రగతిగా భావించవచ్చునని కొంతమంది శాస్త్రవేత్తలు అభిప్రాయపడ్డారు. కానీ 'సంతోషం' అనే పదాన్ని నిర్వచించడం సులభం కాదు. అత్యధికుల శ్రేయస్సుకోసం, సంతోషం కోసం కృషి జరగాలని కొందరు భావిస్తే, సమాజంలోని ప్రతి వ్యక్తి సుఖసంతోషాల కోసం కృషి జరగాలని మరి కొందరు భావిస్తారు.

### 3.6.3. వాంఛలు (Desires)

వ్యక్తుల వాంచలకు అనుకూలమైన సామాజిక వ్యవస్థలను మరియు సామాజిక పరిస్థితులను రూపొందించండమే సామాజిక ప్రగతి లక్ష్యమని కొంతమంది సమాజ శాస్త్రవేత్తల అభిప్రాయం. మానవ జీవితానికి అవసరమైన ఆరోగ్యం, భద్రత, న్యాయం, సమానత్వం, విజ్ఞానం, అంతస్థు మొదలైనవి సముపార్జించడానికి అనుకూలమైన సామాజిక పరిస్థితులను ఏర్పాటు చేయాలి. కానీ వాంఛలకు వాంఛనీయాలకు మధ్య తేడా వున్నది. మానవుల వాంఛలన్నీ వాంఛనీయాలు కాకపోవచ్చు. వాంఛనీయమైన వ్యవస్థలను రూపొందించడంలో కొన్నిసార్లు అవాంఛనీయ సమస్యలు ఉత్పన్నం కావచ్చును. సామాజిక విప్లవం తర్వాత దాదాపు ప్రతిసమాజం పారిశ్రామిక వ్యవస్థ వైపు మొగ్గుచూపింది. పారిశ్రామిక వ్యవస్థ ఎంత వాంఛనీయమైనప్పటికీ, దానికి అనుబంధమైన కలుషిత వాతావరణం, యాంత్రిక జీవనం, మానసిక సమస్యలు వలసలు మొదలగునవి వాంచనీయాలు కావు. వాంఛలకు, వాంఛనీయాలకు మరియు ఆదర్శాలకు, వాస్తవాలకు మధ్యగల అగాధాన్ని, వ్యత్యాసాన్ని తగ్గించడానికి జరిగే ప్రయత్నాన్ని సామాజిక ప్రగతి అని చెప్పవచ్చును.

### 3.3.4 సామాజిక శక్తుల నియంత్ర (Control of Social forces)

ప్రతి సమాజం మతపరమైన దశ నుండి క్రమక్రమంగా శాస్త్రీయ దశకు పరిణామం చెందుతుందని, ఈ దశలో విశ్వజనీనమైన, మానవీయమైన విలువలకు ప్రాధాన్యత లభిస్తుందని ఆగస్ట్ కామ్టే అభిప్రాయపడ్డాడు. ఈ దశలో విశ్వజనీనమైన, మానవీయమైన విలువలకు ప్రాధాన్యత లభిస్తుంది. శాస్త్ర, సాంకేతిక అభివృద్ధి జరగడంతో సామాజిక నిపుణులు మెరుగైన, సమర్ధవంతమైన సామాజిక వ్యవస్థలను స్థాపించి, ప్రజలకు సుఖవంతమైన జీవితాన్ని ప్రసాదించడంలో తోడ్పడుతారు. సమాజంలో కొన్ని అవాంఛనీయమైన, మూఢనమ్మకాలతో ముడిపడ్డ సామాజిక శక్తుల నియంత్రణకు సాధ్యపడి, ప్రగతి పథంలో పయనించడానికి దోహదపడుతుంది.

### 3.6.5. పరిసరాలతో అనుసరణ (Adoptation of Environment)

మానవుడు తన చుట్టూ వున్న పరిసరాలకు తగినట్లు అనుసరణ చెందడం ద్వారా సుఖసంతోషాలను పొంది సామాజిక ప్రగతిని సాధిస్తాడని హెర్బరేట్ స్పెన్సర్ అభిప్రాయపడ్డాడు. ఈ ప్రక్రియలో అనేక సామాజిక రూపాలు క్రమంగా వృద్ధిపొంది, సమాజం సంక్లిష్టతను సంతరించుకొంటుంది. సమాజంలో కేవలం సంక్లిష్టత ద్వార మాత్రమే మానవుడు సుఖసంతోషాలను పొందలేదు. సమాజంలోని అవ్యవస్థను, విచ్ఛిన్నకర స్థితులను నియంత్రించి సమైక్యతను సాధిస్తేనే సామాజిక పరివర్తన సాధ్యమవుతుంది. పరిసరాల విచ్ఛిన్నం వలన ప్రగతి కుంటుపడుతుంది ఎల్.ఎఫ్.వార్డు (L.F.Ward) అభిప్రాయంలో సామాజిక ప్రగతి అంటే పరిసరాలకు సరియైన అనుసరణ జరుపుకోవడమే.

## 3.7 ఉద్దేశ ప్రగతి

ఎల్.ఎఫ్.వార్డు (L.F.Ward) అనే శాస్త్రవేత్త ఉద్దేశ ప్రగతి అనే భావనను మొట్టమొదటిసారిగా ప్రవేశపెట్టాడు. శాస్త్ర, సాంకేతిక ప్రగతి ఉదృతం కావడంతో సమాజ శాస్త్రజ్ఞులు సమాజంలో ప్రణాళికయుతమైన పరివర్తన ద్వారా సామాజిక ప్రగతి సాధిస్తారని ఆగస్టుకోమ్టే పేర్కొన్నాడు. కానీ ఎల్.ఎఫ్.వార్డు మాత్రం ప్రజలలో సమాజ శాస్త్ర విజ్ఞానం వ్యాప్తి చెందడం ద్వారా సామాజిక ప్రగతి సాధిస్తారని అభిప్రాయపడ్డాడు. సమాజంలోని ప్రతి వ్యక్తి సామాజిక లక్ష్యాలను అవగాహన చేసుకొని, వాటిని సాధించడానికి కృషిచేస్తాడని చెప్పినాడు. వార్డు సామాజి ప్రగతి రెండు రకాలుగా జరుగుతుందని పేర్కొన్నాడు. అవి 1. సహజ ప్రగతి (Natural Progress) 2. కృత్రిమ ప్రగతి (Artificial progress)

### 3.7.1 సహజ ప్రగతి

మానవులు తమ చుట్టూవున్న పరిసరాలకు అనుగుణంగా సర్దుకొని జీవితం గడపడమే సహజ ప్రగతిగా పేర్కొన్నాడు. ఇది సహజంగా జరిగే నిరంతర ప్రక్రియ. ఇది సహజమైన పరిణామ ప్రక్రియ. ఇందులో మానవులు ప్రత్యేకమైన, నిర్దుష్టమైన లక్ష్యాలను ఏర్పరుచుకోరు ప్రణాళికలు, వ్యూహాలు, లక్ష్యాలు వుండవు.

### 3.7.2 కృత్రిమ ప్రగతి

మానవులు సామాజిక శ్రేయస్సు దృష్ట్యా సామాజిక పరివర్తనను నిర్దేశిస్తారని, దాని కోసం నిరంతరమూ వివేచనాత్మకమైన వివిధ పథకాలను రూపొందించి వాటిని అమలు పరచడానికి ప్రయత్నించడం వలన సామాజిక ప్రగతి సాధ్యమని వార్డు భావించారు. పరిసరాలను తమ ఉద్దేశాలకు, అనువైన జీవితానికి అనుగుణంగా మార్చుకోవడానికి వివిధ పథకాలను రూపొందించడమే కృత్రిమ ప్రగతి సామాజిక ప్రగతి సాదించడంలో విద్య ప్రధాన పాత్ర వహిస్తుందని వార్డు అభిప్రాయపడ్డాడు. ప్రతి సమాజంలో ప్రజల సుఖసంతోషాలకోసమే రకరకాల ఉద్యమాలు ఆవిర్భవిస్తాయి. పూర్వం ఈ సామాజిక ప్రగతి మతవ్యవస్థల ద్వారా సాగేది. కానీ నేడు శాస్త్రీయ విద్యద్వారా మాత్రమే సామాజిక ప్రగతి సాధ్యమని వార్డు అభిప్రాయపడ్డాడు.

## 3.8. సామాజిక పరిణామ భావన (Concept of Social Evolution)

పంతొమ్మిదవ శతాబ్దంలో సామాజిక ఆలోచనలలో సామాజిక పరిణామ భావన ప్రాముఖ్యతను సంతరించుకొన్నది. పూర్వదశలను అధిగమించి ఒక క్రమ పద్ధతిలో పరివర్తన సంభవిస్తే, ఆ ప్రక్రియనే 'సామాజిక పరిణామం' అంటారు. ఒక ప్రత్యేక చలన దిశలో

నిరంతరమూ, నిర్విరామంగా సంభవించే మార్పునే పరిణామం అంటారు.

సమాజాలన్నీ సాధారణ స్థితి నుండి సంక్లిష్ట స్థితికి చేరడానికి అనేక దశలను దాటవలసి వుంటుంది. ఇదొక సుదీర్ఘ ప్రయాణం. సెయింట్ సైమన్ పరిణామాన్ని గురించి వ్యాఖ్యానిస్తూ మానవులందరూ పరిణామక్రమంలో కొన్ని దశలను దాటవలసివుంటుందని అభిప్రాయపడ్డాడు. అతడు మానసిక చైతన్యాన్ని (a) ఊహాజనితమైన దశ (b) misconjunctural phase (c) సునిశ్చిత దశ అని మూడు రకాల దశలుగా వివరించాడు. సమాజ శాస్త్ర పితామహుడు ఆగస్టు కోమ్టే ప్రతి సమాజం (a) ఆదిమదశ (b) ఆదిభౌతిక దశ (c) పాజిటివ్ దశ అనే మూడు దశలగుండా ప్రయాణం చేయాలని అభిప్రాయపడ్డాడు. అలాగే స్పెన్సర్ సామాజిక జీవనం సాధారణ స్థితి నుండి సంక్లిష్టస్థితికి, స్వజాతీయత నుండి విజాతీయతకు మారుతుందని వివరించాడు. మోర్గాన్ ఆదిమతెగల నాటి నుండి కుటుంబవ్యవస్థ క్రమబద్ధంగా లేని స్త్రీ పురుష కలయిక నుండి వివాహవ్యవస్థ, కుటుంబ వ్యవస్థ ఏర్పడడాన్ని గురించి, మత వ్యవస్థ ఏర్పాటుకావడాన్ని గురించి వివరించాడు.

పంతోమ్మిదవ శతాబ్దం పరిణామ సిద్ధాంతాలను ఇరవైవ శతాబ్దంలో తిరస్కరించారు. తర్వాత కాలంలో నిర్మాణాకృత వ్యవస్థను విశ్లేషించడం ద్వారా తిరిగి ఈ సిద్ధాంతానికి ప్రాణం పోసారు. పరిణామ భావనకు మార్పులు చేసి సాంకేతికతను చేకూర్చారు.

## 3.9 సారాంశం

సామాజిక పరివర్తన ఒక క్రమపద్ధతిలో సంభవిస్తే ఆప్రక్రియనే సామాజిక పరిణామం అంటాము. ప్రత్యేక చలన దిశలో జరిగే మార్పునే పరిణామం అంటాం. సామాజిక ప్రగతి ద్వారా సంభవించేది శ్రేష్ఠమయినచో దానికే సామాజిక ప్రగతి అని అర్థం చేసుకోవచ్చును. అంతిమ లక్ష్యం, ఆదర్శం, నిశ్చయం అనేవి సామాజిక ప్రగతి లక్షణాలు. సమాజాల్లోని విలువలు ప్రముఖ పాత్రను పోషిస్తాయి. మానవ సమాజ పరివర్తన విలువల మీద ఆధారపడి వుంటుంది. ప్రతి సమాజం తన విలువలను ఆధారంగా చేసుకొని లక్ష్యాలను ఏర్పరచుకుంటుంది. ఈ లక్ష్యాలు సమాజసభ్యుల అవసరాలకు తీర్చడంలో, వారి జీవన స్థితిగతులకు మెరుగు పరచడంలో కీలక పాత్ర వహిస్తాయి.

## 3.10 ప్రశ్నలు

1. సామాజిక పరిణామం, సామాజిక ప్రగతిపై ఒక వ్యాసము వ్రాయుము.
2. సామాజిక ప్రగతిని నిర్వచించి, సామాజిక ప్రగతి ప్రాదిపదికలను వివరించుము.
3. సామాజిక పరిణామ భావనను వివరింపుము.

## 3.11 చదువదగిన పుస్తకాలు


R.N. Sarma : Principles of Sociology

తెలుగు అకాడమీ : సమాజము, పరివర్తన, ప్రణాళికలు

పాఠం - 4

# సామాజిక పరివర్తన - జైవిక కారకాలు

## 4.0 లక్ష్యాలు

సామాజిక పరివర్తనకు తోడ్పడే జైవిక పరిసరాలకు సంబంధించిన అంశాలను వివరించడం ఈ భాగం ముఖ్య ఉద్దేశ్యం. ఈ భాగం చదివిన తరువాత మీరు:.

సామాజిక పరివర్తనలో జైవిక అంశాల పాత్రను వివరించగలరు.

విషయసూచిక


4.1 పరిచయం

4.2 సహజ సమతుల్యత

4.3 సామాజిక సమతుల్యత

4.4 జైవిక విశేష వాదాలు

4.5 జాతి - సామాజిక పరివర్తన

4.6 జాతి - శాస్త్రీయ భావన

4.7 జాతి వాదాలు

4.8 జనాభా - సామాజిక పరివర్తన

4.9 జన సమ్మేళనములో పరివర్తనలు

4.10 సారాంశము

4.11 నమూనా ప్రశ్నలు

4.12 చదువదగిన గ్రంథాలు


## 4.1 పరిచయం

మానవుడు భూమిపై పుట్టినది మొదలుకొని ఇతర మానవులతోపాటు వృక్షజాలంతో కొన్ని భౌతిక పరిసరాలలో జీవించడం జరుగుతుంది. ఈ విధంగా ప్రాణికోటితో కూడిన వాతవరణంపై జైవిక పరిసరాలు ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ ప్రభావాలను చూపెడుతూ ఉంటాయి మానవుడు జైవిక పరిసరాలను తనకనుగుణంగా మార్చుకుంటాడు. అందుచేత సామాజిక పరివర్తనకు జైవిక కారకాలు ప్రధాన పాత్ర వహిస్తున్నాయి.

జైవిక కారకాలవల్ల సామాజిక పరివర్తన జరగటానికి హెచ్చుగా అవకాశాలున్నాయి. సమాజంలో క్రిమికీటకాదుల వల్ల పంటలు విస్తారంగా దెబ్బతిని కరువు కాటకాలు ఏర్పడినప్పుడు అంటువ్యాధులు ప్రబలినపుడు యుద్ధాలు జరిగినపుడు సామాజిక వ్యవస్థ హెచ్చుగా దెబ్బతిని పరివర్తనకు దారితీస్తుంది. ప్రపంచ చరిత్రలో మానవులు వివిధ జాతులుగా విభజింపబడి, జాత్యహంకారాలు, దురభిమానాలు, విచక్షణ మొదలైన వాటివల్ల అనేక సమాజలలో తీవ్రమైన సంఘర్షణలు, సంక్షోబాలు ఏర్పడ్డాయి. అలాంటి వాటివల్ల సమాజాలలో తీవ్రమైన మార్పులు వచ్చాయి.

సామాజిక వ్యవస్థకు జనభాకు చాలా అవినాభావ సంబంధం కలదు. జనాభాలో పరిమాణాత్మకం, గుణాత్మకం అయిన మార్పులు ఏర్పడినపుడు సామాజిక వ్యవస్థలలో కూడా మార్పులు వస్తాయి. ఒక భౌగోళిక ప్రాంతంలోని వనరులను సరియైన విధంగా వినియోగించుకొని గరిష్ఠజీవన స్థాయిని సాధించటానికి సరిపడే ప్రజల సంఖ్యను అభిలషణీయ జనాభా అని చెప్పవచ్చు. ఆ ప్రాంతపు

జనాభా సంఖ్యను మించి పెరిగితే అసంపూర్ణ జనాభా లేదా అల్ప జనాభా అని పేర్కొనవచ్చు. అత్యధిక జనాభాగానీ, అతితక్కువ జనాభాగానీ సామాజికాభివృద్ధికి అంతమంచిది కాదు. అభివృద్ధి చెందుతున్న దేశాలలో జనాభా పెరుగుదల వల్ల ప్రజలందరకూ కనీస అవసరాలు అందటంలేదు. అంతేకాక సమాజంలోనిరుద్యోగం, అనారోగ్యం, పేదరికం, నిరక్షరాస్యత, నేరాలసంఖ్య మున్నగు సమస్యలు పెరిగి పోతున్నాయి. అందుచేత అధిక జనాభా వల్ల లాభాల కంటే నష్టాలు ఎక్కువగా ఉన్నాయి. అదే విధంగా అసంపూర్ణ జనాభా లేదా తక్కువ జనాభా ఉన్నప్పుడు కూడా సమాజ అభివృద్ధికి అవకాశాలు తక్కువగా ఉంటాయి. కనుక జనాభా పెరుగుదల వల్లకానీ లేదా తగ్గుదల వల్లకానీ సామాజిక పరివర్తన జరుగుతుంది.

### 4.1.1 సహజ వరణం-సామాజిక వరణం (Natural Selection and Social Selection)

సామాజిక పరివర్తన అనేది ముఖ్యంగా జైవిక పరివర్తన ద్వారానే జరుగుతుందని డార్విన్ అతని అనుయాయులు అభిప్రాయపడ్డారు. భౌతిక పరిసరాలలో సంభవించిన మార్పుల వల్ల గానీ జన్యువుల పరివర్తన వల్లగానీ ప్రాణులలో వైవిధ్యాలు కలుగుతాయని అట్టి ప్రాణులన్నీ భౌతిక, జైవిక పరిసరాలకు అనుగుణంగా సర్దుబాటు చేసుకోవలసి ఉంటుందని భావించారు. ఈ సర్దుబాటు జైవిక పరిసరాలకు అనుగుణంగా సర్దుబాటు చేసుకోవలసి ఉంటుందని భావించారు. ఈ సర్దుబాటు చేసుకోవడానికి ప్రాణులు నిరంతరం పోరాటం సాగిస్తాయి. అటువంటి పోరాటంలో బలహీనమైన ప్రాణులు నశించి బలమైన లేదా శక్తివంతమైన ప్రాణులు మాత్రమే మిగిలి ఉంటాయని భావించడం జరిగింది.

కొందరు సమాజ శాస్త్రవేత్తలు సహజవరణ సూత్రాన్ని మానవ సమాజాలకు వర్తింపజేసి సామాజిక పరిణామాన్ని వివరించారు. వారి అభిప్రాయం ప్రకారం మానవ సమూహాల మధ్య సంఘర్షణ జరిగి బలహీన వర్గాలు నశించిపోయి బలమైన వర్గాలు మాత్రమే అభివృద్ధి పొందటం వల్ల సామాజిక పరిణామం జరుగుతుంది. మానవ సమాజాలలో సహజవరణ పాత్ర పరిమితంగా ఉంటుంది. నేటి సమాజంలో సంఘర్షణ కంటే సహకారం యొక్క పాత్ర హెచ్చుగా ఉంటుంది. నేడు ఆదునిక సమాజాలలో జనన మరణాల రేటు తగ్గింది. జనాభా నియంత్రణ జరుగుతుంది. కనుక ఆధునిక సమాజాలలో సహజవరణం పాత్ర చాలావరకూ తగ్గిపోయిందని చెప్పాలి.

సామాజికవరణమనగా మానవ సమాజాలలో జనాభా నియంత్రణ, దాని అంతర్గత సామాజిక సంబంధాల నుండి ఉత్పన్నమైన పరిస్థితుల ప్రభావం వల్లజరిగే ప్రక్రియ అని చెప్పవచ్చు. సామాజికవరణం నేటి ఆధునిక సమాజాలలో ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ తన ప్రభావాన్ని చూపించి జనాభాను నియంత్రించడం జరుగుతున్నది. అంతేకాక సామాజికాభివృద్ధికి కూడా కృషి చేయడం జరుగుతున్నది.

## 4.2 సహజ సమతుల్యత (Natural Balance)

ప్రకృతిలో ప్రాణులన్నీ తమ మనుగడకోసం నిరంతరం పోరాటం సాగిస్తూనే ఉంటాయి. ఇవి తమ బతుకు పోరాటంలో ఒక వైపు ప్రకృతిశక్తుల తోను, రెండవ వైపు ఇతర ప్రాణులతోను సంఘర్షణలను ఎదుర్కొంటూ ఉంటాయి. ఇట్లా ప్రకృతిలో మనుగడకోసం తీవ్రపోరాటం జరుగుతుండటం వల్ల బలహీనమైన అల్పప్రాణులు నశించే అవకాశాలు అధికంగా ఉంటాయి. శక్తివంతమైన ప్రాణులు వృద్ధి చెందడానికి ఎక్కువ అవకాశాలుంటాయి. దాని వల్ల అల్పప్రాణుల సంఖ్య తగ్గి సమతౌల్యత చెదిరిపోయే ప్రమాదముంటుంది. అట్లా జరగకుండా ఉండేటందుకు గాను ప్రకృతిలో అల్పప్రాణులలో ప్రత్యుత్పత్తి రేటు ఉన్నతస్థాయి ప్రాణుల కంటె ఎన్నో రెట్లు అదికంగా ఉంటుంది అందువల్లనే వాటిలో కొన్ని మృత్యువాతపడినప్పటికి వాటి జాతి నిలిచి ఉంటుంది. ఇట్లా ప్రకృతిలో సాధారణంగా సహజ సమతుల్యతను పరిరక్షించడం జరుగుతుంటాయి. అయితే ఒక్కొక్కప్పుడు భౌతిక పరిసరాలలో కాకతాళీయంగా మార్పులు వచ్చినపుడు ప్రకృతిలో ఒక జాతికి చెందిన ప్రాణులు అధికంగా నశించడం జరగవచ్చు. దానివల్ల సహజ సమతుల్యత చెదిరిపోతుంది, జైవిక పరిసరాలలో ఇల్లాంటి మార్పులు సామాజిక పరివర్తనకు దోహదం చేస్తాయి.

## 4.3 సామాజిక సమతుల్యత (Social Balance)

మానవుడు తొలిదశలో ప్రకృతిలో స్వతస్సిద్ధంగా లభించే ఆహారంమీద ఆధారపడి జీవించేవాడు. తన ఆహార సముపార్జనలో ఇతర జంతువులతో పోటీ పడుతుండేవాడు. కాబట్టి మానవ సామాజిక జీవితం మీద జైవిక పరిసరాల ప్రభావం ఎక్కువగా ఉండేది. జైవిక పరిసరాలలోని మార్పులను బట్టి మానవ సామాజికపు అలవాట్లు, దృక్పథాలు, విలువలు, వ్యవస్థాపన విధానాలు పరివర్తన చెందుతుంటాయి. ఆదిమ దశలోని మానవుడు తనశక్తి సామర్థ్యాలను, కాలాన్ని ఎక్కువగా ఆహార సముపార్జన కోసం వినియోగించవలసి వచ్చేది. మానవ సమాజాలలో కరువుకాటకాలు, అంటువ్యాధులు తరచుగా మానవులను పట్టి పీడిస్తుండేవి. రక్షణ, భద్రత, స్థిరత లోపించడం మూలంగా మానవుడు అనిశ్చిత పరిస్థితులతో కూడిన జీవితాన్ని గడుపుతుండేవాడు. ఆధునిక సమాజంలో మానవుడు ఆహారవిషయంలో స్వయం సమృద్ధిని సాధించడం మూలంగా అతడు తన శక్తియుక్తులను ఇతర విషయాలలో వినియోగించి నాగరికతాభివృద్ధిని సాధించగలిగినాడు. నాగరికతాభివృద్ధి చరిత్ర అంతా జైవిక పరిసరాలను నియంత్రించి, వాటిమీద ప్రాబల్యం సంపాదించడానికి మానవుడు చేసే ప్రయత్నమని చెప్పవచ్చును.

## 4.4 జైవిక విశేషవాదాలు (Biological Determinism)

మానవ సామాజిక జీవితంమీద జైవిక పరిసరాల ప్రభావాన్ని పురస్కరించుకుని కొంతమంది శాస్త్రజ్ఞులు జైవిక కారకాలు ప్రధానంగా సామాజిక పరివర్తనకు దోహందం చేస్తాయనే విశేషవాదాలను రూపొందించినారు. వీరు తమ వాదాలను చారిత్రకాధారాలతో బలపరిచినారు. రోమ్ నాగరికత చివరిదశలో మలేరియా వ్యాధి ప్రబలిందని, దానివల్ల రోమన్ శక్తి సామర్థ్యాలు ఉడిగిపోయి వారిలో అవినీతి పెచ్చుపెరిగి రోమ్ పతననికి దారి తీసిందని వీరు వాదిస్తారు. పధ్నాలుగవ శతాబ్దిలో ఎలుకల వల్ల ప్లేగువ్యాధి యూరప్, ఆసియా దేశాలలో ఉధృతంగా ప్రబలి ఎంతోజననష్టం జరిగింది. ఎన్నో పట్టణాలు నిర్మానుష్యమైనాయి.

ప్లేగు వ్యాధివల్ల ఫ్యూడల్ సామాజిక వ్యవస్థ కూడా దెబ్బతిన్నదని కొందరు శాస్త్రజ్ఞుల అభిప్రాయం. జనాభా తగ్గిపోవడం వల్ల సామాజిక అవ్యవస్థత ఏర్పడిందనీ, బానిసలు స్వతంత్రులయినారనీ, పశువులను వ్యవసాయక రంగంలో ఉపయోగించడం ద్వారానూ, ఇతర పనిముట్లను కనిపెట్టడము మూలంగాను ఆర్థికాభివృద్ధి విశేషంగా జరిగిందని మరికొందరు శాస్త్రజ్ఞులు అభిప్రాయపడినారు.

సమాజంలో క్రిమికీటకాదుల వల్ల పంటల దెబ్బతిని క్షామ పరిస్థితుల ఏర్పడినపుడు ఆస్థితి సామాజిక అవ్యవస్థకు దారి తీస్తుంది. అట్లాగే అంటువ్యాధులు ప్రబలినపుడు సామాజిక వ్యవస్థ దెబ్బతింటుంది. పాడిపంటలు సమృద్ధిగా ఉన్నప్పుడు ప్రజలు సంతోషంగా, ఉత్సాహంగాను ఉంటారు. ఈ కాలంలో వేడుకలు, ఉత్సవాలు, వివాహాలు మొదలైనవి ఎక్కువగా జరుగుతుంటాయి. ఈ విధంగా జైవిక పరిసరాలకు, సామాజిక వ్యవస్థలకు పరస్పర సంబంధం ఉండటం వల్ల ఒకదానిలో జరిగే పరివర్తనమే రెండవ దానిలో కూడా పరివర్తన కలిగిస్తుంది.

## 4.5 జాతి-సామాజిక పరివర్తన (Race and Social Change)

సామాజిక పరివర్తనలో జైవిక కారకాలకు సంబంధించిన చర్చలో "జాతి" మౌలికంగా జీవసంబంధమైన భావన. కాని దీన్ని కొన్ని సందర్భాలలో బాష, సంస్కృతి, మతము, దేశము మొదలగు వాటితో అన్వయించడం మూలంగా జాతి భావనను సరైన విధంగా అవగాహన చేసుకోవడంలో ఇబ్బందులేర్పడినాయి. కొందరు ప్రముఖులు జాతి భావనను స్వార్థదృష్టితో పరిశీలించి, తమకనుకూలమైన వ్యాఖ్యానాలు చేస్తూ, కొన్ని తాత్త్విక సిద్ధాంతాలను రూపొందించినారు. ఇట్లాంటి జాతి సిద్ధాంతాలు సమాజంలోని వ్యక్తుల మధ్య సమూహాల మధ్య ఉండే సామాజిక సంబంధాలను తారుమారు చేస్తూ వచ్చాయి.

## 4.6 జాతి-శాస్త్రీయ భావన (Race as a Scienttfic Concept )

ప్రపంచంలోని మానవులందరు ఒకే ఉన్నత జాతికి **(Homo Sopleens)** చెందినవారే. కాని వారిలో జన్యువుల పరివర్తనవలన, మానవసమూహాలు వేర్వేరు భౌతిక పరిసరాలలో ఏకాంతంగా అన్యజాతి సంపర్కాలు లేకుండా జీవిస్తూ భౌతిక పరిసరాలకు అనుకూలంగా

శారీరక అనుసరణలు జరుపుకోవడం వల్ల ప్రపంచంలోని మానవుల శారీరక లక్షణాలలో విభిన్నతలు ఏర్పడినాయి. ఇట్లా రూపొందిన శారీరక లక్షణాలు ఒక తరం నుండి తరువాతి తరంవారికి అనువంశికంగా సంక్రమిస్తూ వచ్చినాయి. ఇట్లా అనువంశికంగా సంక్రమించే ఉమ్మడి శారీరక లక్షణాలు గల మానవ సమూహాన్ని "జాతి" అని అంటారు.

జీవశాస్త్రవేత్తలు శరీరపు రంగు, ఎత్తు, వెంట్రుకల రంగు, పుర్రెపరిమాణము, ముక్కుతీరు, దవడలు, చెక్కిలిలోని ఎముకలు మొదలైనవి జన్యువుల ద్వారా తల్లిదండ్రుల నుండి వారి సంతానానికి సంక్రమిస్తాయని పేర్కొన్నారు. ఇట్లా అనువంశికంగా సంక్రమించే శారీరక లక్షణాల ప్రాతిపదికగా ప్రపంచంలోని మానవులందరిని కాకసాయిడ్, మంగొలాయిడ్, నీగ్రోయిడ్ లని మూడు ముఖ్యజాతులుగా వర్గీకరించినారు. ఈ జాతులను తిరిగి కొన్ని ఉపజాతులుగా కూడా విభజించినారు.

జాతి అనేది కేవలం ఒక అమూర్తభావన మాత్రమే. అది ఆ జాతికి సంబంధించిన మానవులలో సగటుగా కనిపించే శారీరక లక్షణాలను మాత్రమే సూచిస్తుంది. కాని ఆ జాతిలోని ప్రతిఒక్కనిలోను ఆ జాతి లక్షణాలు అన్నీ ఉండకపోవచ్చు. కొందరిలో విభిన్న జాతి లక్షణాలు ఉండవచ్చు. ఆధునిక సమాజంలో జనసంచారము, అన్యజాతి సంపర్కాలు అధికం కావడం మూలంగా జాతుల సమ్మిశ్రమము ఎక్కువగా జరిగింది. కాబట్టి ఆధునిక సమాజంలో స్వచ్ఛమైన జాతి(Pure Race) అంటూ ఏదీలేదని చెప్పవలెను. జాతి భావన కేవలం కాల్పనికం మాత్రమే.

## 4.7 జాతి వాదాలు (Racial Theories)

ఆధునిక సమాజాలలో మానవులను స్వచ్ఛమైన జాతులుగా ఎన్నిక చేసి వర్గీకరించడం కష్టమైనప్పటికి, కొందరు మానవులలో బాహ్యంగా కనిపించే కొన్ని సాధారణ శారీరక లక్షణాలలోని వ్యత్యాసాలను పురస్కరించుకుని జాతి విభేదాలను విస్తృతపరచి, వారిలో జాతి చైతన్యము, జాత్యహంకారము, దురభిమానము, విచక్షణ మొదలైన వాటిని రెచ్చగొట్టినారు. ఇట్లా జాతి వాదాలు ప్రబలి సమాజాలలో తీవ్రసంఘర్షణలకు, సంక్షోభాలకు దోహదం చేసినాయి.

ఆర్థర్ డి గోబినో (Arthur de Gobineau) అనే శాస్త్రేత్త క్రీ.శ.1853/55లో మానవ జాతులలోని అసమానతలు (Essays on the Inequalities of Human Race) అనే గ్రంథాన్ని ప్రచురించినాడు. ఈ గ్రంథంలో నాగరికతాభివృద్ధి ప్రధానంగా జాతిమీద ఆధారపడి ఉంటుదని గొబినో అభిప్రాయపడినాడు. స్వచ్ఛమయిన ఉన్నత జాతులు మాత్రమే నాగరితాభివృద్ధి పొందడానికి కృషిచేస్తాయి.

గోబినో తరువాత చాంబర్లేన్ (Chamberlain) అనే శాస్త్రవేత్త 1899 వ సంవత్సరములో పందొమ్మిదవ శతాబ్ది పునాదులు (Foundations of Nineteenth Century) అనే గ్రంథాన్ని ప్రచురించి గొబినో సిద్ధాంతాన్ని సమర్థించి, వ్యాపింప జేసినాడు.

జీవసంబంధమైన, జాతిపరమైన వ్యత్యాసాలను ఆధారంగా చేసుకొని సమాజంలో వ్యక్తులను వర్గీకరించడం అనాదినుండి కొనసాగుతూనే ఉన్నది. ఇది సమాజంలో స్తరీకరణానికి దోహదం చేస్తుంది. ఒక జాతి విశిష్టమైనదనీ, అధికమైనదని, మరొకజాతి అధమమైనదని, నీచమైనదని భావాలు వ్యాప్తిలో ఉన్నాయి. శ్వేత జాతివారు, నల్లజాతి వారి కంటె శ్రేష్ఠులని నిరూపించడానికి అనేక పరిశోధనలు జరిగినాయి. అమెరికాలో జాతి వాద ప్రభావం వల్లనే నీగ్రోలను బానిసలుగా చూస్తూ వారి పట్ల ఏర్పాటు విధానాన్ని అవలంభించినారు. ఈ దేశంలో ఈనాటికి జాతి దురాభిమానం, విచక్షణా కొనసాగడం మూలంగా అనేక జాతి సంఘర్షణలు జరుగుతూనే వున్నాయి. అక్కడ జాతి పరమైన ఏర్పాటు విధానం పూర్తిగా నిర్మూలించవలెనని కొన్ని సమూహాలు పోరాటం సాగిస్తున్నాయి. వాటికి వ్యతిరేకంగా వేర్పాటు విధానాన్ని కొనసాగించడానికి మరికొన్ని సమూహాలు ప్రయత్నాలు చేస్తున్నాయి.

ఇట్లాంటి జాతి సమస్యలు అనేక సమాజాలలో కనబడుతూ వుంటాయి. జాతి ప్రాతిపదిక మీదనే ఆస్ట్రేలియా, అమెరికా దేశాలలో పరిమిత వలస విధానాన్ని రూపొందించినారు. జాతి విశిష్టత ఆధారంగా రొడేషియాలో శ్వేతజాతివారు అధిక సంఖ్యాకులైన నల్లవారిమీద పరిపాలన సాగిస్తున్నారు. ఆఫ్రికాలోని ఇతర దేశాలు ఇట్లాంటి జాతి విచక్షణ కొనసాగడాన్ని గురించి తీవ్ర నిరసన తెలుపుతున్నాయి. ఇట్లా జైవికమైన జాతి భావన సామాజిక ప్రాముఖ్యాన్ని పొందింది. అంతర్జాతీయ స్థాయిలో జాతి సంబంధాల ప్రాముఖ్యాన్ని గుర్తించి, ఐక్యరాజ్య సమితి యునెస్కో (UNESCO) ఆధ్వర్యాన జాతి విషయం మీద శాస్త్రీయ పరిశోధనలు నిర్వహించింది. ఈ పరిశోధనల ఆధారంగా జాతీయ్వాదాలన్నింటిని ఖండిస్తూ, ప్రపంచంలోని జాతులన్ని సమానమని ఐకరాజ్యసమితి ఉద్ఘాటించింది.

సమాజాలలో జాతి విచక్షణ, దురాభిమానాలను రూపుమాపి, వివిధ జాతుల మధ్య సామరస్య సామాజిక సంబంధాలను పెంపొందించడానికి అనేక పథకాలను రూపొందించింది.

## 4.8 జనాభా - సామాజిక పరివర్తన (Population and social Change)

సామాజిక వ్యవస్థలకు జనాభాతో చాలా సన్నిహిత సంబంధముంది. జనాభాలో పరిణాత్మకం, గుణాత్మకము అయిన మార్పులు వచ్చినపుడు సామాజిక వ్యవస్థలు మార్పు చెందుతుంటాయి. అట్లాగే సామాజికమైన అలవాట్లు, విలువలు, ప్రజల దృక్పధాలు మారినపుడు జనాభాలో మార్పులు కలుగ వచ్చును. ఇట్లు జనాభా, సామాజిక వ్యవస్థలు పరిస్పర చర్యల వల్ల రెండు పరివర్తన చెందుతుంటాయి.

### 4.8.1 జనాభా సమతుల్యత (Population Balance)

సమాజంలో జనాభా అభివృద్ధి చెందిన కొద్ది సామాజికాభివృద్ధి జరుగుతుందని చాలా మంది శాస్త్రవేత్తలు అభిప్రాయపడినారు. జనాభా మరీ తక్కువగా వున్న చిన్న సమాజాలలో విభేధీకరణకు, శ్రమ విభజనకు అవకాశాలు తక్కువగా వుండటం వలన నాగరికత, సామాజిక అభివృద్ధులు అంతగా పెంపొందవు. జనాభా వృద్ధి చెందినా కొద్ది సమాజంలో విభేధీకరణ, శ్రమ విభజన, విశిష్టికరణ అధికమై నవీన పరిశోధనలకు, నూతన కల్పనలకు అవి దోహదం చేస్తాయి. వీటి వలన సామాజిక అభివృద్ధి జరుగుతుంది. అయితే కేవలం జనాభా పెరుగుదల వలన మాత్రమే సామాజిక అభివృద్ధి జరగదు.

కార్ సాండర్స్ (Carr saunders) అనే శాస్త్రవేత్త ఒక భౌగోళిక ప్రాంతం నుండి వనరులను సరియైన విధంగా వినియోగించుకొని గరిష్ట జీవనస్థాయిని సాధించడానికి సరిపడే ప్రజల సంఖ్యను అభిలషణీయ జనాభా (Optimum population) అని పేర్కొన్నాడు. ఆ ప్రాంతపు జనాభా ఆ సంఖ్యను మించి పెరిగినట్లయితే "అధిక జనాభా" (Over population) అని, దానికి తక్కువగా ఉన్నట్లయితే "అసంపూర్ణ లేదా అల్ప జనాభా" (Under population) అని అంటారు. ఈ విధంగా భౌగోళిక వనరులకు, జనాభాకు పరస్పర సంబంధముంటుంది.

### 4.8.2 జనాభా విపరీత పెరుగుదల (Population Explosion)

ఆధునిక యుగంలో శాస్త్రీయ, సాంకేతిక రంగాలలో విశేషమైన అభివృద్ధి జరిగింది. పారిశ్రామికీరణ ద్వారా, యాంత్రికీకరణ ద్వారా ఆహార పదార్థాల, ఇతర వస్తువుల ఉత్పత్తి అధికమైంది. రవాణా సౌకర్యాలు, ఆహారం నిల్వచేసే పద్ధతులు అభివృద్ధి పొందినాయి. పారిశుధ్య, ఆరోగ్య, వైద్య సదుపాయాలు పెంపొందినాయి. తద్వారా సమాజంలో మరణరేటు (Death Rate) చాలా తగ్గిపోతున్నది. కాని జననరేటు (**Birth Rate**) లో మార్పులేదు. దీని వలన ఆధునిక ప్రపంచంలో జనాభా విస్తృతంగా పెరుగుచున్నది. 1970 సంవత్సరం నాటిని ప్రపంచ జనాభా 3 మిలియన్లకు మించిపోయింది. ప్రపంచంలో ప్రతీ గంటకు 7,500 మంది శిశువులు, అంటే ప్రతి నిమిషానికి సుమారు 125, ప్రతీ సెకండుకు ఇద్దరు శిశువుల చొప్పున జన్మిస్తున్నారు. ప్రపంచంలోని స్థితిగతులు, జనాభా ఇట్లాగే కొనసాగితే కొంత కాలానికి భౌతిక వనరులు అన్ని ఖర్చయి, నిలువ నీడలేని పరిస్థితి ఏర్పడవచ్చునని కొందరు శాస్త్రవేత్తలు వెల్లడించినారు.

ప్రపంచంలోని జనాభా పెరుగుదల శీఘ్రగతిని జరుగుతుండడాన్ని రాబర్ట్ మాల్థస్ (Robert Malthus) అనే జనాభా శాస్త్రవేత్త పరిశీలించి 1798వ సంవత్సరములో "జనాభా సూత్రాల మీద వ్యాసం" (Essay on the principle of population) అనే గ్రంథాన్ని ప్రచురించినాడు. సమాజంలో జనాభా రేఖా శ్రేణి అంటే 1,2,4,8,16,32,64,128,256 లో అభివృద్ధి చెందుతుందని, ఆహార పదార్థాల ఉత్పత్తి అంకశ్రేణి అంటే 1,2,3,4,5,6,7,8,9లో వృద్ధి చెందుతుందని అభిప్రాయపడినారు. ఇట్లా జనాభా, ఆహారోత్పత్తి పెరగడంలో చాలా తేడాలుండటం వల్ల విలంబనమేర్పడి సమాజంలో అరిష్టాలు జరుగుతాయని హెచ్చరించినాడు. సమాజంలో వివిధ పద్ధతుల ద్వారా జనాభా నియంత్రణ జరుగుతుందని మాల్థస్ చెప్పినాడు.

### 4.8.3 జనాభా గతిశీలత (Population Dynamics)

ప్రపంచ దేశాల జనసాంద్రతలో తేడాలుండటమేగాక జనాభా పెరుగుదల రేట్లలోకూడా చాలా వైవిధ్యాలున్నాయి. కొన్ని దేశాలలో జనాభా ఎక్కువ రేటులో వృద్ధిచెందుతుండగా మరికొన్ని దేశాలలో జనాభా దాదాపుగా నిలకడగా వుంటున్నది. జనాభా

పెరుగుదలలో ఈ వైవిధ్యాలు జనన, మరణ రేట్లలోని తేడాలను బట్టి ఏర్పడతాయి. కొన్ని ముఖ్యమైన దేశాల జనన, మరణ రేట్లలో గల వ్యత్యాసాలను, వాటి మార్పులను క్రింది పట్టికలో చూడవచ్చును.

| దేశము | జనన రేటు | | మరణ రేటు | |
|---|---|---|---|---|
| | 1931 | 1970 | 1931 | 1970 |
| ఫ్రాన్స్ | 17.1 | 16.7 | 16.6 | 10.6 |
| యు.కె. | 16.1 | 16.2 | 12.8 | 11.8 |
| అమెరికా సంయుక్త రాష్ట్రాలు | 18.6 | 18.2 | 11.0 | 9.4 |
| జపాన్ | 31.8 | 18.0 | 18.1 | 6.9 |
| ఫిలిప్పైన్స్ | 32.4 | 44.7 | 17.1 | 12.0 |
| భారతదేశం | 36.0 | 42.8 | 24.0 | 16.7 |

ఇండియా, ఫిలిప్పైన్స్ మొదలైన దేశాలలో జనన రేట్లు అధికంగా వున్నట్లు పై పట్టిక ద్వారా తెలుస్తున్నది. వాటి మరణ రేటు క్రమంగా తగ్గుతున్నది. ఆ దేశాలలో జనన, మరణ రేట్లలో చాలా తేడాలున్నాయి. అందుకే జనాభా శీఘ్రంగా వృద్ధిచెందుతున్నది. ఫ్రాన్స్, ఇంగ్లాండ్ మొదలయిన దేశాల జనన, మరణ రేట్లలో అంతగా తేడాలు కనిపించడం లేదు. కాబట్టి ఆ దేశాలలో జనాభా పెద్దగా పెరుగడం లేదు.

డబ్ల్యూ.ఎస్. థాంప్సన్ (W.S.Thampson), ఎఫ్. డబ్ల్యూ. నొటెస్టీన్ (F.W.Notestein) అనే శాస్త్రవేత్తలు ఆర్థిక, సామాజాకాభివృద్ధికి, జనాభా పరివర్తనకు ఉన్న సంబంధాన్ని వివరిస్తూ, జనాభా గతి శీలత సిద్ధాంతాన్ని రూపొందించినారు. జనాభా గతి శీలత మూడు దశలుగా జరుగుతుందని వారు పేర్కొన్నారు.

అవి 1. పారిశ్రామికీకరణానికి పూర్వపు జనాభా సమతుల్యత (Pre-Industrial Population Balance) 2. సంధికాలంలో జనాభా విపరీతమైన పెరుగుదల (Transitional Population Explosion) 3. పారిశ్రామికీకరణానంతరం జనాభా సుస్థిరత (Post-Industrial Population Stability)

### 4.8.1 పారిశ్రామికీకరణానికి పూర్వపు జనాభా సమతుల్యత (Pre-Industrial Population Balance)

సాంప్రదాయక సమాజాలు పారిశ్రామిక యుగంలో అడుగు పెట్టకముందు వాటిలో ఆహార పదార్థాలు పరిమితంగా వుండటం వల్ల, ఆరోగ్య, వైద్య సదుపాయాలు తగినంతగా లేక పోవడం వల్ల మరణాల రేటు అధికంగా ఉండేది. జనన, మరణ రేట్లు రెండు దాదాపు సరిసమానంగా వుండటం వల్ల ఈ దేశంలోని సమాజాలలో జనాభా అంతగా వృద్ధి చెందదు.

### 4.8.2 సంధికాలంలో జనాభా విపరీతమైన పెరుగుదల (Transitional Population Explosion)

పారిశ్రామిక విప్లవానంతరం ఆహార పదార్థాలు మొదలైన వస్తువుల ఉత్పత్తి ఎక్కువగా జరుగుతున్నది. ఆహార పదార్థాలను నిల్వచేసే పద్ధతులు మెరుగుపడినాయి. రవాణా సౌకర్యాలు అభివృద్ధి కావడంలో ఆహార పదార్థాలను ఒక ప్రాంతంనుండి అనేక ప్రాంతాలకు సరఫరా చేయడం జరుగుచున్నది. పారిశుధ్య కార్యక్రమాలు, ఆరోగ్య, వైద్య సదుపాయాలు పెంపొందినాయి. వీటన్నింటి మూలంగా మరణాల రేటు చాలా తగ్గింది. కాని జననాల రేటు అలాగే వుంది. జనన, మరణ రేట్లలో ఎక్కువ తేడా వుండటం వల్ల జనాభా అపారంగా పెరుగుతుంది. ఇండియా, ఫిలిప్పైన్స్ మొదలైన దేశాలలో జనాభా ఈ కారణాల వల్లనే అపారంగా పెరుగుతుంది.

### 4.8.3 పారిశ్రామికీకరణానంతరం జనాభా సుస్థిరత (Post-Industrial Population Stability)

సంపూర్ణ పారిశ్రామికీకరణ చెందిన సమాజాలలో నగరీకరణ జరగడం, ప్రజలలో జీవన స్థాయిని పెంచుకొవలెననే ఆకాంక్ష పెరగడం, స్త్రీలు విద్యార్జన చేసి ఉద్యోగాలలోను, ఇతర సామాజిక కార్యకలాపాలలో పాల్గొనడం, కుటుంబనియంత్రణకు సంబంధించిన విజ్ఞానం వ్యాప్తి చెందడం వీటన్నింటి ప్రభావం వలన జనన రేటు చాలా తగ్గుతుంది. జనన, మరణాల రేటు రెండూ తగ్గడంతో జనాభాలో సుస్థిరత ఏర్పడుతుంది.

## 4.9 జనసమ్మేళనంలో పరివర్తనలు (Changes in the Composition of Population)

జనాభా పెరుగుదలలో విభిన్నతలు సమాజాలను బట్టేగాక, ఒకే సమాజంలో వివిధ ప్రాంతాలలో, వర్గాలలో కూడా కనబడతాయి. జనాభా వృద్ధిలో ఈ తేడా వల్ల సమాజంలోని వివిధ వర్గాలలోని ప్రజల నిష్పత్తి మారుతుంటుంది. దాని మూలంగా సామాజిక వ్యవస్థలలో మార్పులు కలుగుతుంటాయి.

### 4.9.1 నగరీకరణము (Urbanisation)

పారిశ్రామికీకరణ చెందుతున్న దేశాలలో నగరీకరణ అతి శీఘ్రంగా జరుగుతున్నది. పట్టణాలలో నివసించేవారి సంఖ్య క్రమంగా పెరుగుచున్నది. భారతదేశంలో 1901లో 89% ప్రజలు గ్రామాలలోనూ 11% పట్టణాలలోనూ నివశిస్తూ ఉండేవారు. 1961నాటికి జనాభాలో 82% గ్రామాలలోనూ, 18% పట్టణాలలోనూ నివశిస్తున్నారు. అనేక కారణాల వలన ప్రజలు పట్టణాలకు తరలి రావడం వలన, పట్టణాలలో తగినన్ని సౌకర్యాలు లేకపోవడం వల్ల అనేక సమస్యలు ఎదురవుతున్నాయి. ప్రజలు ఎక్కువగా పట్టణాలలో నివశించడం వల్ల నగర ప్రభావం వారిమీద పడి సాంప్రదాయ జీవన విధానం, సామాజికపు అలవాట్లు, విలువలు, వ్యవస్థలు మారుతున్నాయి. ఇది వ్యవస్థాగతమైన మార్పులకు దారితీస్తున్నది

### 4.9.2 వర్గాలను బట్టి జనాభా పెరుగుదలలో తేడాలు

ఒకే సమాజంలో జనాభా పెరుగుదల అన్ని వర్గాలలోనూ ఒకే రూపంలో జరుగడంలేదు. పై తరగతి వారి జీవన ప్రమాణాలు అధికంగా ఉండటం వలన వాటిని పరిరక్షించేందుకుగాను వారి ఆకాంక్షల స్థాయికూడా అధికంగా వుండటం వలన వారిలో జనాభా పెరుగుదల తక్కువగా వుంది. అట్లాగే మధ్యతరగతి వారు కూడా జీవన ప్రమాణాలు పెంపొందించుకునే ఉద్దేశ్యంతో కుటుంబ నియంత్రణను పాటిస్తున్నారు. కాబట్టి వారిలో కూడా జనాభా వృద్ధి అధికంగా లేదు. కాని క్రింది తరగతి ప్రజలలో అజ్ఞానం, మూఢవిశ్వాసాలు, మొదలైనవాటి మూలంగా జనాభా పెరుగుదల అధికంగా వుంది.

జననరేట్లలో తేడాలు మతాన్ని బట్టి కూడా వుంటాయి. కొన్ని మతాలవారు కుటుంబనియంత్రణను వ్యతిరేకిస్తారు. దాని వల్ల ఆ మతం వారిలో జనాభా వృద్ధి మిగతామతస్థుల వారి కంటే ఎక్కువగా వుంటుంది. మన దేశంలో హిందూ స్త్రీల కంటే ముస్లీం స్త్రీలలో జనానుపాతం (Fertility rate) ఎక్కువగా వున్నదని కొన్ని సర్వేలద్వారా తేలింది. ఉదాహరణకు కాన్పూర్ పట్టణంలో ముస్లీం స్త్రీల జననాను పాతం 8.0 వుంటే హిందూ స్త్రీలలో 7.0 వుంది.

### 4.9.3 వలస (Migration)

సమాజాలలో జనాభా వృద్ధి చెందడంలో వలస కూడా ప్రధాన పాత్ర వహిస్తున్నది. రవాణా సౌకర్యాలు అభివృద్ధి చెందిన తరువాత ప్రజలు ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతానికి వలస వెల్లడం అధికమైంది. పద్దెనిమిదవ శతాబ్ది మొదలుకొని ఆసియా, యూరప్ ఖండాల నుంచి ఎంతో మంది అమెరికా, ఆస్ట్రేలియా, ఆఫ్రికా దేశాలకు తరలిపోయి అక్కడ స్థిరనివాసం ఏర్పరచుకున్నారు. ఎంతో మంది నీగ్రోలను ఆఫ్రీకా నుండి బానిసలుగా అమెరికాకు తీసుకొని పోయినారు. ఇట్లా ఉత్తర అమెరికా జనాభా అభివృద్ధి చెందినది.

సాధారణంగా వలసలు ఎక్కువ జనసాంద్రతగల ప్రాంతాల నుండి తక్కువ జనసాంద్రత గల ప్రాంతాలకు జరుగుతుంటాయి. వలస పోయేవారిలో ఎక్కువగా 15 నుండి 45 సంవత్సరాల వయసుగలవారు ఉంటారు. సాధారణంగా స్త్రీలకంటే పురుషులు ఎక్కువగా వలస పోతూంటారు. దీని వల్ల సమాజంలో స్త్రీ, పురుష నిష్పత్తిలో కూడా మార్పు సంభవిస్తుంది.

## 4.10 సారాంశము

పైన చర్చించిన జైవిక కారకాలన్నీ అనేక రూపాలలో కాలానుగుణంగా, వివిధ రంగాలలో మార్పులు తీసుకొని వస్తాయి. పర్యవసానంగా వివిధ వ్యవస్థలలో కూడా మార్పులు జరుగుతున్నాయి. జైవిక కారకాలు సమాజంలో అనేక విపరీత మార్పులకు దోహదపడుతున్నాయి.

## 4.11. నమూనా ప్రశ్నలు

I. ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో సమాధానాలు వ్రాయుము.

1) సామాజిక పరివర్తనలో జైవిక కారకాలు పాత్రను విమర్శనాత్మకంగా వ్రాయుము.

2) జనాభా సామాజిక పరివర్తనకు ఏ విధంగా సహాయకారి అవుతుందో పరిశీలింపుము

3) జనాభా గతిశీలత అనగానేమి? జనాభా గతిశీలత రూపాలను గూర్చి వ్రాయుము.

II. ఈ క్రింది ప్రశ్నలకు 20 పంక్తులలో సమాధానాలు వ్రాయుము.

1) సామాజిక పరివర్తనలో "జాతి" యొక్క పాత్రను వివరింపుము.

2) అధిక జనాభావలన సమాజం ఎదుర్కొనే సమస్యలను గూర్చి వ్రాయుము.

3) సంధికాలంలో జనాభా విపరీతమైన పెరుగుదల వలన సామాజిక పరివర్తనలో సంభవించే మార్పులేమిటి

III. ఈ క్రింది ప్రశ్నలకు 5 పంక్తులకు మించకుండా సమాధానాలు వ్రాయుము.

1) నగరీకరణము

2) వలస

3) జనాభా సమతుల్యత

4) పారిశ్రామికీకరణ

## 4.12 చదవదగిన పుస్తకాలు


| | | |
|---|---|---|
| Kuppuswamy | : | Social Change in India |
| తెలుగు అకాడమి | : | సమాజము, పరివర్తన - ప్రణాళికలు |
| Srinivas.M.N | : | Social Change in India |

పాఠం - 5

# సామాజిక పరివర్తన - సాంకేతిక కారకాలు

## 5.0 లక్ష్యాలు

సాంకేతిక విజ్ఞాన భావనను గురించి చర్చించి సాంకేతిక విజ్ఞానం, ఆర్థిక, సామాజిక వ్యవస్థ స్వరూపాలు, వాటి మధ్యగల సంబంధాలను వివరించడం ఈ భాగం ముఖ్యోద్దేశం. ఈ భాగం చదివిన తరువాత మీరు:

1. సాంకేతిక విజ్ఞానం అర్థాన్ని వివరించగలరు.
2. సాంకేతిక విజ్ఞానం, ఆర్థిక వ్యవస్థలు, సామాజిక వ్యవస్థలకు మధ్యగల సంబంధాన్ని తెలుపగలరు
3. సామాజిక జీవనంపై సాంకేతిక విజ్ఞాన ప్రభావాన్ని వివరించగలరు.

విషయసూచిక


5.1 పరిచయం
5.2 సాంకేతిక విజ్ఞానం
5.3 ఆదిమ వ్యక్తి - సామాజిక చరిత్ర
5.4 ఆధునిక యుగం - సాంకేతిక అభివృద్ధి
5.5 యాంత్రికీకరణము - సామాజిక పరివర్తన
5.6 సామాజిక జీవనముల పరివర్తనలు
5.7 సాంకేతిక - ఆర్థిక వాదాలు
5.8 సారాంశము
5.9 నమూనా ప్రశ్నలు
5.10 చదువదగిన గ్రంథాలు


## 5.1 పరిచయము

సాంకేతిక కారకాలు సామాజిక పరివర్తనకు హెచ్చుగా దోహదం చేస్తున్నాయి. సాంకేతిక విజ్ఞాన చరిత్రను సింహావలోకనం చేసి చూచినట్లయితే దాని ప్రభావం మానవజాతి అభివృద్ధికి ఏవిధంగా దోహదం చేసిందో తెలుస్తుంది. ఆదిమానవుని సాంకేతిక విజ్ఞానం చాలా పరిమితమై ఉండేది. మానవుని సాంకేతికాభివృద్ధి వ్యవసాయం ప్రారంభమైన నాటినుండి మొదలైనదని చెప్పవచ్చు. 'నాగలి' వ్యవసాయదశ ప్రారంభానికి సాంకేతిక చిహ్నం. అక్కడి నుండి సాంకేతికాభివృద్ధి ప్రారంభమై దినదినాభివృద్ధి పొందుతూ ఈనాడు సాంకేతిక పరిజ్ఞానం పరిపక్వదశకు చేరుకుంది. సమాజంలో వివిధరంగాలలో యంత్రశక్తి వినియోగించటం జరుగుతున్నది. అందుచేతనే ఆధునిక యుగాన్ని 'సాంకేతిక యుగమని' యాంత్రిక యుగమని పిలుస్తున్నారు.

మానవున జీవితంపై సాంకేతిక, యాంత్రిక ప్రాబల్యం పెరిగిన కొద్ది వాటి కనుగుణంగా సామాజిక వ్యవస్థలలో కూడా విపరీతమైన మార్పులు వచ్చాయి. యంత్రశక్తి, విద్యుత్‌శక్తి, సౌరశక్తి అణుశక్తి తదితరాలైన శక్తులు సాంకేతికాభివృద్ధికి సాధనాలు. ట్రాక్టరు, మోటారు, రైలుఇంజన్, విమానం, రాకెట్ మున్నగునవి ఎన్నో ఉదాహరణలుగా చెప్పుకోవచ్చు. సాంకేతిక విజ్ఞానం దినదినాభివృద్ధి చెందుతూ మానవజీవన విధానంలో ప్రముఖపాత్ర వహిస్తుందనటంలో సందేహంలేదు.

## 5.2 సాంకేతిక విజ్ఞానం - అర్థం

సాంకేతిక విజ్ఞానం అనే పదాన్ని రెండు రూపాల్లో వాడడం జరుగుతుంది (ఎ) ఒక ప్రత్యేక నాగరికత సంఘం, లేదా కాలపరిమితికి చెందిన సాంకేతిక సాధనాలు, నిపుణతలు (బి) ఒక ప్రత్యేక పారిశ్రామిక రంగంలో ఉపయోగించే సాంకేతిక పద్ధతులు. సాంకేతిక కారకాలు, సామాజిక పరివర్తనల మధ్యగల సంబంధాన్ని చర్చించేటప్పుడు పైన పేర్కొన్న మొదటి అర్థంలో వాడుతాము.

## 5.3 ఆదిమ వ్యక్తి - సామాజిక చరిత్ర

చరిత్రకు పూర్వపు ఆదిమ మానవుల ఆర్థిక, సాంకేతిక పరిసరాలు ఎట్లాంటివో వాళ్ళు వాడిన పనిముట్లు, వస్తు సముదాయాన్ని బట్టి తెలుసుకోవచ్చు. ఆదిమ మానవుల ఆర్థిక జీవితం సామాన్యమైనది. వారి సాంకేతిక విజ్ఞానం కూడా చాలా పరిమితమైనది. వారు అడవులలో ఇతర జంతువులతో పోటీ పడుతూ ఆహారాన్ని సంపాదించుకునేవారు. జనాభా కూడా చాలా తక్కువగా వుండేది. ధృఢ నమ్మకంతో జీవితాన్ని గడపడం నాటి ప్రజలకు తెలియదు. ఎప్పటికప్పుడు తమ ఆహారాన్ని సమకూర్చుకునేవారు. కాబట్టి మిగులు అనేది వుండేది కాదు. ఆర్థిక వ్యవస్థ అతి సామాన్య దశలో వుండేది.

పశుపోషణ, స్థిర వ్యవసాయ పద్ధతులు వినియోగించడంతో ఆర్థిక, సాంకేతికాభివృద్ధి ప్రారంభమైందని చెప్పవచ్చును. ఈ రంగాలలో క్రమంగా ఎన్నో నూతన కల్పనలు చేసినారు. నాగలి ఉపయోగం, వాటిని లాగడానికి పశువులను ఉపయోగించడం, బావుల ద్వారా, కాల్వల ద్వారా నీటి పారుదల సదుపాయాలు ఏర్పరచడం, రసాయనిక ఎరువులను ఉపయోగించడం మొదలైనవాటి వల్ల వ్యవసాయ ఉత్పత్తులు చాలా పెరిగినాయి. చక్రాన్ని తయారుచేసి దానిని బండ్లకు, కుండలను తయారు చేయడానికి ఉపయోగించేవారు. పడవలను తయారుచేయడం ద్వారా నీటి రవాణా సౌకర్యం ఏర్పడింది. క్రమంగా చేనేత మొదలైన పరిశ్రమలు అభివృద్ధి చెందినాయి. గృహనిర్మాణ పద్ధతులలో కూడా క్రమంగా అభివృద్ధి జరిగింది. ఇట్లా మానవ సమాజాల ఆర్థిక, సాంకేతిక పరిసరాలలో క్రమంగా అభివృద్ధి జరిగింది. సమాజాలలో కన్పిస్తున్నఆర్థిక, సాంకేతికాభివృద్ధి అంతా ఆనాది నుంచి క్రమంగా, సంచితంగా వస్తున్న దాని ఫలితమే అని చెప్పవలెను. అయితే పాశ్చాత్య దేశాలలో గత నాలుగు శతాబ్దాలనుండి ఆర్థిక, సాంకేతికాభివృద్ధి క్రమం తీవ్రతరమైంది. ఈ యుగంలో నూతన కల్పనలు, పరిశోధనలు ఎక్కువగా జరిగి నూతన ఉత్పత్తి విధానాలు, నైపుణ్యాలు చాలా అభివృద్ధి చెందినాయి.

## 5.4 ఆధునిక యుగం -సాంకేతికాభివృద్ధి

సమాజంలోని అన్ని రంగాలలో యాంత్రిక శక్తి వినియోగించడం జరుగుతున్నది. కాబట్టి ఆధునిక యుగమని, యాంత్రిక యుగమనీ పిలుస్తారు. మానవజీవితంమీద సాంకేతిక, యాంత్రిక ప్రాబల్యం పెరిగినకొద్ది వాటికి అనుబంధంగా సామాజిక వ్యవస్థలలో కూడా ఎన్నో మార్పులు వచ్చినాయి. సాంకేతిక రంగంలో అనేక నూతన కల్పనలు పరంపరగా జరగడం, దాని వల్ల సామాజిక వ్యవస్థలో కూడా మార్పులు రావడం జరుగుతుంది.

## 5.5 యాంత్రికీకరణము - సామాజిక పరివర్తన

యాంత్రికీకరణ ప్రభావం సామాజిక వ్యవస్థలమీద కొంత ప్రత్యక్షంగాను, మరికొంత పరోక్షంగాను ఉండటం వల్ల వాటిలో మార్పులు కలుగుతుంటాయి.

### 5.5.1. శ్రమ విభజన - ప్రత్యేకీకరణ

సాంకేతికాభివృద్ధి జరిగిన కొద్ది సమాజంలో శ్రమ విభజన అధికమౌతుంది. వేర్వేరు రంగాలలో పనిచేస్తున్న వ్యక్తులు ప్రావీణ్యాన్ని పెంపొందించుకుంటారు. దీనివలన సమాజంలో విశిష్టీకరణ ఎక్కువ అవుతుంది. ఇది శాస్త్రీయ, సాంకేతికాభివృద్ధి కావడానికి దోహదం చేస్తుంది. ఇట్లా సమాజంలో పరంపరగా ఆర్థిక, సాంకేతికాభివృద్ధి జరుగుతుంది. సామాజిక వ్యవస్థలు విస్తృతమై, సంశ్లిష్టమవుతాయి. విభేదీకరణము అధికమై అనేక సమూహాలుగా సమాజం విభజన చెందుతుంది. అయితే ఈ సమూహాలన్నింటి మధ్య పరస్పర సంబంధాలు ఎక్కువగా వుంటాయి.

ఇవి ఒకదాని మీద ఒకటి ఆధారపడి కూడా వుంటాయి. సమూహాలలో స్థానపరంగా, వృత్తి పరంగాను గతిశీలత ఎక్కువగా వుంటుంది. ఈ సమూహాలలో సాంప్రదాయక సామాజిక నియంత్రణ పద్ధతులు శక్తివంతంగా పనిచేయలేవు. సమాజంలోని వివిధ సమూహాల మధ్య యాంత్రిక దార్ఢ్యము సన్నగిల్లుతుంది. కాబట్టి సమాజంలో చట్టాలు, శాసనాలు, ప్రభుత్వ యంత్రాంగం, ఆధునిక

సామాజిక నియంత్రణ పద్ధతులు మొదలైన వాటిద్వారా విధాయక దార్ఢ్యాన్ని సాధించవలసి వస్తుంది. సమాజంలో ఆర్థిక, రాజకీయ సమూహాల, సంస్థల ప్రాబల్యం పెరుగుతుంది.

నూతన కల్పనల ప్రభావం నీటి అలల మోస్తరుగా సమాజంలో విస్తరించి వరుసగా ఎన్నెన్నో మార్పులను కలిగిస్తుంది.

**5.5.2 వ్యవసాయాభివృద్ధి**

శాస్త్రీయ, సాంకేతికాభివృద్ధి జరిగి వ్యవసాయ, పశుపోషణ రంగాలలో నూతన పద్ధతులను ప్రవేశపెట్టడంతో వాటి ఉత్పత్తి వినియోగాలు కూడా పెరిగినాయి. వ్యవసాయరంగంలో అనేక నూతన సాంకేతిక పరికరాలను వాడటం మొదలయింది. రసాయనిక ఎరువులు, సంకర జాతి విత్తనాలు, ట్రాక్టర్ మొదలైన యంత్రపరికరాలు, నీటిపంపు మొదలైన వాటివల్ల వ్యవసాయోత్పత్తులు చాలా పెరిగినాయి. ఆహార పదార్థాల ఉత్పత్తి మాత్రమే కాకుండా వాణిజ్యపంటలు కూడా ఎక్కువయినాయి. వాటితో ఆర్థిక వ్యవస్థ పూర్తిగా మారిపోయింది. వ్యవసాయ రంగంలో యాంత్రికీకరణంతో అందులో పనిచేసే వారి సంఖ్య తగ్గిపోయింది. పట్టణాలలో పరిశ్రమలు అభివృద్ధి చెందడంతో ప్రజలు పల్లెల నుంచి పట్టణాలకు తరలివెళ్ళడం ప్రారంభమయింది. భారత దేశంలో వ్యవసాయం మీద అనాది నుండి ఆధారపడి ఉన్న "జాజ్‌మాని వ్యవస్థ" **(Jajmani System)** మారిపోతున్నది. వ్యవసాయం కూలీల సంఖ్య తగ్గిపోతున్నది. ఈ విధంగా వ్యవసాయాభివృద్ధి వల్ల వివిధ సామాజిక వ్యవస్థలలో కూడా మార్పులు జరిగాయి.

**5.5.3 రవాణ, భావ ప్రసార వ్యవస్థలలో అభివృద్ధి**

ఆవిరి యంత్రం కనిపెట్టక పూర్వం దేశంలోని వివిధ ప్రాంతాల మధ్య రాకపోకలు అంతగా ఉండేవి కావు. భావ ప్రసార సాధనాలు కూడా లేనందువల్ల ప్రపంచలోని వివిధ సమాజాల మధ్య పరస్పర చర్యలు పరిమితంగా ఉండేవి. ఆధునిక యుగంలో వేగంగా వెళ్ళే నౌకలు, మోటార్లు, రైళ్ళు, విమానాలు మొదలైన రవాణా సౌకర్యాల మూలంగా దేశలలోని వివిధ ప్రాంతాలలోనే గాక ఖండాంతరాలలో కూడా రాకపోకలు చాలా పెరిగి వాటి మధ్య దూరం తగ్గి, ప్రపంచమే సంకోచం పొందినట్టయింది. అణుశక్తి ప్రయోగించి రాకెట్ నిర్మించడంతో గోళాంతర ప్రయాణం కూడా సాధ్యమవుతున్నది.

టెలిఫోన్, వైర్‌లెస్, రేడియో, టెలివిజన్ మొదలైన సాధనోపకరణాల ద్వారా భావ ప్రసారం చాలా తేలిక అయింది. రవాణా, భావ ప్రసార వ్యవస్థలలో మార్పును బట్టి సామాజిక వ్యవస్థలలో కూడా ఎన్నో మార్పులు కలిగినాయి. సామాజిక వ్యవస్థల మధ్య పరస్పర చర్యలు అధికమయినాయి. రేడియోవల్ల సుమారు 150 మార్పులు కలిగినట్లు ఆగ్బర్న్ **(Ogburn)** పేర్కొన్నాడు. ఈనాడు రేడియోను కాలక్షేపానికి, విద్యావ్యాప్తికి, ప్రజాభిప్రాయాన్ని రూపొందించడానికి, సామాజికోద్యమాలకు, సాంస్కృతిక వ్యాప్తికి, వాణిజ్య వ్యాపార ప్రకటనలకు మొదలగు అనేక ప్రయోజనాలకు వాడడం జరుగుతున్నది. ఇది అంతర్జాతీయ సామాజిక, సాంస్కృతిక అవగాహనకు, విశ్వ జనీన దృక్పథాలను ఆకళింపు చేసుకోవడానికి దోహదం చేయవచ్చును. కాని రేడియో, టెలివిజన్ సంపూర్ణంగా ప్రభుత్వ ఆధిపత్యంలో ఉన్నప్పుడు అది వ్యక్తిత్వాన్ని, వైవిధ్యాలను పెంపొందించడానికి బదులధికార వైఖరులను, దృక్పథాలను మాత్రమే ప్రచార చేసి సమాజంలో ఏకరూపతను సాధించడానికి ప్రయత్నించవచ్చు. ఇట్లా రవాణా, భావ ప్రసార సాధనాల వల్ల అంతర్జాతీయ సంబంధాలు అధికమయినాయి. ఇవి అంతర్జాతీయ సామాజిక క్రమాన్ని పెంపొందించడానికి దోహదం చేస్తున్నాయి.

**5.5.4 అణుశక్తి నియంత్రణ**

యాంత్రికీకరణ మొదటి దశలో యంత్రాలను నడపడానికి బొగ్గును ఇంధనంగా వాడినారు. క్రమంగా నూనెలు, విద్యుచ్ఛక్తి కనిపెట్టి వాటిని ఇంధనాలుగా ఉపయోగించసాగినారు. అణుశక్తి కనిపెట్టడంతో మానవ సమాజాలలో నూతన శకం ప్రారంభమయింది. అణుశక్తితో అనేక యంత్రాలను నడిపించి, మానవ సంక్షేమ అభ్యుదయ కార్యక్రమాలను చేపట్టి పూర్తి ప్రపంచాన్ని భూతల స్వర్గంగా మార్చడానికి అవకాశాలేర్పడినాయి. అయితే అణుశక్తిని బాంబులు తయారుచేయడానికి ఉపయోగించి తద్వారా మారణహోమం కావించడానికి కూడా ఈనాడు అవకాశం ఏర్పడింది. అందువల్లనే ప్రపంచంలో అణుశక్తి ఉన్నదేశాల పట్ల మిగతా దేశాలు అనుమానంతోను, భయంతోను మెలగుతున్నాయి. అణుశక్తి ఉన్న దేశాల ప్రాబల్యం ఎక్కువయింది. కాబట్టి మిగతా దేశాలు కూడా అణుశక్తిని ఉత్పత్తి

చేసి తమను తాము రక్షించుకోవడాకి ప్రయత్నిస్తున్నాయి. ఇట్లా దేశాల మధ్య అణుశక్తి ఉత్పత్తికి, వినియోగానికి సంబంధించిన పోటి పెరుగుతున్నది.

### 5.5.5. సాంకేతికాభివృద్ధి - వస్తూత్పత్తి - దేశాల మధ్య పోటి ప్రపంచం

సాంకేతిక మైన అభివృద్ధి వల్ల సమాజంలో జీవన ప్రమాణాలు చాలా పెరిగినాయి. విరామ సమయం లభించింది. ఇది తిరిగి నూతన కల్పనలకు అవకాశాలను కల్పించింది. పారిశ్రామికాభివృద్ధి చెందిన దేశాలలో ఉత్పత్తులు పెరగడంతో ముడిపదార్థాలకు, ఉత్పత్తి అయిన వస్తువుల అమ్మకానికి అన్వేషణ ప్రారంభమయింది. ఇట్లా పారిశ్రామికాభివృద్ధి చెందిన దేశాల మధ్య ముడి సరుకుల, మార్కెట్ల నిమిత్తం పోటీ ఏర్పడింది. ఈ పోటీ దేశాల మధ్య సంఘర్షణకు, యుద్ధాలకు, పరపీడనకు, వలస రాజ్యాధిపత్యానికి దారి తీసింది. సమాజంలో అనేక కార్మిక, కర్షక ఉత్పత్తిదారులు మొదలైన అనేక సమూహాలు, సంఘాలు రూపొందినాయి. విభిన్న సమూహాల మధ్య పోటీలు, సంఘర్షణలు అధికమయినాయి.

## 5.6. సామాజిక జీవనంలో పరివర్తనలు

సాంకేతికాభివృద్ధి ప్రభావం మానవ సామాజిక జీవితం మీద ఎంతగానో పడింది. యాంత్రికీకరణవల్ల సామాజిక సంస్థలు, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, మత విశ్వాసాలు మార్పుచెందినాయి. పూర్వం కుటుంబం ఉత్పత్తి, వినియోగ కేంద్రంగా ఉండేది. కాని యాంత్రికీకరణంతో కుటుంబం కేవలం వినియోగ కేంద్రంగా మాత్రమే ఉండిపోయింది. గృహ పరిశ్రమలు దెబ్బతిని ఫ్యాక్టరీ వ్యవస్థ రూపొందింది. పారిశ్రామికీకరణంతో స్త్రీలు తమ ఇండ్లను వదలి ఫ్యాక్టరీలలోనో, ఆఫీసులలోనో, పాఠశాలలోనో పనిచేయడం మొదలయింది. దీని వల్ల స్త్రీల అంతస్తులలోను, పాత్రలలోను మౌళికమైన మార్పులు వచ్చి కుటుంబ వ్యవస్థ పరివర్తన చెందింది.

ఆర్థిక వ్యవస్థలో పోటీలు విపరీతంగా పెరిగి వైయుక్తిక ధోరణులు పెచ్చు పెరిగినాయి. నగరికరణ ప్రభావం వల్ల గ్రామీణ, సాంప్రదాయిక జీవన విధానం మార్పు చెందింది. సామాజిక జీవితంలో ఆర్థిక, లౌకిక విలువల ప్రాబల్యం అధికమయింది. ఆధ్యాత్మికమైన విలువలు సన్నగిల్లినాయి. ప్రజలకు నవ్యత మీద మోజు పెరిగింది. కాబట్టి సామాజిక జీవితంలో ఫ్యాషన్లు అధికమయినాయి. సామాజిక జీవితంలో పోటీలు పెరిగి ఎట్లాగైనా లక్ష్యాలను సాధించవలెననే పట్టుదల పెరిగింది. దాని వల్ల లక్ష్యానికి ఉన్న విలువ ఆ లక్ష్యాలను సాధించే మార్గాలకు ఉండటంలేదు. బాహ్య ఆర్థిక సంపదకున్నంత విలువ మానవులలోని అంతర్గత గుణ విశేషాలకు, నైతిక విలువలకు ఉండటంలేదు. ప్రతి విషయాన్ని క్రియాత్మక, ప్రయోజనాత్మక దృష్టితో పరిశీలించడం జరుగుతున్నది. సామాజిక జీవితంలో చింతనాత్మకత, ఆదర్శ దృక్పధాలు సన్నగిల్లి ప్రాగ్మాటిక్, వైషయిక దృక్పథాల ప్రాబల్యం పెరిగింది.

ఈ విధంగా సాంకేతికాభివృద్ధితో మానవుల ఆలోచనారీతులలో, దృక్పథాలలో మార్పులు కలగడంవల్ల కుటుంబ, ఆర్థిక, రాజకీయ, మత విశ్వాస, నైతికాది సామాజిక వ్యవస్థలన్నీ క్రమంగా మార్పుచెందుతాయి.

## 5.7 సాంకేతిక - ఆర్థిక వాదాలు

సాంకేతిక, ఆర్థిక రంగాలలో అభివృద్ధిని బట్టి సామాజిక వ్యవస్థలలో కలిగే మార్పులను పురస్కరించుకొని కొంతమంది సమాజ శాస్త్రవేత్తలు విశేష వాదాలను రూపొందించినారు. సామాజిక పరివర్తన కేవలం సాంకేతిక, ఆర్థిక కారకాల వల్లనే కలుగుతుందని వీరి అభిప్రాయము. ఇట్లాంటి వాదాలలో ముఖ్యమైన వాటిని గురించి పరిశీలిద్దాం.

### 5.7.1 కారల్ మార్క్స్ (Karal Marx)

సమాజంలోని వ్యవస్థలన్ని ఉత్పత్తి విధానాలమీద, ఆర్థిక వ్యవస్థమీద ఆధారపడివుంటాయని, ఉత్పత్తి విధానంలో మార్పు కల్గినపుడు, ఆర్థికాది వ్యవస్థలు కూడా మార్పు చెందుతాయని కారల్ మార్క్స్ ఉద్ఘాటించినాడు. ఉత్పత్తి విధానాలు ఆర్థిక సంబంధాలను,

నిర్మితులను రూపొందిస్తాయి. ఇవి మొత్తం సామాజిక వ్యవస్థకు పునాది వంటిది. వీటిమీద ఆధారపడి రాజకీయ, న్యాయ, నైతిక, సామాజిక నిర్మితులు, వాటికి అనుబంధమైన సామాజిక వ్యవస్థలు అన్నీ మారుతాయి.

ఇట్లా కారల్‌మార్క్స్ సాంకేతిక, ఆర్థిక కారకాలకు ప్రాధాన్యమిచ్చి సామాజిక పరివర్తనను విపులీకరించినాడు.

### 5.7.2 థార్స్టీన్ వెబ్లెన్ (Thorstein Veblen)

థార్స్టీన్ వెబ్లెన్ (1857-1929) అనే అమెరికా దేశపు సమాజ శాస్త్రజ్ఞుడు సాంకేతిక విధానాలను బట్టి మానవుల ఆలోచన రీతులు, సామాజిక వ్యవస్థలు మారుతుంటాయని అభిప్రాయపడినాడు. మానవులలో కొన్ని సహజాతులు ఉమ్మడిగా వుంటాయి. వాటిల్లో సాధారణంగా మార్పు రాదు. కాని సహజాతుల నుండి ఉత్పన్నమయ్యే అలవాట్లలో, ఆలోచనారీతులలో, దృక్పదాలలో సాంకేతిక పరిసరాలను బట్టి మార్పు కలుగుతుంది. మానవులు తమ జీవత అవసరాలను తీర్చుకోవడానికి ఎన్నో పనులను, వృత్తులను చేపడుతారు. వ్యక్తులు చేసే పనులను బట్టి, వృత్తులను బట్టి వారి అలవాట్లు ఆలోచనారీతులు ఏర్పడి స్థిరపడుతాయి. సాధారణంగా భౌతిక పరిసరాలు, సాంకేతిక విధానాలు మానవుల అలవాట్లను, దృక్పదాలను, ఆలోచనారీతులను రూపొందించడంలో ప్రధానపాత్ర వహిస్తాయని థార్స్టీన్ వెబ్లెన్ అభిప్రాయపడినాడు.

మానవులు తమ అవసరాలను తీర్చుకోవడానికి చేపట్టే సాంకేతిక విధానలలోను, భౌతిక పరిసరాలలోనూ క్రమంగా కొన్ని మార్పులు వస్తాంటాయి. వాటి వల్ల వారి కొత్త భౌతిక పరిసరాలకు, పాత ఆలోచనారీతులకు, దృక్పదాలకు వాటిమీద రూపొందిన సామాజిక వ్యవస్థలకు మధ్య సమన్వయం కుదరదు. కాబట్టి సాంకేతిక పరిసరాలలో మార్పు కల్గినపుడు ఆలోచనారీతులలోనూ, సామాజిక దృక్పదాలలోనూ, అలవాట్లలోను, వ్యవస్థలలోను మార్పు అనివార్యమవుతుంది. ఇట్లా సాంకేతిక పరిసరాలలో మార్పును బట్టి వ్యక్తుల సామాజిక ఆలోచన, దృక్పదాలలోనూ తద్వారా సామాజిక వ్యవస్థలలోను పరివర్తన కలుగుతుంది.

అయితే సమాజంలోని వ్యక్తులందరి సామాజిక దృక్పదాలలో మార్పు అంత త్వరగా రాకపోవచ్చును. సామాజిక పరివర్తన సాంకేతిక పరిసరాల ఒత్తిడి మీద ఆధారపడి వుంటుంది. సాంకేతిక పరిసరాల ఒత్తిడి ఎక్కువగా వున్నపుడు పరివర్తన వేంగంగా కల్గుతుంది. ఒత్తిడి తక్కువగా ఉంటే మార్పు మందకొడిగా సాగుతుంది. సమాజంలోని కొన్ని వర్గాలమీద సాంకేతిక పరిసరాల ప్రభావం ఎక్కువగా వుంటుంది. కాబట్టి సాంకేతిక పరిసరాలలో మార్పు వచ్చినపుడు ఆ వర్గాల ఆలోచనలలో, దృక్పదాలలో వెంటనే మార్పు కల్గుతుంది. కాని సమాజంలోని ధనిక, విరామ వర్గాలమీద మారుతున్న సాంకేతిక పరిసరాల ప్రభావము అంతగా వుండదు. వారికి సమాజంలో రక్షణ, భద్రత వుంటాయి. వారి ఆలోచనలు, దృక్పథాలు వెంటనే మార్పు చెందవు. వారు సామాజిక వ్యవస్థలలో మార్పులకు అవరోధాలు కల్పిస్తూ తమ స్వార్థం కోసం సామాజిక పరివర్తనను ప్రతిఘటిస్తారు. ఇట్లా సంపన్న, విరామ వర్గాల వారు సామాజిక పరివర్తనకు ప్రతిబంధకంగా పనిచేస్తూ, సామాజిక వ్యవస్థలను యథాతథంగా వుంచటానికి ప్రయత్నిస్తూంటారని వెబ్లెన్ ఉద్ఘాటించినాడు.

మార్క్స్ వలె వెబ్లెన్ కూడా సాంకేతిక విధానాలలో అభివృద్ధి జరగడంవల్ల సామాజిక పరిణామము జరుగుతుందని అభిప్రాయపడినాడు. అయితే మార్క్స్ సామాజిక పరిణామానికి అంతిమ లక్ష్యంగా వర్గరహిత, రాజ్యరహిత సమాజ వ్యవస్థాపనమే అని పేర్కొన్నాడు. కాని వెబ్లెన్ సామాజిక పరిణామ చరమ లక్ష్యాన్ని గురించి నిర్దిష్టంగా చెప్పలేదు. మార్క్స్ సామాజిక పరిణామము సంఘర్షణ ద్వారాను, విప్లవం ద్వారాను జరుగుతుందని చెప్పినాడు. కాని వెబ్లెన్ సాంకేతిక పరిసరాలలో మార్పుల వల్ల వ్యక్తుల దృక్పథాలలోనూ తద్వారా సామాజిక వ్యవస్థలలోనూ మార్పులు కలుగుతాయని మాత్రం చెప్పినాడు. మార్క్స్ సిద్ధాంతంలో నైతిక విలువల ప్రభావం ఎక్కువగా కనబడుతుంది. వెబ్లెన్ సామాజిక వాస్తవికతను శాస్త్రీయంగా విశ్లేషణ చేసినాడు. మార్క్స్ సిద్ధాంతం ఆకర్షించినంతగా వెబ్లెన్ సిద్ధాంతం ఆకట్టుకోలేక పోయింది.

## 5.8 సారాంశం

సామాజిక పరివర్తనను కేవలం సాంకేతిక కారకాల ద్వారా విపులీకరించడం కష్టసాధ్యమైన పని. ఒకే రకమైన సాంకేతిక విధానాలు, పరిసరాలు గల సమాజాలలో సామాజిక నిర్మితులలోనూ, సంబంధాలలోనూ, సంస్కృతులలోను విభిన్నతలు గోచరిస్తాయి.

సామాజిక జీవితం మీద సాంకేతిక పరిసరాల ప్రభావం వున్నప్పటికి, సామాజిక పరివర్తన కేవలం సాంకేతిక విధానాలలో మార్పు వల్లనే జరుగుతుందని చెప్పడం సమంజసం కాదు. సాంకేతిక పరిసరాలలోని మార్పులు ఆలోచనారీతులలోను, సమాజ దృక్పధాలలోను, అలవాట్లలోను మార్పు తెచ్చినట్లుగానే ఆలోచనారీతులలోని మార్పులు సాంకేతిక విధానాలలో మార్పులు తెస్తాయి.

## 5.9 ప్రశ్నల నమూనా

ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో సమాధానాలు వ్రాయుము.

1. సామాజిక పరివర్తనలో సాంకేతిక కారకాల పాత్రను వివరింపుము.
2. సామాజిక పరివర్తన కేవలం సాంకేతిక, ఆర్ధిక కారకాల వల్లనే కలుగుతుందని నిరూపించిన సైద్ధాంతిక భావనలను గూర్చి విమర్శనాత్మకంగా వ్రాయుము.
3. సామాజిక జీవనంపై సాంకేతిక కారకాల ప్రభావాన్ని వ్రాయుము.

ఈ క్రింది ప్రశ్నలకు 20 పంక్తులలో సమాధానాలు వ్రాయుము.

1. సామాజిక పరివర్తనపై యాంత్రికీకరణ ప్రభావాన్ని వివరింపుము.
2. "సాంకేతికాభివృద్ధి జరిగిన కొద్ది సమాజంలో శ్రమ విభజన అధికమౌతుంది".
3. రవాణా, భావప్రసార సాధనాలు అంతర్జాతీయ సామాజిక పరివర్తనను పెంపొందించడానికి ఎలా దోహద పడుతున్నాయి.

ఈ క్రింది ప్రశ్నలకు 5 పంక్తులలో సమాధానాలు వ్రాయుము.

1. యాంత్రికీకరణ
2. అణుశక్తి నియంత్రణ
3. వ్యవసాయాభివృద్ధి

## 5.10 చదువదగిన పుస్తకాలు


| | | |
|---|---|---|
| Ogbum. W.F | : | Social Change |
| Thorstein Veblen | : | The Theory of the Leisure Class |
| Kuppu Swamy. B. | : | Social Change in India |
| Telugu Akademi | : | Samajam, Parivarthana - Pranalikalu |

పాఠం - 6

# సామాజిక పరివర్తన - సాంస్కృతిక కారకాలు

## 6.0 లక్ష్యాలు

సామాజిక పరివర్తనలో సాంస్కృతిక కారకాల ప్రధాన పాత్రను చర్చించడం ఈ భాగం ముఖ్యోద్దేశం. ఈ భాగం చదివిన తరువాత మీరు:

1. సంస్కృతిని నిర్వచించగలరు.
2. సాంస్కృతిక విలంబన భావనను వివరించగలరు.
3. సాంస్కృతిక పునర్జీవనం అంటే ఏమిటో తెలుపగలరు.
4. సామాజిక పరివర్తనలో సాంస్కృతిక కారకాల ప్రభావాన్ని వివరించగలరు.

విషయసూచిక


6.1 పరిచయం
6.2 సంస్కృతి - అర్థ వివరణ - నిర్వచనం
6.3 సంస్కృతి - నిర్దేశక పాత్ర
6.4 తాత్త్విక సిద్ధాంతాలు
6.5 ప్రొటెస్టెంట్ నైతిక విలువలు
6.6 శాస్త్రీయ వైఖరులు
6.7 లౌకిక వైఖరులు
6.8 సోషలిస్టు తాత్త్విక సిద్ధాంతాలు
6.9 నవ్య చలనాలు
6.10 మహాపురుషుల సైద్ధాంతికత
6.11 సాంస్కృతిక ఆదాన ప్రధానాలు
6.12 భిన్న సంస్కృతి సమూహాల మధ్య పరస్పర చర్యల సామాజిక ప్రక్రియలు
6.13 సారాంశము
6.14 నమూనా ప్రశ్నలు
6.15 చదువదగిన గ్రంథాలు


## 6.1 పరిచయం

సాంస్కృతిక కారకాలు (Cultural Factors)

సాంస్కృతిక కారకాలు సామాజిక పరివర్తనలో ప్రముఖపాత్ర వహిస్తున్నాయి. ప్రపంచంలోని అన్ని మానవ సమాజాలలోను 'సంస్కృతి' అనేది ప్రధానంగా, తప్పకుండా ఉంటుంది. మానవుడు సంస్కృతిని నిర్మించే జీవిగా మానవ శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. మానవుని జీవితం తాత్కాలికమైనప్పటికిని, అతడు నిర్మించిన సంస్కృతి మాత్రం శాశ్వతంగా ఉండిపోతుందని చెప్పవచ్చు. ప్రతి సమాజంలోనూ ఒక తరం వేరొక తరానికి సంస్కృతిని సాంఘికీకరణ ప్రక్రియ ద్వారా అందించడం జరుగుతుంది. అందువల్లనే సంస్కృతి అనేది తరతరాల మానవుని అనుభవాల సారమని చెప్పుకొనవచ్చు.

## 6.2 సంస్కృతి - అర్థవివరణ - నిర్వచనం

సంస్కృతి అనేది సజాతి ధర్మ ప్రవృత్తి (Genus Homo). మానవ జీవితానికి సంస్కృతి ఆధారభూతమైంది. ఇది మానవులకు సంపూర్ణ జీవన మార్గం. ఇది మానవ జీవనానికి శక్తి వంతమైన మార్గదర్శిగా పనిచేస్తుంది. సంస్కృతి మానవునికి మంచీ, చెడూ, వాంఛనీయమైనది, అవాంఛనీయమైనది, ప్రధానమైనదీ, అప్రధానమైనదీ, సహేతుకం, హేతుబద్ధం కానిదీ తెలుసుకోవడానికి ఉపకరిస్తుంది. ఇదిలా తోడ్పడటం వల్లనే మానవులు పరస్పరం సయోధ్యతో మసలుతూ సాంఘిక సంబంధాలు పరిరక్షించుకుంటూ, వారి జీవితావసరాలను తీర్చుకోగలుగుతున్నారు. మానవుడి సమస్యలు పరిష్కరించేందుకు సంస్కృతి ఒక ప్రణాళికా విధానాన్ని కల్పిస్తుంది.

ప్రపంచంలోని అన్ని మానవ సమాజాలలో 'సంస్కృతి' (Culture) అనేది ప్రధానాంశంగా ఉంది. వ్యక్తిని సంస్కృతిని నిర్మించే జీవిగా మానవ శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. మానవుని జీవితం తాత్కాలికమైనప్పటికీ, అతడు నిర్మించిన సంస్కృతి సాంఘికీకరణ ప్రక్రియ ద్వారా ఒక తరం నుండి మరొక తరానికి అందజేయడం జరుగుతుంది.

సంస్కృతి ప్రాథమికంగా జైవిక పదం. ఇది 'కల్చర్' (కనిపెట్టి చూస్తూ పరిచర్య చేయడం), 'కాల్చెర్' (దున్ను, పోషించు) అనే లాటిన్ పదాల నుండి ఉద్భవించింది. ప్రథమంగా 18వ శతాబ్దంలో జర్మనీలో దీనిని మానవ సమాజాలకు వర్తింపజేయడం జరిగింది.

'సంస్కృతి' అనే పదాన్ని వ్యవహారిక భాషలో అనేక అర్థాలలో వాడుతూ ఉంటారు. సంస్కృతిని మానవ శాస్త్రవేత్తలు అనేక రకాలుగా నిర్వచించారు. సంస్కృతికి నిర్వచనం చెప్పిన తొలి మానవ శాస్త్రజ్ఞుడు ఇ.బి. టైలర్ (E.B. Tylor). 'విజ్ఞానం, నమ్మకాలు, విశ్వాసాలు, కళలు, నీతి నియమాలు, చట్టం, ఆచార వ్యవహారాలు, శాసనాలు, ఇంకా మానవుడు సమాజ సభ్యుడుగా సముపార్జించుకొన్న శక్తి సామర్థ్యాలు, అలవాట్లు వీటన్నింటి సంశ్లిష్ట మొత్తమే సంస్కృతి' అని ఇ.బి. టైలర్ సంస్కృతిని నిర్వచించినాడు. 'మనుషుల్ని పశువుల నుండి వేరు చేసి చూపేదే సంస్కృతి' అని ఆస్వాల్డ్ (Oswald) నిర్వచించినాడు.

స్థూలంగా చెప్పవలెనంటే సమాజ సభ్యుడుగా మానవుని ఆలోచనల, భావోద్రేకాల చర్యల నమూనాలే సంస్కృతి. ప్రతి సమాజంలోను కొన్ని లక్షణాలలతోను, సంక్లిష్టతలతోను, తాత్విక సిద్ధాంతాలతోను, విలువలతోను అంతర్లీనమై ఉంటుంది. సంస్కృతి మానవుల కార్యకలాపాలను, జీవిత విధానాలను తెలుపుతుంది. సంస్కృతి సమాజంలోని వ్యక్తులకు, సమూహాలకు మధ్య పరస్పరచర్యలు జరుపుతూ నియమనిబంధనలను ఏర్పాటు చేస్తుంది. అంతేగాక ఒకే సంస్కృతిలో విభిన్న జీవన విధానాల మధ్య, సాంఘిక విలువల మధ్య సంఘర్షణలు జరగటం వల్లకాని లేదా రెండు వేర్వేరు సంస్కృతుల మధ్య సంఘర్షణలు జరగటం వల్లగానీ సమాజంలో చాలా మార్పులు వస్తుంటాయి.

## 6.3 సంస్కృతి - నిర్దేశక పాత్ర (Directional Role of Culture)

సమాజంలో వివిధ రంగాలలో మార్పుల కంటె మొదట నవ్యతలకు సంబంధించిన భావాలు బయలు దేరతాయి. సాంకేతిక రంగాలలో కూడా నూతన కల్పనల భావాలు మొదట ఉదయిస్తాయి. తరువాత వాటికి రూపకల్పన జరుగుతుంది. ఉదాహరణకు రేడియో కనిపెట్టక పూర్వమే మార్కోనీ దానికి సంబంధించిన భావం కలిగి, విశేష కృషి చేసిన ఫలితంగా దాని రూపకల్పన జరిగింది. అట్లాగే అనేక సామాజిక రంగాలలో నవ్యతలకు సంబంధించిన భావాలు కొంతమంది శిష్టజనులలో బయలు దేరి, వాటికి రూపకల్పన జరిగి ప్రజామోదం పొందడం వల్లనే పరివర్తన కలుగుతుంది. అయితే నూతన భావాలు, కల్పనలు సామాజిక ఆమోదాన్ని పొందుతాయి లేదా అనే విషయాన్ని విలువలు, ప్రమాణాలు నిర్ణయిస్తాయి.

సామాజిక పరివర్తనలో సాంకేతిక కారకాలు సాధనోపకరణాలుగాను, సాంస్కృతిక కారకాలు నిర్దేశకాలుగాను పనిచేస్తాయి. విలువలు సామాజిక పరివర్తన దిశను, లక్ష్యాలను నిర్దేశిస్తాయి. సమాజము ఆ దిశగా పయనించి గమ్యాన్ని చేరుకోవడానికి నాగరికత తోడ్పడుతుంది. ఈ విషయాన్ని మెకైవర్ (Mac Iver), పేజ్ (Page)లు ఈ విధంగా చెప్పినారు. 'నాగరికతను ఎన్నో రేవులకు ప్రయాణం చేయగల నౌకతోను, సంస్కృతిని దానిలోని సారథితోను పోల్చవచ్చును. నౌక లేనిదే ప్రయాణం సాగదు. నౌక పరిస్థితిని

బట్టి ప్రయాణ వేగము, ప్రయాణం చేయగలిగే దూరము, ప్రయాణ సమయంలో అనుభవాలు నిర్ణయమవుతాయి. కాని ప్రయాణ దిశను, గమ్యాన్ని నౌక నిర్ణయించలేదు. నౌక మంచి స్థితిలో ఉంటే ప్రయాణం వేగంగా సాగుతుంది. ఎన్నో రేవులు అందుబాటులో ఉంటాయి. సారధి వాటిలో ఒక రేవును ఎన్నుకుని ఆ దిశగా ప్రయాణం సాగించి గమ్యాన్ని చేరుకోగలుగుతాడు'.

దీనిని బట్టి సంస్కృతి సామాజిక వ్యవస్థల లక్ష్యాలను నిర్దేశిస్తుందని, నాగరికత ఆ లక్ష్యసాధనకు ఉపయుక్తమవుతుందని గ్రహించవలెను. అయితే నాగరికత, సంస్కృతికాంశాలు పరస్పర సంబంధంతో ఉంటాయి. సాంస్కృతికాంశాలలో మార్పుతో బాటు సామాజిక పరివర్తన జరుగుతూ ఉంటుంది.

## 6.4 తాత్త్విక సిద్ధాంతాలు (Ideologies)

సాంస్కృతిక అంశాలలో ప్రధానంగా తాత్త్విక సిద్ధాంతాలు సామాజిక పరివర్తనలో ముఖ్యమైన పాత్రను వహిస్తాయి. మానవ సమాజాలలో తాత్త్విక సిద్ధాంతాల మూలంగా మానవుల భావలలో, దృక్పథాలలో, విలువలలో మార్పు కలిగి సామాజిక పరివర్తన జరుగుతుందని చెప్పడానికి చరిత్రలో ఎన్నోదృష్టాంతాలున్నాయి. రష్యా, చైనా మొదలైన దేశాలలో కమ్యూనిష్టు విప్లవం రావడానికి సాంకేతిక ఆర్థిక విధానాల కంటె మార్క్సు తాత్త్విక సిద్ధాంత ప్రభావమే ప్రధాన కారణమని చెప్పవలెను. అట్లాగె అమెరికా, ఫ్రెంచి విప్లవాలు ప్రజ్వరిల్లడంలో జాన్ లాక్, రూసో, వాల్టేర్ వంటి మేధావుల రచనలు ఎంతో దోహదం చెసినాయి.

## 6.5 ప్రొటెస్టెంట్ నైతిక విలువలు (Protestant Ethics)

సామాజిక పరివర్తనలో మత విశ్వాసాలు, నైతిక విలువలు వీటి పాత్రకు సంబంధించిన విషయాలను గురించి మాక్స్‌వెబర్ (Max Weber) అనే జర్మన్ సమాజ శాస్త్రవేత్త శాస్త్రీయ విశ్లేషణ జరిపినాడు. మత, నైతిక వ్యవస్థలలో మార్పులను బట్టి ఆర్థిక, సామాజిక వ్యవస్థలలో పరివర్తన జరుగుతుందని ఇతని అభిప్రాయం. వెబర్ సిద్ధాంతం మార్క్సు సిద్ధాంతానికి పూర్తిగా వ్యతిరేకము. మార్క్సు సాంకేతిక, ఆర్థిక వ్యవస్థలలోని మార్పులను బట్టి సామాజిక, నైతిక విలువలలో మార్పులు కలుగుతాయని ఉద్ఘాటించగా, వెబర్ నైతిక విలువలలో మార్పులను బట్టి ఆర్ధిక, సామాజిక వ్యవస్థలలో మార్పులు వస్తుంటాయని అభిప్రాయపడినాడు.

ప్రతి సమాజంలో మతవిశ్వాసాలను బట్టి నైతిక విలువలు, ఆర్థిక, సామాజిక వ్యవస్థలు రూపొందుతాయనీ, మతంలో మార్పులను బట్టి నైతిక విలువలు ఆర్థిక, సామాజిక వ్యవస్థల మార్పులను బట్టి నైతిక విలువలు ఆర్థిక, సామాజిక వ్యవస్థలు మార్పు చెందుతాయనీ వెబర్ విశ్లేషణ యొక్క సారాంశము. మతము కొన్ని ఆదర్శ సామాజిక నిర్మితులు రూపొందిస్తుంది. ప్రజలు వాటిని పాటించవలెనని ప్రబోధిస్తుంది. ఉదాహరణకు చైనాలో కన్ఫ్యూషియస్, టాయీ మతాలు కుటుంబ, బంధుత్వ వ్యవస్థలకు ప్రాధాన్యాన్ని ఇచ్చినాయి. బంధుప్రేమ, పెద్దల మీద గౌరవం మొదలైన వాటికి విలువనిచ్చి, వ్యక్తి స్వాతంత్ర్యాన్ని, స్వేచ్ఛను అణగదొక్కడం జరిగింది. భారతదేశంలో కూడా మతంలో ప్రారబ్ధకర్మ, వర్ణవ్యవస్థ మొదలైనవాటికి ప్రాబల్యం ఉండటం మూలంగా సమాజంలో గతిశీలత, స్వాతంత్ర్యం దెబ్బతిని సామాజికాభివృద్ధి కుంటుపడింది. యూరప్‌లో కూడా కాథలిక్ మత ప్రాబల్యమున్నంత కాలం సమాజంలో వ్యక్తి పరమైన విలువలకు, స్వేచ్ఛాస్వాతంత్ర్యాలకు తావులేక పోవడం వల్ల అక్కడ అభివృద్ధి జరగలేదు.

సమాజంలో మతము కీలకస్థానాన్ని ఆక్రమించింది. మత వ్యవస్థలో పరివర్తనతో బాటు నైతిక విలువలలో కూడా మౌలికమైన మార్పులు వచ్చినాయి. ప్రొటెస్టెంట్ నైతిక వ్యవస్థ స్వేచ్ఛకు ఎక్కువ అవకాశాలు కల్పించి పెట్టుబడిదారీ వ్యవస్థ రూపొందడానికి దోహదం చేసింది. ప్రజలలో పనికి, వృత్తికి సంబంధించిన దృక్పథాలలో మార్పును కలిగించింది. ప్రతిపనిలోను నిజాయితీ పాటించవలెనని, కాలాన్ని సద్వినియోగపరచవలెనని, పొదుపు చేసి ధనాన్ని అధికోత్పత్తికి వినియోగించవలెనని ప్రజలకు ఉద్బోధించడం జరిగింది. ప్రతి వ్యక్తి తన వృత్తి విధులను సక్రమమైన పద్ధతిలో నిర్వర్తించి దానిలో విశిష్టతను సంపాదించడం ద్వారా మోక్షం పొందవచ్చునని తెలియజేయడం జరిగింది. క్యాలెండర్‌లో పర్వదినాలను, సెలవురోజులను తగ్గించినారు. రోజుకు 24 గంటలు పనిచేయడానికి అవకాశాలు ఏర్పరిచినారు. ప్రతి ఒక్కడు బైబిలు సొంతంగా చదువవలెనని ప్రభోధించడం మూలంగా సమాజంలో అక్షరాస్యత పెరిగింది. ఈ విధంగా విజ్ఞానము అభివృద్ధి చెందడానికి వీలయింది. ఇట్లా మత, నైతిక వ్యవస్థలలో మార్పులు కలిగి వ్యక్తి స్వేచ్ఛకు కృషికి అవకాశాలు ఏర్పడి, పెట్టుబడిదారీ

ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందిందని వేబర్ ఉద్ఘాటించినాడు.

ప్రపంచంలో ప్రొటెస్టెంట్‌లు అధిక సంఖ్యలో ఉన్న దేశాలు, కాథలిక్‌లు ఉన్నదేశాల కంటె ఎక్కువగా ఆర్థికాభివృద్ధిని సాధించినాయి. ఇండియా, చైనా వంటి దేశాలు చాలాకాలందాకా పారిశ్రామిక, ఆర్థికాభివృద్ధి సాధించలేక పోవడానికి కారణాలు కొంతవరకు ఆ దేశాలలోని ఆర్థిక విషయాల మీద ప్రజల ఉపేక్షా భావము, సోమరితనము, మత విశ్వాసాలు అని చెప్పవలెను. సామాజిక పరివర్తనలో మత విశ్వాసాలు, నైతిక విలువలు ప్రధాన పాత్ర వహిస్తాయని వెబర్ చెప్పినప్పటికి, సామాజిక పరివర్తన కేవలం వాటివల్ల మాత్రమే జరుగుతుందని చెప్పలేదు. సామాజిక పరివర్తనలో సాంకేతిక, ఆర్థికాధికారకాల పాత్రమ కూడా అతడు గుర్తించినాడు.

## 6.6 శాస్త్రీయ వైఖరులు (Scientific Attitudes)

మత ప్రాబల్యం గల సమాజాలలో మానవుడిని, విశ్వాన్ని దైవసృష్టిగా భావిస్తారు. మతము కేవలం ఆధ్యాత్మిక విషయాల వరకే పరిమితంగా ఉండక ప్రకృతి జైవిక, సామాజిక దృగ్విషయాల వివరణ కూడా చేస్తుంది. మత గ్రంథాలలో ఆధ్యాత్మిక విషయాలతోబాటు, ప్రాపంచిక విషయాల వివరణకూడా కొంత వుంటుంది. మతపరంగా వచ్చిన విజ్ఞానం దైవ ప్రసాదితం కాబట్టి పరమ సత్యమని, దానికి భిన్నమైన విజ్ఞానం సత్యదూరమని భావించడం జరుగుతూ వుండేది. యూరప్‌లో కాథలిక్ మతానికి ప్రాబల్యమున్నంతకాలం చర్చి ఆమోదించిన దానికి వ్యతిరేకంగా ఎట్లాంటి శాస్త్ర విజ్ఞానం అభివృద్ధి చెందడానికి వీలు లేక పోయింది. కాని 14వ శతాబ్దంలో నావికులు యూరప్‌నుండి ప్రాశ్చ్య, పశ్చిమ దేశాలకు ప్రయాణం చేసి అక్కడి నాగరికత, సాంస్కృతిక విశేషాలను చూసి వర్ణించడంతో యూరోపియన్‌లకు కనువిప్పు కలిగింది. కూపర్‌నికస్, గెలీలియో ప్రయోగాత్మకంగా తమ విజ్ఞాన శాస్త్ర సూత్రాలను నిరూపణ చేసినారు.

విజ్ఞాన శాస్త్రానికి నాంది గ్రీస్‌లో అరిస్టాటిల్‌తో ప్రారంభమైంది. కాని చాలాకాలం వరకు అది అడుగున పడిపోయింది. మళ్ళీ 15, 16 శతాబ్దాలలో అభివృద్ధి చెందింది. విజ్ఞానశాస్త్రాభివృద్ధితో ప్రజలలో వివేచనాత్మక, శాస్త్రీయ దృక్పథాలు కూడా వృద్ధి పొందినాయి. ప్రతి విషయాన్ని వివేచనాత్మకంగా, శాస్త్రీయ దృష్టితో పరిశీలించడం మొదలైంది.

విజ్ఞాన శాస్త్రాన్ని కేవలం విజ్ఞానం కోసమే కాకుండా ప్రయోజనాత్మకంగా అభివృద్ధి చేయడం జరిగింది. సామాజిక సమస్యల పరిష్కారానికి, మానవ సంక్షేమానికి శాస్త్రీయ విజ్ఞానం ఎంతగానో ఉపయుక్తమయింది. అందువల్ల సమాజంలో శాస్త్రవేత్తల అంతస్తులు, పాత్రలు పెరిగినాయి. ఇట్లా శాస్త్రవిజ్ఞానం సాంకేతికాభివృద్ధికి తోడ్పడుతూ సామాజిక పరివర్తనకు ఒక సాధనంగా ఉపయోగపడుతున్నది.

## 6.7 లౌకిక వైఖరులు (Secular Attitudes)

సమాజంలో శాస్త్రీయ, సాంకేతిక విజ్ఞానం వ్యాప్తి చెందడంతో ప్రజలలో వివేచనాత్మక, వైషయిక దృక్పథాలు ప్రబలినాయి. శాస్త్రీయ విజ్ఞానం అభివృద్ధి చెందక పూర్వం సామాజిక వ్యవస్థలు, ప్రమాణాలు దైవనిర్ణయాలని, వాటిని ఉల్లంగించడం, మార్పుచేయడం అపవిత్రచర్య అని భావించి మార్పులను ప్రతిఘటించడం జరిగేది. కాని శాస్త్రీయ విజ్ఞానం అభివృద్ధి చెందినాకొద్ది ఆధ్యాత్మిక, లౌకిక విషయాలను వేరుచేయడం జరుగుతుంది. ఈ రెండు రకాల విలువల మధ్య తీవ్ర సంఘర్షణ చెలరేగింది. చివరకు లౌకిక విలువలే విజయం పొంది వ్యాప్తి చెందినాయి.

లౌకిక విలువల ప్రాబల్యం పెరగడంతో సామాజిక వ్యవస్థలను మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా మార్పు చేసి, సామాజిక సమస్యలను పరిష్కరించి, సామాజికాభివృద్ధి సాధించవలెననే భావాలు బయలుదేరినాయి. సామాజిక పురోగమనానికి సంబంధించిన అనేక భావాలు, తాత్త్విక సిద్ధాంతాలు, విశేషవాదాలు పెంపొందినాయి.

మత విషయాలలోనే గాక ఆర్థిక, సామాజిక, రాజకీయ సాంస్కృతిక రంగాలలో కూడా సంపూర్ణ స్వేచ్ఛస్వాతంత్ర్యాల ద్వారానే సామాజిక పురోగమణం సాధ్యపడుతుందనే భావము ప్రాబల్యం వహించింది. దీని వల్ల పెట్టుబడీదారి వ్యవస్థ రూపొంది పారిశ్రామికాభివృద్ధి జరిగింది. వ్యక్తులమీద కుటుంబ, మత, ప్రభుత్వాధికారాలు సన్నగిల్లినాయి. వ్యక్తీకరణ ధోరణులు, దృక్పథాలు పెరిగినాయి. సమాజంలో పరపీడన ఎక్కువైంది. సమాజంలో అనేక సమూహాల మధ్య వ్యత్యాసాలు, పోటీలు, సంఘర్షణ పెరిగినాయి. అన్యాయము, అవినీతి,

సామాజిక విఘటన, అరాచక అవ్యవస్థిత పరిస్థితులు సమాజంలో అధికమైనాయి. ఇట్లా సమాజంలో వ్యక్తీకరణ ధృక్పథాలు ప్రబలడంతో అవ్యవస్థిత పరిస్థితులు పెరిగినాయి.

## 6.8 సోషలిస్ట్ తాత్త్విక సిద్ధాంతాలు

సమాజంలో వ్యక్తీకరణ హెచ్చుపెరిగి అవ్యవస్థిత పరిస్థితులు ప్రబలడంతో వ్యక్తికీ, సమాజానికి మధ్య సమతుల్యతను పరిరక్షించవలసిన అవసరమేర్పడింది. సామాజిక శ్రేయస్సు దృష్ట్యా వ్యక్తి స్వాతంత్ర్యాన్ని, హక్కులను నిర్వచింపవలసి వచ్చింది. చాలా కాలం కిందటనే ప్లేటో (PLATO) రచించిన "ది రిపబ్లిక్" (The Republic) అనే గ్రంథంలో సోషలిస్ట్ భావాలను వ్యక్తపరచినాడు. తరువాత 19వ శతాబ్దంలో వ్యక్తి సంపూర్ణ స్వేచ్ఛ స్వాతంత్ర్యాలకు వ్యతిరేకంగా ఫ్రాన్స్‌లో సెయింట్ సైమన్ (Saint Siman), ఫౌరర్ (Fourer), ప్రొధాన్ (Proudhan), బ్లాంక్ (Blank) ఇంగ్లాండ్‌లో రాబర్ట్ ఓవెన్ (Robert Owen) జర్మనీలో లాసాలే (Lassale) మొదలైనవారు సోషలిస్టు భావాలను ప్రతిపాదించి ప్రయోగాలు జరిపినారు. కారల్‌మార్క్స్ వీటన్నింటినీ "దాస్ కాపిటల్" (Das Capital) అనే గ్రంథంలో క్రోడీకరించి ఏంజెల్స్‌తో కలసి సంయుక్తంగా "కమ్యూనిస్ట్ మ్యానిఫెస్టో" (Communist manifesto)ను రూపొందించి సోషలిస్ట్ తాత్త్విక భావాల వ్యాప్తికి, విప్లవానికి మార్గదర్శకుడు అయినాడు. ఈ శతాబ్దంలో రష్యా, చైనా, క్యూబా, పోలాండ్, రూమేనియా, యుగోస్లేవేకియా, అల్బేనియా మొదలైన దేశాలలో కమ్యూనిస్ట్ రాజ్య స్థాపన జరిగింది. ఈనాడు సోషలిస్ట్ భావాలు ప్రపంచంలోని అన్ని దేశాలకు విస్తృతంగా వ్యాపించినాయి. దానితో సామాజిక చర్యల ద్వారా సామాజికాభివృద్ధి సాధ్యపడుతుందనే భావన బలపడింది. ప్రపంచంలోని దేశాలన్ని ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రజాస్వామ్య సోషలిస్ట్ సమాజ వ్యవస్థను నిర్మించడం తమ ప్రధాన లక్ష్యంగా ప్రకటిస్తున్నాయి. ఈ లక్ష్యాన్ని సాధించడం కోసం ప్రస్తుత సామాజిక వ్యవస్థలను, విలువలను మార్చిగాని, సర్దుబాటు చేసినాగాని, కొత్తవ్యవస్థను నిర్మిస్తున్నారు. ఈ సమాజాలలో విజ్ఞాన శాస్త్రాలన్నింటినీ సామాజిక పరివర్తన సాధనాలుగా వినియోగించడం జరిగింది. ఇట్లా సమాజంలో తాత్త్విక సిద్ధాంతాలు, విలువలు సామాజిక పరివర్తనను కలిగిస్తూవుంటాయి.

## 6.9 నవ్యచాలనాలు (Innovations)

సామాజిక పరివర్తనలో నవ్యచాలనాలు ప్రధానపాత్ర వహిస్తాయి. సాంస్కృతిక, సామాజికరంగాలలో నవ్యచాలనాలు ఏర్పడి ఆ వ్యవస్థలలో మార్పులు కలిగిస్తుంటాయి. సామాజిక వ్యవస్థలలో నవ్యచాలనాలు అనేక కారణాల వల్ల జరుగవచ్చును. సాధారణ నవ్యతలు అవసరాన్ని బట్టి సృష్టింపబడుతుంటాయి. సమాజంలో వర్తమాన వ్యవస్థలు వ్యక్తుల, సమూహాల అవసరాలను, ఆకాంక్షలను పూర్తిచేయనప్పుడు కొత్తవాటిని సృష్టించడం జరుగుతుంది. కొంతమందిలో నూతన భావాలు, ఆశయాలు రేకెత్తడంతో వాటికి క్రియరూపాన్ని ఇవ్వడానికి నూతనమార్గాలను సృష్టిస్తారు. మరికొందరు నిరంతరం యాంత్రికమైన పద్ధతులతో, రీతులతో విసుగుచెంది వైవిధ్యం కోసం నవ్యతలను సృష్టించవచ్చును. ఇవి క్రమంగా సమాజంలో వ్యాప్తి చెందుతాయి. సమాజంలో ఫ్యాషన్‌లు తరుచూ మార్పుకు గురియవుతూవుంటాయి. కొందరు సమాజంలోని అవకతవకలను, అవ్యవస్థితను, అక్రమపద్ధతులను తొలగించడానికి, వర్తమాన సామాజిక ప్రమాణాలను ఉల్లంగించి, కొత్త పంథాలను అనుసరిస్తారు. ఆ పంథాలు క్రమంగా ప్రజలలో వ్యాప్తి చెంది సమాజంలో మార్పు కల్గించవచ్చును. మరికొందరు సమాజంలోని లోపాలను సవరించడానికి, కొత్తపథకాలను రూపొందించి ప్రజలలో తమ భావాలను, పథకాలను ప్రసారం చేసి వారిచేత మార్పును ఆమోదింపజేసి వాటిని అమలు పరచడానికి పురికొల్పుతారు. అట్లాంటివారిలో సంస్కర్తలు, విప్లవకారులు వుంటారు. సంస్కర్తలు సమాజంలోని కొన్ని అంశాలలో నెమ్మదిగా, అహింసాయుత మార్గంలో మార్పులు తీసుకొనిరావడానికి ప్రయత్నిస్తారు. కాని విప్లవకారులు సమాజంలోని అనేక రంగాలలో మార్పులు శీఘ్రగతిని తీసుకొని వచ్చి నూతన సమాజాన్ని నిర్మించడానికి ప్రయత్నిస్తారు.

సామాజిక, సాంస్కృతిక రంగాలలో నవ్యచలనాలకు సాంకేతిక నూతన కల్పనలకంటే కూడా ఎక్కువ అవరోధాలు, ప్రతిఘటనలు ఎదురౌతాయి. నవ్యతను సృష్టించేవారు మొదట సామాజిక అసమ్మతికి, ఆగ్రహానికి గురి కావలసి వస్తుంది. అయినప్పటికీ వీరు వెనుదీయక తమ లక్ష్యసాధనకు కృషి చేస్తూ వుండటం వల్ల కొంత కాలానికి నవ్యతలు ప్రజామోదాన్ని పొంది సమాజంలో మార్పులు కల్గుతాయి.

## 6.10 మహాపురుషుల సైద్ధాంతికత (Great Men Theory)

సామాజిక పరివర్తన కలిగించడంలో కొంతమంది వ్యక్తులు ప్రముఖ పాత్ర వహించినారు. నెపోలియన్, అబ్రహాంలింకన్, ముస్సోలిని, హిట్లర్, స్టాలిన్, మహాత్మాగాంధీ, మావో సెటుంగ్, కమాల్ అటాటర్క్ మొదలైనవారు తమ సమాజంలోనే గాక, ఇతర సమాజాల మీద ప్రభావం చూపి ప్రజల సామాజిక దృక్పథాలలో, జీవన విధానాలలో మార్పులు కలిగించినారు. నీట్జే (శ్రీలిరిశిచిలి)అనే తత్త్వవేత్త సామాజిక పరివర్తనలో మహాపురుషుల పాత్రకు ప్రాధాన్యమిచ్చినాడు. సామాజిక పరివర్తనలో నాయకుల పాత్ర ముఖ్యమైనప్పటికి, సమాజశాస్త్రంలో కేవలం ఒక వ్యక్తి మూర్తి మత్వానికి మాత్రమే ప్రాధాన్యమివ్వక, సామాజిక పరిస్థితులకు ప్రాధాన్యమివ్వడం జరుగుతుంది. వ్యక్తి మూర్తిత్వం సామాజిక పరిస్థితులను బట్టి రూపొందుతుంది. అనుకూలమైన సామాజిక వాతావరణం ఉన్నప్పుడే వ్యక్తులు నవ్యతలను సృష్టిస్తారు. వాటి మూలంగా సామాజిక పరివర్తన జరుగుతుంది.

కాబట్టి సామాజిక పరివర్తనకు సామాజిక పరిస్థితులే కారణమని సమాజ శాస్త్రవేత్తల అభిప్రాయము.

## 6.11 సాంస్కృతిక ఆదాన ప్రదానాలు

సామాజిక పరివర్తన కేవలం సమాజంలో స్వతంత్రమైన నూతన కల్పనల వల్ల, శోధనల వల్ల, నవ్యచాలనాలు వల్లనే కాకుండ ఒక సమాజం నుండి మరొక సమాజానికి మధ్య జరిగే ఆదానప్రధానాల వల్ల కూడా జరుగుతుంటుంది. ప్రపంచంలో నాగరికతా సంస్కృతుల వ్యాప్తి ద్వారా అనేక సమాజాలలో అభివృద్ధి జరుగుతుంది. ప్రయాణీకులు, వ్యాపారస్థులు, సైనికులు, మత ప్రచారకులు, ప్రవాస కార్మికులు మొదలైనవారు సామాజిక, సాంస్కృతికాంశాలను ఒక ప్రాంతంనుండి మరొక ప్రాంతానికి వ్యాప్తి చేస్తుంటారు.

ఆధునిక సాంకేతిక యుగంలో రవాణా, భావ ప్రసార సాధనాల అభివృద్ధి జరిగిన తరువాత సాంస్కృతిక, సామాజిక అంశాల వ్యాప్తి చాలా విస్తృతంగా జరుగుతుంది. ఒక సమాజంలో సృష్టి చెందిన నవ్యచాలనాలు వెనువెంటనే ఇతర సమాజాలకు విస్తరించి పోతాయి. దానితో ఒక సమాజంలో జరిగిన మార్పు ఇతర సమాజాలలో కూడా మార్పును కల్గిస్తుంది. రాల్ఫ్‌లింటన్ (Ralph Linton) అంచనా ప్రకారం ఆధునిక సమాజంలో ఏ ఒక్క సమాజము అయినా సంస్కృతి అంశాలను పరిశీలించినట్లయితే దానితో మొత్తము సాంస్కృతిక అంశాలలో ప్రత్యేకముగా ఆ సమాజానికి సంబంధించినవి సుమారు 10 శాతం మాత్రమే వుంటాయని, మిగిలిన 90 శాతం ఇతర సమాజాల నుండి తెచ్చుకున్నవే వుంటాయని తెలుతుంది.

## 6.12 భిన్న సంస్కృతి సమూహాల మధ్య పరస్పరచర్యల సామాజిక ప్రక్రియలు.

విభిన్న సాంస్కృతి గల సమూహాల మధ్య పరస్పరచర్యల వల్ల క్రింది సామాజిక ప్రక్రియలు జరుగడానికి వీలు ఏర్పడుతుంది.

### 6.12.1 సంస్కృతీకరణము (Acculturation)

ప్రజలు ఒక ప్రాంతంనుండి మరొక ప్రాంతానికి వలస వెళ్ళినపుడు వారు క్రమంగా వలస ప్రాంతపు ఆచార వ్యవహారాలను, సంస్కృతిని అలవర్చుకుంటారు. కాలక్రమంగా వారు తమ అసలు సంస్కృతిని పూర్తిగా పోగొట్టుకొని వలస ప్రాంతపు సంస్కృతిని హృద్గంతం చేసుకొనే ప్రక్రియను మానవ శాస్త్రవేత్తలు సంస్కృతీకరణ అంటారు.

**సంస్కృతీకరణకు దోహదపడే పరిస్థితులు :**

సంస్కృతీకరణకు క్రింది పరిస్థితులు తోడ్పడుతాయి.

1. సొంత సంస్కృతి కంటే ప్రభావి వర్గపు సంస్కృతి సంపన్నమై, ఉన్నతస్థాయిలో వుండవలెను.
2. ప్రజలకు పర సంస్కృతిమీద గౌరవభావము వుండవలెను.
3. తమ సొంత సంస్కృతి పరిరక్షణ గురించి అంతగా పట్టుదల లేకుండా వుండవలెను.

4. పర సంస్కృతిని గురించి భయాందోళనలు ఉండకూడదు.

5. రెండు సంస్కృతుల మధ్య సంబంధాలు చాలాకాలం వుండవలెను.

6. తమ సంస్కృతిలో వివిధ అంశాలలో సమైఖ్యత అంతగా లేకుండా వుండవలెను.

పర సంస్కృతిలోని ఔన్నత్యాన్ని, గౌరవ ప్రతిష్టలను, ప్రయోజకత్వాన్ని గుర్తించినపుడు ప్రజలు దానిని ఇష్ట పూర్వకంగా స్వీకరించవచ్చును. ఈనాడు పాశ్చాత్య నాగరికత సంస్కృతులు ప్రపంచంలోని ఇతర సమాజాలలో విస్తరిస్తున్నాయి. సంస్కృతీకరణ ప్రారంభ దశలో కొన్ని సమస్యలు ఎదురౌతుంటాయి. సాధారణంగా వలస పోయిన కుటుంబాలు, వ్యక్తులు, కొత్త సామాజిక పరిస్థితులకు సరిగా సర్దుబాటు చేసుకోలేక ఇబ్బందులను ఎదుర్కొంటూ వుంటారు. తమ సొంత సంస్కృతిని వదులుకోలేక, కొత్త సంస్కృతిని అలవర్చుకోలేక రెంటి మధ్య సతమయ్యే వారిని "ఉపాంత వ్యక్తులు" అంటారు.

### 6.12.2 సాంస్కృతిక పునర్జీవనము (Cultural Revival)

ప్రభావిసమూహం తమ సంస్కృతిని విధేయ సమూహం మీద రుద్దినపుడు ప్రభావి సమూహపు సంస్కృతి ప్రాబల్యం వల్ల తమ సంస్కృతి నశిస్తుందని భయం సందేహాలు, విధేయ సమూహాలలో కలిగినపుడు ప్రజల సామాజిక పరివర్తనను తీవ్రంగా ప్రతిఘటిస్తారు. తమ సంస్కృతిని పునర్జీవింపజేసి, సంస్కరించి, ఉద్ధరించడానికి సంబంధించిన ఉద్యమాలను కొనసాగిస్తారు. ప్రతి సమాజంలోనూ ప్రజలమీద కొత్త సంస్కృతిని బలవంతంగా రుద్దినపుడు తిరుగుబాటు, సాంస్కృతిక పునర్జీవన ఉద్యమాలు చెలరేగడం సాధారణంగా జరుగుతుంది.

### 6.12.3 సాంస్కృతిక అనుసరణ (Cultural Adaptation)

కొన్ని సందర్భాలలో రెండు విభిన్న సంస్కృతుల మధ్య పరస్పర చర్యల ఫలితంగా ఒక సమూహం ప్రజలు రెండో సమూహపు సంస్కృతిలోని అంశాలన్నింటిని యధాతదంగా తీసుకోకుండా, కొన్నింటిని మాత్రమే స్వీకరించవచ్చును. ప్రయోజనకరమైన సాంస్కృతికాంశాలను మాత్రమే గ్రహించి తమ సంస్కృతికి అనుకూలంగా వుండే విధంగా మార్చుకోవచ్చును. ఇది ఒక సామాజికమైన సాంస్కృతిక ప్రక్రియ. జపాన్, ఆధునిక పాశ్చాత్య నాగరికతలోని అంశాలను అనుకూలంగా అనుసరణ చేసుకొని సాంకేతిక, ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాలలో శీఘ్రగతిన పురోగమనం సాధించింది. కాని దాని సాంస్కృతిక అంశాలను పెద్దగా పరివర్తన చెందలేదు. ఇట్లా అనుసరణీయ పరివర్తన వల్ల రెండు సంస్కృతుల సమ్మేళన మేర్పడుతుంది.

### 6.12.4 సర్దుబాటు,సాంస్కృతిక బాహుళ్యము (Accommodation and Cultural Pluralism)

విభిన్న సామాజిక, సాంస్కృతిక సమూహాలు వున్న సమాజంలో ఆ సమూహాల మధ్య ప్రకర్షణలు, సంఘర్షణలు తలెత్తవచ్చును. ఈ పరిస్థితులు ఒకప్పుడు స్వవర్గ వాదాలు (ethnocentrism)గా బయలుదేరి కలహాలకు కూడా దారితీయవచ్చును. కాని సరియైన విద్యావ్యాప్తి వల్ల కొన్ని సమాజాలలో సమూహాల మధ్య సరియైన అవగాహన, సహనము, సుహృద్భావము, పరస్పర గౌరవ మర్యాదలు పెరిగి సర్దుబాటు జరుగవచ్చును. దీనికోసం ప్రత్యేకంగా చట్టాలు, శాసనాలు రూపొందవచ్చును. సమాజాలలో భిన్న సంస్కృతి సమూహాలు సమానమైన అంతస్తు, ప్రతిపత్తి కలిగి సహజీవనం చేయవచ్చును. ఇట్లాంటి పరిస్థితిని సాంస్కృతిక బాహుళ్యమని అంటారు. భారత సమాజం దీనికి చక్కటి ఉదాహరణ. అట్లాగే స్విట్జర్లాండ్‌లో ఫ్రెంచ్, జర్మన్, ఇటాలియన్, స్విస్ వారికి సమానమైన అంతస్తు వున్నది.

### 6.12.5 విలీనీకరణము (Assimilation)

విభిన్న సంస్కృతి సమూహాలు చాలాకాలంగా ఒకే ప్రాంతంలో కలిసి జీవించడం మూలంగా వారి మధ్య సత్సంబంధాలు అభివృద్ధి చెంది సామాజిక, సంస్కృతికాంశాల ఆదాన ప్రదానాలు అధికంగా జరిగి సామాజిక, సాంస్కృతిక అంశాల సమ్మేళనమేర్పడవచ్చును. వాటి సాంస్కృతికాంశాల విభేదాలు అదృశ్యమై ఏక రూపమైన సామాజిక, సాంస్కృతిక వ్యవస్థ రూపొందవచ్చును. ఇట్లాంటి ప్రక్రియనే "విలీనీకరణము" (Assimilation) అని అంటారు.

### 6.12.6 సాంస్కృతిక విలంబన (Cultural lag)

సాంస్కృతిక విలంబన అనే భావనను మొట్టమొదటిసారిగా డబ్లు.ఎఫ్.అగ్బర్న్ (W.f.Ogburn) అనే ప్రఖ్యాత సమాజ శాస్త్రవేత్త ప్రవేశ పెట్టినాడు. ఈయన సంస్కృతిని రెండు అంశాలుగా విభజించినాడు. అవి (1) భౌతిక సంస్కృతి (Material Culture) (2) అభౌతిక సంస్కృతి (Non-material Culture) సంస్కృతిలోని ఈ రెండు అంశాలు పరస్పర సంబంధాన్ని కలిగి ఒకదానిపై మరొకటి ఆధారపడి వుంటాయి. భౌతిక, అభౌతిక సంస్కృతులు ఒకదానిపై మరొకటి ఆధారపడినప్పటికి ఈ రెండు ఒకే విధంగా అభివృద్ధి చెందవు. భౌతిక సంస్కృతి వేగంగా మార్పు చెందుతూ వుండగా అభౌతిక సంస్కృతి మాత్రం కొంచెం నెమ్మదిగా మారుతూవుంటుంది. భౌతిక సంస్కృతి అదే రీతిలో మార్పు చెందక కొంత వెనుకబడి వుండటం జరుగుతుంది. కనుక భౌతిక, అభౌతిక సంస్కృతుల మార్పులలో ఏర్పడ్డతేడాను "సాంస్కృతిక విబంబన" (Cultural Lag) అని అంటారు

## 6.13 సారాంశము

ఇట్లా విలువలు, ధృక్పథాలు, తాత్త్విక సిద్ధాంతాలు, నవ్యచాలనాలు, మతవిశ్వాసాలు, కళలు, సాహిత్యం, సాంస్కృతిక ఆదాన ప్రదానాలు మొదలైనవి సామాజిక పరివర్తనకు కారణమవుతున్నాయి. ఒకకారకం లేదా అంశాలలో మార్పు వస్తే మిగిలిన వాటిలో కూడా మార్పు సంభవిస్తుంది. కనుక సామాజిక పరివర్తన కేవలం ఒకే కారకం లేదా అంశాల వల్లగాక అనేక కారకాలు లేదా అంశాల ప్రభావం వల్ల ఏర్పడుతుందని గ్రహించవచ్చును.

## 6.14 ప్రశ్నల నమూనా

ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో సమాధానాలు వ్రాయుము.

1. సంస్కృతిని నిర్వచించి సామాజిక పరివర్తనలో సాంస్కృతికాంశాల పాత్రను వివరింపుము.
2. సాంస్కృతిక ఆధాన ప్రధానాలను గూర్చి ఒక వ్యాసం వ్రాయండి.
3. విభిన్న సంస్కృతిగల సమూహాల మధ్య పరస్పర చర్యల వల్ల ఎలాంటి సామాజిక ప్రక్రియలు ఏర్పడతాయో వివరించండి.

ఈ క్రింది ప్రశ్నలకు 20 పంక్తులలో సమాధానాలు వ్రాయండి.

1. సాంస్కృతిక పునర్జీవనము అనగా నేమి.
2. సాంస్కృతిక విలంబన అనగానేమో తెలపండీ.
3. సంస్కృతీకరణ అనగానేమి? సంస్కృతీకరణకు దోహదపడే పరిస్థితులేవి?

ఈ క్రింది ప్రశ్నలకు 5 పంక్తులకు మించకుండా సమాధానాలు వ్రాయండి.

1. సంస్కృతి - నిర్దేశిక పాత్ర.
2. నవ్యచాలనాలు
3. విలీనీకరణము
4. సర్దుబాటు - సాంస్కృతిక బాహుళ్యము.

## 6.15 చదువదగిన పుస్తకాలు


| | |
|---|---|
| తెలుగు అకాడమి | సమాజము, నిర్మితి - పరివర్తన |
| తెలుగు అకాడమి | సమాజము, పరివర్తన - ప్రణాళికలు |
| తెలుగు అకాడమి | సమాజశాస్త్రం - పరిచయము |
| Kuppuswamy | Social Change in India |

పాఠం - 7

# సామాజిక ప్రణాళిక - సామాజికాభివృద్ధి - అర్థవివరణ, సూత్రాలు

## 7.0 లక్ష్యం

సామాజిక ప్రణాళిక మరియు సామాజికాభివృద్ధి వాటికి సంబంధించిన అంశాల గురించి తెలుసుకోవటమే ప్రస్తుత పాఠం యొక్క ప్రధానలక్ష్యం

విషయసూచిక


7.1 పరిచయం
7.2 ప్రణాళికా భావన
7.3 సామాజిక ప్రణాళిక - నిర్వచనం
7.4 సామాజికాభివృద్ధి - నిర్వచనం
7.5 సామాజిక ప్రణాళిక - లక్ష్యాలు
7.6 ప్రణాళికలు - రకాలు
7.7 సామాజికాభివృద్ధి - సామాజిక ప్రణాళికలు
7.8 ప్రణాళిక ఒక ప్రక్రియ
7.9 ప్రణాళిక రంగాలు
7.10 సారాంశం
7.11 నూతన పదజాలము
7.12 లక్ష్యం
7.13 పరిచయం
7.14 సామాజిక ప్రణాళిక యొక్క సూత్రాలు
7.15 సారాంశము
7.16 ముఖ్య పదాలు
7.17 నమూనా ప్రశ్నలు
7.18 చదువదగిన గ్రంథాలు


## 7.1 పరిచయం

మానవుడు సంఘజీవి. తాను సమాజంలో చక్కని జీవితాన్ని గడపాలనుకుంటాడు. తనతోపాటు ఇతరుల కూడ అభివృద్ధి చెందాలనుకుంటాడు. దానిని సాధించటానికి అనువైన ప్రణాళికల్ని రూపొందించుకుంటాడు. సామాజికాభివృద్ధికి తనవంతు కర్తవ్యాన్ని నిర్వరిస్తూంటాడు. వ్యక్తి ప్రగతిని సాధిస్తే కుటుంబ అభివృద్ధి చెందుతుంది. కుటుంబాభివృద్ధి ద్వారా సామాజాభివృద్ధి కలుగుతుంది. మానవుడు భవిష్యత్ కోసం ప్రణాళికల్ని ఏర్పరించి సమాజంలో అనేక మార్పులకి కారణమవుతున్నాడు. తద్వారా తాను ప్రగతిని సాధించడమే కాకుండా సామాజికాభివృద్ధికి దోహదపడుతున్నాడు.

## 7.2 ప్రణాళిక భావన

'ప్రణాళిక' అనే పదాన్ని నేడు విశ్వవ్యాప్తంగా విస్తృతంగా ఉపయోగిస్తున్నారు. ప్రణాళిక అనేది కొత్త భావన కానేకాదు. అయితే సామాజిక జీవనాన్ని చక్కగా సవ్యంగా కొనసాగించడానికి ప్రణాళిక నిర్మాణం జరగడం ఆధునికమైన అంశం. సమాజశ్రేయస్సును

దృష్టిలో వుంచుకొని కొన్ని లక్ష్యాలను ఏర్పరుచుకొని వాటిని సాధించటానికి కొన్ని నిర్ణీత సూత్రాల ఆధారంగా ముందుకు సాగిపోవటమే ప్రణాళికగా చెప్పవచ్చు. ప్రణాళిక భావన ప్రాచీన నాగరికతలోనే వుంది. అనాడే గృహ నిర్మాణం మొదలగుని వాణిజ్య వ్యాపారాది రంగాల వరకు ప్రణాళికలను ఏర్పరచుకొనేవారు. యుద్ధతంత్రాలలో సైతం ప్రణాళికలుండటాన్ని గమనించవచ్చు. ప్రాచీన నాగరికతకు ప్రతిబింబాలుగా ఉన్న హరప్పా, మొహంజదారో పట్టణాలు ప్రణాళికబద్ధంగా నిర్మించినట్లు పురావస్తు తవ్వకాలలో లభించిన ఆధారాల వల్ల తెలుస్తుంది.

ఇరవయవ శతాబ్ది ప్రారంభంలోని ప్రముఖ ఉద్యమాలలో ప్రధానమైనది ప్రణాళికా ఉద్యమము. ప్రణాళికకు సంస్కరణకు వివిధ విషయాలలో వ్యత్యాసాలున్నాయి. సంస్కరణ అనేది సంఘంలో ప్రబలంగా ఉన్న అవాంఛనీయమైన సామాజిక పరిస్థితులను నిర్మూలించి, వాటిని సవరించడానికి లేదా చక్కదిద్దడానికి మాత్రమే ప్రయత్నంచేస్తుంది. ప్రణాళికా ఉద్యమం అవాంఛనీయ పరిస్థితులను సరిదిద్దుతూ ఇకపై అట్లాంటివి తలెత్తకుండా చూస్తూ, మొత్తం సామాజికాభివృద్ధికి నిర్మాణాత్మకమైన కృషి సాగిస్తుంది. మానవుని భావి జీవితాన్ని సుఖమయం, సంతోషమయం చేయడమే ప్రణాళికల ప్రధానధ్యేయం.

## 7.3 సామాజిక ప్రణాళిక - నిర్వచనం

బెస్సీ ఎ. మెక్లీనాచన్ (Bessie A Mecleanachan) తన గ్రంథం సామాజిక ప్రణాళిక (Social Planning) లో సామాజిక ప్రణాళికను ఈ విధంగా నిర్వచించాడు.

"ప్రజల సామాజిక జీవన విధానాన్ని, సామాజిక సంస్థలను, సామాజిక కార్యకలాపాలను ప్రభావితం చేస్తూ, సమాజంలో నూతన అవకాశాలను సృష్టించడం ద్వారా గాని, ప్రస్తుతమున్న అవకాశాలను నియంత్రించడం ద్వారాగాని మానవుల వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దటానికి ఉద్దేశించినది.

సామాజిక ప్రణాళికలు ప్రధానంగా ప్రజా సంక్షేమ కార్యకలాపాలకు సంబంధించినవి. వేగంగా మార్పు చెందుతున్న సామాజిక, సాంస్కృతిక పరిస్థితులను, సామాజిక వనరులను, ప్రణాళికల పట్ల ప్రజాభిప్రాయాన్ని పరిగణనల్లోకి తీసుకొని సామాజిక ప్రణాళికల రూపకల్పన జరుగుతుంది. సమాజంలో వివిధ విభిన్న వర్గాలకు చెందిన వ్యక్తుల మధ్య, విభిన్న వ్యవస్థల మధ్య మానవుడు నివసిస్తున్నప్పుడు అతడు అనేక సామాజిక పరిస్థితుల ప్రభావానికి లోనవుతాడు. ఫలితంగా అతని వ్యక్తిత్వంలో ఎన్నో మార్పులు కలుగుతాయి. మానవుని నైయక్తిక ప్రవర్తనను సమిష్టి ప్రవర్తనగా సామాజిక పరిస్థితులు మార్చి వేస్తాయి. ఇట్లాంటి సమిష్టి ప్రవర్తనను వ్యక్తిత్వ ధోరణలను దృష్టిలో ఉంచుకొని సామాజిక ప్రణాళికలను రూపొందించడం జరుగుతుంది. ఉదహరణకు భారతదేశంలోని విభిన్న సముదాయాలు, వాటి జనాభా, సమస్యలు నాయకత్వం, సామాజిక రీతులు, సామాజిక పరివర్తన ధోరణలను దృష్టిలో పెట్టుకొని సామాజిక ప్రణాళికలను రూపొందించాలి.

ప్రణాళికా కార్యక్రమాలు ఫలప్రదం కావాటానికి పటిష్టమైన యంత్రాగం చాలా అవసరం. ఎందుచేతనంటే స్వార్థపరులైన అభివృద్ధి నిరోధకులు అడుగడుగునా అంతరాయాలను కల్పిస్తారు. అధిక సంఖ్యాకులైన సామాన్య ప్రజలకు ప్రణాళికలు ప్రయోజనకరంగా ఉన్నప్పటికి, చాలా కొద్ది మైనారిటి వర్గాల ప్రజలు తమ స్వార్థం కోసం వాటిని తిరస్కరిస్తారు. కాబట్టి కట్టు దిట్టమైన, సుసంఘటితమైన ప్రభుత్వ యంత్రాగాన్ని ఏర్పరచాలి.

## 7.4 సామాజికాభివృద్ధి - నిర్వచనం

అభివృద్ధి విశాలమైన భావన. అభివృద్ధి అంటే సమాజంలో ప్రగతిశీల మార్పురావటం. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత అధికంగా ప్రపంచ దేశాలలో అభివృద్ధి ముఖ్యలక్ష్యంగా ఉంది. ప్రధానంంగా చాలాకాలం వలస దేశాలుగా ఉండి ఏ మాత్రం అభివృద్ధి లేని దేశాలలో ఇది ప్రధాన ధ్యేయంగా ఉంది. అభివృద్ధి అనే భావన కేంద్రీకృతంగానో లేక సమన్వయ పూర్వకంగానో లభ్యమయ్యే వనరుల వినియోగానికి పై దృష్టి నిలువుతుంది. అభివృద్ధి అనేది ప్రణాళిక పరంగా నిర్దిష్టమైన లక్ష్యాల ద్వారా సాధించవచ్చు.

ప్రగతి, పరిణామం అనే పదాల మధ్య వుండేదే సామాజిక అభివృద్ధి. ఆర్థిక, ఆర్థికేతర అంశాలలో వాంఛనీయమైన, అభివృద్ధికరమైన మార్పులొస్తే సామాజికాభివృద్ధి జరుగుతుంది. సమాజంలో అన్ని వర్గాల వారు తమ సృజనాత్మక శక్తులను ఉపయోగించుకొని తమ కోర్కెలు, అవసరాలు తీర్చుకొనే స్థితి సమాజంలో ఉన్నప్పుడు అభివృద్ధికరమైన పరిస్థితి నెలకొంటుంది.

సమాజంలోని వివిధ రంగాలలో ప్రయత్న పూర్వకంగా, ఊర్ధ్వాభిముఖంగా కలుగుతుండే పరివర్తనను సామాజికాభివృద్ధి అని చెప్పవచ్చు.

యల్.టి. హబ్ హుజ్ (L.T. Hobhouse) సామాజికాభివృద్ధిని తన గ్రంథం సోషల్ డెవలప్‌మెంట్ (Social Development) లో ఇలా నిర్వచించాడు.

1 పరిమాణము (Scale) 2 సమర్థత (Ehiaiology) 3 స్వాతంత్ర్యం (Freedom) 4 పరిస్పర సేవ (Mutuality of Service) అనే విషయాలలో ముందడగు వేయడం ద్వారా సముదాయం అభివృద్ధి చెందుతుంది.

**హబ్ హుజ్ దృష్టిలో**

1. పరిమాణమంటే - జనాభా సంఖ్య
2. సమర్థత అంటే - ఒక లక్ష్యాన్ని సాధించటానికిగాను అవసరమైన ప్రకార్యాల విభజన జరిగి వాటిని వేర్వేరుగా వ్యక్తులకు, సమూహాలకు పురమాయించి వారి మధ్య సరియైన సమన్వయాన్ని ఏర్పరచడం.
3. స్వాతంత్ర్యం అంటే - సముదాయంలో వ్యక్తుల ఆలోచనకు, నడవడికి, చొరవకు సరియైన అవకాశాలుండటం.
4. పరస్పర సేవఅంటే - ప్రతి వ్యక్తి సేవా కార్యక్రమాలలో పాల్గొనడం.

పైన వివరించిన రంగాలలో సమాజం ముందడగు వేస్తుండే దానిని సామాజికాభివృద్ధి అని చెప్పవచ్చు. అయితే అన్ని సమాజాలలోను అన్ని విషయాలలో ఏకరూపంగా అభివృద్ధి జరగకపోవచ్చు. కొన్ని సమాజాలు పరిమాణంలో ముందుంటే మరి కొన్ని సమాజాలలో స్వాతంత్ర్యం పరస్పర సేవలలో ముందంజ వేస్తాయి. కొన్నింటిలో సమర్థత ఉంటుంది. స్వాతంత్ర్యం ఉండదు. స్వాతంత్ర్యం ప్రభావిత వర్గాలకే పరిమితమై ఉండవచ్చు. ఏ సమాజంలో అయితే సమర్థత, స్వాతంత్ర్యం, పరస్పర సేవా కార్యక్రమాలు, అన్ని వర్గాల వారికి అందుబాటులో ఉండి, సమాజంలో అన్ని రంగాలలో సమగ్రమైన అభివృద్ధి జరిగినప్పుడు మాత్రమే దానిని సామాజికాభివృద్ధిగా చెప్పవచ్చు.

## 7.5 సామాజిక ప్రణాళిక - లక్ష్యాలు

ప్రజల భౌతిక, మానసిక అవసరాలను తీర్చడమే సామాజిక ప్రణాళికల ప్రధాన ఉద్దేశం క్రింద పేర్కొన్న వాటిని కూడ సామాజిక ప్రణాళికల ముఖ్య లక్ష్యాలుగా చెప్పవచ్చు.

(ఎ) ఉండటానికి గృహవసతిని కల్పించడం.

(బి) శ్రామిక ప్రజలకు విశ్రాంతిని, వినోదాన్ని కలిగించటం.

(సి) విశ్రాంతి సమయాలలో ఆట పాటల వంటి వినోద, వికాస కార్యక్రమాలను ఏర్పాటు చేయటం.

(డి) ప్రజలలో శాస్త్రీయ దృక్పథాన్ని కలుగజేయడం.

(ఇ) నేరాలను, బాల నేరాలను పూర్తిగా రూపుమాపటం.

(ఎఫ్) లలితకళల్ని ప్రోత్సహించి అభివృద్ధి చేయడం.

## 7.6 ప్రణాళికలు - రకాలు

ఒక నిర్ణీతమైన సముదాయానికి, లేదా ప్రాంతానికో లేదా మొత్తం దేశానికో ప్రణాళికలను రూపొందిస్తారు. స్పష్టంగా చెప్పాలంటే పట్టణాలు, నగరాల అభివృద్ధి ప్రణాళికలు, రాష్ట్ర, ప్రాంతీయ ప్రణాళికలు మరియు జాతీయ ప్రణాళికలు సాధారణంగా పట్టణం నుండి జాతీయ ప్రణాళికల వరకు పరిగణనలోనికి తీసుకుంటే ప్రణాళికలను రెండు విధాలుగా విభజించవచ్చు.

(ఎ) స్వల్పకాలిక ప్రణాళికలు - తక్కువ ఖర్చుతో, తక్కువ కాలంలో సమాజాభివృద్ధి కార్యకలాపాలను అనుకొన్న లక్ష్యాల్ని సాధించటం.

(బి) దీర్ఘకాలిక ప్రణాళికలు - ఎక్కువ పెట్టుబడితో ఎక్కువ కాలంలో సమాజాభివృద్ధి కార్యక్రమాలను అంచెలంచలుగా నెరవేర్చడం. ఉదా: భారతదేశంలోని పంచవర్ష ప్రణాళికలు.

## 7.7 సామాజికాభివృద్ధి - సామాజిక ప్రణాళికలు

ప్రణాళికలు సమాజాభివృద్ధికి కోసం రూపొందించబడినది. ప్రణాళికలు ప్రభుత్వపరంగా కాని సహకార సంస్థల ద్వారాగాని అల్పాదాయ వర్గాల వారికి అవసరమైన జీవనస్థాయిని కల్పించడమనే సూక్ష్మ దృష్టిలోకూడిన భావన. ప్రణాళికల ప్రధానోద్దేశం సమాజంలో సామాజిక, ఆర్థిక ప్రగతికి దోహదపడే సామాజిక నిర్మితులను, విలువలను, సామాజికావసరాలను ఉద్దేశాలను అమలు పరచటమే. దీనినే సామాజికాభివృద్ధి భావన అని చెప్పవచ్చు.

## 7.8 ప్రణాళిక ఒక ప్రక్రియ (Planning as a Process)

ప్రణాళికలను ఒక ప్రక్రియగా భావించవచ్చు. ప్రణాళిక ప్రక్రియలో అనేక దశలంటాయి. వీటినన్నింటికి కింది ప్రధాన విభాగాగా విభజించవచ్చు.

(ఎ) ప్రణాళికరచన

(1) సాధించదల్చుకొన్న లక్ష్యాలను నిర్ణయించుకోవటం

(2) ప్రత్నామ్నాయ విధానాలను పరిశీలించటం

(3) సరియైన వాటిని ఎన్నుకోవటం

(4) ఎన్నుకొన్న లక్ష్యాలను అనుగుణంగా సామాజిక పరిస్థితులలో మార్పు కలిగించడం.

వీటికన్నింటికి సంబంధించి పథకాలను రూపొందించడం మొదలగునవి.

(బి) ప్రణాళిక కార్యక్రమ నిర్వహణ

(1) సంస్థల మధ్య, సమూహాల మధ్య ప్రణాళిక లక్ష్యాలను సాధించడంతో సమన్వయం సాధించటం చాలా అవసరం.

(2) ప్రణాళిక విధానాలకు ప్రజలతోట్పాటు చాలా ముఖ్యం.

(3) ప్రణాళికకు అవసరమైన సిబ్బంది, వనరులు, తదితర సామాగ్రిని సమకూర్చడం అవసరం.

## 7.9 ప్రణాళిక రంగాలు (Fields of Planning)

సమాజంలో ప్రణాళికలను మూడు వర్గాలుగా వర్గీకరించవచ్చు.

(ఎ) భౌతిక ప్రణాళికలు (Physical Plans)

(బి) ఆర్థిక ప్రణాళికలు (Economic Plans)

(సి) సామాజిక ప్రణాళికలు (Social Plans)

(ఏ) భౌతిక ప్రణాళికలు - ఒక పట్టణ ప్రాంతంలోని భౌతిక పరిసరాలను లేదా నగర, పారిశ్రామిక ప్రాంతాలలోని భౌతిక పరిసరాలను అభివృద్ధి చేయటానికి నిర్దేశించిన రాష్ట్ర లేదా జాతీయ స్థాయి ప్రణాళికలను భౌతిక ప్రణాళికలుగా చెప్పవచ్చు.

భౌతిక ప్రణాళిక - ప్రధానాంశాలు

(1) సహజ వనరుల పరిరక్షణ - వాటి సక్రమ వినియోగం.

(2) భూసార పరిరక్షణ, వ్యవసాయానికి అనువైన భూములను సద్వినియోగపరచడం.

(3) అడవులను పెంచి కలప పరిశ్రమను అభివృద్ధి చేయటం.

(4) నీటి వనరులను అభివృద్ధి చేయటం

(5) ఖనిజ సంపదను జాగ్రత్తగా కాపాడటం

(6) విద్యుతొత్పత్తిని అధికం చేయడం.

(7) ప్రకృతి పరిరక్షణ

(8) నూతనంగా వినోద విహార సౌకర్యాలను అభివృద్ధి చేయడం.

ఇవన్నీ భౌతిక ప్రణాళికలోని ప్రధానాంశాలు.

(బి) ఆర్థిక ప్రణాళికలు - ఆర్థిక రంగంలోని ప్రణాళికలు కొన్ని సామాజిక లక్ష్యాలను దృష్టిలో ఉంచుకోవాలి. సమాజంలో రోజురోజుకి మారుతున్న సామాజిక పరిస్థితుల దృష్ట్యా నూతన విజ్ఞానాభివృద్ధికి నూతన అవకాశాలు, ఆర్థిక ప్రణాళికలకు మార్గ దర్శకాలై ఉండాలి. ఆర్థిక ప్రణాళికల రూపకల్పన ఉత్పత్తిలు ఉత్పత్తి, సాధనల పంపిణీ వాటి నిర్ణయం సామాజిక లక్ష్యాలకు అనుగుణంగా జరగాలి.

ఆర్థిక ప్రణాళికలు సామాజిక లక్ష్యాలు కింది విధంగా ఉంటాయి.

జాతీయోత్పత్తిని పెంచటం.

జాతీయాదాయాన్ని పెంచి ప్రజల జీవన ప్రమాణాన్ని పెంపొందించటం.

జాతీయాదాయాన్ని ప్రజలందరికి సమంగా పంపిణీ చేయటం

ఉద్యోగ విషయాలలో భద్రత కల్పించటం

పనిగంటల కాలాన్ని తగ్గించటం

పని పరిస్థితులను మెరుగుపరచటం

పైన పేర్కొన్నవి ఆర్థిక ప్రణాళికల సామాజిక లక్ష్యాలుగా చెప్పవచ్చు.

(సి) సామాజిక ప్రణాళికలు - గృహ వసతి, విద్య-వైద్య వినోదం, విశ్రాంతి, వికాసం, సామాజిక సమస్యను పరిష్కరించటం, శాస్త్రాభివృద్ధికి దోహదపడటం, శాస్త్ర విజ్ఞానాన్ని ప్రజలందరికి అందించడం, సాంస్కృతిక అంశాలను మెరుగుపరచి ప్రోత్సహించి సమాజ వికాసానికి దోహదపడటం మున్నగునవి సామాజిక ప్రణాళికలోని ముఖ్యాంశాలు.

## 7.10 సారాంశం

ప్రణాళికలు ఏ రంగానికి చెందినప్పటికి ఆ కార్యక్రమాలు నిర్విఘ్నంగా కొనసాగాలంటే సమాజంలో పటిష్టమైన సామాజిక యంత్రాంగం చాలా అవసరము. అభివృద్ధి నిరోధకులు ప్రణాళికలు విజయవంతం కాకుండా ఆటంకాలు కల్పించకుండ అధికారయంత్రాగం ద్వారా నియంత్రించాలి. సామాజికాభివృద్ధి ప్రణాళికలు తోడ్పడాలి. అయితే ప్రభుత్వానికి ప్రజల మద్దత్తు ఇచ్చిన నాడు ప్రణాళికలు ఏ రంగానికి చెందినవైనా విజయవంతమవుతాయి.

## 7.11 నూతన పదజాలము

1. సామాజిక ప్రణాళికలు
2. సామాజికాభివృద్ధి

# సామాజిక ప్రణాళిక యొక్క సూత్రాలు

## 7.12 లక్ష్యం

సామాజిక ప్రణాళిక యొక్క సూత్రాలను తెలుసుకోవటమే ప్రస్తుత పాఠం యొక్క లక్ష్యం

## 7.13 పరిచయం

సామాజికాభివృద్ధికి సామాజిక ప్రణాళికలు చాలా అవసరం సామాజిక ప్రణాళికగా, సంబంధించి కొన్ని సూత్రాలు ఉన్నాయి.

## 7.14 సామాజిక ప్రణాళిక యొక్క సూత్రాలు

సామాజిక ఉద్యమాలలో అతి ప్రధానమైనది. సామాజిక ప్రణాళిక ఉద్యమము. సామాజిక ప్రణాళికలు మొత్తం సమాజపురోభివృద్ధికి దోహదపడాలి. సమాజంలో వివిధ సమస్యలను పరిష్కరించటానికి రూపొందించిన సాధనాలుగా సామాజిక ప్రణాళికలను గుర్తించవచ్చు కొన్ని ఆచారణాత్మకమైన, నిర్మాణాత్మకమైన సాంకేతికమైన పద్ధతులను అవలంభించి క్లిష్టమైన సామాజిక సమస్యలను చాలా సులువుగా పరిష్కరించడమే కాకుండా సామాజిక పునర్నిర్మాణం చేయవచ్చుననే మౌలిక సూత్రంపై ఆధారపడి సామాజిక ప్రణాళిక రూపకల్పన జరుగుతుంది.

సామాజిక ప్రణాళికలను సామాజిక సిద్ధాంతాలు, సామాజిక పరిశోధనలపై ఆధారపడి రూపొందించడం జరుగుతుంది. సమాజ తీరుతెన్నులను, సామాజిక సమస్యలను సమగ్రంగా సంపూర్ణంగా సరిగా అర్థం చేసుకొన్న తర్వాతే సామాజిక ప్రణాళికలను ఏర్పరచి, వాటిని అమలు జరుపుతారు. దీనితో పాటు సామాజిక మార్పువల్ల తలెత్తె విపత్కర, ప్రమాదకర పర్యవసానాలను కూడా ముందుగానే పసికట్టి వాటిని నిరోధించడం జరుగుతుంది. నేటి సమాజంలో అనూహ్యమైన మార్పులకి సాంకేతిక, వైజ్ఞానికరంగాలలో కలిగిన పురోగతే కారణంగా చెప్పవచ్చు. ఆర్థిక వ్యవస్థ మీద, మతం మీద ఈ మార్పుల ప్రభావం చాలా తీవ్రంగా పడింది. ఈ మార్పులు మానవ సంబంధాలలోని కొన్ని సంక్షోభ పరిస్థితులకూ, అనర్థాలకు దారి తీయ్యటం జరిగింది. అయితే ఇట్లాంటి వాటిని ముందుగానే ఊహించి ప్రణాళికలను రూపొందించి ప్రణాళిక బద్ధమైన సామాజిక పరివర్తనకు దోహదం చేసి ఉన్నట్లయితే మానవ సంబంధాలలో నేడు ఎదుర్కొంటున్న విపత్కర సంక్షోభపరిస్థితులు తలెత్తేవికావు.

## 7.15 సారాంశం

సామాజిక ప్రణాళికలు సామాజికాభివృద్ధికి చాలా ఉపకరిస్తాయి. సామాజిక ప్రణాళికలు కొన్ని సూత్రాలపై ఆధారపడి రూపకల్పన జరుగుతుంది.

## 7.16 ముఖ్య పదాలు

సామాజిక ప్రణాళిక

## 7.17 నమూనా ప్రశ్నలు

1. ప్రణాళిక భావనను వివరించండి.
2. సామాజిక ప్రణాళిను నిర్వచించండి.
3. సామాజికాభివృద్ధి అంటే ఏమిటో తెలపండి.
4. సామాజిక ప్రణాళిక లక్ష్యాలను, రకాలను వివరించండి.
5. ప్రణాళిక ప్రక్రియలో దశలను విశదీకరించండి.
6. ప్రణాళిక రంగాల గురించి వివరించండి.
7. సామాజిక ప్రణాళిక సూత్రాలను విశదీకరింపుము.

## 7.18 చదవదగ్గ గ్రంథాలు

1. Rural Sociology - The Starategy of Change - Hoomies and Beagle
2. Rural Sociology in India - AR Desai
3. Community Organisation and Planning - Arthus Hillman
4. Rural Sociology - The Starategy of Change - Hoomies and Beagle
5. Rural Sociology in India - AR Desai
6. Community Organisation and Planning - Arthus Hillman

పాఠం - 8

# ఆర్థిక ప్రణాళికలో సామాజిక అంశాలు

## 8.0 లక్ష్యం

ఆర్థిక ప్రణాళికలో సామాజిక అంశాలు గురించి తెలుసుకోవటమే ప్రస్తుత పాఠం యొక్క ప్రధానలక్ష్యం.

విషయసూచిక


8.1 పరిచయం

8.2 ఆర్థికాభివృద్ధిలో సామాజిక అంశాలు

8.3 సారాంశము

8.4 లక్ష్యం

8.5 ప్రధాన అవరోధాలు

8.6 సారాంశము

8.7 ముఖ్య పదాలు

8.8 నమూనా ప్రశ్నలు

8.9 చదువదగిన గ్రంథాలు


## 8.1 పరిచయం

సమాజంలో ప్రణాళికల ద్వారా పరివర్తన తీసుకొని రావటానికి అనేక అడ్డంకులు ఉంటాయి. వాటిని అధిగమించాలి. ఈ ఆవాంతరాలు సామాజికంగా లేదా సంస్కృతికం లేదా భౌతికంయైనవికావచ్చు. సమాజంలో పరివర్తన కొందరికి ఆమోదయోగ్యం కాదు. మరికొందరు ప్రస్తుతం ఉన్న స్థితినే కోరుకుంటారు తప్ప దానిని మార్చటానికి సుముఖత చూపించరు. అయితే సామాజికాభివృద్ధి జరగాలంటే ప్రణాళికలు ఫలప్రదం కావాలంటే ఆర్థికాభివృద్ధి జరగాలి. ఆర్థికాభివృద్ధిలో సామాజిక అంశాలు ప్రాముఖ్యత చాలా వుంటుంది.

## 8.2 ఆర్థికాభివృద్ధిలో సామాజిక అంశాలు

### ఆర్థికాభివృద్ధి

ఆర్థిక వ్యవస్థలో నిజమైన జాతీయ ఆదాయాన్ని అంటే వస్తు సేవల రూపంలో ఉండే జాతీయ ఆదాయాన్ని పెరుగుతూ ఉండేటట్లు చేసే ప్రక్రియను ఆర్థికాభివృద్ధి అంటారు.

దేశంలో దీర్ఘకాలంగా వాస్తవ తలసరి ఆదాయం పెరుగుదలను సాధించే ప్రక్రియనే ఆర్థికాభివృద్ధిగా (Gerald M. Mier) భావించాడు.

ప్రపంచ శాంతి ఎంత అవసరమో ఆర్థికాభివృద్ధి అంతే అవసరం. అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఆర్థికాభివృద్ధి లేకుంటే సంఘంలో అశాంతి కలుగుతుంది అలజడులకి అందోళనలకి దారి తీస్తుంది. ఆర్థికాభివృద్ధి అన్ని దేశాలలో జరిగినపుడే మానవ జాతి మనుగడ ఉంటుంది.

సమాజంలో ఆర్థికాభివృద్ధిని సాధించేవి ఆర్థిక ప్రణాళికలు, ఆర్థిక ప్రణాళికలు విజయవంతం కావాలంటే సమాజంలోని భౌతిక, మానసిక, సాంస్కృతిక, సామాజిక రంగాలకు చెందిన అవరోధాలను అధిగమించాలి. ప్రధానంగా సమాజంలోని ప్రజలలో అజ్ఞానం, నిరక్షరాస్యత, వ్యక్తిగత స్వార్థపరత్వం, మూడనమ్మకాలు, సామాజిక జడత, సామాజిక సంస్థలు వివిధ వృత్తుల మద్యపోటీ వంటివి సామాజిక అవరోధాలుగా భావించవచ్చు. వాటిని అధిగమించడానికి అంచెలచెలుగా కృషి జరగాలి. వీటితో పాటు ఆర్థిక ప్రణాళికలకు కొన్ని బాహ్యా పరిస్థితుల కూడా అడ్డంకిగా ఉంటాయి. వీటిలో ముఖ్యమైనవి.

(1) తీవ్రవాద ఉద్యమాలు

(2) ప్రత్యేక సదుపాయలు పొందుతున్న ప్రభావిత వర్గాలు

(3) ప్రణాళికలలో విశ్వాసం లేనివారు.

ప్రణాళికలు జయప్రదం కావాలంటే ప్రజాభిప్రాయం దానికి అనుకూలంగా ఉండాలి. ప్రణాళిక సంఘం ప్రజా సంబంధశాఖ ద్వారా ప్రణాళిక విధానాలను, లక్ష్యాలను, ప్రణాళిక కార్యక్రమాలను ఎప్పటికప్పుడు ప్రజలకి వివరించటానికి ప్రధానకారణం ప్రజాభిప్రాయాన్ని తెలుసుకోవటమే. ఆర్థిక ప్రణాళిక అమలకి కొన్ని సార్లు చట్టాలను రూపొందించవలసి ఉంటుంది. చట్టాల రూపకల్పన అమలులో సైతం అమలులో సైతం ప్రజాభిప్రాయం చాలా అవసరం.

దేశంలో సమస్త వృత్తుల మీద, కుటుంబాల మీద దేశ ఆర్థికాభివృద్ధి ప్రభావం ఉంటుంది. సహజ వనరులను సక్రమంగా సద్వినియోగం చేసుకుంటే తప్ప ఆర్థికాభివృద్ధి జరగదు. కేవలం ప్రజా జీవన ప్రమాణాలను మెరుగుపరచడం ద్వారా లేదా అందమైన భవనాల నిర్మాణం సుందరమైన బాహ్యభౌతిక వాతావరణాన్ని సృష్టించడం మాత్రమే ఆర్థిక ప్రణాళికల లక్ష్యం కాదు. సమాజంలో ప్రధానంగా సామరస్య పూర్వకమైన మానవ సంబంధాలను ఏర్పరచగలిగినప్పుడే వ్యక్తులలో పరస్పర సంఘీభావం, ఐకమత్యం నిస్వార్థజీవనం, సుఖశాంతుల వెల్లి విరుస్తాయి. అప్పుడే సామాజిక, ఆర్థికా ప్రణాళిక లక్ష్యాలు సాధ్యమవుతాయి. ఆకర్షనీయమైన భౌతిక పరిస్థితులకన్న ఆకర్షణీయమైన ఆహ్లాదకరమైన కుటుంబాలు ఉండటం సమాజాభివృద్ధికి చాలా అవసరం.

వివిధ పారిశ్రామిక రంగాలలోనూ, ప్రభుత్వ రంగాలలోనూ, సామాజిక వ్యవస్థలోనూ మానవ సంబంధాలు పెంపొందించాలి. దీనివల్ల మానవత విలువలు పెరిగి ఆర్థికాభివృద్ధి సాధ్యపడుతుంది. ప్రజలలో సహృద్భావనను పెంపొందించాలి. నూతన చైతన్యాన్ని ప్రజలలో కలిగించాలి. వారిలో సామాజాకాభివృద్ధి, సామాజిక, ప్రణాళికలు, సామాజిక పరివర్తన పట్ల ఏదైనా అనుమానాలున్న, అపోహలు నెలకొన్న వెంటనే వాటిని పూర్తిగా తొలిగించాలి. నిజమైన అభివృద్ధి సమాజంలో జరగాడానికి ఇది దోహదపడుతుంది.

సమాజంలో నివసిస్తున్న ప్రజల జీవన విధానాన్ని మెరుగుపరచటమే ఆర్థికాభివృద్ధి ప్రధానలక్ష్యం. ఆర్థికాభివృద్ధి జరిగితే వ్యక్తుల జీవన ప్రమాణాలు పెరుగుతాయి, విద్యావకాశాలు కలుగుతాయి. సంప్రదాయాలలో, విలువలలో పరివర్తన వస్తుంది. ఆరోగ్య పరిస్థితులు మెరుగుపడతాయి. ఇవన్నీ ఆర్థిక ప్రణాళికలకి అవసరమయ్యే సామాజికాంశాలే.

దేశాలలో ఆర్థికాభివృద్ధి జరుగుతున్నంతకాలం ఆయా దేశాల ఉండటానికి గృహవసతి, తినడానికి తిండి కట్టుకోవడానికి బట్ట నీరు, విద్య, వైద్య సముదాయాలు వంటివి లభ్యమవుతూనే ఉంటాయి. అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఉత్పత్తికి ఉపకరించే ఆస్తులు పెరగటం అవసరం. ప్రజలలోని గూఢంగా ఉన్న మేధాశక్తి, తెలివితేటలు వంటివి ఒక రకంగా దేశ ఆర్థికాభివృద్ధికి దోహదపడతాయి.

## 8.3 సారాంశం

ఆర్థిక ప్రణాళికలో సామాజిక అంశాల పాత్ర చాలా ఉంది. ప్రణాళిక రూపకల్పనలో సామాజిక అంశాలను పరిగణనలోకి తీసుకోవడం జరుగుతుంది. ఆర్థికాభివృద్ధికి అనువైన ప్రణాళికలు అవసరం అతిసక్రమంగా సవ్యంగా సమగ్రంగా జరిగినపుడే సమాజాభివృద్ధి కలుగుతుంది. సామాజిక అంశాలను దృష్టిలో పెట్టుకొని ఆర్థిక ప్రణాళికల తయారీ జరిగితే తప్పు సామాజికాభివృద్ధి సాధ్యపడదు.

# సామాజికాభివృద్ధి - ప్రణాళికలు - అవరోధాలు

## 8.4 లక్ష్యం

సామాజికాభివృద్ధిని సాధించాలంటే సమాజంలో స్థిరపడిన విశ్వాసాలు, విలువలు, అలవాట్లు, నిర్మితులు, సామాజిక దృక్పథాలను మార్చవలసి వస్తుంది. అయితే వీటిని మార్చటానికి ప్రజలు సుముఖకంగా ఉండకపోవచ్చు. వారు మార్పును వ్యతిరేకరించటమే కాకుండా

ప్రతి ఘటనకు పూనుకోవచ్చు. ప్రజలు మార్పులను తిరస్కరిస్తే సామాజికాభివృద్ధి జరగకుంటుంది. సామాజికాభివృద్ధి ప్రణాళికలకు అవరోధం కలిగించే అంశాలు చాలా ఉన్నాయి.

## 8.5 ప్రధాన అవరోధాలు

### 8.5.1 నిరక్షరాస్యత

ప్రజలు విజ్ఞాన వంతులైతే తప్ప అభివృద్ధి విలువ తెలియదు. ప్రజల అజ్ఞానం వల్ల సమాజ శ్రేయస్సుకోసమే సామాజికాభివృద్ధి జరిగిన దానిని గుర్తించదు. వెనకబడిన దేశాలలో అధిక శాతం ప్రజలు నిరక్షరాస్యులుగా ఉంటారు. వీరు తామున్న స్థితినే కోరుకుంటారు. బాగుందని భావిస్తారు. బాగుపడాలని కోర్కె ఉన్నప్పటికి తగిన పరిజ్ఞానం లేకపోవటంతో సామాజికాభివృద్ధి అక్కడ జరగకపోవచ్చు. ప్రజల అజ్ఞానమే సామాజికాభివృద్ధికి పెద్ద అవరోధంగా చెప్పవచ్చు. సామాజిక వ్యవస్థలలో, విలువలలో పరివర్తన ప్రజలు విద్యవంతులు కానేదే, వారికి విషయ పరిజ్ఞానం లేనిదే సామాజికాభివృద్ధి సాధ్యపడదు.

### 8.5.2 సామాజికజడత (Social Inertia)

ప్రజల సోమరితనమే సామాజికాభివృద్ధికి ప్రధాన శత్రువు. దీనివల్ల సామాజిక జడత ఏర్పడి స్తబ్దంగా ఉంటుంది. ప్రజలు తామున్న స్థితేమేలను కుంటారు. దానితోనే సంతృప్తి పడతారే తప్పముందుకురారు. అభివృద్ధిలో భాగస్వామ్యులు కారు. వ్యక్తుల సోమరితనం, జడత భౌతిక పరిసరాల ప్రభావం వల్లగాని, సామాజిక విలువల వల్లగాని, సామాజిక అభ్యాసాలవల్ల గాని ఏర్పడవచ్చు. సంప్రదాయ సమాజంలో ప్రజల అంధవిశ్వాసాలు వారిలో జడత కలగడానికి కొంతవరకు దోహదపడతాయి. కర్మసిద్ధాంతం మార్పులేని, రాని కులవ్యవస్థ వంటివి ప్రజలలో చొరవనకు చుఱుకు దనాన్ని కల్పించక వారి ఆశల, ఆకాంక్షల స్థాయిని తగ్గించటంవల్ల సామాజిక జడత ఏర్పడింది. ఫలితం సామాజికాభివృద్ధి మందగించింది. చాలాకాలం నుంచి సమాజాల స్తబ్దంగా ఉండిపోవటానికి కారణంగా నిలిచాయి.

### 8.5.3 సామాజిక అలవాట్లు

సాధారణంగా సమాజంలో వ్యక్తులు ఒక రకమైన జీవితానికి అలవాటు పడిన తర్వాత దానిని వదలు కోవటానికి లేదా మార్చు కోవటానికి ఇష్టపడరు. వ్యక్తులు అలవరచుకొన్నలే అలవాట్లు. వాటిని గుడ్డిగా అనుసరిస్తూ క్రమంక్రమంగా వాటికి బానిసలయి, తమ తరవాత తరం వారికి కూడా అందిస్తున్నారు.

క్రింది ఉదహరణలను గమనిస్తే ప్రజలు వారి అలవాట్లకి ఎలా బానిసలయ్యారు అర్థమవుతుంది.

ప్రజలు పోష్టికాహారాన్ని తీసుకోక అనారోగ్యవంతులమతున్నారు. పోషకవిలువలున్న పదార్థాలను తినకుండ ఉండటం, అంటే అన్నాన్ని పూర్తిగా గంజి వార్చేసితినడం. సారమంతా గంజిలోనే ఉంటుంది. నిస్సారమైన దానిని తిని నీరసంగా ఉంటున్నారు. అదే విధంగా ఆకుకూరలను. ఉడక బెట్టి వార్చి వాడటం. దానిలో కూడా ఆకు కూరల సారమంతా నీటిపాలవుతుంది. పోషకవిలువలన్నీ పోతాయి. తాజాగా, చౌకగా అందుబాటులో ఉన్న పండ్లను తినకపోవటం.

గ్రామీణ ప్రాంతాల కొందరు వైద్య సదుపాయాలున్న, టీకాలు మొదలైనవి లభించిన్న వాటిని తిరస్కరించటం, వినియోగించుకోకుండటం నాటు వైద్యాన్నే ఆశ్రయించటాన్ని గమనించవచ్చు.

వ్యవసాయ రంగంలోను, గృహ పరిశ్రమల రంగంలోను నూతన పద్ధతులు, పరికరాలు అందుబాటులో ఉన్న పాత పద్ధతులను పరికరాలను ఉపయోగిస్తున్నారు. ఫలితంగా తక్కువ దిగుబడిని పొందుతున్నారు. పేదరికంతో బాధపడుతున్నారు.

సామాజిక రీతులను అనుసరించడంలో సనాతన ఆచార వ్యవహారాలనే అవలభించడం వల్ల సామాజికాభివృద్ధికి ప్రణాళికలకు అవరోధాలు కలుగుతున్నారు.

### 8.5.4 సనాతన పరాయణత్వం (Conservatism)

సంప్రదాయక సమాజాలలో ప్రజల మీద, వారు పాటించే సంప్రదాయాలు, ఆచార వ్యవహారాల ప్రభావం అధికంగా ఉంటుంది. వీటికి వ్యతిరేకం నడుచుకొనే ధైర్య సాహసాలు చాలా మందికి ఉండవు. ప్రభుత్వ శాసనాలనైన ఉల్లంఘిస్తారు కానీసం ప్రధాయాలను

మాత్రం వదలు కోవటానికి ప్రజలు ఎంతమాత్రం అంగీకరించరు. తరతరాలుగా, యుగ యుగాలుగా వస్తున్న సంప్రదాయాలు కొన్ని ఉత్తమమైన చాలా సంప్రదాయాలు సామాజాకాభివృద్ధికి ప్రణాళికలను అవరోధాలు. కాలాను గుణంగా సమాజంలో ఎన్నో మార్పులు చోటు చేసుకుంటున్న కొందరు మాత్రం సంప్రదాయలనే గుడ్డిగా అనుసరిస్తూ సామాజాకాభివృద్ధికి అవరోధాన్ని కల్గిస్తున్నారు. వీటికి అనేక ఉదహరణలున్నాయి.

ప్రత్యేకించి గ్రామీణ ప్రాంతాలలో ఆడపిల్లలను సంప్రదాయాల పేరిట బయటికి పంపించటంగాని, బడికి పంపించటం గాని చెయ్యటం లేదు. ఉద్యోగం పురుష లక్షణమంటారేగాని స్త్రీలను ప్రోత్సహించరు. సంప్రదాయాల పేరిట అయిన దానికి, కానిదానికి వివాహాది శుభకార్యాలకు, శార్దకర్మలకు తమ ఆధాయాన్ని మించి ఖర్చుచేసి ఆర్థిక బాధలను అభవిస్తుంటారు. కలరా, అమ్మవారు (చికెన్ ఫాక్స్) వంటి అంటువ్యాధులు ప్రబలినపుడే తగిన వైద్యాన్ని పొందక జంతుబలులు, అమ్మవారికి ఇవ్వటం, గ్రామదేవత ఆగ్రహమే కారణమని భావించడం జరుగుతుంది.

సాధారణంగా సంప్రదాయాలు, సనాతన భావాల ప్రభావం, ప్రాబల్యం పట్టణాలు, నగరాలలో కన్న గ్రామీణ ప్రాంతాలలోను, పురుషులలో కన్న మహిళలలోను, యువతీయువకులలో కన్న వృద్ధులలోను, చదువుకొన్న వారిలోకన్న నిరక్షరాస్యులలోను అధికంగా ఉంటుంది.

**8.5.5 భయ సందేహాలు (Fear and Suspicion)**

సాధారణంగా సమాజంలో నూతన కల్పనలను ప్రవేశపెట్టినపుడు ప్రజలు వాటిని భయ సందేహాలలో చూస్తారు. నూతన పరికరాలు ఎలా ఉంటాయో సరిగా పని చేస్తాయో లేదో? అనే అనుమానంతో వారు వాటిని వినియోగించుకోకుంటారు. పాత పరికరాలకు అలవాటు పడినవాళ్లు కొత్త వాటిని స్వీకరించడానికి ఆచరణలోకి తీసుకోవాటానికి అంతగా ఆసక్తి చూపరు. నూతన భావాలను ప్రవేశపెట్టినపుడు ప్రజలకవి వింతగా ఉంటాయి. వీటివల్ల కొందరికి నష్టం కలగవచ్చు. ఈ వర్గాలవారు ప్రజలలో భయందోళనలను కలిగిస్తారు. కనుక భయ సందేహాలు కూడా సామాజాకభివృద్ధి ప్రణాళికలలను అవరోధాలే. దీనికి అనేక ఉదహరణలున్నాయి.

కుటుంబ నియంత్రణ పద్ధతులకు వ్యతిరేకంగా కొన్ని మత సంస్థలు ప్రజలలలో భయాన్ని కలిగిస్తారు. అదేవిధంగా సోషలిజానికి, లౌకిక విధానానికి వ్యతిరేక ప్రచారం జరుగుతుంది. ఈ విధంగా నూతన భావాలు, పద్ధతులు, పరికరాలు, సమాజాంలో ప్రవేశపెట్టినపుడు ప్రజలలతో భయాందోళనలు సహజమే. భయాందోళనలు అభివృద్ధికి ప్రణాళికలకు అడ్డుగోడలుగా నిలుస్తాయి. భయాందోళనలు ఎప్పటికప్పుడు పరిష్కరించుకొన్నప్పడే ప్రగతి సాధ్యపడుతుంది. సమాజం పురోగతి మార్గాన పయనిస్తుంది.

**8.5.6 సంఘర్షణలు (Conficts)**

భారతదేశం విభిన్న సంప్రదాయాలకు, సంస్కృతులకి నిలయం. వివిధ జాతులు, విభిన్న మతాలు భాషపరభేదాలు దేశంలో ఉన్నాయి. ప్రజలు తమ తమ మతాన్ని జాతిన్ని, కులాన్ని, భాషను గౌరవించుకొన్నట్టి ఇతరులని గౌరవించాలి. వారి మతాన్ని కులాన్ని, జాతిని, బాషను కించపరచుకూడదు. ఆ విధంగా జరిగితేనే భిన్నత్వంతో ఏకత్వం సాధ్యపడుతుంది. సమాజంలో సమైక్యత ఉంటుంది. సంఘర్షణలకతావుండరు. సామాజికి ప్రణాళికల ద్వారా సామాజికాభివృద్ధి జరుగుతుంది. అయితే అప్పడప్పుడు వ్యక్తులు తమలక్ష్యాలను సాధించే విషయంలో మార్గాలను గురించే భిన్న అభిప్రాయాలను వ్యక్తపరుస్తారు. కొందరు తమ అభిప్రాయాలనే విలువ ఇవ్వలంటారు. ఇటువంటి స్థితి, పరిస్థితి వ్యక్తిగత సంఘర్షణ నుండి సమాజ సంఘర్షణలకు కూడా దారి తీస్తుంది. సమాజంలోని ప్రజల దృష్టి ఇటువంటి వాటిపై ఉండిపోవటంతో సామాజాకాభివృద్ధి కార్యక్రమాలపై ఎటువంటి ఆసక్తిని కనపరచడు. ఫలితం సమాజంలో అభివృద్ధి కుంటుపడుతుంది. దీనివల్ల సమాజంలో సంఘర్షణలు కూడా అభివృద్ధికి, ప్రణాళికలకు అవరోధలే అని చెప్పవచ్చు.

**8.5.7 ఆర్థికమైన అసమానతలు**

సామాజికాభివృద్ధి జరగవలెనంటే మొదట ఆర్థికాభివృద్ధి జరగాలి. ఆర్థికాభివృద్ధిని సాధించలేని ఏ దేశం కూడా సమాజపరంగా ప్రగతిని సాధించలేదు. వెనకబడిన దేశాలు ఆర్థిక పుష్టి లేకపోవటంతో అభివృద్ధి చెందిన దేశాల మీద ఆధారపడవలసి వస్తుంది. దీనివల్ల

ఆశించిన మేర సమాజాకాభివృద్ధి జరగటం లేదు. సమాజంలో కొందరు విశేషంగా ధనార్జన చేస్తుంటే మరికొందరూ నిత్య జీవితా వసరాలు తీర్చుకోలేని దౌర్భాగ పరిస్థితతిలో ఉన్నారు. ఆర్థికమైన అసమానతల సమాజంలో ఉన్నంతకాలం అభివృద్ధి అమడ దూరంలో ఉంటుంది. సామాజిక ప్రణాళికకు సమాజ అభివృద్ధికి సమాజంలోని ఆర్థిక ఇబ్బందులు అసమానతలు కూడా అవరోధాలని చెప్పవచ్చు.

8.5.8 గూడుకట్టిన స్వార్థాలు

సమాజంలో పరివర్తనను గూడు కట్టిన స్వార్థాలు మాటిమాటికి ప్రతి ఘటిస్తూ ఉంటాయని, దానివలనే సామాజిక వ్యవస్థ యధావిధంగా ఉండి పోతుందని టాల్కాట్ పార్సన్ తన సోషల్ సిస్టమ్ (ఐళిబిరిబిజి ఐగిరీశిలిళీ) అనే గ్రంథంలో వివరించాడు. కొందరు వ్యక్తులు సమాజంలో అదివరకు ఉన్న సామాజిక పరిస్థితులలో సర్దుబాటు చేసుకొని కొన్ని ప్రయోజనాలను పొందుతుంటారు. ఇట్లాంటి గూడుకట్టిన స్వార్థాలు మీద విజయం సాధించడం ద్వారానే సామాజిక పరివర్తన సాధ్యపడుతుంది. వీరు సామాజికాభివృద్ధికి విరోధులు. వీరు విశిష్ట జనవర్గానికి చెందినవారు. వీరు సాధ్యమైనంత వరకు సామాజిక పరివర్తనను ప్రతిఘటించి నిరోధిస్తారు. వీరిలో కొందరు రాజకీయ పార్టీలలో చేరి సామాజికాభివృద్ధిని ప్రతి ఘటిస్తారు. సామాజిక పరివర్తనను వ్యతిరేకించే ప్రభావిత వర్గాలను కూడా గూడుకట్టిన స్వార్థ పరవర్గాలుగా చెప్పవచ్చు. ఉదహరణకు భూస్వాములు భూసంస్కరణలను అడ్డుకుంటారు. బడా వ్యాపారస్థులు సోషలిస్టు వ్యవస్థను నిరసిస్తారు. బ్యాంకుల జాతీయ కరణను వ్యతిరేకిస్తారు. సామాజికాభివృద్ధికి సంబంధించిన విధాలను ప్రతి ఘటిస్తూ అమలు కాకుండా అడ్డుకుంటారు.

## 8.6 సారాంశం

సామాజికాభివృద్ధి సామాజిక ప్రణాళికలకు ప్రధానంగా నిరక్షరాస్యత, సామాజిక, జడత, సామాజిక అలవాట్లు, సనాతన పరాయణ్యం భయ సందేహాలు, ఆర్థిక అసమానతలు, సంఘర్షణలు గూడుకట్టిన స్వార్థాలు అవరోధాలుగా నిలుస్తాయి. వీటిని తొలగిస్తేనే తప్ప ప్రణాళికలకు అనుగుణంగా సమాజాభివృద్ధి జరగదు.

## 8.7 ముఖ్యపదాలు

నిరక్షరాస్యత

సామాజిక జడత

ఆర్థికాభివృద్ధి

సామాజిక అంశాలు

## 8.8 నమూనా ప్రశ్నలు

1. సామాజికాభివృద్ధి ప్రణాళికలు ఎదురయ్యే అవరోధాలు వివరింపుము?
2. ఆర్థికాభివృద్ధి అంటే ఏమిటో వివరించండి?
3. ఆర్థికాభివృద్ధి ప్రణాళికలలో సామాజిక అంశాల గురించి తెలియజేయండి.

## 8.9 చదవదగిన పుస్తకాలు

The Planning of Change - Warren G Bennis
Community Organisation and Planning - Arthus Hillman
Social Change - Ogurn, W.K.
Social Change - Lapiera R.J
The Planning of Change - Warren G Bennis

పాఠం - 9

# సామాజిక ప్రణాళికలో భావప్రసార పాత్ర, సామాజిక ప్రణాళిక మరియు సామాజిక పరివర్తన, అభిప్రాయ నాయకత్వ పాత్ర

## 9.0 ఉద్దేశ్యాలు, లక్ష్యాలు

సామాజిక పరివర్తనను తీసుకుని రావడంలో సామాజిక ప్రణాళిక యొక్క ప్రాధాన్యతను, సామాజిక ప్రణాళికల రూపకల్పన, అమలులలో భావప్రసారం పాత్రను అధ్యయనం చేయడం ఈ పాఠం ఉద్దేశ్యం. ఈ భాగం చదివిన తర్వాత మీరు సామాజిక ప్రణాళికకు, సామాజిక పరివర్తనకు మధ్యగల సంబంధాన్ని అర్థం చేసుకోగలరు.

- భావ ప్రసారం అంటే ఏమిటో తెలుసుకోగలుగుతారు.
- సామాజిక ప్రణాళికపై భావ ప్రసారాలు, ఏ విధమైన ప్రభావాన్ని చూపుతాయో వివరింపగలుగుతారు.
- సామాజిక పరివర్తన, ప్రణాళికలలో అభిప్రాయ నాయకత్వం పాత్రను అవగాహన చేసుకోగలుగుతారు.

**విషయసూచిక**


**9.1** పరిచయం
**9.2** సామాజిక ప్రణాళికలో భావప్రసార పాత్ర
**9.3** సామాజిక ప్రణాళిక మరియు సామాజిక పరివర్తన
**9.4** సామాజిక ప్రణాళికలో అభిప్రాయ నాయకత్వ పాత్ర
**9.5** సారాంశము
**9.6** నమూనా ప్రశ్నలు
**9.7** చదువదగిన పుస్తకాలు


## 9.1 పరిచయం

సామాజిక ప్రణాళికలు సమాజంలో అంచెలువారీగా అభివృద్ధిని సాధించడానికి కృషి చేస్తాయి. ప్రజల నిర్ణయాలను ఒక పద్ధతిలో నిర్దేశించడంలోనూ, ప్రజల ఆశయాలను, కోరికలను రేకెత్తించడంతో జన సంబంధ భావ ప్రసార సాధనాలు ప్రధాన పాత్ర వహిస్తాయి. భావప్రసార సాధనాలు పరివర్తనను తీసుకొని వచ్చే సాధనోపకరణాలు కూడా. వీటితో బాటుగా సామాజిక ప్రణాళిక ఆధారంగా ఏర్పడే సామాజిక పరివర్తనలో అభిప్రాయ నాయకులు కూడా ప్రాముఖ్యత వహిస్తారు. సామాజిక ప్రణాళికలో భావ ప్రసారాల పాత్రను పరిశీలిద్దాం

## 9.2 సామాజికప్రణాళికలో భావప్రసార పాత్ర

### 9.2.1 భావప్రసారమంటే ఏమిటి?

సమాజం మనుగడకు, సమాజంలోకి వివిధ వ్యక్తుల మధ్య పరస్పర అవగాహనకు భావ ప్రసారం అవసరం. భావ ప్రసారమంటే సామాజిక ఆలోచన విధానానికి చెందిన బాహ్య నిర్మాణం. భావప్రసారాన్ని రాబర్ట్ ఇ. పార్క్ ఈ విధంగా వివరించినాడు. "భావప్రసారం ద్వారానే సమాజం మనుగడ సాగుతూ ఉంటుంది. దీని ద్వారానే వ్యక్తులు ఉమ్మడి అనుభవాలలో పాలు పంచుకొంటూ, ఉమ్మడి జీవితాన్ని సాగిస్తుంటారు. సమాజం మనుగడకు భావప్రసారం ప్రధానమైనది".

ఒకే ప్రదేశంలో చాలాకాలం పాటు నివాసమేర్పరచుకొన్న వారి ఆశయాలలో, దైనందిన సామాజిక కార్యకలాపాలలో, జీవన విధానాలలో చాలావరకు సారూప్యముంటుంది. సమాజంలోని వ్యక్తుల మధ్య సామాజిక సంబంధాలు వారి మధ్య ఉమ్మడిగా గల సామాజిక విలువలమీద ఆధారపడి ఉంటాయి. భావప్రసారం ప్రజలలో ఉమ్మడి ఆశయాలు, ఉమ్మడి దృక్పథాలు ఏర్పడటానకి దారి తీస్తుంది. దీనినే జాన్ డేవీ ఈ విధంగా వర్ణించినాడు.

"పరస్పర భావప్రాసరం ద్వారాను, అవగాహన ద్వారాను, సామాజిక విలువలను ఒక తరం నుంచి తర్వాతి తరం వారికి అందించడం ద్వారాను, సమాజం తన మనుగడను సాగిస్తూ ఉంటుంది. అంతేకాక, సమాజం మనుగడ ప్రధానంగా ఈ పరస్పర భావప్రసారంపై, పరస్పర అవగాహనపై ఆధారపడి ఉన్నదని చెప్పవచ్చు".

### 9.2.2. భావ ప్రసార సాధనలు

సంశ్లిష్టమైన పెద్ద సముదాయాలలో, సమాజాలలో భావప్రసార సాధనాలైన వార్తపత్రికలు, చలన చిత్రాలు, రేడియో, టెలివిజన్, ఇంటర్నెట్ మొదలైనవి కొందరు వ్యక్తులు కోట్లాకొలది ప్రజలలో భావప్రసార సంబంధాలేర్పరచుకోవడానికి ఉపకరిస్తాయి.

భావప్రసార సాధనాలను (1) సాంప్రదాయక ప్రసార సాధనాలు, (2) ఆధునిక సమాచార సాధనాలు - అని రెండు రకాలుగా వర్గీకరించవచ్చు.

సాంప్రదాయక ప్రసార సాధనాలు తరతరాలనుండీ ప్రజలను ప్రభావితం చేస్తున్నవి. నాటకం, జానపదనృత్యం, తోలుబొమ్మలాట, బుర్రకథ, హరికథ, భజనలు, వీధినాటకం, జానపద గీతాలు, గొల్లసుద్దులు, జముకులకథ మొదలయిన సంప్రదాయ ప్రసారసాధనాలు ప్రజలను చైతన్యవంతం చేయడంలో ప్రధాన పాత్ర వహిస్తున్నాయి. భారతదేశంలోని ప్రతి ప్రాంతంలోనూ ఆ ప్రాంతంలో విశేష ప్రచారం, ఆదరణ పొందిన ఒక్కో సాంప్రదాయిక ప్రసార సాధనం కొనసాగుతోంది. జాత్ర (పశ్చిమ బెంగాల్), బుర్రకథ (ఆంధ్రప్రదేశ్), విల్లుపట్టు (తమిళనాడు), తమాష (మహారాష్ట్ర), యక్షగానం (కర్నాటక) మొదలయినవి ఈ సందర్భంలో చెప్పుకోవచ్చు. భారతదేశంలోని సాంప్రదాయిక సమాజాన్ని ఆధునికీకరణ దిశగా మళ్లించడానికి సాంప్రదాయిక ప్రసార సాధనాలు అత్యంత అనువైన ప్రచార సాధనాలు.

వార్తాపత్రికలు, రేడియో, సినిమా, టెలివిజన్, ఇంటర్నెట్ మొదలయిన సాధనాలను ఆధునిక సమాచార సాధనాలుగా పేర్కొనవచ్చు. ఆధునిక భావప్రసార సాధనాల ద్వారా కోట్లాది ప్రజా సమూహాలలో ఒక్కమారుగా ఒకే విధమైన భావ స్పందన కలిగించడానికిఅవకాశమున్నది. కాబట్టి వీటన్నింటినీ సామూహికంగా జన సంబంధ భావప్రసార సాధనాలు (Mass Communication Media) అని పేర్కొన్నారు.

వార్తా పత్రికలు, వాటి సంపాదకీయ వ్యాసాలు, వార్తల విశ్లేషణ, వార్తా ప్రచురణలు, రేడియో వార్తల ద్వారా చర్చాప్రసంగాలు, చలన చిత్రాలు, టెలివిజన్ దృశ్య చిత్రాలు జన సమూహాలలో భావచైతన్యానికి, తద్వారా సామాజిక పరివర్తనకు తోడ్పడతాయి.

### 9.2.3 భావప్రసార సాధనాల పాత్ర

ఒక వ్యక్తి లేదా సమూహం లేదా ఒక సంస్థ యొక్క భావాలను, ఉద్దేశ్యాలను మరొక వ్యక్తి, సమూహం లేదా సంస్థకు తెలియజేసే ప్రకియే భావప్రసారం. ప్రజలందరూ, సామాజిక పరిస్థితులకు, సామాజిక సంఘటనలకు, సామాజిక పరివర్తనకూ ఒకే విధంగా ప్రతిస్పందించాలంటే వారి మధ్య భావప్రసారం, అవగాహన ఉండాలి. భావప్రసారాలు అభివృద్ధి చెందుతున్న కొద్దీ సమాజంలోకి వివిధ సంస్థలు అభివృద్ధి చెందుతూ ఉంటాయి. సామాజిక ప్రణాళిక ద్వారా సమాజంలో అభివృద్ధి సాధించడానికి, సంక్షేమ కార్యక్రమాలను రూపొందించడానికి భావప్రసార సాధనాలు తోడ్పడతాయి.

సర్వసాధారణంగా సామాజిక ప్రణాళికలు ప్రభుత్వపరంగా కొనసాగుతాయి. అయితే ఈ ప్రణాళికలలో అంతర్గతంగా సంఘీభావం, భావప్రసారం ఉన్నప్పుడే ప్రభుత్వం వాటిని అమలు పరచగలుగుతుంది.

ప్రభుత్వం రూపొందించే నియమావళి, చట్టాలు, శాసనాలు, కొనసాగడానికి భావప్రసారం ఒక సాధనంగా పని చేస్తుంది. భావప్రసారసాధనాల ద్వారానే ప్రజలు ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం రూపొందించే ప్రణాళికల లక్ష్యాలను తెలుసుకగలుగుతారు. ప్రజల భాగస్వామ్యం లేకపోతే ఏ సంక్షేమ కార్యక్రమం విజయవంతం కాదు. ఈ కార్యక్రమాలలో ప్రజలు చురుకుగా పాల్గొనేట్లు చేయడానికి భావప్రసార సాధానాలు తోడ్పడతాయి.

ఆధునిక భావాలను, పద్ధతులను వ్యాప్తి చేయడంలో భావ ప్రసార సాధనాలు ప్రధాన పాత్రను వహిస్తాయి. అంతేకాక, ప్రాచీన ఔన్నత్యాన్ని తెలిపే తరతరాల భారతీయ సంస్కృతిని ప్రజలకు అందించడంలో కూడా భావ ప్రాసర సాధనాలు కీలకమైన పాత్రమ నిర్వహిస్తాయి.

సామాజిక జీవితంలో సారూప్యంతోబాటు భిన్నత్వం కూడా మిళితమై ఉంటుంది. ఈ భిన్నత్వంలో ఏకత్వం వల్లనే సమాజంలోని ముఖ్యమైన సమస్యల విషయంలో ప్రజలకు అభిప్రాయ భేదాలున్నప్పటికీ భావప్రసార సాధనాల ద్వారా వారి మధ్య పరస్పర అవగాహన పెంపొందించడానికి వీలు కలుగుతుంది. ఉదాహరణకు, ప్రజారోగ్యము, మతాశిశు సంక్షేమము, ఆరోగ్యము, వ్యవసాయము, నీటిపారుద,యువజన సంక్షేమము మొదలయిన రంగాలలో ప్రణాళికలు విజయవంతంగా కొనసాగడంలో భావప్రసారసాధనాలు ముఖ్యమైవ పాత్ర వహిస్తాయి.

## 9.3 సామాజిక ప్రణాళిక మరియు సామాజిక పరివర్తన

ఏ సమాజంలోనైనా సరే, ప్రజల భౌతిక మానసికావసరాలను సంతృప్తి పరచడమే సామాజిక ప్రణాళికల ప్రధాన లక్ష్యము. నివసించడానికి గృహ వసతి కల్పించడం, విద్యాభివృద్ధికి సదుపాయాలను కల్పించడం, శ్రామిక వర్గాలకు సంక్షేమ పథకాలను అమలు పరచడం, సమాజంలోని అరాచకశక్తులను అణచివేయడం, శాస్త్రవిజ్ఞానాభివృద్ధికి దోహదం చేయడం మొదలయినవి సామాజిక ప్రణాళికలలోని కొన్ని ముఖ్యలక్ష్యాలు.

సామాజిక ప్రణాళికలు ముఖ్యంగా ప్రజాసంక్షేమ కార్యకలాపాలకు సంబంధించినవి. త్వరితగతిన పరివర్తన చెందుతున్న సమాజిక సాంస్కృతిక పరిస్థితులను, సామాజిక వనరులను, ప్రణాళికల పట్ల ప్రజల దృక్పథాన్ని దృష్టిలో ఉంచుకుని సామాజిక ప్రణాళికలను రూపొందించడం జరుగుతుంది.

సామాజిక పరివర్తనకు, సామాజిక ప్రణాళికలకు అవినాభావ సంబంధమున్నదని చెప్పవచ్చు. సామాజిక ప్రణాళికలు సామాజిక సిద్ధాంతాలపై ఆధారపడి రూపొందుతాయి. సామాజికాభివృద్ధి క్రమాన్ని సామాజిక పరివర్తనా సిద్ధాంతాలు తెలియజేస్తాయి. మానవులకు, ప్రకృతిలోని సహజవనరులకు, ప్రజల సంస్కృతికి, భౌగోళిక పరిస్థితులకు మధ్యగల అవినాభావ సంబంధాలను, వ్యక్తి మీద, సంస్కృతి మీద వీటి ప్రభావాన్నీ అవగాహన చేసుకున్నప్పుడే, సమాజ సమగ్రాభివృద్ధికి దోహదం చేయగల సామాజిక ప్రణాళికలను రూపొందించడానికి వీలుపడుతుంది. ప్రస్తుత సమాజాలలోని నిర్దేశిత పరివర్తనను తీసుకొని రావడంలో సామాజిక ప్రణాళికలు ప్రధాన పాత్ర వహిస్తున్నాయి.

సామాజిక ప్రణాళికలు సమాజంలోని యదార్థ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రూపొంధించిన సామాజిక సిద్ధాంతాలు, ఈ ప్రణాళికలు నవ్య సమాజ స్థాపనకు బృహత్ కార్యక్రమాలను రూపొందించడమేకాక దిశానిర్దేశం కూడా చేస్తాయి.

## 9.4 సామాజిక ప్రణాళికలో అభిప్రాయ నాయకత్వ పాత్ర

సమాజంలో మార్పును తీసుకొని రావడంలో అభిప్రాయ నాయకుడు ప్రధాన పాత్ర వహిస్తాడు. ఈనాడు ప్రపంచంలోని వివిధ దేశాలలో విప్లవాత్మకమైన పరివర్తన ఏర్పడటానికి అభిప్రాయ నాయకత్వమే అని సమాజ శాస్త్రవేతలు భావిస్తారు.

ఒక సమాజంలోని ఒక సమస్యపట్ల ప్రజలదృష్టికి కేంద్రీకృతం చేసి, ఆ సమస్య యొక్క చెడు ఫలితాలను ప్రజలకు తెలియజెప్పి, ఆ సమస్యను నిర్మూలించడం ద్వారా సమాజంలో అభివృద్ధిని సాధించగలమనే అభిప్రాయాన్ని, నమ్మకాన్ని కల్గించే నాయకుడిని

అభిప్రాయనాయకుడు లేదా ఉపదేశాత్మక నాయకుడిని (Opinion Leader) అని నిర్వచించవచ్చు. అభిప్రాయ నాయకులు ప్రజలలో చైతన్యం తీసుకొనివస్తారు. అభివృద్ధి కార్యక్రమాల పట్ల ప్రజలలో ఆమోదయోగ్యమైన అభిప్రాయాన్ని కల్గిస్తారు.

సామాజిక ప్రణాళికను సమర్థవంతంగా అమలు జరపడంలో అభిప్రాయ నాయకత్వం కీలకమైన పాత్రను నిర్వహిస్తుంది. సాంప్రదాయక సమాజాలలోని ప్రజలు మార్పును త్వరగా అంగీకరించరు. కొన్ని సందర్భాలలో ప్రతిఘటిస్తారు. ప్రణాళికాబద్ధమైన మార్పును తీసుకునిరావడంలో అభిప్రాయనాయకత్వం పాత్ర చాలా ప్రధానమైనది. సమాజంలో అభివృద్ధిని సాధించవలెనంటే అనేక నూతన కార్యక్రమాలను చేపట్టవలసి ఉంటుంది. ఈ కార్యక్రమాల అమలు ప్రజల భాగస్వామ్యంతో ముడిపడి ఉంటుంది. ఈ కార్యక్రమాల పట్ల ప్రజలకు సదవగాహన ఏర్పడితేనే ప్రజలు ఆయా కార్యక్రమాలలో పాల్గొంటారు. ప్రణాళికబద్ధమైన వివిధ కార్యక్రమాలను, ప్రణాళికల స్వరూప స్వభావాలను, ప్రజలు వాటికి సహకరించవలసిన ఆవశ్యకతను ప్రజలు తెలుసుకునేటట్లు చేయడంలో అభిప్రాయ నాయకుడు ప్రముఖమైన పాత్రను నిర్వహిస్తూ ఉంటాడు.

## 9.5 సారాంశం

సమాజం పరివర్తనశీలమైనది. నేటి సమాజంలో సంక్లిష్టత అధికమవడంతో వివిధ సమస్యలేర్పడుతున్నాయి. ప్రజాసంక్షేమ కార్యక్రమాల్ని రూపొందించడం, వాటిని అమలు పరచడానికి చేసే ప్రయత్నాలనే సామాజిక ప్రణాళిక అంటారు. నిర్దేశిత సామాజిక పరివర్తనకు సామాజిక ప్రణాళికలు మూలాధారాలు. సామాజిక ప్రణాళిక ద్వారా మానవ సమాజంలో అభివృద్ధిని సాధించడానికి, సంక్షేమ కార్యక్రమాలను రూపొందించడానికి భావ ప్రసార సాధనాలు తోడ్పడతాయి. సమాజంలో పరివర్తన తీసుకొని రావడం కోసం ప్రవేశ పెట్టే ప్రణాళికబద్ధమైన అభివృద్ధి కార్యక్రమాల పట్ల ప్రజలలో మానసిక చైతన్యం ఏర్పడేటట్లు చేయడంలో అభిప్రాయ నాయకులు కీలకమైన పాత్రను నిర్వహిస్తారు.

## 9.6 నమూనా ప్రశ్నలు

ఈ క్రింది ప్రశ్నలకు సమాధానములు వ్రాయుము.

1. సామాజిక ప్రణాళికలో భావప్రసార సాధనాల పాత్రను వివరించుము.
2. సామాజిక ప్రణాళికలో అభిప్రాయ నాయకత్వం నిర్వహించే పాత్రను విశ్లేషించి చూపుము.

## 9.7 చదువవదగిన పుస్తకాలు


1. Sir Asthus Salter : "The framework of an ordered society"
2. M. Venkata Rangaiah : "Welfare state and socialist state"
3. ఎం.ఎన్. శ్రీనివాస్ : "ఆధునిక భారతదేశంలో సామాజిక పరివర్తన"

పాఠం - 10

# భారతదేశములో సామాజిక ప్రణాళిక - సముదాయ అభివృద్ధి, పంచాయతీ రాజ్ వ్యవస్థ

## 10.0 లక్ష్యాలు

ఈ పాఠం లక్ష్యాలు - భారతదేశంలో సముదాయాభివృద్ధి పథకాలను గురించి క్షుణ్ణంగా అవగాహన చేసుకోవడం, ఈ పథకాలు అమలులో పంచాయతీరాజ్ వ్యవస్థ పాత్రను పరిశీలించడం.

విషయసూచిక

10.1 పరిచయం
10.2 మారుతున్న గ్రామీణ ప్రపంచం
10.3 సముదాయాభివృద్ధి తొలి ప్రయత్నాలు
10.4 సముదాయాభివృద్ధి, పంచాయతీ రాజ్ వ్యవస్థ
10.5 సారాంశం
10.6 నమూనా ప్రశ్నలు
10.7 చదువదగిన గ్రంథాలు

## 10.1 ఉపోద్ఘాతం

మనదేశంలో 1952వ సంవత్సరము అక్టోబరు రెండవ తేదీన సముదాయాభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. గ్రామీణ ప్రజల ఆర్థిక, సామాజిక జీవనాలలో మార్పు తీసుకొని రావడం కోసం రూపొందించిన పంచవర్ష ప్రణాళికలు అమలు జరపడానికి రూపొందించిన ప్రధాన సాధనమే సాముదాయికాభివృద్ధి కార్యక్రమాలు. దేశంలో సర్వతోముఖాభివృద్ధిని సాధించడమే ఈ కార్యక్రమాలు ప్రధానోద్దేశము. ప్రజాస్వామ్య వికేంద్రీకరణపై ఆధారపడిన పంచాయతీరాజ్ వ్యవస్థ ఈ కార్యక్రమాల అమలులో ప్రధాన పాత్ర వహిస్తుంది.

## 10.2 మారుతున్న గ్రామీణ ప్రపంచం

భారతీయ సామాజిక, సాంస్కృతిక జీవనంలో గ్రామాలు అత్యంత ప్రధానమైనది. భారతీయ గ్రామాలు చైతన్యరహితమైనవి కావు. గ్రామీణ అధ్యయనాలు జరిపిన సమాజ శాస్త్ర పరిశోధకులు బ్రిటీష్ వారి రాక నుంచి గ్రామాలలో వచ్చిన మార్పులపై సుదీర్ఘమైన పరిశోధనలు జరిపినారు. బ్రిటీష్ వారు గ్రామాలను సంఘటిత పరిచి విశాల భారత సమాజంలో సంబంధాలు పెంపొందింపజేసినారు. స్వాతంత్ర్యానంతరం భారత ప్రజా ప్రభుత్వం గ్రామల స్థితిగతులను పెంపొందించడానికి చాలా చట్టాలను రూపొందించింది. గ్రామాలను సమగ్రంగా అభివృద్ధి చేయడానికి గాను సాముదాయికాభివృద్ధి ప్రణాళికలను అమలు జరిపినారు. పంచవర్ష ప్రణాళికల ద్వారా దేశంలోని చిన్న చిన్న గ్రామాలన్నిటిని సంఘటిత పరిచి జాతీయాభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొనేలా చేయడమేగాక ప్రజలకు రాజకీయ అధికారంలో కూడా భాగస్వామ్య కల్పించడం జరిగింది. పంచాయతీ రాజ్ వ్యవస్థ అమలు జరపడంతో అధికారం వికేంద్రీకరణ జరిగి గ్రామ ప్రజలు స్థానిక అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు వేసుకుని అమలు పరిచే అవకాశం కలిగింది. దీని వల్ల దేశ పురోభివృద్ధి సాధించడం కోసం రూపొందించిన సామాజిక ప్రణాళికలను విజయవంతంగా అమలు పరచడానికి అవకాశాలేర్పడినాయి.

## 10.3 సముదాయాభివృద్ధి తొలి ప్రయత్నాలు :

భారతదేశం స్వాతంత్ర్యం సముపార్జించిన నాటికి అన్ని రంగాలలో వెనకబడిన వుంది. నాటి మేధావులంతా ఆర్థిక సుస్థిరత లేని రాజకీయం అర్థరహితమని అభిప్రాయపడి, సామాన్య పౌరుని జీవన స్థితిగతులను మెరుగుపరచి కనీసావసరాలను తీర్చడానికి ప్రభుత్వం

ప్రణాళికలను తయారు చేసి అమలు పరచవలెనని సూచించినారు. దీని పర్యవసానంగా భారత ప్రభుత్వం 1950 మార్చి నెలలో ప్రణాళికా సంఘాన్ని ఏర్పాటు చేసింది. ఏప్రిల్ 1951వ సంవత్సరంలో మొదటి పంచవర్ష ప్రణాళిక అమలులోకి వచ్చింది. గ్రామాలలో ప్రబలంగా ఉన్న దారిద్ర్యము, నిరక్షరాస్యత మొదలైన లోపాలను సరిదిద్ది సామాన్య మానవుని జీవన పరిస్థితులను మెరుగు పరచడానికి మొదటి పంచవర్ష ప్రణాళికలో సాముదాయికాభివృద్ధి కార్యక్రమాలకెంతో ప్రాధాన్యత ఇచ్చినారు. ఈ కార్యక్రమాలను భారత గ్రామీణ స్థితిలో క్రమమైన మార్పు తేవడానికి ఉద్దేశించినారు.

ఇటువంటి కార్యక్రమాలు భారతదేశంలో ప్రారంభించడం ఇదే మొదటిసారి కాదు. 1920 వ సంవత్సరంలో గాంధీజీ ఆధ్వర్యాన సేవాగ్రాం పరిసరాలలోనూ, 1921వ సంవత్సరంలో రవీంద్రనాథ్ ఠాగూర్ ఆధ్వర్యంలో శాంతినికేతన్ పరిసరాలలోను, గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగింది. 1920 వ సంవత్సరంలో ఎఫ్.ఎల్.బ్రెయిన్ ఆధ్వర్యంలో గుర్‌గావ్ ప్రాజెక్టు స్థాపించడం జరిగింది. మద్రాస్ రాష్ట్రంలో 1946వ సంవత్సరంలో ప్రారంభించిన ఫిర్కా అభివృద్ధి కార్యక్రమం కూడా ఈ సందర్భంలో పేర్కొనదగినది. ఈ కార్యక్రమ ముఖ్యోద్దేశం స్థానికంగా లభ్యమయ్యే సాధన సంపత్తులను సద్వినియోగం చేసి గ్రామీణుల పరిస్థితులను మెరుగుపచరడం. 1948 వ సంవత్సరంలో ఆల్బర్ట్ మేయర్ అనే అమెరికన్ పట్టణ ప్రణాళికావేత్త ఆధ్వర్యంలో జాగ్రత్తగా ఎంపిక అయిన అమెరికన్, భారతీయ ఉద్యోగుల సహాయంతో ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని ఎటావా జిల్లాలోని 97 గ్రామాలలో ఈ సాముదాయికాభివృద్ధి కార్యక్రమాల ప్రారంభించినారు. ఈ ప్రాజెక్టులో ఉన్న గ్రామాలలో అన్ని రంగాలలో ఎంతో అభివృద్ధి సాధించడం జరిగింది. ఈ ప్రాజెక్టులో సాధించిన విజయాలు, ఎదుర్కొన్న సమస్యలు భారతదేశ గ్రామీణాభివృద్ధి కార్యక్రమానికి మార్గదర్శకమయినది. "గ్రామ సేవకులు" అనే క్రొత్త పదవిని క్రొత్త పద్ధతిలో గ్రామీణ అవసరాలకు సరిపడే విధంగా రూపొందించినారు. ఇవి భారత్ సాముదాయికాభివృద్ధి కార్యక్రమాలను అమలు పరచడంలో ఎంతో సహాయపడినాయి.

ఎస్.కె.డే. పంజాబులోని నిలోఖేరి గ్రామంలో 6,000 మంది కాందిశీకులకు పరిసర అడవి ప్రాంతంలో పునరావాస సౌకర్యాల నేర్పాటు చేసి, ఆ ప్రాంతమంతా సస్యశ్యామలం గావించినాడు. అదే విధంగా సుధీర్‌ఘోష్ ఢిల్లీ పరిసర ప్రాంతాలలోని ఫరీదాబాద్ గ్రామాన్ని సంఘటిత పరచి స్వయం సమృద్ధమైన పారిశ్రామిక పట్టణంగా రూపొందించినాడు. సాముదాయికాభివృద్ధి తొలి ప్రయత్నాల వల్ల మనకు సరైన పద్ధతులలో గ్రామీణులను సంఘటిత పరచినట్లయితే, వారి సహకారంతో ఎంత అభివృద్ధి సాధించవచ్చునో తెలిపింది.

## 10.4. సముదాయాభివృద్ధి, పంచాయతీ రాజ్ వ్యవస్థ

### 10.4.1 సముదాయాభివృద్ధి భావన

సమాజంలో సర్వతోముఖాభివృద్ధిని సాధించడంలో సమాజ వికాస కార్యక్రమాల పాత్రను ప్రపంచంలోని అభివృద్ధి చెందుతున్న ప్రజాస్వామ్య దేశాలన్నీ గుర్తించినాయి. భారతదేశ ప్రథమ పంచవర్ష ప్రణాళికలో "సాముదాయికాభివృద్ధి" కార్యక్రమాన్ని ఈ విధంగా వివరించడం జరిగింది. "గ్రామీణ ఆర్థిక, సామాజిక రంగాలలో అభివృద్ధికరమైన మార్పును తీసుకొని రావడానికి సాముదాయికాభివృద్ధి కార్యక్రమం ఒక ముఖ్య సాధనము. అది మానవుని సుఖమయ జీవితానికి పునాది వేస్తుంది. సాముదాయికాభివృద్ధి కార్యక్రమాల ప్రధాన లక్ష్యం సమాజంలోని ఆకలి, అనారోగ్యం, అజ్ఞానాలను పారద్రోలి, దేశాన్ని సుభిక్షం చేసి విజ్ఞాన వికాసాలను వెదజల్లడమే".

### 10.4.2 భారతదేశంలో సముదాయాభివృద్ధి పథకాలు

భారతదేశంలో 1952వ సంవత్సర ప్రారంభంలో తొలిసారిగా దేశంలోని 15 ప్రదేశాలలో ప్రాథమిక సముదాయాభివృద్ధి పథకాలను ప్రవేశపెట్టడం జరిగింది. రెండవదశలో అక్టోబరు 2, 1952 న 55 సముదాయాభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించినారు. మూడవదశలో 1956వ సంవత్సరాంతం నాటికి దేశంలోని 1,20,000 గ్రామాలలో నివసిస్తున్న ప్రజలు ఈ సముదాయాభివృద్ధి కార్యక్రమాల ద్వారా లాభం పొందవలెనని ఈ పథకం ఉద్దేశం. సాముదాయికాభివృద్ధి కార్యక్రమాల యొక్క ఆశయాలను రెండు విధాలుగా అమలు పరచవలెనని నిర్ణయించినారు. ఒకటి సమాజ వ్యవస్థాపనా పద్ధతి, రెండు విస్తరణ పద్ధతి. సమాజ వ్యవస్థాపన పద్ధతి అంటే గ్రామాలలో ఉండే ప్రజలలో సాముదాయికాభివృద్ధి కార్యక్రమాలపై ఉత్తేజాన్ని కలిగించి, గ్రామస్థాయిలో ప్రజా ప్రతినిధులతో కూడిన పరిపాలనాంగాలు ఈ కార్యక్రమాల పట్ల శ్రద్ధ చూపేట్లు చేయడం. విస్తరణ పద్ధతి అంటే నాగరిక సమాజంలో అభివృద్ధికి దోహదం చేసే విషయాలను గ్రామ ప్రాంతాలకు విస్తరించడం.

భారతదేశంలోని సాముదాయికాభివృద్ధి కార్యక్రమాల పరిణామంలో మూడు దశలు ప్రధానంగా కనిపిస్తాయి. మొదటి దశను "ప్రభుత్వ యంత్రాంగ దశ (Official Phase) అని పేర్కొన్నారు. ఈ దశలో సాముదాయికాభివృద్ధి కార్యక్రమమంతా ప్రభుత్వ యంత్రాంగం ఆధ్వర్యంలో సాగిపోయింది. అన్ని రంగాలలోను సాముదాయికాభివృద్ధి కార్యక్రమాలను ప్రభుత్వ అధికారులే నిర్వహించినారు. ప్రజలకు ఉద్దేశించిన ఈ కార్యక్రమ నిర్వహణలో ప్రజల పాత్ర ఏ మాత్రం లేకపోవడం వల్ల ఈ మొదటి "ప్రభుత్వ యంత్రాంగదశ" ఎక్కువ కాలం కొనసాగలేదు.

ఆ తర్వాత, సాముదాయికాభివృద్ధి కార్యక్రమాలలో రెండవదశ ప్రారంభమయింది. ఈ దశను 'సలహాసంఘ దశ'గా పేర్కొన్నారు. ఈ దశలో ప్రభుత్వం నామినేట్ చేసిన కొంతమంది సభ్యులు సాముదాయికాభివృద్ధి కార్యక్రమాల నిర్వహణలో ప్రభుత్వ అధికారులకు తోడ్పడుతూ తమకు తోచిన సలహాలను ఇచ్చారు.

ప్రజాస్వామ్య సిద్ధాంతానికి, నామినేషన్ విధానానికి, పొత్తు కుదరదు. కాబట్టి లోపభూయిష్టమైన ఈ రెండవ దశ కూడా త్వరలోనే అంతరించి మూడవదశ ప్రారంభమైంది. ఈ మూడవదశను "ప్రాతినిధ్యదశ" (Representative Phase)గా పేర్కొన్నారు. ఈ దశలో, గ్రామ స్థాయి నుంచి జిల్లాస్థాయివరకు, సాముదాయికాభివృద్ధి కార్యక్రమ నిర్వహణ, అధికారం, అజమాయిషీ అంతా పంచాయతీ వ్యవస్థ హస్తగతమయింది. గ్రామ, బ్లాక్, జిల్లా స్థాయిలో ప్రజా ప్రతినిధులే సముదాయ అభివృద్ధి కార్యక్రమాలను సారథ్యం వహిస్తున్నారు. దీనినే "ప్రజాదశ" అని కూడా అంటారు.

సాముదాయికాభివృద్ధి మూడు ముఖ్యాంశాల మీద ఆధారపడి ఉంది. అవి.

అ. పంచాయతీరాజ్ వ్యవస్థ

ఆ. సహకారి సమాజం

ఇ. స్వచ్ఛంద సేవాసంస్థలు

### 10.4.4. సముదాయాభివృద్ధిలో పంచాయతీరాజ్ వ్యవస్థ

సముదాయాభివృద్ధి కార్యక్రమాల అమలులోని మూడవదశలో అంటే "ప్రాతినిధ్యదశ"లో గ్రామస్థాయి నుండి జిల్లా స్థాయి వరకు ఈ కార్యక్రమాల నిర్వహణ బాధ్యతను పంచాయతీ వ్యవస్థకు ఇవ్వడం జరిగింది.

మన ప్రభుత్వంలో ఎన్నో శాఖలున్నాయి. విడివిడిగా శాఖలుంటే అభివృద్ధిని సాధించడం కష్టం అని భావించడం జరిగింది. అందువల్ల ఈ శాఖలన్నింటినీ సంయుక్త పరచడం ద్వారా విజయాన్ని సాధించవచ్చునని భావించినారు. ఈ అభిప్రాయంతోనే సాముదాయికాభివృద్ధి కార్యక్రమాలు రూపొందించడం జరిగింది. ఒక్కొక్క సముదాయాభివృద్ధి కేంద్రంలో 100 గ్రామాలుంటాయి. ఈ కార్యక్రమాలన్నీ బ్లాక్ డెవలప్‌మెంట్ ఆఫీసరు ఆధ్వర్యంలో జరుగుతూ ఉంటాయి. ఈ అధికారి క్రింద ఆయా శాఖల విస్తరణాధికారులుంటారు. వ్యవసాయం, ప్రజారోగ్యం, సహకారం, పరిశ్రమలు, విద్య, ఇంజనీరింగ్, స్త్రీ అభ్యుదయం మొదలయిన గ్రామీణ శాఖలకు విస్తరణాధికారులు ఉంటారు. వీరితో బాటు ప్రతి పది గ్రామాలకు ఒక్కొక్కరు చొప్పున 'గ్రామసేవకుల'ని పిలువబడే గ్రామ స్థాయి సిబ్బంది ఉంటుంది. బ్లాక్‌స్థాయి పరిపాలన జిల్లా కలెక్టర్ ఆధీనంలో ఉంటుంది. సాముదాయికాభివృద్ధి కార్యక్రమాల పర్యవేక్షణ బాధ్యత కలెక్టరుదే. సాంకేతిక పరమైన విషయాలు ఆయా జిల్లాలలో ఉన్న సాంకేతిక శాఖాధికారులు పర్యవేక్షిస్తారు. రాష్ట్ర స్థాయిలో ముఖ్యమంత్రి, కేంద్రస్థాయిలో ప్రధానమంత్రులు అధ్యక్షతన నియమింపబడ్డ ఒక సంఘం ఈ కార్యక్రమాల పరిపాలనను అజమాయిషీ చేస్తుంది.

సాముదాయికాభివృద్ధి కార్యక్రమాల ప్రారంభించిన తొలిరోజులలో ఈ కార్యక్రమాలలో గ్రామస్తుల పాత్ర చాలా తక్కువగా ఉండేది. బల్వంతరాయ్ మెహతా కమిటీ సాముదాయికాభివృద్ధి కార్యక్రమాల పనితీరును పరిశీలించి కొన్ని సిఫారసులు చేసింది. ఈ కమిటీ సిఫార్సు మేరకు సాముదాయికాభివృద్ధి కార్యక్రమాలను మెరుగుపరచడానికి నూతన పంచాయతీ వ్యవస్థను ప్రవేశ పెట్టారు. దీనినే 'పంచాయితీ రాజ్ వ్యవస్థ' అని పిలుస్తారు. పంచాయతీ రాజ్‌వ్యవస్థ "మూడెంచెల వ్యవస్థ" (Three tier system) . ఈ వ్యవస్థ ద్వారా 'ప్రజా స్వామ్య వికేంద్రీకరణ' ' (Democratic decentralisation) ను సాధించ గలుగుతాం. పంచాయితీరాజ్‌లో జిల్లా స్థాయిలో జిల్లా పరిషత్, బ్లాకు స్థాయిలో పంచాయితీ సమితి, గ్రామ స్థాయిలో గ్రామ పంచాయితీ ఉంటాయి. పంచాయతీ రాజ్ వ్యవస్థలో ప్రజలే న్యాయనిర్ణేతలు. గ్రామసభనుంచి లోక్‌సభ వరకు తమ ప్రతినిధులను ప్రజలే ఎన్నుకొంటారు. గ్రామంలోని ప్రణాళికా కార్యక్రమాలన్నీ గ్రామ సభ ఆమోదంతోను, వాటి ఆధ్వర్యంలోను జరుగుతాయి. పంచాయతీ రాజ్ వ్యవస్థలో గ్రామము, బ్లాక్, జిల్లా ప్రణాళికాభివృద్ధి కేంద్రాలుగా ప్రాధాన్యత వహిస్తాయి.

సాముదాయికాభివృద్ధి అనే గమ్యస్థానాన్ని చేరుకోవడానికి పంచాయతీరాజ్ వ్యవస్థ ఒక సాధనము. ఈ గమ్యం సాధించడంకోసం పంచాయతీరాజ్ క్రింద పేర్కొన్న విధానాలకు అధిక ప్రాధాన్యతనిస్తుంది.

- దేశంలో వ్యవసాయోత్పత్తికి ప్రధాన ప్రాముఖ్యతనివ్వడం.
- గ్రామీణ పరిశ్రమలను పెంపొందించడం
- స్థానికంగా లభ్యమయ్యే సహజ, మానవ వనరులను అభివృద్ధి పరచడం.
- గ్రామాలలో ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు ప్రత్యేక సహాయం చేయడం
- ప్రభుత్వ సంస్థల స్థానంలో స్వచ్ఛంధ సంస్థల పాత్రను అధికతరం చేయడం.
- సమాజంలో సమైక్య భావాన్ని, సహకార స్వయం సహాయక విధానాలను పెంపొందించడం.

### 10.4.4. సముదాయాభివృద్ధి కార్యక్రమాల మూల్యాంకన

సముదాయాభివృద్ధి కార్యక్రమాలు సఫలీకృతం అయ్యాయా? ఇవి ప్రజలకు అందుతున్నాయా? అనే ప్రశ్నలకు సమాధానం చెప్పడం అంత సులభమైన విషయం కాదు. వి.కె.ఆర్.వి. రావు, ఎస్.సి. దూమే, బల్వంతరాయ్ మెహతా కమీటీ మొదలైన వారి పరిశీలన ప్రకారం ఈ కార్యక్రమాలకు కొన్ని అవరోధాలున్నాయి. వీటిలో ప్రధానమైనవి - అజ్ఞానం, సిబ్బంది కృషిలో లోపం, దోషాలతో కూడిన నిర్వహణా సూత్రాలు, మన దేశంలో ఎక్కువ మంది ప్రజలు కర్మ సిద్ధాంతాన్ని నమ్మడం, సాంకేతిక, సామాజిక నైపుణ్యం కొరతగా ఉండటం. ఈ అవరోధాల ఫలితంగా సాముదాయికాభివృద్ధి కార్యక్రమాలు అనుకున్నంతగా ప్రజలకు చేరడం లేదని చెప్పాలి.

మన సమాజం సామాజిక ఆర్థిక అసమానతలతో కూడి ఉన్నది. నిరక్షరాస్యత వల్ల, చొరవలేకపోవడం వల్ల, తగినంత సమాచారం తెలియకపోవడం వల్ల సాముదాయికాభివృద్ధి కార్యక్రమాల ప్రయోజనాలను అందరూ సమానంగా పొందలేకపోతున్నారు. ప్రజలలో నిరక్షరాస్యతను, నిర్మూలించడానికి, సామాజిక స్పృహను కలిగించి, వారిని చైతన్యవంతులుగా చేయడానికి వివిధ పథకాలు, కార్యక్రమాలను చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమాల ద్వారా సాముదాయికాభివృద్ధి కార్యక్రమాలను విజయవంతంగా అమలు పరచడానికి వీలవుతుంది.

## 10.5 సారాంశం

సాముదాయికాభివృద్ధి కార్యక్రమాల ప్రధాన లక్ష్యం సమాజంలో సర్వతోముఖాభివృద్ధిని సాధించడం. భారత దేశంలో ఈ కార్యక్రమాలను 1952వ సంవత్సరం అక్టోబర్ 2 వ తేదీన ప్రారంభించినారు. సముదాయాభివృద్ధికి పంచాయతీరాజ్ వ్యవస్థకు దగ్గరి సంబంధముంది. పంచాయతీ రాజ్ వ్యవస్థలో బహుప్రజామోదానికే ఎక్కువ ప్రాధాన్యతనిస్తారు కనుక సాముదాయికాభివృద్ధి అనే గమ్యాన్ని చేరుకోవడానికి పంచాయతీరాజ్ వ్యవస్థ ఒక సాధనంగా పనిచేస్తుంది.

## 10.6. నమూనా ప్రశ్నలు

1. 'సముదాయాభివృద్ధి' భావనను వివరించుము.
2. సాముదాయికాభివృద్ధి కార్యక్రమాలకు పంచాయతీరాజ్ వ్యవస్థ ఏ విధంగా దోహదపడుతుందో వివరింపుము.
3. జాతీయ విస్తరణ సేవ కేంద్రాలపై ఒక వ్యాఖ్యవ్రాయుము.
4. సాముదాయికాభివృద్ధి కార్యక్రమాలు సఫలీకృతమవకపోవడానికి దారితీసే కారణాలేవి?

## 10.7 చదువవదగిన పుస్తకాలు :


1. S.C.Jain - Community Development and Panchayat Raj in India.
2. V.T. Krishnamachari - Community Development
3. A.R. Desai - Rural Sociology in India.
4. తెలుగు అకాడమీ - సమాజము, నిర్మితి, పరివర్తన

పాఠం - 11

# భారతదేశములో సామాజిక ప్రణాళిక - సర్వోదయ ఉద్యమము, మహాత్మాగాంధీ నిర్మాణాత్మక కార్యక్రమాలు

## 11.0 లక్ష్యాలు

సామాజిక ప్రణాళికలో సర్వోదయ ఉద్యమం పాత్రను తెలుసుకోవడం, మహాత్మాగాంధీ నిర్మాణాత్మక కార్యక్రమాలను అవగాహన చేసుకోవడం ఈ పాఠం యొక్క లక్ష్యాలు.

విషయసూచిక

11.1 పరిచయం
11.2 సర్వోదయ ఉద్యమం
11.3 మహాత్మాగాంధీ నిర్మాణాత్మక కార్యక్రమాలు
11.4 సారాంశము
11.5 నమూనా ప్రశ్నలు
11.6. చదువదగిన గ్రంథాలు

## 11.1 పరిచయం

సమాజంలో నిర్మాణాత్మకమైన మార్పును తీసుకొని రావలెనంటే ప్రణాళికాబద్ధంగా మార్పును తీసుకొని రావడానికి ప్రయత్నించాలి. సాధించవలసిన లక్ష్యాలను ముందుగానే నిర్ణయించుకుని, ఆ లక్ష్యాలను సాధించడానికి అనుసరించవలసిన మార్గాలను రూపొందించడం, వీటి సహాయ సహకారాలతో సమాజంలో మార్పును తీసుకుని వచ్చే పద్ధతినే ప్రణాళికాబద్ధమైన మార్పు అని పేర్కొనవచ్చు. ఆది నుంచి భారతదేశంలో ఏర్పడిన మార్పులన్నీ క్రమబద్ధమైనవి కావు. స్వాతంత్ర్యానంతరం సమాజంలో ప్రణాళికాబద్ధమైన పరివర్తనలు తీసుకుని రావడానికి చేసిన ప్రయత్నాలలో సర్వోదయ ఉద్యమం, నిర్మాణాత్మక కార్యక్రమాలు ముఖ్యమైనవి.

## 11.2. సర్వోదయ ఉద్యమం

### 11.2.1 'సర్వోదయ' భావన

'సర్వోదయం' అంటే సర్వమానవ సంక్షేమమని అర్థం. సమాజంలో అందరికి నిత్యావసరాలు తీరాలనీ, అందరి సంక్షేమాన్ని కాంక్షించాలనీ, సమాజంలోని సంపద అందరికీ చెందాలనీ సర్వోదయ ఉద్యమం భావిస్తుంది. 'సర్వోదయం' అనే పదాన్ని మహాత్మాగాంధీ మొట్టమొదటిసారిగా ఉపయోగించినారు. రస్కిన్ రచించిన "అన్‌టు దిస్ లాస్ట్" (Unto this Last) గ్రంథాన్ని అనువదించే సందర్భంలో ఈ పదాన్ని గాంధీమహాత్ముడు ఉపయోగించాడు. సమాజంలోని సర్వప్రజానీకానికి, అట్టడుగున ఉన్న మానవాళి నిత్యావసరాలను తీర్చడానికి కృషి జరగవలెనని, సమాజంలోని సంపద సమాజంలోని చిట్టచివరి మనిషికి కూడా అందవలెనని రస్కిన్ అభిప్రాయం. "అన్ టు దిస్ లాస్ట్" అనే మాటను బైబిలులోని ఏసుక్రీస్తు ప్రబోధాల నుంచి రస్కిన్ గ్రహించి తన గ్రంథానికి పేరు పెట్టినాడు. ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక రాజకీయ రంగాలలో మానవతా దృక్పథం ప్రధానంగా ఉండవలెనని 'సర్వోదయ' సిద్ధాంతం ప్రబోధిస్తుంది. మనదేశంలో సర్వోదయ ఉద్యమం కొనసాగడానికి గాంధీ మహాత్ముడు ఎంతో కృషి చేశాడు. మన దేశంలో సర్వోదయ ఉద్యమానికి వినోబాభావే, జయప్రకాశ్ నారాయణలు కూడా సారథ్యం వహించారు.

### 11.2.2 సర్వోదయ ఉద్యమ లక్షణాలు

ఆర్థిక, రాజకీయ, సాంఘిక, సాంస్కృతిక రంగాలలో సాందించవలసిన అభివృద్ధి విషయంలో మానవతావాదం ఉండాలనేది సర్వోదయ ఉద్యమం యొక్క ప్రధానాశయం. సర్వోదయ ఉద్యమం ద్వారా సమాజంలో అందరికి సామాజిక న్యాయాన్ని చేకూర్చువచ్చునని, పేదరికాన్ని నిర్మూలించి సమసమజాన్ని స్థాపించవచ్చునని భావిస్తాం. సర్వోదయ ఉద్యమానికి కొన్ని మౌళిక సూత్రాలున్నాయి. ఈ సూత్రాలను అవగాహన చేసుకోవడం ద్వారా సర్వోదయ ఉద్యమ లక్షణాలను అర్థం చేసుకోవచ్చు.

సర్వోదయ సిద్ధాంతంలోని మౌళిక సూత్రాలు ఇవి :

**1. భిన్నత్వంలో ఏకత్వం (Unity in diversity)**

ఏ సమాజంలో అయినా భిన్నత్వం సహజము. సమాజం వివిధ జాతుల, మతాల, కులాల సమ్మేళనం. ప్రజల ఆర్థిక స్థితిగతులలోనూ, మానవమేథలోనూ, సామాజిక సాంస్కృతిక పరిస్థితులలోనూ భిన్నత్వం ఉంటుంది. సమాజంలో భిన్నత్వమున్నప్పటికీ, ప్రజలందరూ ఆ భిన్నత్వాన్ని దరిచేరనీయకుండా, ఒకే కుటుంబ సభ్యుల వలె సమైక్యంగా శాంతి, సహకారాలతో కలిసిమెలసి జీవించడం నేర్చుకోవలెననీ, బలవంతులు బలహీనులకు సహాయపడవలెననీ, ధనవంతులు పేదవారికి ధర్మకర్తలుగా మాత్రమే వ్యవహరించవలెననీ, ప్రతిఒక్కడూ సమిష్టి సంక్షేమం కోసం కృషి చేయవలెననీ గాంధీజీ ప్రజలకు ఉద్బోధించినాడు.

**2. సామాజిక సమానత్వము (Social Equality)**

సర్వోదయ సిద్ధాంతం ప్రకారం, సమాజంలోని వ్యక్తులంతా సమానులే. కుల, మత, జాతి, వర్గ భేదాలను, విచక్షణలను సర్వోదయ సిద్ధాంతం పరిగణించదు. "సర్వమానవులు సమానులే" అన్న సూత్రాన్ని సర్వోదయవాదం దృఢంగా విశ్వసిస్తుంది. సర్వోదయ సిద్ధాంతం ఒక పవిత్రమైన ప్రజాస్వామ్య సిద్ధాంతం.

**3. నిస్వార్థ ప్రజాసేవకులకే అధికారము :**

నిరంతరము తమ రాజకీయ పార్టీల కోసం, తమ స్వార్థం కోసం ప్రాకులాడే వారి వల్ల 'సర్వోదయం' ప్రాప్తించదు. నిస్వార్థంగా ప్రజాసేవచేసే అంకితభావం గల వారి వల్ల మాత్రమే సర్వోదయం సిద్ధిస్తుంది.

**4. బహుజనామోదమైన అభిప్రాయము :**

దేశంలోని ప్రజాసమస్యల మీద వేర్వేరు సమూహాలకు విభిన్నాభిప్రాయాలుండటం సహజం. అయితే ఇతరుల అభిప్రాయాలను గౌరవించడం సర్వోదయవాదుల లక్ష్యం. సర్వోదయ వ్యవస్థలో ప్రజామోదం పొంతన నిర్ణయాలను అమలు పరచడానికి కృషి జరుగుతుంది.

**5. స్వశక్తి పై ఆధారపడటం :**

సర్వోదయ వ్యవస్థలో ప్రజలు క్రమశిక్షణతో ఉంటారు. ప్రజలు సర్వజన సంక్షేమం కోసం కృషి చేస్తారు. సర్వోదయ వ్యవస్థలో ప్రజలకు ప్రభుత్వం యొక్కఅవసరమే ఉండదు. ప్రతి వ్యక్తికీ తన వ్యవహారాలు చక్కబెట్టుకోవడానికి పూర్తి స్వేచ్ఛ ఉంటుంది. అందువల్ల, ప్రజలు ప్రభుత్వ సహాయం మీద ఆధారపడక, స్వయం పోషకత్వాన్ని సాధించడానికి ప్రయత్నం చేస్తారు.

**6. ప్రజలే ప్రణాళికాకర్తలు :**

సర్వోదయ వ్యవస్థలో వారి సంక్షేమం కోసం పథకాలను రూపొందించుకొంటారు. గ్రామ వ్యవస్థనుఆధారం చేసుకొని తాలూకా, జిల్లా, రాష్ట్ర స్థాయిలలో కూడా ప్రజలు తమ ప్రణాళికలను తామే రూపొందించుకుంటారు. తెలియని విషయాలలో నిపుణుల సహాయం తీసుకుంటారు. ఈ విధంగా, ప్రణాళికా వ్యవస్థ గ్రామ స్థాయిలో ప్రారంభమై, జాతీయ స్థాయికి చేరుకుంటుంది. గ్రామీణ జీవితంలోని అన్ని రంగాలలోనూ ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి సాధించడానికి గ్రామీణ ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి సాధించడానికి గ్రామీణ ప్రణాళికా

సంఘ సభ్యులే పథకాలను వేస్తారు. ఉదాహరణకు, గ్రామ పారిశుద్ధ్యము, ఆరోగ్యము, గృహ నిర్మాణం, గృహవసతి, నీటిపారుదల, వ్యవసాయం, పరిశ్రమలు, రహదార్లు, విద్య, వినోదం మొదలయిన రంగాలలో క్రమానుగతమైన అభివృద్ధిని సాధించి, గ్రామసీమలను ఆదర్శంగా తీర్చిదిద్దడానికి ప్రణాళికలు తోడ్పడుతాయి.

**7. వికేంద్రీకరణ:**

ఎప్పుడైతే గ్రామాలు తమ ప్రణాళికలను తామే రూపొందించుకొంటున్నాయో, అప్పుడు ప్రణాళికా వ్యవస్థలో వికేంద్రీకరణ జరుగుతున్నదన్నమాట. గ్రామ స్థాయిలో కాకుండా జాతీయ స్థాయిలో ప్రణాళికలు రూపొందించినట్లయితే, ప్రణాళికారచన చేసే వారికి దేశంలోని అన్ని వర్గాల ప్రజలు, అన్ని ప్రాంతాల సమస్యలను కూలంకషంగా అర్థం చేసుకునే అవకాశముండకపోవచ్చు. కనుక వివిధ సామాజిక జీవన రంగాలలో వికేంద్రీకరణ కోసమే సర్వోదయ వాదులెప్పుడూ కృషి చేస్తారు. ఆర్థిక, రాజకీయ తదితర రంగాలలో ప్రజాస్వామ్య వికేంద్రీకరణ జరిగినప్పుడే, 'ప్రజాస్వామ్యము' అనే మాటకు అర్థము, విలువ ఉంటాయని సర్వోదయ సిద్ధాంతం విశ్వసిస్తుంది. తమ తమ వృత్తులలో పనివారికి పూర్తి స్వేచ్ఛ ఉండవలెనని సర్వోదయ వాదులు కోరతారు.

**8. దోపిడీ విధానానికి, యుద్ధాలకు వ్యతిరేకత :**

సమాజంలో దోపిడీ విధానం, యుద్ధాలు లేనప్పుడే, నిరుద్యోగాన్ని, పేదరికాన్ని సమూలంగా నాశనం చేయడానికి చేపట్టిన పథకాలు విజయాన్ని సాధించగలుగుతారు. అప్పుడే నిజమైన ప్రజాస్వామ్యం వర్ధిల్లుతుంది. శక్తివంతమైన దేశాలు తమ ఆర్థిక, రాజకీయ, సైనిక ప్రాబల్య విస్తరణ కోసం జరిపే ప్రయత్నాలవల్లనే ప్రపంచంలో యుద్ధభీతి ఆవరిస్తుంది. సర్వోదయ సిద్ధాంతానికి ఇది పూర్తిగా విరుద్ధమైనది. ఈ దోపిడీ విధానాలను యుద్ధ భీతిని నిర్మూలించవలెనంటే, ఉత్పత్తి వ్యవస్థలో వికేంద్రీకరణను ప్రవేశపెట్టడంతో బాటు ఉత్పత్తులను, ప్రజల ప్రాథమిక అవసరాలను దృష్టిలో ఉంచుకొని జరపవలెనని సర్వోదయ వాదులు పేర్కొంటారు.

**9. సహకారము, సర్వ మానవ సౌభ్రాతృత్వము**

గ్రామాల వారీగా, లేదా, ప్రాంతాలవారీగా అభివృద్ధి సాధించడంతో బాటు, వివిధ గ్రామాల మధ్య, వివిధ ప్రాంతల మధ్య అనేక ప్రజా సంక్షేమ రంగాలలో పరస్పర సుహృద్భావాలను పెంపొందించవలెనని సర్వోదయ సిద్ధాంతం ఆశిస్తుంది. ప్రజలలో సహకార భావాన్ని పెంపొందించాలని సర్వోదయ సిద్ధాంతం ఆకాంక్షిస్తుంది. సహకారం లేకపోతే మానవ సమాజం మనలేదు. సహకారం ఉండాలంటే ప్రజల మధ్య పరస్పర అవగాహన ఏర్పడాలి. వివిధ గ్రామాల మధ్య పరస్పర సహకారాన్ని పెంపొందించాలి. రవాణా సౌకర్యాల్ని పెంపుచేస్తే వివిధ గ్రామాలలోని ప్రజల మధ్య పరస్పర అవగాహన ఏర్పడి సంపూర్ణమైన సహకారం ఏర్పడుతుంది. తద్వారా ప్రజల మధ్య సామరస్యాన్ని పెంపొందించవచ్చు.

సర్వోదయ సిద్ధాంతం యొక్క మౌళిక సూత్రాలను సాధించడం ద్వారా, బడుగువర్గాల వారిని అభివృద్ధి పథంలోకి నడిపించగలుగుతామని గాంధీజీ ప్రగాఢంగా విశ్వసించినాడు.

**11.2.3. సామాజిక ప్రణాళికలో సర్వోదయ ఉద్యమం పాత్ర**

సామాజిక ప్రణాళిక ఒక ఆధునాతమమైన భావన. నేటి ఆధునిక సమాజంలో సమస్యలు అధికమవడం, అసమానతలు, స్వార్థం పెరిగిపోవడం, ఫలితంగా ఈ సమస్యలకు పరిష్కార మార్గాలను అన్వేషించడం కోసం సామాజిక ప్రణాళికలు ఉద్భవించినాయి. సామాజిక ప్రణాళికల లక్ష్యాలలో ప్రధానమైనవి - పేదరిక నిర్మూలన, వ్యక్తి స్వేచ్ఛ, సమానత్వాలను కాపాడటం, విజ్ఞాన శాస్త్రాభివృద్ధి, సంఘ సంక్షేమాన్ని సాధించడం. సాంఘిక సమానత్వం, ఏకత్వం, సర్వమానవ సంక్షేమం అనే మౌలిక సూత్రాలపై ఆధారపడిన సర్వోదయ ఉద్యమం సామాజిక ప్రణాళికల లక్ష్యాలను నిర్ణయించగలదు. ఈ సర్వోదయ సూత్రాలను త్రికరణ శుద్ధిగా అమలు పరచడం ద్వారా నిమ్న, బడుగు వర్గాల అభ్యున్నతికి పాటుపడవచ్చు. సర్వోదయ సిద్ధాంతం సహకారానికి ఎంతో ప్రాముఖ్యతనిస్తుంది. సామాజిక ప్రణాళికల అమలులో ప్రజలు భాగస్వామ్యం వహించడం చాలా అవసరం. సర్వోదయ సిద్ధాంతాన్ని అనుసరిస్తే ప్రజలు ప్రణాళికా కర్తలుగా

ప్రణాళికలను రూపొందించడమేగాక, విజయవంతంగా వాటిని అమలు పరచగలుగుతారు. తద్వారా సమానత్వంపై ఆధారపడిన సమసమాజాన్ని స్థాపించవచ్చు.

## 11.3. మహాత్మాగాంధీ నిర్మాణాత్మక కార్యక్రమాలు :

### 11.3.1. మహాత్మాగాంధీ భావనలు :

సత్యాన్వేషణమే జీవితధ్యేయంగా, అహింసామార్గమే అనుసరణీయంగా ఏర్పరుచుకొన్న మహనీయుడు మహాత్మగాంధీ. సమాజంలోని ఏ నిర్మాణాత్మక కార్యక్రమాన్ని అయినా అర్థం చేసుకోవలెనంటే, ఆ కార్యక్రమంలో ఇమిడి ఉన్న మానవునికి సంబంధించిన భావనను అర్థం చేసుకోవడం చాలా అవసరం. సామాన్య మానవుని సౌభాగ్యమే తనకు చాలా ముఖ్యమని గాంధీజీ అనేక పర్యాయాలు ఉద్ఘాటించినాడు. మానవునిలో అనేక దైవిక శక్తులున్నాయని గాంధీజీ విశ్వసించినాడు. మానవునిలో గల శాంతి, సత్యము, ప్రేమ మొదలయిన దివ్యగుణాలు దైవ ప్రేరితాలని ఆయన విశ్వాసము. తన ఇష్టానుసారంగా ఆలోచించుకోవడానికి, తన ఆత్మాప్రబోధానుసారం కర్తవ్యం నిర్వహించడానికి మానవునికి స్వేచ్ఛ ఉండవలెనని గాంధీజీ ఆశయము. గాంధీజీ నిర్మాణాత్మక కార్యక్రమాలను అర్థం చేసుకోవడానికై, సామాజిక, ఆర్థిక, రాజకీయ సమస్యలపై గాంధీజీ అభిప్రాయాలను పరిశీలించడం అవసరం.

గాంధీజీ నాగరికతను నైతిక దృక్కోణం నుంచి పరిశీలించినాడు. సమాజంలో నైతికాభివృద్ధే నాగరికతాభివృద్ధి అని గాంధీజీ చెప్పినాడు. సమాజంలోని బడుగు వర్గాల వారికోసం, అనాదిగా అనేక అన్యాయాలకు గురైన ప్రజల కోసం పాటు పడి వారి పురోభివృద్ధికి కృషిచేసి వారి సుఖదుఃఖాలలో పాలు పంచుకుని, వారితో మమేకం చెందడమే నిజమైన నాగరికతా లక్ష్యమని గాంధీజీ అభిప్రాయపడినాడు.

గాంధీజీ ఆర్థిక విధానాలలో మానసిక, నైతిక దృష్టులు రెండూ సమ్మిళితమై ఉన్నాయి. సమాజంలోని ఆర్థిక సంపద మీద క్రమబద్ధమైన, న్యాయమైన ఆంక్షలు విధించి, తద్వారా సామాజిక న్యాయం చేకూర్చవలెనని గాంధీజీ ప్రతిపాదించినాడు. సంపదను పోగు చేసుకోవలెననే మానవుని అత్యాశే సమాజంలోని అన్యాయాలకు మూల కారణం. సమాజంలోని ప్రతి వ్యక్తీ సంతోషంగా, సంతృప్తి కరంగా జీవించవలెనంటే ధనికులు స్వచ్ఛందంగా తమ సంపద హక్కును వదులుకోవలెనని గాంధీజీ ఉద్బోధించినాడు. గాంధీజీ ఆర్థిక సూత్రాలలో నైతిక విలువలు స్పష్టంగా కనబడతాయి. సంపద కూడ బెట్టవలెననే పేరాశ నశించి, దాని స్థానంలో దాతృత్వం, ప్రేమ చోటు చేసుకోవలెనని గాంధీజీ ప్రజలకు ఉద్బోధించినాడు.

### 11.3.2 నిర్మాణాత్మక కార్యక్రమాల ప్రాధాన్యత

భారతదేశ జనాభాలో సుమారు 80 శాతం ప్రజలు గ్రామాలలో నివసిస్తున్నారు. గ్రామాలలో చైతన్యవంతమైన మార్పును తీసుకునిరావడం ద్వారా భారతదేశాన్ని బాగు చేయవచ్చునని, ఈ మార్పు కోసం నిర్మాణాత్మక కార్యక్రమాలు చేపట్టవలెనని గాంధీ మహాత్ముడు భావించాడు. మన దేశ చరిత్రను పరిశీలిస్తే ప్రాచీనకాలం నుండే గ్రామాల అభివృద్ధికి రాజులు, చక్రవర్తులు పాటుపడ్డారు. స్వాతంత్ర్యం రావడానికి మునుపు గ్రామ పునఃనిర్మాణ కార్యక్రమాల ఎంతో తోడ్పడ్డాయి. గ్రామాలలో నిర్మాణాత్మక కార్యక్రమాలను చేపట్టడం ద్వారా సామాజిక పరివర్తనను సాధించడానికి గాంధీ మహాత్ముడు ఎంతగానో తోడ్పడ్డాడు. మానవుడు తనకు తానుగా ఆలోచించుకోవడానికీ, తన భవిష్యత్తును తీర్చిదిద్దుకోవడానికి, తానే స్వయంగా పోషించుకోగల పరిస్థితులను కల్పించాలని గాంధీజీ భావించాడు. ఆయన గ్రామ పునః నిర్మాణ కార్యక్రమాలకు కొన్ని విధానాలను ఆధారంగా పెట్టుకున్నాడు. ఈ విధానాలు 1. ఆర్థిక విధానం 2. సమగ్ర గ్రామ సేవ, 3. స్వయం సమృద్ధి.

1. ఆర్థిక విధానం : సంపదను సంపాదించాలనే అత్యాశ సమాజంలోని అన్ని అనర్థాలకు మూలమని గాంధీజీ అభిప్రాయం. సమాజంలో ఆర్థిక అసమానతలను తొలగించడానికి సంపదపైన న్యాయబద్ధమైన ఆంక్షలు విధించాలని గాంధీజీ పేర్కొన్నాడు. ధనికులు పేదవారి సంక్షేమం కోసం పాటుపడాలని, ప్రతివారు కష్టపడి పనిచేయాలని, పనిలేని వారికి పని కల్పించడం ద్వారా పేదరికాన్ని నిర్మూలించవచ్చునని గాంధీజీ భావించాడు. తద్వారా సమాజంలో నిర్మాణాత్మక కార్యక్రమాలను విజయవంతంగా కొనసాగించవచ్చు.

2. సమగ్రగ్రామసేవ : భారతదేశం గ్రామాలలో నివసిస్తోంది. గ్రామ ప్రజలు అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొనడానికి త్వరగా ముందుకు రారు. అందువల్ల వారిని చైతన్యవంతులుగా చేయాలి. సేవాదృక్పథంలో గ్రామాల అభివృద్ధికి తోడ్పడితే గ్రామీణ ప్రజలు ఉత్సాహవంతులై ముందుకు వస్తారు.

గ్రామాలలో ఎన్నో వనరులుంటాయి. ఆ వనరులను ఉపయోగించి గ్రామాలలో పరిశ్రమలను అభివృద్ధి పరచాలి. కుటీర పరిశ్రమలను ప్రోత్సహించి, గ్రామీణ కళలను పైకి తీసుకొని రావాలి.

3. స్వయం సమృద్ధి : గ్రామ సీమలు స్వయం సమృద్ధంగా ఉండాలి. గ్రామాలలో నిరుద్యోగాన్ని రూపుమాపాలంటే ఖాదీ గ్రామోద్యోగ పరిశ్రమలు అభివృద్ధి చెందవలెనని గాంధీ మహాత్ముడు తెలియజేశాడు.

అహింసా సిద్ధాంతాన్ని అనుసరించి సమాజాన్ని చైతన్యవంతం చేయాలని గాంధీజీ పేర్కొన్నాడు. స్వయం సంపూర్ణమైన గ్రామాలను పునాదులుగా చేసుకుని సమాజ నిర్మాణం జరగాలని గాంధీజీ భావించినాడు. గాంధీ మహాత్ముడు పేర్కొన్న నిర్మాణాత్మక కార్యక్రమాలను ప్రణాళికల ద్వారా అమలు చేయడానికి మన ప్రభుత్వం అనేక కార్యక్రమాల్ని చేపట్టింది. పంచవర్ష ప్రణాళికలలో ఈ కార్యక్రమాలు మరింత విస్తృతం చేయబడినాయి.

## 11. 4 సారాంశం

భారతదేశంలో స్వాతంత్ర్యం లభించేనాటికి 80% పైగా ప్రజలు గ్రామాలలో నివసిస్తున్నారు. సామాజికాభివృద్ధిని సాధించాలంటే గ్రామీణ పునర్నిర్మాణ ఆవశ్యకతను గ్రహించి, గ్రామీణ ప్రజల భాగస్వామ్యం ప్రోత్సహించేందుకు జరిగిన ప్రయత్నాలలో గాంధీజీ ప్రవేశపెట్టిన నిర్మాణాత్మక కార్యక్రమాలు ప్రధానమైనవి.

సమాజంలో ఏ నిర్మాణాత్మక కార్యక్రమాన్నైనా అర్థం చేసుకోవలెనంటే, ఆ కార్యక్రమంలో ఇమిడి ఉన్న మానవునికి సంబంధించిన భావనను అర్థం చేసుకోవడం చాలా అవసరం. సామాన్యమానవుని సౌభాగ్యమే తనకు చాలా ముఖ్యమని గాంధీజీ అనేక పర్యాయాలు చెప్పినారు. సమాజంలోని ఆర్థిక సంపద మీద క్రమబద్ధమైన, న్యాయమైన ఆంక్షలు విధించి, దాని ద్వారా సామాజిక న్యాయం చేకూర్చవలెనని గాంధీజీ చెప్పినాడు.

'సర్వోదయం' అనే పదాన్ని మొదట గాంధీజీ వాడినాడు. 'సర్వోదయం' అంటే సర్వమానవ సంక్షేమమని అర్థం. ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక రాజకీయ రంగాలలో కూడా మానవతాదృక్పథం ప్రధానంగా ఉండవలెనని 'సర్వోదయ' సిద్ధాంతం బోధిస్తుంది. ఈ సిద్ధాంతంలోని ముఖ్యాంశాలు. భిన్నత్వంలో ఏకత్వం, సామాజిక సమానత్వం, నిస్వార్థ ప్రజాసేవకులకే అధికారం. బహుజనామోదమైన అభిప్రాయం; స్వశక్తిమీద ఆధారం; ప్రజలే ప్రణాళికా కర్తలుగా వ్యవహరించడం, వికేంద్రీకరణ, పరపీడన విధానానికి, యుద్ధాలకు స్వస్తి, సహకారం, సర్వమానవ సౌభ్రాతృత్వం.

## 11.5 నమూనా ప్రశ్నలు

1. మహాత్మాగాంధీ నిర్మాణాత్మక కార్యక్రమాలను గురించి వివరించుము.
2. సర్వోదయం అనగా నేమి? సర్వోదయ ఉద్యమం యొక్క మౌలిక సూత్రాలేవి?
3. సామాజిక ప్రణాళికలో నిర్మాణాత్మక కార్యక్రమాల పాత్రను వివరింపుము.

## 11.6 చదువదగిన పుస్తకాలు


1. S.C. Dube - India's Changing Villages
2. తెలుగు అకాడమీ ప్రచురణ - సమాజము, నిర్మిత, పరివర్తన ప్రచురణ

పాఠం - 12

# భారతదేశ సామాజిక ప్రణాళిక - బలహీన వర్గాల సంక్షేమము, స్త్రీ సంక్షేమము మరియు బాలలు, వికలాంగుల సంక్షేమము

## 12.0 లక్ష్యాలు

1. భారతదేశ సామాజిక ప్రణాళికను గురించి క్లుప్తంగా గ్రహించుట.
2. బలహీన వర్గాల సంక్షేమమును గురించి వాటి ఆవశ్యకతను గురించి గ్రహించుట.
3. స్త్రీ సంక్షేమ ఆవశ్యకతను గ్రహించుట.
4. బాలలు, వికలాంగుల సంక్షేమము మరియు వారి సంక్షేమము కొరకు నిర్దేశించిన వివిధ పథకాల గురించి అవగాహన చేసుకొనుట.

విషయసూచిక


12.1 పరిచయం
12.2 బలహీన వర్గాల సంక్షేమము
12.3 స్త్రీ సంక్షేమము
12.4 బాలలు, వికలాంగుల సంక్షేమము
12.5 పునఃపరిశీలన
12.6 నూతన పదజాలము
12.7 నమూనా ప్రశ్నలు
12.8 చదువదగిన గ్రంథాలు


## 12.1 పరిచయము

సమాజంలో వేగంగా మార్పులు సంభవిస్తున్న సమయంలో, ఆ సమాజంలోని ప్రజలు రెండు ముఖ్యమైన ప్రశ్నలను ఎదుర్కొంటారు. అవి ఏవనగా (1) నూతన సమాజము రేఖలు ఎట్లా ఉంటాయి? (2) మారిన సమాజంతో పాటు, మానవత్వపు విలువలు ఎట్లా మారుతాయి? భారతదేశంలో పెద్ద ఎత్తున ప్రణాళికలపై మార్పులు తీసుకొని రావడానికి ప్రయత్నాలేవీ జరుగలేదు.

ఏ సమాజ నిర్మితిని పరిశీలించినప్పటికి దానిలో మనకు భేదాలు, సామాజిక, ఆర్థిక అసమానతలు, వ్యక్తిగత తారతమ్యాలు స్పష్టంగా కనిపిస్తాయి. సమాజంలో వివిధ వర్గాలవారు, వివిధ కులాలవారు, తెగలవారు, వివిధ రకములైన మనస్తత్వం గలవారు, వివిధ వృత్తులవారు జీవిత యాత్ర కొనసాగిస్తుంటారు.

భారతదేశ కుటుంబ వ్యవస్థలో అనేక మార్పులు వచ్చినాయి. ఉమ్మడి కుటుంబాలు చిన్న కుటుంబాలుగా చీలిపోయినాయి. బహు భార్యత్వం నుంచి ఏక పత్నీత్వానికి చేరుకొన్నాయి. 1950 సంవత్సరంలో రూపొందించిన భారత నూతన రాజ్యాంగం ప్రకారం స్త్రీకి పురుషునితో బాటు సమాన హక్కులు లభించినాయి. ఆచరణలో స్త్రీ పురుషుల మధ్యగల అసమానతలను తొలగించడానికి ప్రభుత్వము అనేక చట్టాలను రూపొందించింది.

ఏ దేశ సౌభాగ్యమైనా ఆ దేశం యొక్క భౌతిక సంపదతోబాటు, ఆ దేశ పౌరుల శక్తి, సామర్థ్యాల మీద ఆధారపడి ఉంటుంది. ఈనాటి బాలబాలికలే రేపటి పౌరులన్న పరమ సత్యాన్ని మనము మరువరాదు. కాబట్టి శిశువుల ఆరోగ్యాన్ని, మేథాశక్తినీ, మానసిక ధైర్యాన్ని పెంపొందించి, వారిలో సమగ్ర వ్యక్తిత్వాన్ని వికసింప జేయవలసిన బాధ్యత సమాజం మీద ఉంది. సమాజంలోని అనాధ బాల

బాలికలు, వికలాంగులైన కుంటి, గ్రుడ్డి, మూగ పిల్లలు మానసిక వ్యాధితో బాధపడే పిల్లలు ఈ వర్గాల వారి సంక్షేమం కోసం ప్రభుత్వమూ, సమాజమూ అనేక ప్రత్యేక శ్రద్ధాశక్తులతో కృషి చేయవలసిన అవసరమున్నది.

## 12.2 బలహీన వర్గాల సంక్షేమము

### 12.2.1 సమాజంలోని బలహీన వర్గాలు

కుల వ్యవస్థ వేళ్ళూనిన సమాజంలో వ్యక్తుల సామాజిక, ఆర్థిక జీవన విధానాలూ అసమానతలూ పుట్టుకతోనే నిర్ణయమవుతాయి. సమాజంలో కొందరు అగ్ర కులానికి చెందిన వారుగాను, మరికొందరు తక్కువ కులానికి చెందిన వారుగాను భావిస్తారు. ఈ రెండవ శ్రేణికి చెందిన వారిని సమాజంలో హీన కులస్థులుగా పరిగణిస్తారు. వీరినే షెడ్యూల్ కులాల వారు అని కూడా పిలుస్తారు. ఈ షెడ్యూల్ కులాల ప్రజలతో బాటు షెడ్యూల్ తెగల ప్రజలు అనేక శతాబ్దాలుగా సమాజంలోని బలపరమైన కులాల వారి బాధలకు, దోపిడీలకు గురి అయినారు. దాని మూలంగా వారు ఈనాటికీ భారత దేశంలో వెనుకబడిన బలహీన వర్గంగానే మిగిలి పోయినారు. వీరితోబాటు సమాజంలో వేర్వేరు రకాలైన బలహీన వర్గాల ప్రజలు, వ్యక్తులు ఉన్నారు. ఉదా॥ స్త్రీలు, పిల్లలు, వెనుకబడిన వర్గాలవారు, అంగవైకల్యం గలవారు, యాచకులు, వ్యభిచారమే వృత్తిగా గలవారు, బాల నేరస్థులు, నిరాశ్రయులు మొదలైనవారు.

### 12.2.2 బలహీన వర్గాల సంక్షేమం - ఆవశ్యకత

సమాజంలోని బలహీన వర్గాల ప్రజలను అభివృద్ధికి తీసుకొని రావలెనంటే, దేశ ప్రజలందరికి సమానంగా లభించే సాధారణ సదుపాయాలతో బాటు కొన్ని ప్రత్యేక సదుపాయాలను, ప్రత్యేకమైన కొన్ని మినహాయింపులను వారికి అందజేయవలెను. అలా లేనప్పుడు, సాధారణంగా లభించే సదుపాయాలను, అవకాశాలను ఉపయోగించుకోవటానికి కావలసిన శక్తి వారికి ఉండదు. దేశంలోని అన్ని వర్గాల ప్రజల శ్రేయస్సును కాపాడే బాధ్యత ప్రభుత్వం మీద ఉన్నది.

### 12.2.3 సహాయక చర్యలు

భారత దేశపు 1931 సం॥ జనాభా లెక్కలకు పూర్వం షెడ్యూల్ కులాల వారిని "దళిత కులాలు" అని పిలిచేవారు. 1936వ సం॥ నుంచి ఈ దళిత కులాల వారినే షెడ్యూల్ కులాలని పిలవ సాగినారు. వెనుకబడిన వర్గాల ప్రజల సంక్షేమ కార్యక్రమాలు భారత దేశ ప్రభుత్వ విధానాలలో అంతర్భాగాలుగా పరిగణించినారు. బలహీన వర్గాల, షెడ్యూల్ కులాల, షెడ్యూల్ తెగలవారి ఆర్థిక, విద్య విషయాలలో ప్రత్యేక శ్రద్ధ వహించవలెననీ, వారిని సామాజిక అన్యాయాల నుంచి, తదితర దోపిడి విధానాల నుంచి రక్షించవలెననీ భారత దేశ రాజ్యాంగంలోని నిర్దేశిక సూత్రాలలో చెప్పడం జరిగింది. ఇవే కాకుండా వారి స్థితి గతులను గురించి, సాధక బాధకాలను గురించి విచారణ జరపడానికి, వాటి నివారణకు, తగిన సిఫార్సులను రూపొందిచడానికి ఒక కమిషన్‌ను నియమించవలెనని కూడా భారత రాజ్యాంగంలో చెప్పడం జరిగింది.

### 12.2.4 సంక్షేమ కార్యక్రమాలు

ప్రభుత్వ ఉద్యోగాలలో కొంత శాతం షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగల వారికి ప్రత్యేకంగా కేటాయించడం, ఈ కులాల విద్యార్థులకు ప్రభుత్వ ఉపకారవేతనాల మంజూరు మొదలైన సదుపాయాలను భారత ప్రభుత్వం కల్పించింది. వీరు సాధారణ ప్రజలలో ఒక భాగమైనప్పటికి, అనేక శతాబ్దాల నుంచి సాంఘికంగా, ఆర్థికంగా వెనుకబడి ఉండటం మూలంగా అధిక స్థాయిని సాధించలేకపోతున్నారు.

అపరిశుభ్ర కృత్యాలను వృత్తిగా స్వీకరించిన వారి పని పరిస్థితులను మెరుగు పరచడానికి, పాకీ పనివారి గృహ నిర్మాణానికి సబ్సిడీ ఇవ్వడం, కార్మిక కర్షకులకు ఉచితంగా ఇళ్ళ స్థలాలు మంజూరు చేయడం, వెనుకబడిన ప్రజల సహాయార్థం ఏర్పడిన స్వచ్ఛంద సేవా సంఘాలకు ఆర్థిక సహాయం చేయడం మొదలైన పథకాలను అమలు జరిపి ఈ బలహీన వర్గాల వారి సామాజిక పురోభివృద్ధికి భారత ప్రభుత్వము గొప్ప కృషి చేసింది.

## 12.3 స్త్రీ సంక్షేమము

భారతదేశం కుటుంబ వ్యవస్థలో అనేకమైన మార్పులు వచ్చినాయి. ఉమ్మడి కుటుంబాలు చిన్న కుటుంబాలుగా చీలిపోయినాయి. బహు భార్యత్వం నుంచి ఏకపత్నిత్వానికి చేరుకొన్నాయి. 1950 సం॥లో రూపొందించిన భారత నూతన రాజ్యాంగం ప్రకారం స్త్రీకి పురుషునితోబాటు సమాన హక్కులు లభించినాయి. ఆచరణలో స్త్రీ పురుషుల మధ్యగల అసమానతలను తొలగించడానికి ప్రభుత్వము అనేక చట్టాలను రూపొందించింది. వాటిలో ముఖ్యమైనవి, 1955 సం॥లో హిందూ వివాహము విడాకుల చట్టాన్ని 1956 వ సం॥లో హిందూ అనుపూర్విక చట్టాన్ని భారత ప్రభుత్వం రూపొందించింది. 1955వ సం॥ చట్టము ప్రకారం భార్యకాని లేదా, ఆమె భర్తకాని బతికి ఉండగా విడాకులివ్వకుండా రెండవ వివాహం చేసుకోరాదు. 1956వ సం॥ చట్టం ప్రకారము, ఆస్తిలో కొడుకులతో పాటు, కూతుళ్ళకు, విధవ స్త్రీలకు కూడా సమాన ఆస్తి హక్కు ఉంది. స్త్రీకి కూడా దత్తత చేసుకొనే అధికారం వచ్చింది. మగ పిల్లవానిని దత్తత చేసుకొనినట్లే ఆడపిల్లను కూడా దత్తత చేసుకోవడానికి అర్హత లభించింది.

### 12.3.1 స్త్రీ విద్య

స్త్రీల పురోభివృద్ధికి విద్య అత్యవసరము. స్త్రీ విద్యావ్యాప్తికి క్రైస్తవ మత మిషనరీలు కారకులని చెప్పవచ్చు. స్త్రీలు ఎక్కువ శాతం నిరక్షరాస్యులుగా గృహస్థ జీవితాన్ని గడుపుతూ కూపస్థ మండూకాలవలె కాలం వెళ్ళబుచ్చుతున్నారు. ఈ దారుణ పరిస్థితిని మహాత్మా గాంధీజీ పూర్తిగా అర్థం చేసుకున్నాడు. అందుకే 'నాతి వికాసం జాతి వికాసం' అన్నాడు గాంధీజీ. స్త్రీ విద్యా వంతురాలయితే కుటుంబ సభ్యులంతా విద్యావంతులయినట్లేనని గాంధీజీ విశ్వాసము. వార్ధా పథకంలో బాలబాలికల మధ్య భేదం చూపలేదు.

స్త్రీల విద్యా బోధనకు, విద్యా వ్యాప్తికి భారత ప్రభుత్వము పంచవర్ష ప్రణాళికలో ప్రత్యేకంగా ధనాన్ని కేటాయించింది. దేశంలోని బాలికల సంఖ్యతో పోల్చిచూస్తే, స్త్రీ విద్యావకాశానికి ప్రస్తుతమున్న వసతులు సరిపోయినంతగా లేవనే చెప్పవచ్చు.

### 12.3.2 స్త్రీలు - ఆరోగ్యము

స్త్రీల ఆరోగ్యాన్ని గురించి ప్రభుత్వమూ, జాతీయ, అంతర్జాతీయ ఆరోగ్య సంస్థలూ ప్రత్యేక కృషి చేస్తున్నాయి. భారత దేశంలోని అనేక పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో మాతాశిశు సంరక్షణ కేంద్రాలను ప్రభుత్వం వారు విరివిగా స్థాపించినారు. సమాజంలో కనీసం 40% పైగా దారిద్ర రేఖకు దిగువన వుంటున్న ఈ స్థితిలో కుటుంబ నియంత్రణను సరిగా పాటించనందు వలన మన దేశంలో ప్రసూతి మరణాల సంఖ్య ఎక్కువగానే ఉండి, స్త్రీలు రక్తహీనత, నీరసం లాంటి వాటికి గురి అవుతారు. పదిమంది అనారోగ్యవంతులైన శిశువులకన్నా ఒక్క ఆరోగ్య వంతమైన సంతానాన్ని కనిపించుకోవడం వల్ల స్త్రీ యొక్క ఆరోగ్యం ఎల్లవేళలా బాగుంటుంది.

### 12.3.3 వివిధ వృత్తులలో స్త్రీలకు అవకాశాలు

దేశంలోని అన్ని ప్రభుత్వోద్యోగాలను చేపట్టడానికి, పురుషులతో సమానంగా స్త్రీలకు కూడా ప్రభుత్వము అవకాశం కల్పించింది. భారత దేశంలో 1960వ సం॥ నాటికే వైద్య, ఆరోగ్య శాఖలలోని ఉద్యోగాలలో సుమారు 80,000 మంది స్త్రీలున్నారు. స్వాతంత్ర్యానంతరము వివిధ వృత్తులలో విద్య, బ్యాంకులు, వివిధ రకములైన ఆఫీసులలో స్త్రీలకు ఉద్యోగావకాశం లభించింది.

### 12.3.4 కేంద్ర సాంఘిక సంక్షేమ సంఘము : స్త్రీ సంక్షేమము

1953 సం॥లో ఏర్పాటైన కేంద్ర సాంఘిక సంక్షేమ సంఘము భారతదేశంలో అనేక సాంఘిక సేవా కార్యక్రమాలను నిర్వహించింది. స్త్రీ సంక్షేమ, పునరావాస కార్యక్రమాలకోసం కృషి చేస్తున్న అనేక స్వచ్ఛంద సాంఘిక సేవా సంస్థలకు, కేంద్ర సాంఘిక సంక్షేమ సంఘము విరివిగా ఆర్థిక సహాయం చేసింది. ఈ సంఘము పట్టణ ప్రాంతాలలో అనేక సంక్షేమ ప్రాజెక్టులను నిర్వహించడం ద్వారా స్వల్ప ఆదాయంగల కుటుంబాలలోని స్త్రీల ఆదాయాన్ని పెంపొందించుకోవడానికి సహాయం చేసింది.

### 12.3.5 స్త్రీలు, రాజకీయ హక్కులు

ఏ సమాజంలో అయినా స్త్రీల పురోభివృద్ధికి వారి రాజకీయ హక్కులు చాలా ముఖ్యమైనవి. 1947వ సం॥లో స్త్రీ పురుష విచక్షణ లేకుండా 21 సం॥లు దాటిన వారందరికి ఓటు హక్కు లభించింది. 1985 సం॥లో 61వ రాజ్యాంగ సవరణ ద్వారా, 18 సం॥లు దాటిన

వారందరికి మనదేశంలో ఓటు హక్కు లభించింది. ఇదే కాకుండా స్త్రీలు అసెంబ్లీ సభ్యత్వానికి, పార్లమెంట్ సభ్యత్వానికి ఇంకా వివిధ రకములైన సభ్యత్వానికి పోటీ చేయడానికి హక్కు ఉన్నది.

## 12.4 బాలలు, వికలాంగుల సంక్షేమము

ఏ దేశ సౌభాగ్యమైనా ఆ దేశం యొక్క భౌతిక సంపదతోబాటు, ఆ దేశ పౌరుల శక్తి, సామర్థ్యాల మీద ఆధారపడి ఉంటుంది. ఈనాటి బాలబాలికలే రేపటి పౌరులన్న పరమసత్యాన్ని మనము మరవరాదు. కాబట్టి, శిశువుల ఆరోగ్యాన్ని, మేధాశక్తిని, మానసిక ధైర్యాన్ని పెంపొందించి, వారిలో సమగ్ర వ్యక్తిత్వాన్ని వికసింపజేయవలసిన బాధ్యత సమాజం మీద ఉంది. సమాజంలోని అనాధ బాల బాలికలు, వికలాంగులైన కుంటి, గ్రుడ్డి, మూగ పిల్లలు మానసిక వ్యాధితో బాధపడే పిల్లలు ఈ వర్గాల వారి సంక్షేమం కోసం ప్రభుత్వమూ, సమాజమూ అనేక ప్రత్యేక శ్రద్ధాసక్తులతో కృషి చేయవలసిన అవసరమున్నది.

### 12.4.1 భారతదేశంలో బాలల సంక్షేమము

భారత రాజ్యాంగంలో బాలల సంక్షేమము కోసం ఈవిధంగా పేర్కొన్నారు.

1) 14 సం॥ల లోపు బాల బాలికలను ఎవ్వరిధీ కర్మాగారాలలో గాని, గనులలో గాని లేదా మరే కష్టమైన పనులలో గాని వినియోగించరాదు.

2) పిల్లలను గాని, యువ జనులను గాని, ఎవ్వరూ తమ స్వార్థానికి బలి చేయరాదు. పిల్లలను నైతికంగాను, భౌతికంగాను ఇతరుల బాధనుంచి రక్షించవలెను.

3) భారత రాజ్యాంగాన్ని రూపొందించినప్పటి నుంచి 10 సం॥ల లోపుగా, 14 సం॥ల కంటె తక్కువ వయసు గల పిల్లలందరికి ఉచిత, నిర్బంధ విద్య ఇవ్వడానికి ఏర్పాటుదల చూపవలెను.

### 12.4.2 పిల్లలు - విద్య

భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత భారత ప్రభుత్వము విద్యావ్యాప్తికి గట్టి కృషి చేసింది. కాని 14 సం॥లలోపు వయసు గల బాల బాలికల ఉచిత, నిర్బంధ విద్యా లక్ష్యాన్ని ఇంకా సాధించవలసి ఉన్నది.

### 12.4.3 శిశు ఆరోగ్యం

దేశంలో ప్రస్తుతమున్న మాతాశిశు సంక్షేమ ఆరోగ్య కేంద్రాల సంఖ్య అవసరానికి చాలినంతగా లేదు. దీనికి తోడు ఈ ఆరోగ్య కేంద్రాలు ఎక్కువగా పట్టణ ప్రాంతాలలో కేంద్రీకృతమై ఉన్నాయి.

### 12.4.4 నిరాశ్రయులైన శిశువులు, బాలబాలికలు

మన దేశంలో శిశు నిరాశ్రయుల సంఖ్య చాలా ఎక్కువ. ఈ సంక్షేమానికి మహారాష్ట్ర, గుజరాత్, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, ఉత్తర ప్రదేశ్, ఢిల్లీ మొదలైన రాష్ట్రాల్లో అనేక సహాయ సంస్థలు పనిచేస్తున్నాయి. దేశంలోని కొన్ని ఆశ్రమాలు, వివిధ మత సంస్థలు, రామకృష్ణ మిషన్ గృహాలు, మరియు మదర్ థెరిసా సేవా సంస్థ మొదలైనవి నిరాశ్రయులైన శిశువులకోసం కృషి చేస్తున్నాయి.

### 12.4.5 పిల్లలు - యాచన

సమాజంలోని కొందరు, తమ స్వార్థానికి శిశువులను అమానుషంగా వికలాంగులను చేసి, వారిని యాచక వృత్తిలోకి బలవంతంగా దింపడం మనదేశంలో అక్కడక్కడ కనిపిస్తున్నది. కాబట్టి, శిశు యాచక వృత్తిని రూపుమాపవలసిన అవసరము ప్రభుత్వంపైన ఉన్నది.

### 12.4.6 బాలనేరము

సమాజము ఎదుర్కొంటున్న సమస్యలలో బాల నేరము చాలా ముఖ్యమైనది. దేశములో పారిశ్రామికీకరణము, నాగరీకరణము వీటి మూలంగా ఏర్పడిన సాంఘిక పరిస్థితుల కారణంగా సమాజంలో బాల నేరాలకు దోహదం చేసినాయి. పై కారణాల వల ఎన్నో నేల

కుటుంబాలు గ్రామ ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాలకు వలస వెళ్ళడం వల్ల, బాల బాలికలు నూతన పట్టణ వాతావరణంతో సరిగా ఇమడటానికి అనువైన సామాజిక పరిస్థితులు లేకపోవడం బాలనేరాలు ఎక్కువ కావడానికి కారణమని చెప్పవచ్చు.

### 12.4.7 స్వతంత్ర్యానంతరము ప్రభుత్వ సహాయక చర్యలు

భారత దేశానికి స్వాతంత్ర్యం లభించిన తరువాత, ప్రభుత్వం, బాల నేరస్తులను, బాలనేరానికి సంబంధించిన సమస్యలను మానవతాదృష్టితో పరిశీలించ సాగింది. బాలనేర విషయాన్ని విద్యా విషయంలో ఒక భాగంగా పరిగణించినారు. తరువాత, ఈ బాలనేర విషయము సాంఘిక సంక్షేమ మంత్రిత్వ శాఖతో జతచేర్చినారు. బాల నేరస్తులను విచారించడానికి దేశంలో ప్రత్యేకంగా బాలల న్యాయస్థానాలను స్థాపించినారు.

### 12.4.8 బాల నేరస్తుల పునరావాసము

బాల నేరస్తులకు సాంఘిక పునరావాసం కల్పించడం కోసం వారిని సర్టిఫయిడ్ పాఠశాలల్లో ఉంచుతారు. ఈ పాఠశాలల్లో బాలనేరస్తుల వ్యక్తిగత చరిత్రను పరిశీలించి, వివిధ వృత్తులలో, మరమగ్గాల నేతలోను, చేనేత వృత్తులలోను, వ్యవసాయ కార్యక్రమాలలోను శిక్షణ నిచ్చుతున్నారు.

### 12.4.9 వికలాంగుల, నిరాశ్రయుల సంక్షేమము

భారత దేశము, పారిశ్రామిక రంగంలో ఇంకా గణనీయమైన ప్రగతిని సాధించక పోవడం వల్ల, అర్హులైన ప్రజలందరికీ ఉపాధి సౌకర్యాలు లేవు. ఇక వికలాంగుల సంగతి వేరుగా చెప్పనవసరం లేదు. వీరు తమ దురదృష్టకర పరిస్థితుల మూలంగా సమాజంలోని కొన్ని అవకాశాలను, సదుపాయాలను కోల్పోతున్నారు. వీరు సమాజంలోని ఇతర వ్యక్తుల కంటె ఏమాత్రం లోపము గలవారు కాదనే గట్టి భావాన్నీ, నమ్మకాన్నీ వారిలో కలిగించవలసిన బాధ్యత సమాజంలోని ప్రజలందరి పైన, ప్రభుత్వంపైన ఉన్నది.

## 12.5 పున: పరిశీలన

ఆది నుంచి భారతదేశంలో జరిగిన సామాజిక పరివర్తన క్రమబద్ధమైనది కాదు. అంతేగాక, భారతదేశంలో పెద్ద ఎత్తున ప్రణాళికలపై మార్పులు తీసుకొనిరావడానికి ప్రయత్నాలేవీ జరగలేదు. గ్రామ సీమలలో ప్రజల జీవన ప్రమాణాన్ని మెరుగు పరచవలెనంటే, అక్కడి ప్రజారంగాలన్నింటిలోనూ ఒక తీరుగా అభివృద్ధి జరుగవలెను. గ్రామీణ పునర్నిర్మాణాభివృద్ధి కార్యక్రమాల కోసం జరిగే కృషి ప్రభుత్వ పరమైనది కాకుండా ప్రజల నుంచే వెలువడినదిగా ఉండవలెను. అలాంటప్పుడే భారతదేశము ప్రగతిని సాధించగలదు.

సమాజంలోని బలహీన వర్గాల ప్రజలను అభివృద్ధి లోనికి తీసుకొని రావలెనంటే, దేశ ప్రజలందరికి సమానంగా లభించే సాధారణ సదుపాయాలతోబాటు కొన్ని ప్రత్యేక సదుపాయాలను, ప్రత్యేకమైన కొన్ని మినహాయింపులను వారికి అందజేయవలెను. వీరు సాధారణ ప్రజలలో ఒక భాగమైనప్పటికి, అనేక శతాబ్దాల నుంచి సాంఘికంగా, ఆర్థికంగా వెనుకబడి ఉండటం మూలంగా అధిక స్థాయిని సాధించలేకపోతున్నారు. కాబట్టి ప్రభుత్వ ఉద్యోగాలలో కొంతశాతం వీరికి ప్రత్యేకంగా కేటాయించడం భారత ప్రభుత్వం కల్పించింది.

1950 సం॥లో రూపొందించిన భారత నూతన రాజ్యాంగం ప్రకారం స్త్రీకి పురుషునితో బాటు సమాన హక్కులు లభించినాయి. స్త్రీల పురోభివృద్ధికి విద్య అత్యవసరము. స్త్రీ విద్యావంతురాలయితే కుటుంబ సభ్యులంతా విద్యావంతులయినట్టేనని గాంధీజీ విశ్వాసము. కాబట్టి స్త్రీలందరికీ వాళ్ళ అభిరుచి జీవితావసరాలను అనుసరించి విద్య నేర్పవలెను. స్త్రీ విద్యాబోధనకు, విద్యావ్యాప్తికి భారత ప్రభుత్వము పంచవర్ష ప్రణాళికలో ప్రత్యేకంగా ధనాన్ని కేటాయించింది. స్త్రీల ఆరోగ్యాన్ని గురించి ప్రభుత్వము, జాతీయ, అంతర్జాతీయ ఆరోగ్య సంస్థలూ ప్రత్యేక కృషి చేస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాలలో మాతాశిశు సంరక్షణ కేంద్రాలను ప్రభుత్వం వారు విరివిగా స్థాపించినారు. దేశంలోని అన్ని ప్రభుత్వోద్యోగాలను చేపట్టడానికి, పురుషులతో సమానంగా స్త్రీలకు కూడా ప్రభుత్వము అవకాశము కల్పించింది. ఏ సమాజంలో ఆధునా స్త్రీల పురోభివృద్ధికి వారి రాజకీయ హక్కులు చాలా ముఖ్యమైనవి. వీటిని 1947వ సం॥లో భారత దేశంలో స్త్రీ

పురుష విచక్షణ లేకుండా 21 సం॥లు దాటిన వారందరికి ఓటు హక్కు లభించింది. ఈ విధంగా స్త్రీ సంక్షేమము కోసం భారత ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేసింది.

ఏ దేశ సౌభాగ్యమైనా ఆ దేశంయొక్క భౌతిక సంపదతో బాటు, ఆదేశ పౌరుల శక్తి, సామర్థ్యాల మీద ఆధారపడి ఉంటుంది. కాబట్టి శిశువుల ఆరోగ్యాన్నీ, మేధాశక్తినీ, మానసిక ధైర్యాన్ని పెంపొందించి, వారిలో సమగ్ర వ్యక్తిత్వాన్ని వికసింపజేయవలసిన బాధ్యత సమాజంమీద ఉంది. భారత దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించడంతో శిశు సంక్షేమంలో ఒక నూతన దశ ప్రారంభమయింది. స్వాతంత్ర్యం తరువాత మన ప్రభుత్వము బాల నేరస్తులను, బాలనేరానికి సంబంధించిన సమస్యలను మానవతాదృష్టితో పరిశీలించసాగింది. ఇక వికలాంగుల సంగతి చూస్తే వీరు తమ దురదృష్టకరమైన పరిస్థితుల మూలంగా సమాజంలోని కొన్ని అవకాశాలను, సదుపాయాలను కోల్పోతున్నారు. వీరు సమాజంలోని ఇతర వ్యక్తుల కంటే ఏమాత్రం లోపము గలవారు కాదనే గట్టి భావాన్నీ, నమ్మకాన్నీ వారిలో కలిగించవలసిన బాధ్యత సమాజంలోని ప్రజలందరిపైన ప్రభుత్వం పైన ఉన్నది.

## 12.6 నూతన పదజాలం

1. పునరావాసం : తిరిగి క్రొత్త జీవన మార్గాన్ని ఏర్పరుచుట.
2. సర్వతోముఖాభివృద్ధి : మానవుని ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక, సాంఘిక అభివృద్ధి.
3. వికేంద్రీకరణ : పరిపాలన వివిధ స్థాయిలలో జరుగుటకు వివిధ వర్గాలుగా విభజించుట.
4. పరదా : స్త్రీ పూర్తి శరీరాన్ని కప్పుతూ ధరించే వస్త్రము.
5. నిర్వాసితులు : భారతదేశ విభజన జరిగినపుడు ఆశ్రయమును కోల్పోయినవారు.
6. స్వచ్ఛంద సాంఘిక సేవాసంస్థలు : ఏ నిర్బంధము, చట్టముల ప్రమేయము లేక సమాజ సేవ కొరకు ఏర్పడిన సేవాసంస్థలు.
7. స్త్రీల పురోభివృద్ధి : స్త్రీల శారీరక, మానసిక, సాంఘిక, సాంస్కృతిక అభివృద్ధి.
8. నిరాశ్రయులు : అనాధలు, ఏ కారణం వల్లనైనా తన తల్లిదండ్రులకు, బంధువర్గానికి దూరమైన వారు.
9. బాల నేరస్థులు : 14 సం॥ల వయస్సు అంతకంటె తక్కువ వయస్సు గల నేరస్థులైన బాలబాలికలు.
10. వికలాంగులు : శారీరకంగా గాని మానసికంగా గాని లోపములున్న వారు.

## 12.7 నమూనా ప్రశ్నలు

1. బలహీన వర్గాలనగానేమి? సమాజంలోని బలహీన వర్గాల సంక్షేమ ఆవశ్యకతను గురించి వ్రాయుము.
2. స్త్రీ సంక్షేమమును గురించి వ్రాయుము.
3. భారత దేశంలోని బాలల సంక్షేమమును గురించి వ్రాయుము.
4. బాల నేరమును గురించి విశదీకరించుము.

## 12.8 చదువదగిన గ్రంథాలు


1. సమాజము - పరివర్తన ప్రణాళికలు : తెలుగు అకాడమి
2. సమాజ నిర్మితి, పరివర్తన : తెలుగు అకాడమి
3. విద్య - తాత్త్విక, సామాజిక ఆధారాలు : తెలుగు అకాడమి

పాఠం - 13

# భారత దేశంలో సామాజిక శాసనాలు

## 13.0 లక్ష్యాలు

1. సామాజిక శాసనములలో బాల్య వివాహ, హిందూ వివాహ ప్రత్యేక వివాహ మరియు విడాకుల చట్టాల ద్వారా కల్పింపబడిన హక్కులను గ్రహించుట.
2. హిందూ వారసత్వ చట్టము దాని ఆవశ్యకతను గ్రహించుట.
3. దత్తత, పోషణ చట్టమునందలి వివిధ అంగాలను గ్రహించి దత్తతకు కావలసిన అర్హతలను, అనర్హతలను అవగాహన చేసుకొనుట.
4. వరకట్న నిషేద చట్టమును చట్ట పరిధిని గ్రహించుట.
5. కుటుంబ నియంత్రణ, గర్భ స్రావముల చట్టమును గూర్చి తెలుసుకొనుట.
6. సామాజిక శాసనాల అమలులో ఏర్పడిన అవరోధాలను వాటిని తొలగించటానికి ప్రభుత్వ కృషిని గూర్చి తెలుసుకొనుట.

**విషయసూచిక**


13.1 పరిచయం
13.2 బాల్య వివాహ నిరోధము
13.3 హిందూ వారసత్వ చట్టము, 1956
13.4 హిందూ దత్తత, పోషణ చట్టము 1956
13.5 వరకట్న నిషేధ చట్టము
13.6 కుటుంబ నియంత్రణ, గర్భస్రావాల చట్టము
13.7 శాసనాల అమలులో ఏర్పడిన అవరోధాలు వాటిని అధిగమించడానికి శాసనాలు
13.8 పునఃపరిశీలన
13.9 నూతన పదజాలము
13.10 నమూనా ప్రశ్నలు
13.11 చదువవలసిన గ్రంథాలు


## 13.1 పరిచయము

ప్రతి సమాజము తన సమాజ సభ్యులు సక్రమంగా తమ విధులను నిర్వర్తించడానికి కొన్ని నియమాలను నిర్ణయిస్తుంది. ఈ నియమాలను అనుసరించి నడిచే వారిని సమాజ సభ్యులుగా గౌరవిస్తుంది. నియమాలను వ్యతిరేకించే వారిని సమాజము శిక్షిస్తుంది, లేదా సమాజం నుంచి వెలివేయడంగాని, గెంటివేయడం గాని చేస్తుంది. భారత దేశము దీర్ఘకాలం బ్రిటిష్ పరిపాలనలో ఉండటంచేత బ్రిటన్‌లోని సాంఘిక శాసనాలు, సాంఘిక సంక్షేమము, సాంఘిక భీమా, సాంఘిక భద్రతా కార్యక్రమాల ప్రభావము మనదేశంలో సామాజిక శాసనాల మీద ఎక్కువగా ఉన్నది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత భారీ ఎత్తున శాసనాలను మార్చటం జరిగింది.

## 13.2 బాల్యవివాహ నిరోధము

యుక్త వయస్సు రాకమునుపే వివాహం చేయడం భారతీయ సంప్రదాయాలలో ఉంది. వ్యక్తి స్వాతంత్ర్య ధోరణులు ప్రపంచంలో వ్యాప్తి చెందడం మొదలయిన నాటినుంచి వివాహ విషయంలో వ్యక్తి, తనంతట తాను జీవిత సహభాగినిని ఎన్నుకొనే అవకాశము ఉండవలెననే భావము క్రమంగా వ్యాపించింది. కాబట్టి వివాహ వయస్సు పెంచవలెనని ఉద్యమము ప్రారంభమయింది. ఇదే కాకుండా

సమాజంలో బాల్య వివాహాల వల్ల చాలా అనర్థాలు వాటిల్లాయి. జనాభా పెరుగుదల అజ్ఞానం అధికమవడం, స్త్రీకి చిన్న తనంలోనే సంతానం కలగడం వల్ల, అధిక బాధ్యత వల్ల త్వరగా ఆరోగ్యం క్షీణించడం జరిగింది. రాజారామ్ మోహన్ రాయ్, ఈశ్వర చంద్ర విద్యా సాగర్ మొదలైన వారు ఈ దురాచారాన్ని వ్యతిరేకించారు.

1927లో హర విలాస్ శారద బాల్య వివాహాల నివారణకు బిల్లును ప్రవేశ పెట్టినాడు. ఈ బిల్లుకు ప్రజల అండదండలు ఉన్నాయని గ్రహించి, ప్రభుత్వము 1929లో బాల్య వివాహ నిరోధక చట్టాన్ని ఆమోదించింది. దీనినే శారదా చట్టమని కూడా అంటారు. ఇది 1930 ఏప్రిల్ మొదటి తేదీన దేశమంతటా అమలులోకి వచ్చింది. ఈ చట్టం ప్రకారము వివాహ వయస్సు స్త్రీకి 15, పురుషునికి 18 ఉండవలెను. ఎవరైనా అట్లాంటి బాల్య వివాహం చేసినట్లయితే వారు శిక్షార్హులు. 1955 హైందవ వివాహ చట్టంలో వయ' పరిమితి మొదట్లో స్త్రీకి 15, పురుషునికి 18 ఏండ్లని నిర్ణయించినా తరువాత సవరణ ద్వారా స్త్రీకి 18, పురుషునికి 21 పెంచినారు.

### 13.2.1 ప్రత్యేక వివాహ చట్టము

హిందూ సంప్రదాయంలో వివాహాలు కులాలకు పరిమితం. మతాంతర వివాహాలకు అవకాశం ఉండేది కాదు. అలా చేసికొన్నట్లయితే వారు సమాజంలో హక్కులు కోల్పోతారు. కాని 1872లో ఏ కులం వారైన వారికి ఇష్టం వచ్చిన కుటుంబం నుంచి వివాహం చేసికోవచ్చు. ఈ చట్టము 1923లో సవరించడం జరిగింది. కాల పరిస్థితులను బట్టి వచ్చిన మార్పులకు పై చట్టము సరిపడిన విధంగా లేనందు వల్ల అవసరమయిన కారణాన 1954లో ప్రత్యేక వివాహాల చట్టంగా రూపొంది, పాత చట్టము రద్దు అయింది. ఈ సవరణ తర్వాత ప్రతి జిల్లాలోను ఒక వివాహ రిజిస్ట్రారు కార్యాలయం ఏర్పాటు చేశారు.

### 13.2.2 హిందూ వివాహ చట్టము

ఈ చట్టము 1955 నుంచి భారత దేశమంతటికి వర్తింపజేసినారు. హిందువుల వివాహానికి సంబంధించిన నియమాలను, నిబంధనలను క్రోడీకరించి ఈ చట్టాన్ని రూపొందించడం జరిగింది. అందులో కొన్ని షరతులను హిందూస్త్రీ పురుషులు వివాహం చేసుకోవడానికి అమలు పరచవలెను. (1) ఏ ఒకరికీ భార్యగాని భర్తగాని జీవించి ఉండరాదు (2) ఏ ఒక్కరు పిచ్చివారై ఉండకూడదు (3) పెండ్లి కుమారుని వయస్సు 21, పెండ్లి కుమార్తె వయస్సు 18 సంవత్సరాలు నిండవలెను (4) ఆచారము అనుమతిస్తే తప్ప వివాహ సంబంధానికి వరుసకాని వారై ఉండకూడదు.

### 13.2.3 విడాకులు

హైందవ సమాజంలో వివాహమనేది విడదీయరాని పవిత్ర బంధమనే అభిప్రాయము ప్రబలి వుంది. కాని, మారుతున్న విలువలను బట్టి ఈ అభిప్రాయంలో మార్పు వస్తున్నది. 1955 లో అమలులోకి వచ్చిన హిందూ వివాహాల చట్టము విడాకుల విషయంలో సమగ్రమయిన నిబంధనలను రూపొందించింది. అది దేశవ్యాప్తంగా వర్తిస్తుంది. విడాకులు కోరడానికి కారణాలేవనగా (1) ఇద్దరిలో ఏ ఒక్కరయినా అవినీతికి అలవాటుపడటం (2) కుష్టు, సుఖవ్యాధులుండటం (3) సన్యాసం స్వీకరించడం (4) ఏడేండ్లుగా కన్పించకుండా జీవించి ఉన్నారన్న విషయం కూడా తెలియకపోవడం (5) న్యాయరీత్యా విడిపొమ్మని న్యాయస్థానం డిక్రీ ఇచ్చిన తరువాత రెండేండ్లకు కూడా సంసారం చేయకపోవడం. ఇదేకాక మరో రెండు కారణాల వల్ల కూడా భార్య విడాకులకు కోరవచ్చు. (1) చట్టం అమలులోనికి రాకముందు భర్త రెండవ వివాహం చేసుకోవడం (2) పెండ్లయిన తరువాత భర్త భార్యను బలత్కారంగా చెరచటం.

విడాకులు కావలెనంటే, వివాహమైన తరువాత మూడు సంవత్సరాలు గడపవలెను. కాని కొన్ని సందర్భాలలో ఘోరంగా హింసించి బాధపెడుతుంటే మూడేండ్లునిండక ముందే విడాకులకు న్యాయ స్థానము అనుమతించవచ్చు. విడాకులిచ్చినా, వివాహాన్ని రద్దు చేసినా, అప్పటికి గర్భం ధరించి ఉండటం ద్వారాగాని, అంతకు ముందుగానే కాని కలిగిన పిల్లలు ఆ ఇరువురి సంతానంగానే గుర్తించడం జరిగి, తల్లిదండ్రుల ఆస్తిపై హక్కును కలిగి ఉంటారు. విడాకులు పొందిన స్త్రీ పోషణ భారాన్ని ఆమెకు వ్యక్తిగతంగా ఉన్న ఆస్తిని బట్టి భర్త ఆర్థిక శక్తిని బట్టి న్యాయస్థానము భరణం రూపంలో నిర్ణయిస్తుంది. ఈ భరణం పొందిన స్త్రీ పర పురుషునితో సంబంధం పెట్టుకొన్న తిరిగి వివాహం చేసుకొన్నా రద్దవుతుంది.

## 13.3 హిందూ వారసత్వ చట్టము, 1956

ఒక ప్రాంతపు సంప్రదాయాలు వేరొక ప్రాంతంలో ఉండవు కాబట్టి న్యాయస్థానాలు ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొనవలసి ఉంటుంది. అన్నింటిని సమకూర్చడం కష్టమయినప్పటికి, చాలామంది న్యాయశాస్త్రజ్ఞుల కృషి ఫలితంగా హిందూ వారసత్వ చట్టం 1956లో రూపొందింది. దీనితో వివిధ రాష్ట్రాలలో అంతవరకు అమలులో ఉన్న వారసత్వ సంప్రదాయాలు, వేర్వేరు చట్టాలు రద్దయినాయి. రాజ్యాంగంలో స్త్రీకి సమాన హక్కు కల్పించడం జరిగింది. కాబట్టి స్త్రీకి కూడా సమాన హక్కులు కల్పించవలెననే నిర్ణయంతో హిందూ వారసత్వ చట్టము అమలులోకి వచ్చింది. ఈ చట్టం ప్రకారం భర్త మరణించినప్పుడు ఆ ఆస్తిపై ఆమె పిల్లలతో సమంగా హక్కును పంచుకొంటుంది. పిల్లలు మైనర్లయితే, భర్త చేస్తున్న అజమాయిషీని తానే చేస్తుంది. సంతానం లేకపోతే భర్త ఆస్తి అంతా భార్యకే దక్కుతుంది. ఆమె తన ఇష్టం వచ్చినట్లు చేసుకోవచ్చు. ఎవరికైనా దత్తత తీసుకొని, తన ఆస్తిపై హక్కును ఏర్పరచటానికి అధికారముంది. ఈమె కూడా చనిపోతే, దత్తత లేని పక్షంలో ఆ ఆస్తి భర్తవైపు వారికి దక్కుతుంది. స్త్రీకి తండ్రివైపు నుంచి కూడా వారసత్వ హక్కు ఉంది. ఈవిధంగా మొత్తంమీద స్త్రీ పురుషునితో బాటు సమాన హక్కును అనుభవిస్తుంది.

## 13.4 హిందూ దత్తత, పోషణ చట్టము 1956

సంతాన హీనులైన స్త్రీ పురుషులు వేరే పిల్లలను పెంచుకొని తన మధ్య ప్రకృతి సిద్ధంగా లేని బంధుత్వాన్ని చట్టరీత్యా ఏర్పరచుకొనే పద్ధతిని దత్తత అని నిర్వచించవచ్చు. భారత దేశంలో పురాతన కాలం నుంచి ఈ పద్ధతి అమలులో ఉన్నది. వివిధ ప్రాంతాలలోని సంప్రదాయాలను, పద్ధతులను సేకరించి అన్నింటికి అనుగుణంగా ఉండేటట్లు, హిందూ దత్తత, పోషణ చట్టము 1956 డిసెంబరు 21వ తేది నుంచి అమలులోనికి వచ్చింది. పురాతన చట్ట ప్రకారము బాలుడు మాత్రమే దత్తత స్వీకారానికి అర్హుడు. కాని ప్రస్తుత చట్ట ప్రకారము బాలిక కూడా దత్తత స్వీకారానికి అర్హురాలే.

ఈ క్రింది అర్హతలు లేకపోయినట్లయితే దత్తత చట్ట బద్ధమయినదిగా గుర్తింపబడదు.

1. దత్తత స్వీకరించే వ్యక్తి దత్తత స్వీకరించడానికి కావలసిన అర్హత హక్కులు కలిగి ఉండవలెను.
2. దత్తత ఇచ్చే వ్యక్తికి కూడా ఆ అర్హత, హక్కు ఉండవలెను.
3. బాలుడుకాని, బాలికకాని హిందువై ఉండవలెను.
4. దత్తత ఇవ్వబడే బాలుడుకాని, బాలిక కాని అంతకు ముందే ఎవరిచేతా దత్తత స్వీకరించబడి ఉండకూడదు.
5. ఆ బాలుడుకాని, బాలికకాని అవివాహితులై ఉండవలెను.
6. వారు 15 సం॥ల లోపు వయస్సు కలిగిన వారై ఉండవలెను.

ఈ చట్టంలోని 11వ సెక్షన్ ప్రకారం దత్తత స్వీకరించే స్త్రీ, పురుషులు తమ కుమారుడు లేదా మనుమడు లేదా ముని మనుమడు కాని జీవించి ఉన్నట్లయితే దత్తత స్వీకరించరాదు.

## 13.5 వరకట్న నిషేధ చట్టము

నేటి సమాజాన్ని పీడిస్తున్న సమస్యలలో వరకట్నము ఒకటి. ఈ సమస్య మూలంగా దారిద్ర్యాన్ని అనుభవిస్తున్న తల్లిదండ్రులున్నారు. యువతులు ఆత్మహత్య చేసుకొన్న సందర్భాలు అనేకమున్నాయి. సరి అయిన జోడు కుదరక దాంపత్య జీవితంలో సుఖశాంతులు కొరవడుతున్న సంసారాలు ఎన్నో ఉన్నాయి. సాహిత్యము, రేడియో, సినిమా ఇతర ప్రచారక సాధానాల ద్వారా ప్రజలను ఈ సమస్యపై విద్యావంతులను చేయడానికి స్వచ్ఛందమయిన కృషి సాగుతూనే ఉంది. దీనికి తోడు వరకట్నాన్ని అరికట్టడానికి శాసన బద్ధమయిన చర్యలు కూడా తీసుకోవలెనని చాలాకాలం నుంచి కృషి సాగుతున్నది. కొంతమంది సభ్యులు లోక్ సభలో దీనిని ప్రైవేట్ బిల్లుగా ప్రవేశ

పెట్టినారు. ఈ కృషి ఫలితంగా చిట్ట చివరికి ప్రభుత్వము వరకట్న నిషేధ బిల్లును 1960లో ఆమోదించింది. వివాహ సందర్భంలోనైనా, ఆ తరువాతనైన పెండ్లి కుమార్తె తండ్రి పెండ్లి కుమారునికి ఏ రూపంలోనయినా కట్నమివ్వరాదు. అలా ఇవ్వడం జరిగితే ఈ చట్టం కింద జరిమానా లేదా జైలుశిక్ష లేదా రెంటిని విధించవచ్చు.

## 13.6 కుటుంబ నియంత్రణ, గర్భస్రావాల చట్టము

కుటుంబ నియంత్రణ జానాభాను తగ్గించడమే కాకుండా స్త్రీ జీవితంలో చాల పరివర్తనను కూడా కలిగిస్తుంది. అధికంగా పిల్లలను కంటూ ఉంటే ఆరోగ్యం క్షీణిస్తుంది. అలా లేనప్పుడు, స్త్రీ తన ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతో బాటు తన కాలాన్ని ఉద్యోగం మొదలయిన వ్యాపకాలకు వినియోగించుకోవచ్చు. జనాభా విపరీతంగా పెరుగుతున్న భారతదేశం వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలలో కుటుంబ నియంత్రణను పాటించేటట్లు చేయడం ఎంతైనా అవసరము. అందుకే ఈ పద్ధతికి అధిక ప్రాధాన్యమిస్తున్నారు.

గర్భస్రావమును దేశంలోను ఇంకా చాలా దేశాలలోను చట్ట విరుద్ధము. కేంద్ర కుటుంబ నియంత్రణ మండలి సదహారవ సమావేశంలో చేసిన సూచనను అనుసరించి గర్భస్రావం చేసుకోవడాన్ని చట్టబద్ధం చేసే విషయాన్ని పరిశీలించడానికి కేంద్ర ప్రభుత్వము 1964లో ఒక సంఘాన్ని నియమించింది. ఈ సంఘం తన నివేదికను 1966వ సం॥లో సమర్పించింది. ఈ నివేదికను అనుసరించి కేంద్ర ప్రభుత్వము 1971 వైద్య పరంగా గర్భ స్రావ చట్టాన్ని ఆమోదించింది. ఇది 1972 ఏప్రిల్ 1 నుంచి అమలులోనికి వచ్చింది. ఈ చట్టం ప్రకారము గర్భం ధరించిన స్త్రీ తనకు సంతానము అక్కర లేదనుకుంటే ఆ గర్భాన్ని వైద్యుల ద్వారా తొలగించుకోవడానికి అనుమతి లభిస్తుంది. గర్భస్రావాలను ప్రోత్సహించే కంటే, ఇతరమయిన సంతాన నిరోధక పద్ధతులను అవలంబించడం ఆరోగ్య దృష్ట్యా మంచిదని వైద్యులు అభిప్రాయము. సంతాన నిరోధక పద్ధతులు బహుళంగా ప్రచారంలోకి వచ్చినాయి. కాబట్టి సంతానము అక్కరలేదను కొన్నవారు గర్భధారణ జరగకుండా ముందుగానే జాగ్రత్త పడుతున్నారు.

## 13.7 శాసనాల అమలులో ఏర్పడిన అవరోధాలు వాటిని అధిగమించడానికి శాసనాలు

కుటుంబ నియంత్రణా కార్యక్రమాలు 1951 నుంచి అమలులోనికి వచ్చినప్పటికీ ఉధృతంగా కార్యక్రమాలు అమలు పరచడం 1965 నుంచి మాత్రమే అని చెప్పవచ్చు. దినదినాభివృద్ధి చెందుతున్న జనాభాను అరికట్టడానికి ప్రభుత్వము అనేకమయిన చర్యలు తీసుకుంటున్నప్పటికీ, దేశంలోని వివిధ మతాలు, వర్గాలు అవలంబిస్తున్న ఆచార వ్యవహారాలు, కట్టుబాట్లు కుటుంబ నియంత్రణా కార్యక్రమాలను అమలు పరచడంలో ఆటంకాలను కలిగిస్తున్నావి. వీటికి కారణం నిరక్ష్యరాస్యత ఆర్థిక ఇబ్బందులు ప్రజలలో ఈ సమస్యను గురించి పూర్తి జ్ఞానం లేకపోవడం. ఈ కార్యక్రమం అమలుకు అవరోధాలవుతున్నవి.

కుటుంబ నియంత్రణా కార్యక్రమాల అమలులో ఎదురవుతున్న ఆటంకాలను ఎదుర్కోవలెనంటే ప్రభుత్వము ఈ క్రింది చర్యలను తీసుకొనవలెను.

1) జనాభా పెరుగుదల సమస్యను గూర్చి ప్రజలను విద్యావంతులను చేయడం.

2) నిరక్ష్యరాస్యులకు దృశ్య శ్రవణాత్మక పద్ధతుల ద్వారా సమస్య గురించి తెలియజేయడం.

3) వయోజనులకు లైంగిక పరిజ్ఞానం కలిగించడం.

4) ప్రచారము అన్ని భాషల వారికీ అందుబాటులో ఉండేటట్లు చేయడం.

5) బలహీన వర్గాల ఆర్థిక, సాంఘిక పరిస్థితులు మెరుగుపరచడం.

6) కుటుంబ నియంత్రణా సాధనాలు అన్ని వర్గాల వారికీ, గ్రామీణ ప్రజలకు అందుబాటులో ఉండేటట్లు చేయడ

7) స్త్రీ విద్యను ప్రోత్సహించడం.

8) వివాహ వయోపరిమితిని పెంచడం.

పై చెప్పిన సూత్రాలను పాటించినచో చాలావరకు కుటుంబ నియంత్రణ అమలులో ఎదురవుతున్న ఆటంకాలను ఎదుర్కొనవచ్చును.

## 13.8 పునః పరిశీలన

ప్రతి సమాజము తన సమాజ సభ్యులు సక్రమంగా తమ విధులను నిర్వర్తించడానికి కొన్ని నియమాలను నిర్ణయిస్తుంది. భారదేశము దీర్ఘకాలం బ్రిటిష్ పరిపాలనలో ఉండటం చేత బ్రిటన్‌లోని సాంఘిక శాసనాలు, సాంఘిక సంక్షేమము, సాంఘిక భీమా, సాంఘిక భద్రతా కార్యక్రమాల ప్రభావము మన దేశంలో సామాజిక శాసనాల మీద ఎక్కువగా ఉన్నది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత భారీ ఎత్తున శాసనాలను మార్చటం జరిగింది.

1927లో హర విలాస్ శారద బాల్య వివాహాల నివారణకు బిల్లును ప్రవేశ పెట్టినాడు. ఈ బిల్లుకు ప్రజల అండదండలు ఉన్నాయని గ్రహించి, ప్రభుత్వము 1929లో బాల్య వివాహ నిరోధక చట్టాన్ని ఆమోదించింది. దీనినే శారదా చట్టమని కూడా అంటారు. ఈ చట్టం ప్రకారము వివాహ వయస్సు స్త్రీకి 15, పురుషునికి 18 ఉండవలెను. 1955 హైందవ వివాహ చట్టంలో వయః పరిమితి మొదట్లో స్త్రీకి 15, పురుషునికి 18 ఏండ్లని, నిర్ణయించిన తరువాత సవరణ ద్వారా స్త్రీకి 18, పురుషునికి 21 పెంచినారు.

హిందూ సంప్రదాయంలో వివాహాలు కులాలకు పరిమితం. మతాంతర వివాహాలకు అవకాశం ఉండేది కాదు. కాని 1872లో వచ్చిన చట్టం వచ్చింది. ఇందులో ఏ కులం వారైన వారికి ఇష్టం వచ్చిన కుటుంబం నుంచి వివాహం చేసుకోవచ్చును. పై చట్టం 1923లో సవరించడం జరిగింది. మరల 1954లో ప్రత్యేక వివాహాల చట్టంగా రూపొందింది.

1955 నుంచి హిందూ వివాహ చట్టము అమలులోనికి వచ్చింది. హిందువుల వివాహానికి సంబంధించిన నియమాలను, నిబంధలను క్రోడీకరించి ఈ చట్టాన్ని రూపొందించటం జరిగింది.

హైందవ సమాజంలో వివాహమనేది విడదీయరాని పవిత్ర బంధమనే అభిప్రాయము ప్రబలివుంది. కాని మారుతున్న విలువలను బట్టి ఈ అభిప్రాయములో మార్పు వస్తున్నది. 1955 అమలులోకి వచ్చిన హిందూ వివాహాల చట్టము విడాకుల విషయంలో సమగ్రమయిన నిబంధనలను రూపొందించింది. అది దేశవ్యాప్తంగా వర్తిస్తుంది.

రాజ్యాంగంలో స్త్రీకి సమాన హక్కు కల్పించడం జరిగింది. కాబట్టి స్త్రీకి కూడా సమాన హక్కులు కల్పించవలెననే నిర్ణయంతో హింధూ వారసత్వ చట్టం 1956లో అమలు లోనికి వచ్చింది.

వివిధ ప్రాంతాలలోని సంప్రదాయాలను పద్ధతులను సేకరించి అన్నింటికి అనుగుణంగా ఉండేటట్లు హిందూ దత్తత, పోషణ చట్టము 1956 డిసెంబరు 21వ తేది నుంచి అమలులోనికి వచ్చింది. పూర్వం బాలుడు మాత్రమే దత్తత స్వీకారానికి అర్హుడు కాని ఈ చట్టం ప్రకారము బాలిక కూడా దత్తతకు అర్హురాలే.

నేటి సమాజాన్ని పీడిస్తున్న సమస్యలలో వరకట్నము ఒకటి. ప్రభుత్వము వరకట్న నిషేధ బిల్లును 1960లో ఆమోదించింది. కుటుంబ నియంత్రణ జనాభాను తగ్గించడమే కాకుండా స్త్రీ జీవితంలో చాలా పరివర్తనను కూడా కలిగిస్తుంది. గర్భస్రావము మనదేశంలోను ఇంకా చాలా దేశాలలోను చట్ట విరుద్ధము. కాని కేంద్ర కుటుంబ నియంత్రణ మండలి సూచనను అనుసరించి, కేంద్ర ప్రభుత్వము 1971లో వైద్య పరంగా గర్భస్రావ చట్టాన్ని ఆమోదించింది. ఇది 1972 ఏప్రిల్ 1 నుంచి అమలులోనికి వచ్చింది.

శాసనాల ద్వారా సామాజిక సమస్యలను పరిష్కరించి సంక్షేమ పరిస్థితులను నెలకొల్పే బాధ్యత ఆధునిక ప్రభుత్వాల మీద ఉన్నదనే విషయాన్ని తెలుసుకోవలసిన అవసరముంది.

7)

## 13.9 నూతన పదజాలము

1. సామాజిక ఉద్యమము : సమాజంలోని కొన్ని ఆచారాలు సామాజిక ప్రగతి నిరోధకాలయినప్పుడు వాటిని తొలగించుటకు చైతన్య వంతులయిన కొందరి ప్రయత్నము.

2. సామాజిక చట్టం : ఉద్యమాల ద్వారా కొంత మార్పును తెచ్చిన ఆచారాలను బలవంతంగా మాన్పించేందుకు ప్రభుత్వం రూపొందించే చర్య.

3. దత్తత : ఇతరుల సంతానానికి స్వంత సంతానానికి గల హక్కు, బాధ్యతలను అప్పగిస్తూ చేసుకొనే ఒప్పందము.

4. వరకట్నము : వివాహానికి వస్తుపరమైన లేక ధన పరమైన ఆస్థి ప్రాతిపధిక అయితే దానిని వరకట్నమంటారు.

## 13.10 నమూనా ప్రశ్నలు

1. శాసనాల మూలంగా సమాజంలో స్త్రీ అంతస్థులో వచ్చిన మార్పులను గురించి వ్రాయుము.

2. ఈ క్రింది వాటిని గురించి వ్రాయుము.

   (1) వితంతు వివాహము (2) ప్రత్యేక వివాహ చట్టము (3) విడాకులు (4) శారదా చట్టము.

3. హిందూ దత్తత పోషణ చట్టమును గురించి విపులంగా వ్రాయుము.

4. కుటుంబ నియంత్రణ అనగానేమి? దీని అమలులో ఏర్పడిన అవరోధాలను, వాటిని అధిగమించడానికి కావలసిన మార్గాలను గురించి వ్రాయుము.

## 13.11 చదువవదగిన గ్రంథాలు


1. సామాజిక సమస్యలు - శాసనాలు : తెలుగు అకాడమి

2. భారతీయ సమాజం : తెలుగు అకాడమి

పాఠం - 14

# భారతదేశములో సామజిక పరివర్తన - ఆధునికీరణము - నిర్వచనము, స్వభావము మరియు పాత్ర

## 14.0 ఉద్దేశ్యాలు, లక్ష్యాలు

భారతదేశములో సామాజిక పరివర్తన తీరు తెన్నులను వివరించడం ఈ భాగం ముఖ్యఉద్దేశం. ఈ భాగం చదివని తర్వాత మీరు

- భారతదేశంలోని సామాజిక పరివర్తనను అర్థం చేసుకోగలరు.
- ఆధునికీకరణం ప్రక్రియును నిర్వచించగలరు.
- సామాజిక పరివర్తనలో ఆధునికీకరణ పాత్రను అర్థంచేసుకోగలరు.

విషయసూచిక


14.1 పరిచయం

14.2 భారతదేశంలో సామాజిక పరివర్తన - ఆధునికీకరణం

14.3 సారాంశము

14.4 నమూనా ప్రశ్నలు

14.5 చదువదగిన గ్రంథాలు


## 14.1. పరిచయం

సామాజిక నిర్మితిలో, సామాజిక సంబంధాలలో మార్పును సామాజిక పరివర్తనగా వివరిస్తారు. ఆధునికీకరణ ప్రక్రియ ఫలితంగా భారతదేశంలో సామాజిక పరివర్తన ఏర్పడింది. ఈ అధ్యాయంలో భారతదేశంలో సామాజిక పరివర్తన ధోరణులను ఆధునికీకరణ ప్రక్రియ పాత్రను పరిశీలిద్దాం.

## 14.2 భారతదేశంలో సామాజిక పరివర్తన - ఆధునికీకరణం

### 14.2.1 సామాజిక పరివర్తన నిర్వచనం, అర్థం

పరివర్తన ప్రకృతికి సహజధర్మము. ప్రకృతిలోని అనేకాంశాల వలెనే సామాజిక వ్యవస్థలలో, సామాజిక సంబంధాలలో కాలక్రమంగా పరివర్తన ఏర్పడుతుంది.

స్థూలంగా చెప్పవలెనంటే కాలాన్నిబట్టి సామాజిక సంబంధాలలో కలిగే మార్పులే సామాజిక పరివర్తనలు. సమాజంలోని వివిధ అంశాలయిన వ్యక్తుల పాత్ర- అంతస్తుల, నిర్మితులు, ప్రమాణాలు, విలువలు, సంస్థలలో ఏర్పడే మార్పులన్నీ సామాజిక పరివర్తనలో ఇమిడి ఉంటాయి.

"సామాజిక పరివర్తన అంటే సామాజిక సంబంధాలలో కలుగుతున్న మార్పులు మాత్రమే. సామాజిక పరివర్తన సాంస్కృతిక పరివర్తన కంటే భిన్నమైంది" అని సామాజిక పరివర్తనను మెకైవర్, పేజ్‌లు వివరించినారు.

గిల్లిన్ మరియు గిల్లిన్‌ల అభిప్రాయం ప్రకారం "స్థిరపడిన సామాజిక జీవన విధానంలో మార్పులు కల్గడమే సామాజిక పరివర్తన. నవ్యకల్పనల ద్వారాగానీ, వ్యాప్తి ద్వారాగానీ, భౌగోళిక పరిస్థితులలో, సాంస్కృతిక సాధనాలలో, జనాభాలో, తాత్త్విక సిద్ధాంతాలలో మార్పులు కల్గడం వల్ల సామాజిక పరివర్తన ఏర్పడుతుంది".

విల్బర్ట్ ఇ. మూర్ నిర్వచనం ప్రకారం "సామాజిక నిర్మితులు, వాటికి అనుబంధమైన ప్రమాణాలు, విలువలు, సాంస్కృతిక ప్రతీకలు, మొదలైన వాటిలో కలిగే మార్పులే సామాజిక పరివర్తన.

సామాజిక పరివర్తన పాక్షికంగా గాని, లేదా సంపూర్ణంగా గాని ఉండవచ్చు. పరివర్తన క్రమబద్ధంగా జరగవచ్చు లేదా క్రమరహితంగా ఉండవచ్చు. పరివర్తన నిర్దిష్టంగా, ప్రయత్నపూర్వకంగా జరగవచ్చు లేదా అప్రయత్నంగా ఉండవచ్చు. సామాజిక వ్యవస్థలలో ఏర్పడిన మార్పులే సామాజిక పరివర్తనలు.

**14.2.2 భారతదేశంలో సామాజిక పరివర్తన లక్ష్యాలు**

భారతదేశంలో గత శతాబ్ది నుంచి పాశ్చాత్య నాగరికతా సంపర్కం వల్ల సామాజిక పరివర్తన గతి తీవ్రతరమైంది. పారిశ్రామికీకరణ, ఆధునికీకరణల ఫలితంగా దేశంలోని అన్ని రంగాలలోనూ గణనీయమైన మార్పులు ఏర్పడినాయి, ఏర్పడుతున్నాయి. స్వాతంత్ర్యానంతరం నిర్మితీయపరంగా సామాజిక, ఆర్థిక వ్యవస్థలలో పరివర్తన తీసుకుని రావడం కోసం కొన్ని సమిష్టి లక్ష్యాలను మన రాజ్యాంగం పేర్కొన్నది. ఈ సమిష్టి లక్ష్యాలు :

1. సామాజిక లక్ష్యాలు (ఉదా॥కు సమానత్వం, సమన్యాయపాలన, స్వేచ్ఛ)
2. ఆర్థిక లక్ష్యాలు (ఆర్థిక పరమైన సమతుల్యపంపిణీ, ప్రణాళికాబద్ధమైన ఆర్థికాభివృద్ధి)
3. రాజకీయ లక్ష్యాలు (రాజకీయ సత్తా వికేంద్రీకరణ, నిర్ణయాలు తీసుకొనే ప్రకియలో ప్రజల భాగస్వామ్యం పరిపాలనలో పారదర్శకత.
4. సాంస్కృతిక లక్ష్యాలు (మత పరమైన సమాజాన్ని లౌకిక సమాజంగా మార్చడం)

**14.2.3 భారతదేశంలో సామాజిక పరివర్తన స్వభావం, దిశ**

భారతదేశంలో సామాజిక పరవర్తన దిశ ఆధునికీకరణ వైపు ఉండటం వల్ల ఎన్నో సామాజిక పరివర్తనలు ఏర్పడినాయి. అనాదినుంచి భారతీయ సమాజం ఉమ్మడి కుటుంబం, కులం అనే రెండు ప్రధాన సామాజిక వ్యవస్థల మీద ఆధారపడి ఉంది. ఈ రెండు వ్యవస్థలు ఈ నాటికి కూడా ఉన్నప్పటికి, వాటి నిర్మితి, ప్రకార్యాలలో చాలా మార్పులు వచ్చినాయి. మన దేశంలో స్వాతంత్ర్యానంతరం సార్వజనీన వయోజన వోటింగ్ మీద ఆధారపడిన స్వయంపాలనా సంస్థలను గ్రామ, రాష్ట్ర, జాతీయస్థాయిలో ప్రవేశపెట్టడం జరగింది. పంచవర్ష ప్రణాళికల ద్వారా ఆర్థికాభివృద్ధిని సాధించడం జరుగుతున్నది. ప్రజలందరికి విద్యావకాశాలు కల్పించడం జరిగింది. వీటన్నింటి వల్ల భారతీయుల దృక్పథాలు మార్పు చెందినాయి. ఈనాడు మనదేశంలో ఆధునికీరణం దిశగా ఇతోధికంగా సామాజిక పరివర్తనలు తీసుకుని రావడానికి ప్రయత్నాలు కొనసాగుతున్నాయి.

**14.2.4. ఆధునికీకరణం భావన, నిర్వచనం**

ఆధునికీకరణ ఒక సామాజిక పరివర్తనా ప్రక్రియ. శాస్త్రీయ, సాంకేతిక పరిజ్ఞానం ఫలితంగా ఏర్పడే సామాజిక పరివర్తనలను ఆధునికీకరణగా వివరించవచ్చు.

విల్బర్ట్‌మూర్ నిర్వచనం ప్రకారం "సాంప్రదాయక సమాజర సమగ్రంగా పరివర్త చెందుతూ, ఆర్థిక సంపన్నత, రాజకీ సుస్థిరతలతో అభివృద్ధి చెందిన పాశ్చాత్యదేశాలలోని సాంకేతిక విధానాలను అనుసరిస్తూ, వాటికి అనుబందమైన సామాజిక వ్యవస్థను రూపొందించుకునే ప్రక్రియే ఆధునికీకరణ". ఐసెన్‌స్టెడ్ (Eisenstadt) అభిప్రాయం ప్రకారం ఆధునికీకరణ భావన సామాజిక వ్యవస్థాపన యొక్క నిర్మితీయ అంశాలకు, సామాజాల సమాజిక- జనాభా తీరమైన అంశాలలో మార్పులను వర్తిస్తుంది. "మానవ కార్యకలాపాలకు ఆధుని శాస్త్రీయ పరిజ్ఞానాన్ని అమలు చేయడమే ఆధునికీకరణ" అని రస్తోవ్, వార్డ్ (Rustow and Ward) లు అభిప్రాయపడినారు.

ఆధునికీకరణం మొదట పాశ్చాత్యదేశాలలో ప్రారంభమయింది. తరవాత క్రమంగా ఇతర దేశాలకు వ్యాప్తి చెందింది. ఆధునిక యుగంలో సాంకేతిక, శాస్త్రీయ రంగాలలో ఎంతో అభివృద్ధి ఏర్పడింది. సులభ సాధ్యమైన రవాణా, భావప్రసార సాధనాలు, ఇన్ఫర్మేషన్

టెక్నాలజీల వల్ల ప్రపంచం 'గ్లోబల్ విలేజి"గా మారింది. దీని వల్ల సమాజాలు పరస్పరం ప్రభావితమవుతున్నాయి. ఈ మార్పులన్నీ ఆధునికీకరణ ప్రక్రియను వివరించే అంశాలే.

### 14.2.5 ఆధునికీకరణ లక్షణాలు, స్వభావం

ఆధునికీకరణ యొక్క లక్షణాలలో ప్రధానమైనవి -యంత్రాల వాడకం,భావప్రసార సాధనాల ఉపయోగించడం, నగరీకరణ, వ్యవసాయపరమైన వృత్తుల స్థానంలో వ్యవసాయేతర వృత్తులు ఏర్పడటం, అక్షరాస్యతరేటు, తలసరి ఆదాయం పెరగడం, సంపాదిత అంతస్తుకు అత్యధిక ప్రాధాన్యత నివ్వడం.

ఆధునికీకరణం చెందుతున్న దేశాలలో ఆర్థికాభివృద్ధికోసం విశేష కృషిజరుగుతుంది. దీని వల్ల ఆర్థికవ్యవస్థలో గణనీయమైన మార్పులు కలుగుతాయి. ఆర్థికాభివృద్ధి సాధించడానికి పారిశ్రామికీకరణ అవసరం. కాబట్టి పారిశ్రామికీకరణకు దారితీసే శాస్త్రీయ, సాంకేతికాభివృద్ధికి, పరిశోధనలకు ప్రోత్సాహం లభిస్తుంది. సామాజిక జీవితంలోని అన్ని రంగాలలో యంత్రాలను వాడటం జరుగుతుంది. ఆధునిక పద్ధతులు ద్వారా వ్యవసాయం చేయడం వల్ల ఉత్పత్తుల పెరుగుతాయి. పారిశ్రామిక, వ్యవసాయ రంగాలలో ఉత్పత్తులు పెరగడంతో జాతీయాదాయం, ప్రజల జీవన ప్రమాణాలు పెరుగుతాయి. వాణిజ్య, వ్యాపారాలు వృద్ధి పొందుతాయి. సమాజంలో నిపుణుల అవసరం ఎక్కువవుతుంది. కాబట్టి వృత్తి నైపుణ్యం గలవారు సమాజంలో అంతస్తును, ప్రాబల్యాన్ని సంపాదిస్తారు. సమాజిక వ్యవస్థలలో గతిశీలత అధికమవుతుంది. సమాజంలో శ్రమవిభజన, ప్రత్యేకీకరణ చాలా పెరిగిపోతుంది.

ఆధునికీకరణ, పారిశ్రామికీకరణల పర్యవసానంగా నగరాలలో జనాభా పెరుగుతుంది. దీనితో బాటు గ్రామాల నుండి నగరాలకు వలస వచ్చేవారి సంఖ్య కూడా పెరుగుతుంది.

ఆధునికీకరణ ప్రక్రియ సాంప్రదాయిక సమాజాల సామాజిక సంబంధాలలో, నిర్మితులలో చాలామార్పులను తీసుకొని వస్తుంది. ఈ మార్పులను పరిశీలిస్తే ఆధునికీకరణ స్వాభావన్నా అవగాహన చేసుకోవచ్చు. ఆధునికీకరణం వల్ల ఏర్పడే మార్పులుగా ఈ అంశాలను పేర్కొనవచ్చు.

1. సాంప్రదాయిక సమాజాలలోని రాచరికం, ఫ్యూడల్ విధానాల స్థానంలో ప్రజాస్వామ్యంపై ఆధారపడిన రాజకీయ వ్యవస్థ చోటు చేసుకుంటుంది.
2. వివేచానాత్మక సమన్వయం ఆధారంగా పాలనా యంత్రాంగాన్ని వ్యవస్థీకరించడం జరుగుతుంది.
3. ఆర్థికాభివృద్ధి సక్రమంగా సాగడానికి, రాజకీయ వ్యవహారాలలో, పరిపాలనలో ప్రజలు చైతన్యవంతంగా పాల్గొనడానికి ప్రజలకు విద్య అవసరము. దీనికోసం విద్యావ్యవస్థలను ఆధునికీకరిస్తారు. ఉచిత ప్రాథమిక విద్యాపథకాలను అమలుపరచడం, శాస్త్రీయ సాంకేతిక విద్యలకు ఎక్కువ ప్రాధాన్యమివ్వడం జరుగుతుంది.
4. మాస్‌మీడియా సాధానాలయిన రేడియో, టెలివిజన్, సినిమా, వార్తాపత్రికలు, ఇంటర్నెట్‌లను ఎక్కువగా వాడతారు.
5. ఆధునికీకరణం వల్ల కుటుంబ వ్యవస్థలో చాలా మార్పులేర్పడతాయి. ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నమై చిన్న కుటుంబాలుగా రూపొందుతాయి. కుటుంబంలో సాంప్రదాయిక, మతపరమైన విలువల ప్రాబల్యం తగ్గిపోతుంది. వైయుక్తిక ధోరణులు ఎక్కువవుతాయి.
6. ఆధునికీకరణ ప్రక్రియలో విభిన్న అభిరుచులను, అవసరాలను తీర్చే ఉద్దేశ్యంతో పనిచేసే స్వచ్ఛందసంస్థలు ప్రధాన పాత్ర వహిస్తాయి.
7. ఆధునిక సమాజంలో సంపాదిత అంతస్తుకు అధిక ప్రాధాన్యముంటుంది. ఆర్థిక, లౌకిక, విలువల ప్రాబల్యం ఎక్కువ.
8. ఆధునికీకరణం చెందిన సమాజాలలోని అన్ని రంగాలలో ప్రజాస్వామ్య విలువలు ఎక్కువగా ఉంటాయి.

వివిధ సమాజ శాస్త్రవేత్తలు ఆధునికీకరణకు ఇచ్చిన నిర్వచనాలు, వివరణల ఆధారంగా ఆధునికీకరణ లక్షణాలను ఈ విధంగా క్రోడీకరించవచ్చు.

- శాస్త్ర విజ్ఞానం
- వివేకవంతమైన ఆలోచన
- లౌకికవాదము
- సంపాదిత అంతస్తు
- అభివృత్తులు, ప్రమాణాలు, విలువలతో మార్పు
- నూతన ప్రకార్యపరమైన సంస్థల ఏర్పాటు
- మానవ వనరులపై పెట్టుబడి పెట్టడం
- ఆర్థిక ప్రగతి లక్ష్యంగా గల ఆర్థిక వ్యవస్థ
- బంధుత్వం, కులం, మతం, ప్రాంతీయత, భాష వంటి అంశాలకు ప్రాధాన్యతనివ్వడం కంటే జాతీయ లక్ష్యాలు ప్రధానమైనవని భావించడం.
- స్వేచ్ఛా వ్యవస్థ (Open system)
- గతిశీల మూర్తిమత్వం

**14.2.6 భారతదేశంలో ఆధునికీకరణ ప్రక్రియ**

భారతదేశంలో సామాజిక పరివర్తనను ఆధునికీకరణ వైపు దిశానిర్దేశం చేసినారు. దేశాన్ని వివిధస్థాయిలో ఆధునికీకరించడానికి ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. సామాజిక స్థాయిలో సమానత్వం ఆధారంగా సామాజిక సంబంధాల నేర్పరచడం, సామాజిక గతిశీలతను ప్రోత్సహించడం, కుల వివక్షతలను తొలగించడం, స్త్రీలు, వెనుకబడిన వర్గాల స్థితిగతులలో మార్పుతేవడం ఆధునికీకరణ లక్ష్యాలు. మన దేశంలో ప్రణాళికలు, విద్య, చట్టాలు, శాసనాలు, ఇతర దేశాల నుండి సహాయం పొందడం, మాస్ మీడియా, స్వేచ్ఛావాద విధానాలనూ ధునికీకరణ ఏజెన్సీలుగా ఉపయోగిస్తున్నాం. ఆధునికీకరణ ఫలితంగా భారతదేశంలో ఎన్నో మార్పులేర్పడినాయి.

ఆర్థిక పరంగా ఉత్పత్తులు పెరిగినాయి. వ్యవసాయ రంగంలో శాస్త్ర, సాంకేతిక నైపుణ్యాల ఉపయోగిత పెరిగింది. సాంప్రదాయిక గ్రామీణ ఆర్థిక నిర్మితులయిన యాజమాన్యవ్యవస్థలో గణనీయమైన మార్పులేర్పడినాయి. సాంప్రదాయిక యాజమాన్య వ్యవస్థలో వివిధ కులాల వారు తమ సాంప్రదాయిక వృత్తులను చేస్తూ పరస్పర సహాయ సహకారాలతో జీవితం గడుపుతూ ఉండేవారు. ఆధునికీకరణ ఫలితంగా గ్రామాల ఆర్థిక, సామాజిక వ్యవస్థలు పూర్తిగా పరివర్తన చెందినాయి. వాణిజ్య పంటలు ఎక్కువగా పండించడం, నగదు మీద ఆధారపడిన ఆర్థిక విధానం ప్రముఖమైనాయి. స్వాతంత్ర్యానంతరం ప్రభుత్వం కౌలుదారీ విధానాన్ని, ఇతర భూసంస్కరణలను ప్రవేశపెట్టడం వల్ల కూడా ఎన్నో పరివర్తనలేర్పడినాయి. గతంలోని జమీందారీ, ఫ్యూడల్ సత్తానిర్మితి స్థానంలో వ్యక్తికి ప్రాధాన్యతనిచ్చే పార్లమెంటరీ ప్రజాస్వామ్య పద్ధతి ఏర్పడింది. సాంస్కృతికంగా సాంప్రదాయమతపరమైన సమాజం నుండి సెక్యులర్ విలువల నిర్మితిగా మన దేశసంస్కృతి పరివర్తన చెందింది.

భారతదేశంలోని ఆధునికీకరణ ప్రణాళికల లక్ష్యం సమాజంలోని అన్ని అంశాలు ఆధునికీకరణ వైపు పరివర్తన చెందడం. అయితే వాస్తవంగా అన్ని రంగాలలో ఒకేసారిగి సమన్వయంతో కూడిన మార్పులు ఏర్పడతాయి, అంతే కాక ఆధునికీకరణ ప్రభావం నిర్మితీయంగా అన్ని సంస్థలలో ఒకే రకంగా ఉండదు. ఉదాహరణకు పారిశ్రామిక రంగం అతి వేగంగా ఆధునికీకరణ చెందుతుంది.

ఇదే వేగంతో కుటుంబవ్యవస్థ, మత సంస్థలు మారవు. ఈ విలంబన ఫలితంగా సామాజిక పరివర్తనకు ఆటంకాలేర్పడతాయి. త్వరితగతిని పరివర్తన చెందుతున్న సమాజంలో కొన్ని అవకతవకల మూలంగా సామాజిక అసమానతలు, సామాజిక సమస్యలు ఉత్పన్నమవుతూ ఉంటాయి.

## 14.3 సారాంశం

మానవ సమాజం ఒక నిత్యనూతన చైతన్య స్రవంతి. దానిలో పరివర్తన కలిగించే శక్తులు ఉంటాయి. చాలా కాలం నుంచి సమాజాలు పరివర్తన చెందుతున్నప్పటికీ ఆధునిక యుగంలో పరివర్తన రేటు పెరిగింది. శాస్త్ర, వైజ్ఞానిక, సాంకేతిక రంగాలలో మార్పులు, నవ్యకల్పనల ఫలితంగా ఆధునికీకరణ ప్రక్రియ ఏర్పడింది. భారతదేశంలో కూడా ఆధునికీకరణ ఫలితంగా సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక పరమైన పరివర్తనలేర్పడినాయి.

## 14.4 నమూనా ప్రశ్నలు

ఈ క్రింది ప్రశ్నలకు సమాధానములు వ్రాయుము.

1. సామాజిక పరివర్తనను నిర్వహించి, భారతదేశములో సామాజిక పరివర్తన ధోరణులను వివరింపుము.
2. ఆధునికీకరణమనగా నేమి? ఆధునికీకరణ లక్షణాలేవి?
3. సామాజిక పరివర్తనలో ఆధునికీకరణ పాత్రను వివరించుము.
4. భారతదేశంముల ఆధునికీకరణ ఫలితంగా ఏర్పడిన మార్పులను వివరింపుము.

## 14.5. చదువదగిన పుస్తకాలు

Moore. W.E. - Social Change

Myson Weiner - Modernisation

Srinivas, M.N. - Social Change in Modern India

పాఠం - 15

# భారత దేశములో సామాజిక పరివర్తన ప్రక్రియలు - సంస్కృతీకరణము, పాశ్చాత్యీకరణము, లౌకికీకరణము మరియు ఇస్లామికీకరణము

## 15.0 లక్ష్యాలు

1. సంస్కృతీకరణ ప్రక్రియను అవగాహన చేసుకొనుట మరియు దాని ముఖ్య ప్రకార్యములను గ్రహించుట.
2. పాశ్చాత్యీకరణ ప్రక్రియను అవగాహన చేసుకొనుట మరియు దానిలో ఇమిడి ఉన్న మానవతా విలువలను గ్రహించుట.
3. హిందూ మతంపై లౌకికీకరణ ప్రభావాన్ని గ్రహించుట మరియు లౌకికీకరణము నందు ప్రభుత్వ పాత్రను అవగాహన చేసుకొనుట.
4. మహమ్మదీయ కరణమును గూర్చి అవగాహన చేసుకొనుట.

విషయసూచిక


15.1 పరిచయం
15.2 సంస్కృతీకరణము
15.3 పాశ్చాత్యీకరణము
15.4 లౌకికీకరణం
15.5 మహమ్మదీయకరణము
15.6 ముగింపు
15.7 నూతన పదజాలము
15.8 నమూనా ప్రశ్నలు
15.9 చదువదగిన గ్రంథాలు


## 15.1 పరిచయము

భారత సమాజానికి గ్రామ సముదాయము, కుల వ్యవస్థ, సమిష్టి కుటుంబము ప్రధానమైన స్థంభాలు. భారత దేశంలో సామాజిక పరివర్తన అధ్యయన సందర్భంగా ఎమ్.ఎన్. శ్రీనివాస్ అనే సమాజ శాస్త్రజ్ఞుడు కొన్ని భావనలను రూపొందించినాడు. ఈ భావనలు కుల వ్యవస్థకు సంబంధించినవి. బ్రిటిష్ వారి రాకతో కులవ్యవస్థలో పరివర్తన వేగంగా జరిగింది. స్వాతంత్ర్యానంతరము ఈ వ్యవస్థలో పరివర్తన తీవ్ర తరమైనదని చెప్పవలెను. శ్రీనివాస్ రూపొందించిన భావనలలో సంస్కృతీకరణము ఒకటి. భారత దేశ సాంఘిక చరిత్రను పరిశీలిస్తే సంస్కృతీకరణ ప్రక్రియ మొదటి నుంచి అల్పంగానో అధికంగానో జరుగుతున్నదనే చెప్పవలెను.

బ్రిటిష్ పరిపాలన మొదలైనప్పటి నుంచి భారతీయ సమాజంలో అనేక పరివర్తనలు జరిగాయి. సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, సాంకేతిక, రాజకీయ రంగాలలో అనేక పరివర్తనలు వచ్చాయి. ముఖ్యంగా భారతీయ సమాజంలో జరిగిన పరివర్తనలకు పాశ్చాత్యీకరణ ప్రక్రియ ప్రధాన పాత్ర వహించిందని చెప్పవచ్చు.

సామాన్య వ్యవహారంలో ఒక వ్యక్తి యుక్తి యుక్తంగా సమయ సందర్భాలను అనుసరించి విషయ ప్రాధాన్యంతో మాట్లాడినప్పుడు ఆ వ్యక్తిని లౌక్యుడు అంటాము. మత ప్రసక్తి లేనటువంటి విషయము లౌకిక విషయము. లౌకికీకరణము ఒక రకంగా ప్రయోజన వాదము. స్థూలంగా ఒక విషయాన్ని మూఢ విశ్వాసాలతోను, మతపరంగాను ఆలోచించక హేతుబుద్ధితో వివేచనతో యధార్థంగా ఆలోచించే విధానాన్నే లౌకికీకరణమని చెప్పవచ్చు.

చారిత్రకంగా చూస్తే, పాశ్చాత్యీకరణకు ముందు మన దేశంలో ఇస్లామీకీకరణ లేదా మహమ్మదీయకరణ ఉన్నది. బ్రిటిష్ పాలనలో పాశ్చాత్యీకరణ ప్రధాన పాత్ర వహించింది. ముస్లిం సైనిక రాజకీయ శక్తుల ప్రభావం భారతదేశములో అనేక సామాజిక మార్పులకు దారి తీసినది. ఈ ప్రభావ ముద్ర గాఢంగా ఉన్నది. సామాజిక మార్పులో వాస్తవ దృక్పథాన్ని పరిశీలించడానికి మహమ్మదీయ కరణ లేదా ఇస్లామికీకరణను స్వీకరించక తప్పదు.

## 15.2 సంస్కృతీకరణము

"తక్కువ అంతస్తుకు చెందిన కులం వారు కాని లేదా గిరిజన సమూహం కాని మరి ఏ ఇతర సమూహం కాని తమ ఆచారాలను అలవాట్లను, సంస్కారాలను, భావాలను, జీవన విధానాలను మార్చుకొని ఉన్నత కులాల వారిని ప్రధానంగా ద్విజులను అనుసరిస్తున్నప్పుడు ఆ ప్రక్రియను సంస్కృతీకరణమనవచ్చు'.

ఒక కులంగాని, తెగకాని సంస్కృతీకరణం చెందడానికి ఒకే రకమైన నమూనాను, లేదా బ్రాహ్మణులు అనుసరించే పద్ధతిని, క్షత్రియ, వైశ్య, శూద్ర కులాలు కూడా అనుసరించవచ్చు. ఒక కులంగాని, తెగకాని ఆచార వ్యవహారాలను అనుసరించడమనేది వారి అంతస్తుపైన, హోదాపైన ఆధారపడి ఉంటుంది. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య వర్ణాలు మూడు కూడా ఉపనయన సంస్కారానికి అర్హమైనవే. కాని క్షత్రియ, వైశ్య కులాలు ఈ సంస్కారానికి బ్రాహ్మణులు ఇచ్చినంత ప్రాధాన్యమివ్వరు. అందువల్లనే బ్రాహ్మణులను సంస్కృతీకరణానికి ఉత్తమమైన ఆదర్శ ప్రతీకలుగా పరిగణించడం జరుగుతున్నది.

యమ్.యన్.శ్రీనివాస్ సంస్కృతీకరణ ప్రక్రియనే "కులీనీకరణము" అని పేర్కొన్నాడు. తక్కువ స్థాయిలో ఉన్న కులము సామాజిక క్రమ శ్రేణిలో ఉన్నత స్థానాన్ని ఆక్రమించడానికి, కులీనతను సంపాదించడానికి ప్రయత్నిస్తుంది. కాబట్టి కులీనీ కరణము సరైన ప్రయోగమని ఇతని అభిప్రాయము.

సంస్కృతీకరణ ప్రక్రియ యొక్క ముఖ్యమైన ప్రకార్యము ఒక కులంయొక్క లౌకిక స్థాయికి మత పరమైన లేదా సంస్కార యుతమైన స్థాయికి మధ్య ఉన్న అగాధానికి వంతెన కట్టడం వంటిది. ఒక గ్రామంలో ఒక నిమ్న కులం ఆస్తి చేతకాని, రాజకీయమైన హోదా చేతకాని ప్రాబల్య కులంగా మారుతుంది. అట్లాంటి సమయంలో ఆ కులం అగ్ర కులాన్ని అనుసరించడం మొదలు పెడుతుంది. అగ్ర కులంవారి జీవన విధానాలను, ఆచారాలను, సంస్కారాలను పాటించడమే కాక నమ్మకాలను భావాలను కూడా వారు పెంపొందించుకొంటారు.

సంస్కృతీకరణ ప్రక్రియ చాలా రకాలుగా ఉంటుంది. ఒక కులంలోని వ్యక్తుల వివాహాలు కులంలోనే జరగవలెను. దీనినే 'అంతర్వివాహము' అంటారు. కాని ఒక్కొక్కప్పుడు ఒక నిమ్న కులంలోని స్త్రీ తనకంటే ఎక్కువ కులంలోని పురుషుని వివాహమాడినప్పుడు అది 'అనులోమ వివాహము' అవుతుంది. ఈ రకమైన వివాహము నిమ్న కులంవారు సంస్కృతీకరణం చెందటానికి ఎక్కువ తోడ్పడుతుంది.

## 15.3 పాశ్చాత్యీకరణము

పాశ్చాత్యీకరణం అనగా "ప్రజలు పాశ్చాత్య నాగరికతను, సాంస్కృతిక, సామాజిక అంశాలను అనుసరిస్తూ పాశ్చాత్య, దృక్పథాలను, విలువలను పెంపొందించుకునే ప్రక్రియా విధానం".

ఉదాహరణకు బ్రిటిష్ వారు పందొమ్మిదవ శతాబ్దిలో భూమి సర్వే చేయడం, సుంకాలను నిర్ణయించడం, ఆధునిక పద్ధతులలో బ్యూరోక్రసీ, పోలీసును, సైన్యాన్ని నెలకొల్పడం, న్యాయ స్థానాలను నెలకొల్పి శాసనాలను, చట్టాలను క్రోడీకరించడం, రైల్వే, తంతి-తపాలా రోడ్లు, కాలువలు మొదలైన ప్రసార సాధనాలను అభివృద్ధి పరచడం జరిగింది. పై వాటితోపాటు పాఠశాలలను, కళాశాలలను క్రైస్తవ మిషనరీలు స్థాపించడం మొదలైన కార్యాలను నిర్వహించడం, ఆధునిక రాజ్యానికి పునాదులు వేశారు.

బ్రిటిష్‌వారు తమతో ముద్రణ యంత్రాన్ని కూడా తీసుకొని వచ్చినారు. బ్రిటిష్ పరిపాలన వల్ల భారతీయ సమాజంలోను, సంస్కృతిలోను కలిగిన పరివర్తనలను వివరించడానికి ఎమ్.ఎన్. శ్రీనివాస్ పాశ్చాత్యీకరణం అనే పదాన్ని ప్రయోగించాడు.

పాశ్చాత్యీకరణమనే పదంలో కొన్ని విలువలు ఇమిడి ఉన్నాయి. వీటిలో కొంత ముఖ్యమైనది మానవతావాదం. దానిలో ఎన్నో ఇతర విలువలు చేరి ఉన్నాయి. మానవతా వాదం అంటే "కులం, మతం, వయస్సు, లింగం, ఆర్థిక స్థాయి మొదలైన వాటిలో ప్రమేయం లేకుండా సర్వమానవ సంక్షేమానికి కృషి చేయడం".

సాధారణంగా గ్రామ వాసులకంటే పట్టణ వాసులే పాశ్చాత్య ప్రభావానికి ఎక్కువగా లోనవుతారు. పంతొమ్మిదో శతాబ్ది ఉత్తరార్థంలో భారతీయులలో పాశ్చాత్యీకరణం చెందిన మేధావి వర్గం ముందుకు వచ్చింది. ఈ వర్గానికి చెందిన నాయకులే నూతన, ఆధునిక భారతదేశానికి వెలుగుబాట చూపారు. రవీంద్రనాద్ ఠాగూర్, స్వామి వివేకానంద, గోపాలకృష్ణ గోఖలే, బాల గంగాధర్ తిలక్, వల్లభాయ్ పటేల్, మహాత్మాగాంధీ, జవహర్ లాల్ నెహ్రు, రాధాకృష్ణన్ మొదలైన వారిని ముఖ్యులుగా పేర్కొనవచ్చును. క్రమంగా పాశ్చాత్య విజ్ఞానం సంపాదించుకున్న మేధావుల సంఖ్య పెరిగింది.

పాశ్చాత్యీకరణ భారతీయులలో తమ సాంప్రదాయక సమాజాన్ని మార్పు చేయవలెననే కోరికను రేకెత్తించింది. దీనికంటే కూడా శక్తివంతమైన స్వాతంత్ర్య పిపాస ప్రజలలో తలెత్తడంలో సామాజిక పరివర్తన కొరకు గౌణ (సెంకడరీ) స్థాయికి దిగింది. పాశ్చాత్య దేశాలైన బ్రిటిష్, యూరోపియన్ పండితుల రచనల వల్లనే భారతీయ నాగరికతలోని గొప్పతనాన్ని గురించి, దాని సంపన్నతను, ప్రాచీనతలను గురించి భారతీయులకు తెలిసింది. ఇది తెలుసుకోవడం వల్లనే భారతీయులలో ఆత్మ గౌరవం పెంపొందింది. పాశ్చాత్యులను వారితో సమానులుగా ఎదుర్కొని, వారినుంచి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను అభివృద్ధి పొందే హక్కును కోరేమనో ధైర్యం, ఆత్మ విశ్వాసం, భారతీయులకు కలిగింది. భారతదేశ స్వాతంత్ర్య సమరంలో సామాన్య ప్రజానీకమంతా చేరేటట్టుగా వారిని ఉత్తేజ పరచడానికి రాజకీయ వేత్తలు దీనిని సాధనంగా వినియోగించుకున్నారు.

భారతీయులపై పాశ్చాత్యుల ప్రభావం ఎంతగానో ఉందని చెప్పవలె. ఎమ్.ఎన్.శ్రీనివాస్ ప్రతి పాదించిన పాశ్చాత్యీకరణ పదంపై కొందరు అభ్యంతరాలు చెప్పారు. వారిలో డేవిడ్ లెర్నర్ పాశ్చాత్యీకరణ ప్రభావానికి బదులుగా ఆధునీకీకరణం అన్న పదాన్ని వర్ణించాడు. అయితే శ్రీనివాస్ తన "ఆధునిక భారతదేశంలో సామాజిక పరివర్తన" అనే (సోషల్ ఛేంజ్ ఇన్ మోడ్రన్ ఇండియా) గ్రంథములో పాశ్చాత్యీకరణం తటస్థమైన పదంగా తెలిపాడు. ఎందుకంటే ఈ పదం చెడు ప్రభావాన్ని కాని, మంచి ప్రభావాన్ని కాని సూచించదు. పాశ్చాత్యీకరణ దేశాలు ఏవైనా ప్రత్యక్ష సంబంధం వల్లగాని లేదా పరోక్ష సంబంధం వల్లగాని పశ్చిమ దేశాల ప్రభావానికిలోనై పరివర్తనకు గురి అయితే ఆప్రక్రియను పాశ్చాత్యీకరణంగానే వివరించారు.

## 15.4 లౌకికీకరణం

సెక్యులర్ అనే పదానికి ఒక సుదీర్ఘ చరిత్ర ఉంది. సమయ సందర్భాలను గమనించి విషయ ప్రాధాన్యంతో యుక్తిగా ప్రవర్తించిన వ్యక్తిని "లౌక్యుడు" అని, స్ఫురించే భావాన్ని "లౌక్యం" అని నిత్య వ్యవహారంగా వాడుతున్నారు. లౌకికీకరణ భావంలో మతపరమైన అంశాలున్నాయనే భావం కాలానుగుణంగా మార్పు చెందుతున్నది. మానవ జీవనంలో నైతిక, న్యాయ, చట్ట, ఆర్థిక రాజకీయాల విభిన్నాంశాలలో వ్యత్యాసం అధికమై ఈ అంశాలలో ప్రతి ఒక్కటి మిగిలిన వాటితో నేరుగా ఉండటాన్ని కూడా లౌకికీకరణంగా పరిగణిస్తున్నారు. వ్యక్తిగత జీవితాన్ని సహేతుకమైన సూత్రాలననుసరించి క్రమబద్ధం చేయడం, హేతురహిత విషయాలను వీలైనంతమేరకు విస్మరించడం, త్యజించడం జరుగుతున్నది. అనగా లౌకికీకరణ భావన వివేచనా ధోరణిని కూడా అవలంబించి విస్తృత ప్రాతిపదికను సంతరించుకొన్నది. అందుచేత లౌకికీకరణాన్ని ఒక దృక్పథంగా ఒక ఆలోచనా పద్ధతిగా భావింపవచ్చు. స్థూలంగా, ఒక విషయాన్ని మూఢ విశ్వాసాలతోను, మతపరంగాను ఆలోచించక, హేతుబుద్ధితో వివేచనతో యథార్థంగా ఆలోచించే విధానాన్నే లౌకికీకరణమని చెప్పవచ్చు.

భారత దేశంలో బ్రిటిష్ పాలనతో సామాజిక సాంస్కృతిక జీవనంలో లౌకికీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. భావ ప్రసారాల అభివృద్ధి వినియోగం పెరగటంవల్ల, విద్యావ్యాప్తి వల్ల ప్రాదేశిక గతిశీలత అధికం కావడంవల్ల, లౌకికీకరణ ప్రక్రియ అను ప్రయుక్తమై దృఢమైంది. అందుకే పాశ్చాత్యీకరణం ప్రక్రియలో లౌకికీకరణ ప్రక్రియ ఒక భాగమని ఎమ్.ఎన్.శ్రీనివాస్ అన్నాడు.

రెండు ప్రపంచ యుద్ధాలు, అటు పిదప కొనసాగిన భారత స్వాతంత్ర్యం సంగ్రామం, సామాజికంగాను, రాజకీయంగాను జనులను సమీకరించి సెక్యులర్ విధానాన్ని పెంచాయి. గాంధీజీ అభిప్రాయంలో లౌకికీకరణ అంటే మతేతరం కాక మత సహన భావం మాత్రమే. స్వాతంత్ర్యానంతరం లౌకికీకరణ ప్రక్రియలో విస్తృత రీతులు ఏర్పడినాయి. భారతదేశాన్ని సకలమతసహన భావ గర్భితమైన లౌకిక రాజ్యాంగా ప్రకటించడం, కొన్ని వర్గాలకు ప్రత్యేక హక్కులను కల్పించడం లౌకికీకరణ ప్రక్రియకు తార్కాణాలుగా పేర్కోవచ్చు. "ఇంతకు పూర్వం దీనిని మత సంబంధమైనదానిగా భావించేవారు ఇప్పుడు దానిని మత సంబంధమైన దానిగా భావించకపోవడం లౌకికీకరణంగా" ఎమ్.ఎన్.శ్రీనివాస్ నిర్వచించాడు.

ఆధునిక భారతదేశంలో పాశ్చాత్యీకరణ సంస్కృతీకరణలతోపాటు సెక్యులర్ తీరు వచ్చిందని శ్రీనివాస్ అభిప్రాయం. సంస్కృతీకరణలో హిందువులు, ఆదివాసులు ఎక్కవ ప్రభావితులయ్యారు. సెక్యులర్ విధానంలో భారతీయులందరూ, ప్రధానంగా నగరవాసులు విద్యావంతులు ప్రభావితమైనారు. హిందూ సమాజంలో శుచి-అశుచి అనే భావాలు కేంద్రీకరించి ఉండగా సెక్యులర్ విధానం వలన ఈ భావాలు సన్నగిల్లిపోతున్నాయి. హిందూమతానికి దేశవ్యాప్తంగా కేంద్ర వ్యవస్థగానీ, ఒకే పెద్ద వ్యవహార కర్తగాని లేకపోవడం, మతవ్యాప్తి ఎక్కవగా కుల వ్యవస్థ మీద, సమిష్టి కుటుంబం మీద ఆధారపడడం వల్ల సులభంగా సెక్యులర్ విధానం హిందూ మతాన్ని బాగా ప్రభావ పరిచింది. పూర్వంవలె మతం మానవ జీవన విధానంలోని అన్ని అంశాలతో పెనవేసుకొని ఉన్నట్లు ఇప్పుడు కన్పించదు. ఈ రకమైన సడలింపు ప్రక్రియనే లౌకికీకరణమని వర్ణించవచ్చు.

లౌకికీకరణలో ప్రభుత్వ పాత్ర చూస్తే భారత స్వాతంత్ర్యానంతరం రూపొందించుకొన్న రాజ్యాంగ విధానానికి లౌకిక రాజ్య లక్షణమున్నప్పటికి హిందూ సమూహ భావనకు నూతన భావ రూపాన్నివ్వడానికి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నం కొనియాడ దగినదిగా ఉంటున్నది. రాజ్యాంగంలో పొందు పరచబడిన ఆర్టికల్ 14, 15(1),(2), 16(1), (2), ఆర్టికల్ 20, 21, 23, 24 మొదలగు వరుస క్రమమైన సదుపాయాలన్ని 'లౌకిక' భావనను ధృడపరుస్తున్నాయి. అందువల్ల భారత రాజ్యాంగం చూపిన రూపును 'మతాల వైవిధ్యంలో - లౌకిక ఏకత'గా చిత్రిస్తున్నారు. రాజ్యాంగం వయోజనులకు ఓటు హక్కును కల్పించింది.

వివిధ స్థాయిలలో స్వయం పాలన విధానం కల్పించబడింది. అంటరాని తనం అమానుషమని, రాజ్యాంగ విరుద్ధమని, దాని పాటింపు నేరమని శాసమని చేయబడింది. హరిజనులకు, నిమ్న వర్గాలకు సమానమైన ప్రతి పత్తులను కల్పించడం, గ్రామాలలో పూర్వంవలె వారిని హింసించకుండా, అవమానపరుచకుండా శిక్ష మొదలగు వాటి ద్వారా రక్షణ కల్పించడం. దేవాలయ ప్రవేశానుమతి హక్కును కల్పించడం మొదలగు ప్రయత్నాలన్నీ వారికి అనాదిగా జరిగిన అన్యాయాలను రూపుమాపుటకు ఉద్దేశించినవే. హిందూ వ్యక్తిగత న్యాయ సూత్రాలలో కుటుంబ ఆస్తి వ్యవహారాల న్యాయ సూత్రాలలో కూడా మార్పులు సంభవిస్తున్నవి. మతాంతర వివాహాలకు వీలు కల్పించి, రక్షణ కల్పించారు. దేవాలయాలు పుణ్యస్థలాలు ప్రభుత్వ యంత్రాంగ పరిధిలోకి తీసుకొని రాబడినాయి. హిందూ మతాన్ని తిరిగి వ్యాఖ్యానించడానికి వీలుగా కులం, కుటుంబం గ్రామంలో పరివర్తనలు సంభవిస్తూనే ఉన్నాయి. మొత్తం మీద సెక్యులర్ విధానం భారతీయులపై ప్రభావం చూపిందని, విశిష్టంగా హిందువులపై ప్రగాఢ ప్రభావ ముద్రను వేసిందని ఎమ్.ఎన్.శ్రీనివాస్ భావిస్తున్నారు.

## 15.3 మహమ్మదీయకరణము

చారిత్రకంగా చూస్తే, పాశ్చాత్యీకరణకు ముందు మన దేశంలో ఇస్లామీకీకరణ లేదా మహమ్మదీయ కరణ ఉన్నది. దీనిలో మూడు విధాలైన సాంస్కృతిక స్థాయిలు ఉన్నవి. (1) ఇస్లాంలోకి మారడం ద్వారా సాంస్కృతికంగా, సామాజికంగా ఉన్నత స్థాయికే చేరడం (2) ఇస్లాంలోకి మారివారు సాంస్కృతిక మత విషయాలలో సనాతనత్వం వైపుకుపోవడం (3) అవసరార్థం ఇస్లాం సాంస్కృతిక విలువలను, జీవన విధానాన్ని అవలంబించడం.

భారతదేశంలో ఇస్లాం సంస్కృతి సహజంగా ఉన్నత సామాజిక స్థితిని, అధికారాన్ని అవకాశాన్ని అందుబాటులోకి తెచ్చాయి. స్థాయిని పెంచుకోడానికి దగ్గర మార్గంగా ఇస్లాంలోకి మారడం కనిపించింది. మహమ్మదీయకరణలో భారతీయ ముస్లింలు హిందూ విధానాలను తృణీకరించి ఇస్లాం సూత్రాలను, సాంస్కృతిక జీవన విధానాన్ని అనుకరించారు. కింది కులాల నుండి ముస్లిములుగా మారిన వారు హిందూ దేవతలను, క్రతువులను, పండుగలను గౌరవిస్తూ, సాంస్కృతిక సంబంధాలు పోగొట్టుకోకుండా ఉంచారు. ఈ

విధంగా హిందూ, ఇస్లాం స్థానిక సంప్రదాయాలు పరస్పరం ఇచ్చి పుచ్చుకుంటూ వందలాది సంవత్సరాల పాటు కలిసిపోయాయి. హిందూ ప్రభావం నుండి భారతదేశంలో ఇస్లాంను విమోచన గావించాలనే దృష్టితో తిరగదోడే ఉద్యమం ప్రారంభమైంది. హిందూ మతంతో సాంస్కృతిక సంబంధాలు కావాలని సనాతన ముస్లిములు తెంచుకోదలచారు. మహమ్మదీయకరణలో వ్యక్తమైన రాజకీయం కూడా ఈ సాంస్కృతిక ఉద్యమాలకు బలాన్ని చేకూర్చింది. ఇస్లాం ధోరణిలో మతం, రాజకీయాలు ఒకే మూసలో పోశారు.

## 15.6 ముగింపు

సంస్కృతీకరణ ప్రక్రియ యొక్క ముఖ్యమైన ప్రకార్యము ఒక కులం యొక్క లౌకిక స్థాయిని మతపరమైన లేదా సంస్కార యుతమైన స్థాయికి మధ్య ఉన్న అగాధానికి వంతెన కట్టడం వంటిది.

భారత సమాజానికి గ్రామ సముదాయం, కులవ్యవస్థ, సమిష్టి కుటుంబం ప్రధానమైన స్తంభాలు. భారతదేశంలో సామాజిక పరివర్తన అధ్యయన సందర్భంగా ఎమ్.ఎన్.శ్రీనివాస్ అనే సమాజ శాస్త్రజ్ఞుడు కొన్ని భావనలు రూపొందించినాడు. శ్రీనివాస్ రూపొందించిన భావనలలో సంస్కృతీకరణము ఒకటి. ఇతను సంస్కృతీకరణ ప్రక్రియనే 'కులీనకరణము' అని పేర్కొన్నాడు.

ఆంగ్లేయుల పరిపాలనలో భారత సమాజము ఎన్నో పరివర్తనలకు గురి అయింది. మన సమాజంలో జరిగిన సామాజిక పరివర్తనను అధ్యయనం చేయడం కోసం ఎమ్.ఎన్.శ్రీనివాస్ రూపొందించిన భావనలలో పాశ్చాత్యీకరణమొకటి.

పాశ్చాత్యీకరణ భావనలో కొన్ని విలువలు ఇమిడి ఉన్నాయి. అందులో ముఖ్యమైనది మానవతావాదము. మానవతను శ్రీనివాస్ నిర్వచించిన విధమిది "కుల, మత, లింగ, వయో భేదాలను, ఆర్థిక బలాన్ని దృష్టిలో ఉంచుకోకుండా, సర్వజనుల సంక్షేమానికి పాటుపడటమే, మానవుడుగా మనడమే మానవత". మానవతలో సమత్వము, లౌకికీకరణమనే విలువలు కూడా ఇమిడి ఉన్నాయి. ఆంగ్ల భాషను పాఠశాలలో ప్రవేశపెట్టిన తరువాత, విద్యావంతులందరు ఇంచుమించుగా పాశ్చాత్య ప్రభావానికి గురి అయినారు.

మత ప్రసక్తి లేనటువంటి విషయము లౌకిక విషయము. లౌకికీకరణ ఒకరకంగా ప్రయోజన వాదము. భారత సమాజంలో, సామాజిక, సాంస్కృతిక జీవనంలో లౌకికీకరణ బ్రిటిష్ పాలనతో ఏర్పడింది. లౌకికీకరణ ప్రక్రియ వల్ల ఎక్కువగా హిందువులు ప్రభావితులయినారని చెప్పవచ్చు. హిందూ మతానికి దేశ వ్యాప్తమైన ఒక వ్యవస్థగాని, ఏకైక నాయకుడు గాని లేకపోవడం, హిందూ మత వ్యాప్తి ఎక్కువగా కులవ్యవస్థ మీద, సమిష్టి కుటుంబం మీద ఆధారపడి ఉండటం ఈ ప్రభావానికి కారణాలు కావచ్చు.

పాశ్చాత్యీకరణకు ముందు మన దేశంలో మహమ్మదీయకరణ లేదా ఇస్లామీకీకరణ ఉన్నది. ముస్లిం సైనిక రాజకీయ శక్తుల ప్రభావం భారతదేశంలో అనేక సామాజిక మార్పులకు దారి తీసినది. భారతదేశంలో ఇస్లాం సంస్కృతి సహజంగా ఉన్నత సామాజిక స్థితిని, అధికారాన్ని అవకాశాన్ని అందుబాటులోకి తెచ్చాయి. హిందూ, ఇస్లాం స్థానిక సంప్రదాయాలు పరస్పరం ఇచ్చిపుచ్చుకుంటూ వందలాది సంవత్సరాలపాటు కలిసిపోయాయి. హిందూ ప్రభావం నుండి భారతదేశంలో ఇస్లాంను విమోచన గావించాలనే దృష్టితో తిరగదోడే ఉద్యమం ప్రారంభమైంది. మహమ్మదీయకరణలో వ్యక్తమైన రాజకీయం కూడా ఈ సాంస్కృతిక ఉద్యమాలకు బలాన్ని చేకూర్చింది. ఇస్లాం ధోరణిలో మతం, రాజకీయాలు ఒకే మూసలో పోశారు.

## 15.7 నూతన పదజాలము

1. కులీనులు : ఉన్నత కులమువారు
2. మౌలిక మార్పులు : మూల అంశాలలో మార్పులు
3. సనాతనత్వము : పూర్వపు విధానము
4. విభేదీకరణము : అనేక సామాజికాంశాలలో వ్యత్యాసాలు, వైవిధ్యము

5. భావప్రసార సాధనాలు : ప్రజాభిప్రాయ సేకరణ, అభిప్రాయ వ్యాప్తికి ఉపయోగపడు సాధనాలు.

6. సనాతనత్వము : పూర్వపు విధానము.

## 15.8 నమూనా ప్రశ్నలు

1. సంస్కృతీకరణ భావ వివరణను గురించి వ్రాయుము.
2. సంస్కృతీకరణము యొక్క ముఖ్య ప్రకార్యముల గురించి తెల్పుము.
3. పాశ్చాత్యీకరణ భావ వివరణను తెలిపి అందులో ఇమిడి ఉన్న మానవతా విలువలను గురించి వ్రాయుము.
4. లౌకికీకరణమును నిర్వచించి, హిందూ మతంపై లౌకికీకరణ ప్రభావమును తెలుపుము.
5. లౌకికీకరణంలో ప్రభుత్వ పాత్రను తెల్పుము.
6. ఇస్లామీకీకరణమును గురించి వ్రాయుము.

## 15.9 చదువదగిన గ్రంథాలు


1. సమాజము - నిర్మితి, పరివర్తన : తెలుగు అకాడమి
2. భారతదేశ సమాజ నిర్మాణం, మార్పు : ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విశ్వవిద్యాలయం
3. భారతీయ సమాజం : తెలుగు అకాడమి.

(DASOC 31)

B.A. DEGREE EXAMINATION, DECEMBER 2010.

(Examination at the end of Final Year)

Part II — Sociology

Paper III — SOCIAL CHANGE AND PLANNING

Time : Three hours Maximum : 100 marks

Answer any FIVE of the following.

Select not less than TWO from each Section.

All questions carry equal marks.

SECTION A

1. Explain "Social evolution" and "Progress" with examples.

"సామాజిక పరిణామము" మరియు "అభివృద్ధి" ని గూర్చి సోదాహరణముగా వివరింపుము.

2. Write in detail about the theories of social change.

సాంఘిక మార్పు సిద్ధాంతాలను గురించి విపులముగా వ్రాయుము.

3. What are the sociological aspects of economic planning?

ఆర్థిక ప్రణాళికలోని సామాజిక అంశాలు యేవి?

4. Explain the role of communication in social change.

సామాజిక మార్పులు బావప్రసారము యొక్క పాత్రను వివరించుము.

5. Analyse the Sarvodaya movement.

సర్వోదయ వుద్యమమును విశ్లేషించుము.

SECTION B

6. State the objectives and emphasis of community development programmes in India.

భారతదేశములో సమాజ వికాశాభివృద్ధి కార్యక్రమాల లక్ష్యాలను, ప్రాధాన్యతలను పేర్కొనుము.

7. Discuss the relationship between social legislation and social change with Indian examples.

సామాజిక చట్టాలకు, సామాజిక మార్పుకు గల సంబంధాన్ని భారతీయ వుదాహరణలలో చర్చించుము.

8. How does communication effects the process of development?

భావ ప్రసారణ అభివృద్ధి ప్రక్రియను ఏ విధంగా ప్రభావితం చేస్తుంది.

9. Write an essay on Sanskritezation process.

సాంస్కృతీకరణ ప్రక్రియను గూర్చి ఒక వ్యాసమును వ్రాయుము.

10. Answer any TWO of the following short notes :

(a) Panchayat Raj

పంచాయితీ రాజ్.

(b) Modernisation.

ఆధునికీకరణము.

(c) Cultural lag.

సాంస్కృతిక విలంబన.

(d) Sarvodaya.

సర్వోదయ.

# (DASOC 31)

B.A. DEGREE EXAMINATION, MAY 2008.

(Examination at the end of Final Year)

Part II — Sociology

Paper III — SOCIAL CHANGE AND PLANNING

Time : Three hours                                                  Maximum : 100 marks

Answer any FIVE of the following.

Select not less than TWO from each Section.

All questions carry equal marks.

## SECTION A

1. Define Social evolution and explain briefly its nature.

Discuss the theories relating to social change.

Discuss the various factors affecting social change.

2. Explain the meaning and principles of social planning and development.

3. Examine the role of opinion leaders in social planning and social change.

## SECTION B

4. Explain the nature of Gandhi's constructive programmes.

5. Describe briefly various social legislations in India.

6. Examine the concepts of Islamaisation and Secularization.

7. Explain the differences between Westernization and Modernisation.

8. Answer any TWO of the following (short notes) :

   (a) Cultural lag

   (b) Obstacles of social planning

   (c) Sarvodaya movement

   (d) Sanskritization

---

**(DASOC 31)**

B.A. DEGREE EXAMINATION, DECEMBER 2011.

(Examination at the end of Final Year)

Part II — Sociology

Paper III — SOCIAL CHANGE AND PLANNING

Time : Three hours Maximum : 100 marks

Answer any FIVE of the following.

Select not less than Two from each Section.

All questions carry equal marks.

SECTION — A

1. Explain the process of social evolution.

   సామాజిక పరిణామ ప్రక్రియను వివరింపుము.

2. Examine the chain reactions of social change.

   సామాజిక మార్పులో గొలుసు కట్టు ప్రతి చర్యలను పరిక్షింపుము.

3. Discuss the technological factors affecting social change.

   సామాజిక మార్పును సాంకేతిక కారకాలు ఏలా ప్రభావితము చేస్తాయో చర్చింపుము.

4. Analyse the sociological aspects of economic planning.

ఆర్థిక ప్రణాళికవో సామాజిక అంశాలను విశ్లేషించుము.

5. Write an essay on methods of communication.

భావ ప్రసార పద్ధతులపై ఒక సంక్షిప్త వ్యాసము వ్రాయుము.

## SECTION — B

6. Write briefly about Mahatma Gandhi constructive programmes.

మహాత్మాగాంధీ యొక్క నిర్మాణాత్మక పథకాలను గూర్చి క్లుప్తంగా వ్రాయుము.

7. Bring out the nature and significance of Panchayati Raj System in India.

భారత దేశములో పంచాయతీరాజ్ వ్యవస్థ యొక్క ప్రాముఖ్యతను తెలియజేయుము.

8. Examine the problems in the implementation of social legislation.

సామాజిక శాసనాల అమలులో ఎదురయ్యే అవరోధాలను పరిక్షింపుము.

9. Write an essay on Sanskritization process.

సంస్కృతీకరణ ప్రక్రియను గూర్చి ఒక వ్యాసము వ్రాయుము.

10. Answer any TWO of the following (Short Notes)

(a) Social Progress

(b) Secularization

(c) Social planning

(d) Community development.

ఈ క్రింది వానిలో ఏవైనా రెండింటి గురించి వ్రాయుము. (లఘు వ్యాఖ్య).

(a) సామాజిక ప్రగతి

(b) లౌకికీకరణము

(c) సాంఘిక ప్రణాళిక

(d) సాముధాయక అభివృద్ధి.

---

(కత్తిరించి పంపవలెను)

## అధ్యాపకుల, విద్యార్థుల సలహాలు, సూచనలు :

అధ్యాపకులు, విద్యార్థులు ఈ స్టడీ మెటీరియల్‌కు సంబంధించిన సలహాలు, సూచనలు, ముద్రణ దోషాలు తెలియపరచినచో, పునర్ముద్రణలో తగు చర్యలు తీసుకొనగలము. తెలియపరచవలసిన చిరునామా : **డిప్యూటీ డైరెక్టర్, దూరవిద్యా కేంద్రం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, నాగార్జున నగర్ - 522 510.**

| **Course** | **Year** | **Paper No. & Title** |
|---|---|---|
| B.A. | IIIrd Year | Paper - III : Social Change and Planning |

(కత్తిరించి పంపవలెను)

(కత్తిరించి పంపవలెను)

(కత్తిరించి పంపవలెను)